
'ఆర్థిక అసమానతలు తొలగకపోతే రాజకీయ స్వాతంత్ర్యానికి అర్థం లేదు'

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 14 వెల: ₹ 5.50

సంపుటి: 16 సంచిక: 77

గురువారం 8-6-2023

SIMULTANEOUSLY PRINTED AT KARIMNAGAR | HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL



తొలి రోజే 'తల'పోటు...

భారత బౌలర్లు విఫలం. ఆసీస్ 327/3. హెడ్ అజేయ సెంచరీ -12లో



'పాలసీ'కి ముందు లాభాలు

6 నెలల తర్వాత 63 వేలపైకి సెన్సెక్స్. 18,700 స్థాయిపైకి నిఫ్టీ -13లో



మణిపూర్‌లో ముగ్గురు బలి

పశ్చిమ ఇంఫాల్ జిల్లాలో అంబులెన్సుకు అల్లరిమూక నిప్పుపెట్టడంతో ఎనిమిదేళ్ల బాలుడు, మరో ఇద్దరు మృతి చెందారు.

వివరాలు 6లో ▸



కోర్టు దగ్గర గ్యాంగ్‌స్టర్ హత్య

లక్నో సివిల్ కోర్టు ఆవరణలో గ్యాంగ్‌స్టర్ సంజీవ్ మహేశ్వరి జీవా దారుణ హత్యకు గురయ్యాడు.

వివరాలు 6లో ▸



'ఆర్డినెన్స్' విషయంలో అండగా..

ఢిల్లీలో పాలనా సేవలపై సర్వాధికారం విషయంలో కేంద్రం ఆర్డినెన్స్‌ను వ్యతిరేకిస్తామని సమాజ్‌వాదీ పార్టీ కేజ్రీవాల్‌కు హామీ ఇచ్చింది.

వివరాలు 6లో ▸



ఫాలోయింగ్‌లో కింగ్

సీఎంఓతో పాటు ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి కేటీఆర్ సామాజిక మాధ్యమ ఖాతాల నిర్వహణలో దూసుకుపోతున్నారు.

వివరాలు 14లో ▸

న్యూస్‌రీల్

ఇక సామాన్యుడి పరిస్థితి ఏంటి?



భూ వివాదంలో ఓ రిసార్ట్ యాజమాన్యం హైకోర్టు, సుప్రీంకోర్టును ఆశ్రయించి న్యాయం పొందినా స్పందించని అధికారుల తీరుపై హైకోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది. సుప్రీంకోర్టు ఇచ్చిన ఉత్తర్వులన్నా ఇంత లెక్క లేనితనమా అంటూ అధికారులను ప్రశ్నించింది.

- వివరాలు 3లో▶

ఇక ప్రియాంక ఫుల్ ఫోకస్



కర్ణాటక గెలుపుతో ఊపు మీదున్న కాంగ్రెస్ అదే తరహా జోరును తెలంగాణలోనూ కొనసాగించే క్రమంలో పార్టీ పటిష్టతపై దృష్టిపెట్టింది. ఇందులో భాగంగానే తెలంగాణ ఎన్నికల వ్యవహారాలన్నీ ప్రియాంకాగాంధీ కనుసన్నల్లో జరిగేలా ప్రణాళిక సిద్ధం చేస్తోంది.

- వివరాలు 3లో▶

పగ్గాల మార్పుకే మొగ్గు?

రాష్ట్ర బీజేపీలో సంస్థాగత మార్పులకు జాతీయ నాయకత్వం కసరత్తు

- కర్ణాటకలో ఓటమి నేపథ్యంలో తెలంగాణపై ప్రత్యేక దృష్టి
- అక్కడి తప్పులు ఇక్కడ జరగకుండా అప్రమత్తం
- వచ్చే ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని
- సంస్థాగతంగా బలోపేతంపై ఫోకస్
- అధ్యక్షుడి మార్పుతో పాటు ఎన్నికల కమిటీ, మేనిఫెస్టో కమిటీల్లో మార్పులపై జోరుగా ఊహాగానాలు
- బండి సంజయ్‌కు కేంద్రమంత్రి పదవి!
- సామాజిక సమీకరణలు దృష్టిలో పెట్టుకుని ఇతరులకు అధ్యక్ష బాధ్యత.. త్వరలోనే ఢిల్లీ నుంచి ప్రకటన



సాక్షి, హైదరాబాద్

కర్ణాటకలో ఓటమి నేపథ్యంలో బీజేపీ జాతీయ నాయకత్వం తెలంగాణపై దృష్టి సారించింది. అక్కడి తప్పులు రాష్ట్రంలో పునరావృతం కాకుండా చేపట్టాల్సిన కార్యాచరణపై కసరత్తు ప్రారంభించింది. వచ్చే అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై తర్జనభర్జన పడుతోంది. రాష్ట్ర పార్టీలో సంస్థాగత మార్పుల దిశగా అధిష్టానం ఆలోచన చేస్తోందనే ప్రచారం జోరుగా సాగుతోంది. పలు కమిటీల్లో మార్పులు చేయవచ్చని తెలుస్తోంది. అలాగే రాష్ట్ర అధ్యక్షుడి మార్పు కూడా పరిశీలనలో ఉన్నట్లు సమాచారం. బండి సంజయ్ రాష్ట్రంలో పార్టీని బలోపేతం చేయడంతో పాటు ఢీ అంటే ఢీ అనే స్థాయికి చేర్చినా, తెలంగాణలో పాగా వేయాలంటే అది చాలదని బీజేపీ అగ్రనేతలు భావిస్తున్నట్టు చెబుతున్నారు. సంజయ్‌కి కేంద్ర మంత్రి పదవి ఇచ్చే అవకాశం ఉందని, సామాజిక సమీకరణలను దృష్టిలో పెట్టుకుని, రాష్ట్ర అధ్యక్ష బాధ్యతలు ఇతరులకు కట్టబెట్టవచ్చనే ప్రచారం సాగుతోంది. ఈ ఏడాది జరగాల్సిన తెలంగాణ సహా ఐదు రాష్ట్రాల ఎన్నికల కార్యాచరణపై ఢిల్లీలో ప్రస్తుతం కొనసాగుతున్న అగ్రనేతల సమాలోచనలు..రాష్ట్ర పార్టీ ముఖ్యనేతల ప్రకటనలు ఈ ప్రచారానికి బలం చేకూరుస్తున్నాయి.

కర్ణాటకలో ఓటమి నేపథ్యంలో..

దక్షిణాదిలో సానుకూల పరిస్థితులున్నాయని జాతీయ నాయకత్వం మొన్నటివరకు భావిస్తూ వచ్చింది. అయితే కర్ణాటక ఎన్నికల్లో ఓడిపోవడం, పార్టీ స్వయంకృతాపరాధమే ఇందుకు కారణమనే కచ్చితమైన అంచనాల నేపథ్యంలో తెలంగాణలో జాగ్రత్తగా వ్యవహరించాలని నిర్ణయించింది. కర్ణాటకలో పార్టీ అధికారంలో ఉండడంతో ముఖ్యనేతల మధ్య సమన్వయం లోపించింది. మంత్రులు, సీనియర్ నాయకులు ఎవరికివారు అన్నట్టుగా వ్యవహరించారు. దీనితో పాటు 40 శాతం కమీషన్ల సర్కార్ అంటూ రాష్ట్ర ప్రభుత్వంపై ఆరోపణలు వెల్లువెత్తాయి. ఈ నేపథ్యంలోనే ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత వచ్చి బీజేపీని ఓడించారనే అంచనాకు జాతీయ నాయకత్వం వచ్చినట్లు తెలిసింది. అక్కడ పరిస్థితిని సరిగా అంచనా

మిగతా 3వ పేజీలో ▶



గోదావరికి చీర, పసుపు, కుంకుమలతో కూడిన సారె సమర్పిస్తున్న మంత్రి కేటీఆర్

తెలంగాణ.. కోటిన్నర ఎకరాల మాగాణి

ములుగు సభలో మంత్రి కేటీఆర్

- ఇప్పుడు 'మంచం పట్టిన మన్యం' లాంటి వార్తలే లేవు..
- ఏజెన్సీల ప్రజలు ఆరోగ్యంతో జీవిస్తున్నారు..
- రాష్ట్రాన్ని అభివృద్ధి చేసిన కేసీఆర్‌పై కాంగ్రెస్ నేతలు ఎగిరి పడుతున్నారు..
- రాబందుల్లా వ్యవహరించిన కాంగ్రెస్‌కు బుద్ధి చెప్పాలి..
- ములుగులో పలు అభివృద్ధి పథకాలకు ప్రారంభోత్సవం

ములుగు: 'నా తెలంగాణ కోటి రతనాల వీణ అని జైలు గోడలపై బొగ్గుతో రాసుకున్న దాశరథి మాటలకు అనుగుణంగా నీళ్లు, నిధులు, నియామకాల నినాదంతో పద్నాలుగేళ్లు పోరాడిన నేత కేసీఆర్. తెలంగాణ కోటి రతనాల వీణ కాదని కోటిన్నర ఎకరాల మాగాణి అని నిరూపించి చూపించారు..' అని రాష్ట్ర మంత్రి కేటీఆర్ అన్నారు. 'కాంగ్రెస్ అధికారంలో ఉన్న ఛత్తీస్‌గఢ్‌లో సాగు పెట్టుబడికి రూ.2 వేలు ఇస్తుంటే, తెలంగాణ ప్రభుత్వం రూ.10 వేలు ఇస్తోంది. అక్కడి రైతులు ఎంత పండించినా, ప్రభుత్వం 12 క్వింటాళ్లనే కొంటోంది. అదే తెలంగాణలో రైతులు పండించిన ప్రతి గింజను రాష్ట్ర సర్కారు

మిగతా 2వ పేజీలో ▶

కాళేశ్వరం జలాలకు లక్ష జన హారతి

మంత్రి జగదీశ్‌రెడ్డి నేతృత్వంలో ప్రతిష్టాత్మక కార్యక్రమం

- వివరాలు 5లో▶

తొలి విడత రూ. లక్ష సాయం 15 కులాలకు!

సాక్షి, హైదరాబాద్

బీసీ వర్గాల్లోని కుల.. చేతి వృత్తిదారులు పనిముట్లు, వృత్తి పరికరాలు కొనుగోలు చేసుకొనేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన లక్ష రూపాయల ఆర్థిక సాయాన్ని (గ్రాంటు) తొలి విడతలో 15 కులాలకే అందించనున్నారు. బీసీ వర్గాల్లోని ఆ 15 కులాల వివరాలను బీసీ సంక్షేమ శాఖ బుధవారం విడుదల చేసింది. పూర్తిగా చేతి వృత్తిదారులకే ఈ ఆర్థిక సాయాన్ని అందించనుంది.

ఆర్థిక సహాయం కోసం తొలి విడతలో ఎంపిక చేసిన బీసీ కులాలు...

1.నాయీ బ్రాహ్మణులు 2.రజక 3.సగర/ఉప్పర 4.కుమ్మరి/శాలివాహన 5.అవుసల 6.కంసాలి 7.కమ్మరి 8.కంచరి 9. వడ్ల/వడ్ర/వడ్రంగి, శిల్పులు 10.కృష్ణ బలిజ పూసల 11.మేదర 12.వడ్డెర 13. ఆరె కటిక 14.మేర 15.ఎంబీసీలను రూ.లక్ష స్కీం వర్తించే బీసీ కులాలుగా పేర్కొన్నది. అలాగే కళ్యాణలక్ష్మి లబ్ధిదారులు కూడా ఈ పథకానికి అర్హులేనని ప్రభుత్వం స్పష్టం చేసింది. 1 ఏప్రిల్ 2021 తరువాత పొందిన ఆదాయ ధ్రువీకరణ పత్రాల ద్వారా ఈ పథకానికి దరఖాస్తు చేసుకోవచ్చని ప్రభుత్వం స్పష్టం చేసింది.

రైతుకు మరింత దన్ను

- 2023-24 ఖరీఫ్ సీజన్‌కు గానూ 14 రకాల పంటలకు కనీస మద్దతు ధర పెంచిన కేంద్రం
- వరి మద్దతు ధరపై రూ.143 పెంపు.. సాధారణ రకం క్వింటాల్ రూ.2,183, 'గ్రేడ్-ఎ' రూ.2,203
- పెసరపై ఏకంగా రూ.803 పెంపు, మద్దతు ధర రూ.8,558



దేశ వ్యాప్తంగా నైరుతి రుతుపవనాలు విస్తరిస్తున్న వేళ రైతులకు కేంద్రం తీపికబురు చెప్పింది. ఖరీఫ్ సీజన్ ఆరంభమవుతున్న వేళ 2023-24 మార్కెటింగ్ సీజన్‌కు సంబంధించి 14 రకాల పంటల కనీస మద్దతు ధరలు పెంచుతూ నిర్ణయం చేసింది. వ్యవసాయదారుల ఉత్పత్తులకు లాభదాయక ధరలు నిర్ధారించేలా, పంటల వైవిధ్యతను ప్రోత్సహించేలా మద్దతు ధరల పెంపుకు బుధవారం ప్రధాని నరేంద్ర మోదీ అధ్యక్షతన జరిగిన ఆర్థిక వ్యవహారాల కేబినెట్ కమిటీ ఆమోదం తెలిపింది.

- వివరాలు 6లో▶



ఉక్రెయిన్‌ను ముంచెత్తిన వరద

సురక్షిత ప్రాంతాలకు వలసపోతున్న జనం

- వివరాలు 6లో▶

ప్రభుత్వాల వైఫల్యాలను యువతే ఎండగట్టాలి

- రెండు కోట్ల ఉద్యోగాలన్న మోదీ ఉన్న ఉపాధిని పోగొడుతున్నారు..
- ఇంటికో ఉద్యోగమని చెప్పిన కేసీఆర్ యువతను నిర్వీర్యం చేశారు
- యూత్ కాంగ్రెస్ జాతీయ కార్యవర్గ సమావేశంలో ఉత్తమ్
- హైదరాబాద్‌లో యూత్ కాంగ్రెస్ జాతీయ సమావేశాలు



ప్రజల్లోకి 'యూత్ డిక్లరేషన్'

గజ్వేల్ నుంచి బస్సు యాత్ర

- వివరాలు 3లో▶

సాక్షి, హైదరాబాద్

కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ, రాష్ట్రంలో అధికారంలో ఉన్న బీఆర్‌ఎస్‌లు యువతకు ద్రోహం చేశాయని, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల వైఫల్యాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లే బాధ్యత యువజన కాంగ్రెస్ నాయకులపై ఉందని నల్లగొండ ఎంపీ, టీపీసీసీ మాజీ అధ్యక్షుడు కెప్టెన్ ఎన్.ఉత్తమ్‌కుమార్‌రెడ్డి వ్యాఖ్యానించారు. అఖిల భారత యువజన కాంగ్రెస్ (ఏఐవైసీ) జాతీయ కార్యవర్గ సమావేశాలు బుధవారం హైదరాబాద్‌లో ప్రారంభమయ్యాయి. మూడు రోజుల పాటు జరగనున్న ఈ సమావేశాల ప్రారంభ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా ఉత్తమ్ మాట్లాడుతూ ఇంటికో ఉద్యోగం ఇస్తామని చెప్పి రెండుసార్లు అధికారం చేపట్టిన తర్వాత కూడా రాష్ట్రంలో ఖాళీగా ఉన్న ప్రభుత్వ ఉద్యోగాలను భర్తీ చేయడంలో సీఎం కేసీఆర్ విఫలమయ్యారని, బీఆర్‌ఎస్ పాలనలో యువత

మిగతా 3వ పేజీలో ▶

ఏపీ ఉద్యోగికి 'గ్యారంటీ' భరోసా

సీపీఎస్‌తో పోలిస్తే మరింత మెరుగ్గా జీపీఎస్

- రిటైర్‌మెంట్ తర్వాత చివరి నెల బేసిక్‌లో 50 శాతం మొత్తం పెన్షన్‌తో పాటు ఏటా 2 డీఆర్‌లు
- త్వరలో 12వ పీఆర్సీ ఏర్పాటు
- 10వేల మంది కాంట్రాక్టు ఉద్యోగుల క్రమబద్ధీకరణ
- 6,840 కొత్త పోస్టుల మంజూరు
- ప్రభుత్వంలో ఆంధ్రప్రదేశ్ వైద్య విధాన పరిషత్ విలీనం
- మంత్రివర్గ సమావేశం అనంతరం మీడియాకు వెల్లడించిన ఏపీ మంత్రి వేణుగోపాలకృష్ణ

10లో



రేపు కేరళకు 'నైరుతి'!

- ఉధృతమైన పశ్చిమ గాలులు
- మరింత విస్తరణకు అనుకూల పరిస్థితులు

కొన్నాళ్లుగా దోబూచులాడుతున్న నైరుతి రుతుపవనాలు ఎట్టకేలకు కేరళను తాకనున్నాయి. సాధారణంగా ఏటా జూన్ ఒకటో తేదీకి ఇవి కేరళలోకి ప్రవేశిస్తాయి. కానీ మూడు రోజులు ఆలస్యంగా జూన్ 4న తాకుతాయని భారత వాతావరణ శాఖ (ఐఎండీ) ముందస్తుగా అంచనా వేసింది. అయితే ఆ అంచనాలు కూడా తప్పాయి. ఈనెల ఏడు, లేదా ఎనిమిది తేదీల్లో కేరళలోకి ప్రవేశించవచ్చని ఐఎండీ పేర్కొంది. ప్రస్తుతం కేరళలో రుతుపవనాల ప్రవేశానికి అనుకూల పరిస్థితులేర్పడ్డాయి. దక్షిణ అరేబియా సముద్రం మీదుగా పడమట గాలులు కొనసాగుతున్నాయి. దీంతో శుక్రవారం నాటికల్లా నైరుతి రుతుపవనాలు కేరళలో ప్రవేశించడానికి పరిస్థితులు అనుకూలంగా ఉన్నాయని ఐఎండీ బుధవారం వెల్లడించింది.

- వివరాలు 2లో▶

మా రూటే సెప'రేటు'!

సాక్షి ప్రతినిధి, మహబూబ్‌నగర్: రాష్ట్రంలో రైస్ మిల్లర్ల దందాకు అడ్డే లేకుండా పోతోంది. అవినీతి అధికారుల సహకారం తోడవడంతో వారు ఆడిందే ఆట.. పాడిందే పాటగా మారింది. నిబంధనల ప్రకారం మిల్లులకు ఏ ధాన్యాన్ని పంపిస్తారో దాన్నే మర ఆడించి.. ఎఫ్‌సీఐకి బియ్యం అప్పగించాలి. కానీ, జోగుళాంబ గద్వాల జిల్లాలో ఇందుకు భిన్నంగా వ్యవహారం నడుస్తోంది. స్థానికంగా కేటాయించిన నాణ్యమైన ధాన్యాన్ని ప్రభుత్వ మద్దతు ధరకు మించి అధిక ధరకు బహిరంగ మార్కెట్‌లో అమ్ముకుని సొమ్ము చేసుకుంటున్నారు. అంతేగాక యాదాద్రి భువనగిరి జిల్లా నుంచి బియ్యాన్ని దిగుమతి చేసుకుని ఎఫ్‌సీఐకి పెడుతున్నారు. జిల్లాలో పౌరసరఫరాల శాఖకు చెందిన ఓ అధికారి, రైస్ మిల్లర్ల సంఘానికి చెందిన ఓ రాష్ట్రస్థాయి నేత ఈ బాగోతంలో కీలకపాత్ర పోషిస్తున్నట్లు తెలుస్తోంది.

ఆ అధికారే సూత్రధారి

సీఎమ్మార్ బియ్యాన్ని అప్పగించేందుకు గడువుపై గడువు పెంచిన ప్రభుత్వం గత నెల 31 వరకు చివరి అవకాశం ఇచ్చింది. లేకుంటే చర్యలు తప్పవని, సదరు మిల్లులను బ్లాక్‌లిస్ట్‌లో పెడతామని హెచ్చరించడంతో మిల్లర్లకు దిక్కులేని పరిస్థితి ఏర్పడింది. జిల్లాలో సుమారు 15 మిల్లుల నిర్వాహకులకు సంకట పరిస్థితి నెలకొనగా.. వారు తమకు సహకరిస్తున్న జిల్లాకు చెందిన ఓ పౌరసరఫరాల అధికారిని సంప్రదించారు. దాంతో సదరు అధికారి.. సీఎమ్మార్ బియ్యంలో

మిగతా 10వ పేజీలో ▶

కస్టమ్ మిల్లింగ్ రైస్‌లో మాయాజాలం

- జోగుళాంబ జిల్లాలో భారీ దందా
- సీఎమ్మార్ ధాన్యం ఇచ్చేది స్థానిక మిల్లర్లకు..
- బియ్యం వచ్చేది మాత్రం యాదాద్రి జిల్లా నుంచి..
- రైస్‌మిల్లర్ల సంఘం రాష్ట్రస్థాయి నేతదే కీలకపాత్ర
- ఓ పౌరసరఫరాల అధికారే సూత్రధారిగా వసూళ్ల పర్వం



గద్వాలలో 2021-22 రబీలో సీఎమ్మార్ రైస్ వివరాలు (ఏసీకేలలో)..

మిల్లులు	మిల్లర్లకు ఇచ్చిన ధాన్యం	మర ఆడించి తిరిగి ఇచ్చినవి	పెండింగ్
36 (రా)	897.35	640.56	256.78
5 (బాయిల్డ్)	1,058.27	732	326.77

ఒక ఏసీకేకు రూ.లక్ష వరకు కమీషన్..

'కస్టమ్ మిల్లింగ్ రైస్ (సీఎమ్మార్) పెట్టలేని వారు తాను చెప్పినట్లు చేస్తే అంతా సర్దుబాటు చేస్తాను.. మీపై కేసులుండవు, పెనాల్టీ ఉండదు.. పైగా మీరు ప్రభుత్వం నుంచి తిరిగి ధాన్యం తీసుకునేలా వెసులుబాటు కల్పిస్తాను' అని సదరు అధికారి హామీ ఇవ్వడంతో మిల్లర్లందరూ తలాడించినట్లు సమాచారం. ఒక ఏసీకే (290 క్వింటాళ్లు)కు రూ.8.41 లక్షలు (క్వింటాల్‌కు రూ.2,900) చొప్పున యాదాద్రి జిల్లాకు చెందిన రైస్ మిల్లర్ల సంఘం రాష్ట్రస్థాయి నాయకుడి బ్యాంక్ ఖాతాలో వేసేలా ఒప్పందం కుదిర్చారు. ఇందుకు ప్రతిఫలంగా సదరు మిల్లర్ల సంఘం నాయకుడి నుంచి ఆ అధికారి ఒక ఏసీకేకు రూ.50 వేల నుంచి రూ.లక్ష వరకు కమీషన్ అందుకుంటున్నట్లు విశ్వసనీయ వర్గాల ద్వారా తెలిసింది. ఇలా జిల్లా నుంచి సుమారు 100 ఏసీకేల వరకు డబ్బులను సదరు రాష్ట్ర స్థాయి నేత ఖాతాకు పంపగా.. సదరు అధికారికి ఇప్పటివరకు రూ.కోటి వరకు అందినట్లు ఆరోపణలు విన్పిస్తున్నాయి.

క్లుప్తంగా...

16న రాష్ట్రపతి రాక



సాక్షి, హైదరాబాద్: రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము ఈ నెల 16న సాయంత్రం హైదరాబాద్ పర్యటనకు రానున్నారు. 17న ఉదయం దుండిగల్ ఎయిర్‌ఫోర్స్ అకాడమీలో నిర్వహించనున్న పాసింగ్ అవుట్ పరేడ్‌లో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొంటారు. అనంతరం తిరిగి ఢిల్లీకి బయల్దేరి వెళ్తారు. 16న రాత్రి రాజ్‌భవన్‌లో రాష్ట్రపతి బసకు ప్రభుత్వం ఏర్పాట్లు చేస్తోంది.

సమాచారమివ్వని ప్రభుత్వ శాఖలు

కేటీఆర్‌కు ఫోరం ఫర్ గుడ్ గవర్నెన్స్ లేఖ

సాక్షి, హైదరాబాద్: తెలంగాణలో పరిశ్రమల వారీగా పెట్టుబడులు, ఉపాధి కల్పన సమాచారంలో ప్రభుత్వ శాఖలు అనుసరిస్తున్న తీరు అనుమానాలు కలిగించేలా ఉందని ఫోరం ఫర్ గుడ్ గవర్నెన్స్ కార్యదర్శి ఎం.పద్మనాభరెడ్డి పేర్కొన్నారు. తెలంగాణ పారిశ్రామిక రంగంలో రూ.3.3 లక్షల కోట్ల పెట్టుబడులు, 22.5 లక్షల ఉద్యోగాలు కల్పించామంటూ చేస్తున్న ప్రకటనలు అవాస్తవమని భావించాల్సి ఉంటుందని తెలిపారు. ఈ మేరకు ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి కేటీ రామారావుకు ఫోరం ఫర్ గుడ్ గవర్నెన్స్ తరపున పద్మనాభరెడ్డి బుధవారం లేఖ రాశారు. పరిశ్రమల వారీగా పెట్టుబడి, ఉద్యోగ అవకాశాల వివరాల కోసం పరిశ్రమల శాఖ ముఖ్య కార్యదర్శి, తెలంగాణ ట్రేడ్ ప్రమోషన్ కార్పొరేషన్, పరిశ్రమల శాఖ కమిషనర్‌కు సమాచార హక్కు చట్టం కింద దరఖాస్తు చేసినా సరైన సమాచారం ఇవ్వడం లేదన్నారు.

మంచిర్యాలలోనే బీసీబంధు ప్రకటించాలి: జాజుల

పంజగుట్ట (హైదరాబాద్): సీఎం కేసీఆర్ రేపు మంచిర్యాలలో నిర్వహిస్తున్న సభలోనే బీసీబంధు ప్రకటించాలని అప్పుడే బీసీలు ఆయనను నమ్ముతారని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. బీసీ కులవృత్తులు చేసుకునే వారికి లక్ష రూపాయలు ఇస్తామని అంటున్నారని, అది ఎంతమందికి ఇస్తారు, ఎంత బడ్జెట్ కేటాయించారు, రాష్ట్రంలో ఉన్న 1.37 కోట్ల బీసీ కుటుంబాలన్నిటికీ ఇస్తారా.. అనే విషయాలు ఏవీ లేకుండా ఒక జీవో తెచ్చి బీసీలను మభ్యపెట్టేందుకు చూస్తే ఊరుకునేది లేదని హెచ్చరించారు. బుధవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో బీసీ కుల సంఘాల విస్తృతస్థాయి సమావేశం నిర్వహించారు.

సమ్మె ఆలోచన విరమించడం శుభపరిణామం: గంగుల



సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో ఏ ఒక్కరూ ఆకలితో అలమటించకూడదన్న ముఖ్యమంత్రి కేసీఆర్ అభిమతానికి అనుగుణంగా రేషన్‌డీలర్లు తమ వంతు బాధ్యతను నిర్వర్తించాలని రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి గంగుల కమలాకర్ పిలుపునిచ్చారు. ప్రతి నెలా మొదటి వారంలో పేదలకు బియ్యం పంపిణీ చేసే బృహత్తర బాధ్యత డీలర్ల పై ఉందని అన్నారు. రాష్ట్రంలోని అన్ని జిల్లాల రేషన్ డీలర్ల సంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు, సంఘాల ప్రతినిధులతో మంత్రి గంగుల కమలాకర్ బుధవారం పౌరసరఫరాల భవన్‌లో ప్రత్యేకంగా సమావేశమయ్యారు. తనతో చర్చలు జరిపిన తరువాత సమ్మె ఆలోచన విరమించి పేదలకు రేషన్ పంపిణీ ప్రారంభించడం శుభపరిణామని అన్నారు. డీలర్ల సమస్యలన్నీ పరిష్కారం దిశలో ఉన్నాయని భరోసానిచ్చారు.

తెరుచుకున్న చౌకధరల దుకాణాలు

రేషన్ డీలర్లు సమ్మె విరమిస్తున్నట్లు ప్రకటించిన నేపథ్యంలో బుధవారం రాష్ట్రవ్యాప్తంగా దుకాణాలు తెరుచుకున్నాయి. కాగా, సమ్మె విరమణ విషయంలో యూనియన్ నాయకుల మధ్య సమన్వయ లోపం, గ్రూపుల కారణంగా బుధవారం మధ్యాహ్నం వరకు కొంత గందరగోళ పరిస్థితులు కనిపించాయి. హైదరాబాద్ జిల్లాలోని 653 దుకాణాలకు గాను 645 షాపులను తెరిచి, బియ్యం పంపిణీ చేయగా.. రాత్రి వరకు గ్రామీణ ప్రాంతాల్లోని షాపులు కూడా తెరిచి బియ్యం పంపిణీ చేశారు.

రేపు చేప ప్రసాదం పంపిణీ

గన్‌ఫౌండ్రీ (హైదరాబాద్): మూడు సంవత్సరాల అనంతరం హైదరాబాద్‌లో చేప ప్రసాదం పంపిణీకి ఏర్పాట్లు జరుగుతున్నాయి. మృగశిరకార్తె సందర్భంగా ప్రతి సంవత్సరం ఆస్తమా రోగులకు పంపిణీచేసే చేప ప్రసాదాన్ని ఈ నెల 9వ తేదీన నాంపల్లి ఎగ్జిబిషన్ మైదానంలో పంపిణీ చేయనున్నారు. కరోనా నేపథ్యంలో ఈ ప్రసాదం పంపిణీని నిలిపివేసిన విషయం తెలిసిందే. ప్రస్తుతం పరిస్థితులు మెరుగుపడటంతో చేప ప్రసాదాన్ని స్వీకరించేందుకు ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, రాజస్తాన్ తదితర రాష్ట్రాల నుంచి కూడా పెద్ద ఎత్తున రోగులు ఎగ్జిబిషన్ మైదానానికి చేరుకుంటున్నారు. ఈ నేపథ్యంలో రోగులకు ఎటువంటి అసౌకర్యం కలుగకుండా వివిధ శాఖల అధికారులు చర్యలు చేపట్టారు.

డీహెచ్‌తో రవిచంద్ర భేటీ

సాక్షి, హైదరాబాద్: బీఆర్ఎస్ ఎంపీ వద్దిరాజు రవిచంద్ర బుధవారం ప్రజారోగ్య సంచాలకుడు (డీహెచ్) డాక్టర్ శ్రీనివాసరావుతో ఆయన కార్యాలయంలో భేటీ అయ్యారు. మాజీ ఎంపీ పొంగులేటి శ్రీనివాసరెడ్డి కాంగ్రెస్ లేదా బీజేపీలోకి వెళ్లినా రాజకీయంగా ఎలాంటి వ్యూహాలు అనుసరించాలన్న దానిపై ఉభయులూ చర్చించినట్లు సమాచారం. ఒకవేళ పొంగులేటి కొత్తగూడెం నియోజకవర్గం నుంచి పోటీకి దిగితే ఏం చేయాలో వారు చర్చించారు. తమ మధ్య రాజకీయాలు చర్చకు రావడం నిజమేనని, కానీ రవిచంద్ర మాత్రం ఇతర పనులపై వచ్చినట్లు శ్రీనివాసరావు చెప్పారు.



కొత్త అతిథి.. 'నవరంగ్'

కామారెడ్డి బస్వాపూర్ వద్ద దర్శనం

పలు ప్రాంతాల్లో కనిపించడంతో పక్షి ప్రేమికుల హర్షం

సాక్షి, హైదరాబాద్: తెలంగాణ వ్యాప్తంగా అతిథి పక్షుల సందడి నెలకొంది. వలస వచ్చిన వివిధ రకాల పక్షులు స్థానికులకు ఆహ్లాదాన్ని పంచుతున్నాయి. వాటిలో తొమ్మిది రంగులు, ఆకర్షణీయమైన రూపు, ప్రత్యేకమైన అరుపులు కలిగిన 'నవరంగ్' పిట్టలు జనాన్ని అలరిస్తున్నాయి. ఇండియన్ పిట్టగా పిలుచుకునే దీని సాంకేతిక నామం 'పిట్ట బ్రాచ్యూరా'. తాజాగా ఈ పక్షి కామారెడ్డి జిల్లా బస్వాపూర్ దగ్గర్లోని అటవీప్రాంతంలో కనువిందు చేస్తోంది. అప్పుడప్పుడు నల్లమల అటవీ ప్రాంతంతో పాటు, హైదరాబాద్ నగరం, అమీన్‌పూర్ చెరువు ప్రాంతాల్లోనూ కనిపిస్తుందని పక్షి ప్రేమికులు చెబుతున్నారు.



అందమైన పక్షి..

అనంతగిరి హిల్స్ సహా రాష్ట్రంలోని ఇతర అడవుల్లోనూ ఇవి దర్శనమిస్తుంటాయి. శరీరంపై రంగుల ప్రత్యేకతతో వీటిని 'నవరంగ్'గా అభివర్ణిస్తారు. ఈ పక్షి అరుపు 'విజిల్' సౌండ్‌ని తలపిస్తుంది. ఎంతో అందమైన పక్షి.

– హరికృష్ణ ఆడెపు, హైదరాబాద్ బర్డింగ్ పాల్స్

తెలంగాణ.. కోటిన్నర ఎకరాల మాగాణి





రామప్ప ఆలయంలోని సరిగమలు పలికే పొన్నచెట్టు శిల్పాన్ని మీటుతున్న మంత్రి కేటీఆర్. ములుగు సభకు హాజరైన జనం

▶ మొదటి పేజీ తరువాయి

కొనుగోలు చేస్తోంది. ఇది కాంగ్రెస్ నాయకులకు కనిపించట్లేదు. పైగా రాష్ట్రాన్ని అభివృద్ధిపథంలో తీసుకెళ్తున్న సీఎం కేసీఆర్‌పై దద్దమ్మల్లా, సన్నాసుల్లా ఆరోపణలు చేస్తూ ఎగిరెగిరి పడుతున్నారు..' అని మంత్రి ఆగ్రహం వ్యక్తం చేశారు. 'నాడు ఉమ్మడి రాష్ట్రంగా ఉన్న సమయంలో వర్షాకాలం, శీతాకాలం రాగానే 'మంచం పట్టిన మన్యం' అనే వార్తలు వస్తుండేవి. నేడు శుభ్రమైన మంచినీటిని అందించడంతో పాటు అన్ని రకాల సౌకర్యాలను కల్పించడంతో ములుగు, భద్రాచలం ఏజెన్సీ గ్రామాల ప్రజలు ఆరోగ్యంగా ఉంటున్నారు..' అని తెలిపారు. 'కాంగ్రెస్ చేతిలో మోసపోయి మళ్లీ గోసపడదామా.. అభివృద్ధి లక్ష్యంగా ముందుకు సాగుతున్న బీఆర్ఎస్‌నే గెలిపించుకుందామా..?' అని ప్రజలను ప్రశ్నించారు. తెలంగాణ ఆవిర్భావ దశాబ్ది వేడుకల్లో భాగంగా ములుగులో బుధవారం మంత్రులు మహమూద్ అలీ, ఎర్రబెల్లి దయాకర్‌రావు, సత్యవతిరాథోడ్‌తో కలిసి జిల్లా సమీకృత కలెక్టరేట్, ఎస్పీ కార్యాలయం, మినీ బస్సు డిపో, మోడల్ పోలీస్‌స్టేషన్, గ్రంథాలయ భవనం, శ్మశానవాటిక నిర్మాణాలకు కేటీఆర్ శంకుస్థాపన చేశారు. అనంతరం సాగునీటి దినోత్సవం సందర్భంగా వెంకటాపురం(ఎం) మండలం రామప్ప రిజర్వాయర్‌లో భీం ఘన్‌పూర్ నుంచి వస్తున్న గోదావరి జలాలకు పూజలు చేశారు. తర్వాత ములుగులో ఏర్పాటుచేసిన సభలో ప్రసంగించారు.

ములుగుపై కేసీఆర్‌కు ఎంతో ప్రేమ

'ములుగు నియోజకవర్గంలో ప్రతిపక్ష కాంగ్రెస్ ఎమ్మెల్యే ఉన్నప్పటికీ సీఎం కేసీఆర్ మదిలో ఈ ప్రాంత ప్రజలపై అమితమైన ప్రేమ ఉంది. ఇందులో భాగంగానే రూ.133 కోట్లతో అభివృద్ధి పనులు చేపడుతున్నారు. 'నాడు నేను రాను బిడ్డ సర్కారు దవాఖానాకు అన్న ప్రజలు నేడు ప్రభుత్వ ఆస్పత్రులకు క్యూ కడుతున్నారు. మండుటెండల్లోనూ చెరువులు నిండుగా కనిపించడంతో పాటు మత్తళ్లు పోస్తున్నాయి. వ్యవసాయ సీజన్‌రాగానే టింగ్.. టింగ్‌మంటూ ఫోన్‌లలో మెసేజ్‌ల ద్వారా పెట్టుబడి సహాయం తమ ఖాతాల్లో అందడాన్ని రైతులు చూస్తున్నారు. ములుగు ఎమ్మెల్యే వినతి పత్రం అందించకపోయినా మెడికల్ కళాశాల మంజూరు చేశాం. గ్రామ పంచాయతీగా ఉన్న ములుగును మున్సిపాలిటీగా మారుస్తూ ఇటీవల జరిగిన శాసనసభ సమావేశంలో బిల్లు ప్రవేశపెట్టాం. అయితే కొంతమంది తెలివి లేని కాంగ్రెస్ నాయకులు మోసపూరిత మాటలతో పక్కదారి పట్టిస్తున్నారు. కేసీఆర్ పాలనపై చిన్నబిడ్డల నుంచి ముసలివాళ్ల వరకు ఆలోచన చేయాలి..'అని మంత్రి విజ్ఞప్తి చేశారు. బీజేపీ, కాంగ్రెస్ నాయకులు సంక్రాంతి గంగిరెద్దుల్లా వచ్చి అడ్డం పొడుగు లేకుండా మాట్లాడుతున్నారని విమర్శించారు. రాంబదుల్లా వ్యవహరించిన కాంగ్రెస్ పార్టీకి బుద్ధిచెప్పాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో డీజీపీ అంజనీకుమార్, ఎమ్మెల్సీలు పల్లా రాజేశ్వర్‌రెడ్డి, పోచంపల్లి శ్రీనివాస్‌రెడ్డి, ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మనవడి కోసం కోనాపూర్ ఎదురుచూపులు!

నాయినమ్మ పేరుతో బడి కట్టించిన కేటీఆర్

సాక్షి, కామారెడ్డి: మంత్రి కేటీఆర్ రాక కోసం కామారెడ్డి జిల్లా బీబీపేట మండలంలోని కోనాపూర్ ఎదురుచూస్తోంది. తన నాయినమ్మ వెంకటమ్మ పేరిట ఆయన సొంత డబ్బు రూ.2.5 కోట్లతో గ్రామంలో చేపట్టిన పాఠశాల భవనం నిర్మాణ పనులు పూర్తయ్యాయి. గతేడాది మే 10న మంత్రి దీనికి శంకుస్థాపన చేశారు. అదే సమయంలో గ్రామంలో అభివృద్ధి పనులకు భారీ ఎత్తున నిధులు మంజూరు చేశారు. ఊరంతా సీసీ రోడ్లు, కుల సంఘాల భవనాలు, ఆలయాల పునర్నిర్మాణం వంటి పనులు జోరుగా సాగుతున్నాయి. పాఠశాల భవన నిర్మాణం దాదాపు పూర్తి కాగా తుదిమెరుగులు దిద్దుతున్నారు. ఈనెల 12 నుంచి పాఠశాలలు పునఃప్రారంభం కానున్న నేపథ్యంలో కేటీఆర్ ఎప్పుడు వస్తారో, బడిని ఎప్పుడు ప్రారంభిస్తారోనని గ్రామస్తులు ఎదురుచూస్తున్నారు.

నదులకే నడక నేర్పిన నాయకత్వం: కేటీఆర్ ట్వీట్

కేసీఆర్ సంకల్పంతోనే సాగునీటి ప్రాజెక్టులకు స్వర్ణయుగం

సాక్షి, హైదరాబాద్: ఉమ్మడి పాలనలో తెలంగాణ వ్యవసాయ రంగంలో సంక్షోభం నెలకొని రైతుల జీవితాలు అత్యంత దుర్భరంగా ఉండేవని, కానీ కొత్త రాష్ట్రం ఏర్పడిన తర్వాత సీఎం కె.చంద్రశేఖర్‌రావు సంకల్పంతో సాగునీటి రంగంలో స్వర్ణయుగం ప్రారంభమైందని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి కేటీ రామారావు తెలిపారు. తెలంగాణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా తెలంగాణ నీటిపారుదల రంగంలో సాధించిన విజయాలపై మంత్రి కేటీఆర్ ట్వీట్ చేశారు. కోటి రతనాల వీణగా ఉన్న తెలంగాణను కోటి ఎకరాల మాగాణంగా మార్చిన ఘనత కేసీఆర్‌కే దక్కుతుందని, రాష్ట్ర జల విధానం దేశానికే కాకుండా మొత్తం ప్రపంచానికే ఆదర్శమన్నారు. జీవం కోల్పోయిన గోదావరి నదికి ప్రాణం పోయడంతో పాటు కాళేశ్వరం ప్రాజెక్టును మానవ నిర్మిత అద్భుతంగా కేసీఆర్ తీర్చిదిద్దారన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టు వచ్చే వందేళ్ల వరకూ రైతులకు తిరుగులేని అభయం లాంటిదని, నదికే నడక నేర్పిన ధీరోదాత్త నాయకుడు కేసీఆర్ అని మంత్రి కేటీఆర్ తన ట్వీట్‌లో పేర్కొన్నారు. అతి త్వరలో పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్ట్ కూడా సాకారమవుతుందని స్పష్టం చేశారు.

అప్పు ఇచ్చి అఘాయిత్యం!

- సకాలంలో అప్పు తీర్చకపోవడంతో క్లాస్‌మేట్‌పై కామవాంఛ తీర్చుకున్న ఎంబీఏ విద్యార్థి
- షీటీమ్‌ను ఆశ్రయించిన యువతి

హిమాయత్‌నగర్: కాల్ మనీ తరహా ఉదంతం హైదరాబాద్ నడిబొడ్డున చోటుచేసుకుంది. ఎంబీఏ విద్యార్థినికి అప్పు ఇచ్చిన ఆమె క్లాస్‌మేట్ తిరిగి చెల్లించలేకపోవడాన్ని అదునుగా భావించి అఘాయిత్యానికి పాల్పడ్డాడు. షీ టీమ్ ద్వారా వివరాలు తెలుసుకున్న నారాయణగూడ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు. విశ్వసనీయ సమాచారం ప్రకారం... నారాయణగూడలోని ఓ కళాశాలలో ఎంబీఏ ఫస్టియర్ చదువుతున్న యువతి ఆర్థిక ఇబ్బందులు ఉండటంతో కొన్ని నెలల క్రితం తన క్లాస్‌మేట్ నుంచి డబ్బు తీసుకుంది. నిర్ణీత సమయంలో ఆ యువతి ఈ బకాయి తీర్చలేకపోయింది. దీంతో అతడు ఎట్టి పరిస్థితుల్లో వెంటనే నగదు చెల్లించాలంటూ ఒత్తిడి చేసి ఆమెను నిస్సహాయురాలిని చేశాడు. ఆ డబ్బు అడగకుండా ఉండాలంటే తన కోరిక తీర్చాలని ఒత్తిడి చేశాడు. గత్యంతరం లేని ఆమె అంగీకరించడంతో కొన్ని రోజుల క్రితం నారాయణగూడలోని ఓయో రూమ్‌కు వెళ్లారు. అక్కడ ఇద్దరూ ఏకాంతంగా ఉండగా సదరు యువకుడు రహస్యంగా వీడియో చిత్రీకరించాడు. దాన్ని మరుసటి రోజు తన స్నేహితులకు చూపించాడు. అప్పటి నుంచి ఇతడితోపాటు మరో నలుగురు యువకులు తమ కోరిక తీర్చాలంటూ ఆమెను బ్లాక్‌మెయిల్ చేయడం మొదలెట్టారు. అలా చేయకుంటే వీడియో వైరల్ చేస్తామని బెదిరించారు. ఆ యువతి ఒప్పుకోకపోవడంతో ఆ వీడియోను వాట్సాప్ గ్రూపుల్లో వైరల్ చేశారు. ఇన్‌స్టాగ్రామ్‌లో ఓ పేజ్ క్రియేట్ చేసి పోస్ట్ చేశారు. మానసిక క్షోభకు గురైన యువతి ఇటీవల షీ టీమ్‌ను ఆశ్రయించింది. నిందితులపై కేసు పెట్టాలని షీటీమ్ నారాయణగూడ పోలీసులకు సిఫార్సు చేసింది. దీంతో ఐదుగురు యువకులపై కేసు నమోదు చేశారు. పరారీలో ఉన్న వీరిని గాలించేందుకు ప్రత్యేక బృందాన్ని రంగంలోకి దింపారు.

రేపు కేరళకు 'నైరుతి'!



- ఉధృతమైన పశ్చిమ గాలులు
- మరింత విస్తరణకు అనుకూల పరిస్థితులు

సాక్షి, విశాఖపట్నం/హైదరాబాద్: కొన్నాళ్లుగా దోబూచులాడుతున్న నైరుతి రుతుపవనాలు ఎట్టకేలకు కేరళను తాకనున్నాయి. సాధారణంగా ఏటా జూన్ ఒకటో తేదీకి ఇవి కేరళలోకి ప్రవేశిస్తాయి. కానీ మూడు రోజులు ఆలస్యంగా జూన్ 4న తాకుతాయని భారత వాతావరణ శాఖ (ఐఎండీ) ముందస్తుగా అంచనా వేసింది. అయితే ఆ అంచనాలు కూడా తప్పాయి. ఈనెల ఏడు, లేదా ఎనిమిది తేదీల్లో కేరళలోకి ప్రవేశించవచ్చని ఐఎండీ పేర్కొంది. ప్రస్తుతం కేరళలో రుతుపవనాల ప్రవేశానికి అనుకూల పరిస్థితులేర్పడ్డాయి. దక్షిణ అరేబియా సముద్రం మీదుగా పడమట గాలులు కొనసాగుతున్నాయి. పశ్చిమ గాలుల లోతులో పెరుగుదల, ఆగ్నేయ అరేబియా సముద్రం, లక్షద్వీప్, కేరళ తీర ప్రాంతాలపై మేఘావృతం ఉధృతం వంటి పరిణామాలున్నాయి. దీంతో శుక్రవారం నాటికల్లా నైరుతి రుతుపవనాలు కేరళలో ప్రవేశించడానికి పరిస్థితులు అనుకూలంగా ఉన్నాయని ఐఎండీ బుధవారం వెల్లడించింది. అనంతరం ఈ రుతుపవనాలు దక్షిణాది రాష్ట్రాల్లోని మరికొన్ని ప్రాంతాల్లో ముందుకు సాగుతాయని తెలిపింది. అలాగే అరేబియా సముద్రం, మొత్తం లక్షద్వీప్, మాల్దీవులు, కొమరిన్ ప్రాంతాలు, నైరుతి, మధ్య, ఈశాన్య బంగాళాఖాతంలోని మరికొన్ని ప్రాంతాలు, ఈశాన్య రాష్ట్రాల్లోని కొన్ని ప్రాంతాల్లోకి నైరుతి ప్రవేశానికి అనుకూల పరిస్థితులున్నాయని వివరించింది.

మరో మూడు రోజులు వడగాలులే

ఇటు రాష్ట్రంలో రోజురోజుకూ ఉష్ణోగ్రతలు పెరుగుతూనే ఉన్నాయి. బుధవారం రాష్ట్రంలో భగభగలతో జనం విలవిల్లాడారు. కరీంనగర్ జిల్లా తంగులలో 45.8 డిగ్రీల సెల్సియస్ అధిక ఉష్ణోగ్రత నమోదైంది. ములుగు జిల్లా మేడారంలో 45.5 డిగ్రీలు నమోదైంది. కాగా, రాగల మూడు రోజులు రాష్ట్రంలో అక్కడక్కడా వడగాలులు వీచే అవకాశం ఉంది. గురు, శుక్రవారాల్లో ఆదిలాబాద్, కొమరం భీం, మంచిర్యాల జిల్లాల్లో వడగాలులు వీచే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం హెచ్చరించింది. మరోవైపు రుతుపవనాల ఆగమనం నేపథ్యంలో రాగల మూడు రోజులు రాష్ట్రంలో అక్కడక్కడ ఉరుములు, మెరుపులతో కూడిన వర్షాలు కురిసే అవకాశముంది. మరికొన్నిచోట్ల మూడు రోజులు తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని తెలిపింది.

బుధవారం రాష్ట్రంలో నమోదైన గరిష్ట ఉష్ణోగ్రతలు.. (సెల్సియస్‌లలో)

ప్రాంతం	గరిష్ట ఉష్ణోగ్రత
తంగుల (కరీంనగర్)	45.8
మేడారం (ములుగు)	45.5
దామరచర్ల (నల్లగొండ)	45.3
మహదేవపూర్ (జయశంకర్)	45.1
తాడ్వాయి (ములుగు)	45.1
మునగాల (సూర్యాపేట)	45.1
కెరమెరి (కొమురంభీం)	45.1
జంబుగ (కొమురంభీం)	45.0
కేతేపల్లి (నల్లగొండ)	45.0
ఖమ్మం	43.6
భద్రాచలం	43.2
ఆదిలాబాద్	42.8
నల్లగొండ	42.5
హనుమకొండ	41.5
రామగుండం	42.6
మెదక్	41.4
హైదరాబాద్	40.0
నిజామాబాద్	41.1
మహబూబ్‌నగర్	39.4

చందమామను ఎలాగూ ఇవ్వలేరు..
నీళ్లయినా ఇవ్వండి

కేంద్రంపై కేసీఆర్ విమర్శలు
- బీఆర్ఎస్‌లో చేరిన పలువురు మహారాష్ట్ర, మధ్యప్రదేశ్ నేతలు
- 'వ్యాపం'స్కామ్‌ను వెలుగులోకి తెచ్చిన సామాజిక కార్యకర్త కూడా..



సీఎం కేసీఆర్ సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరిన ఆనంద్‌రాయ్, మధ్యప్రదేశ్ నాయకులు

సాక్షి, హైదరాబాద్: 'అందని చాంద్ సితారాలను ఎట్లాగూ అందివ్వలేరు....కనీసం అందుబాటులో వున్న నీరు విద్యుత్‌నైనా దేశ రైతాంగం కోసం ఎందుకు అందించలేకపోతున్నారని కేంద్ర ప్రభుత్వాన్ని బీఆర్ఎస్ అధినేత ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్ రావు ప్రశ్నించారు. కేంద్ర పాలకులను నిలదీసే దిశగా ప్రతీ దేశ పౌరుడు జాగృతం కావాల్సిన అవసరముందని పునరుద్ఘాటించారు. బుధవారం మహారాష్ట్రకు చెందిన వందలాది మంది నేతలు, కార్యకర్తలు కేసీఆర్ సమక్షంలో బీఆర్ఎస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా కేసీఆర్ మాట్లాడుతూ.. తెలంగాణలో అన్ని రంగాల్లో అభివృద్ధి కార్యక్రమాలు అమలవుతున్నప్పుడు దేశంలోని ఇతర రాష్ట్రాల్లో ఎందుకు కావని ప్రశ్నించారు. కేంద్రాన్ని ఏలుతున్న పాలకులకు చిత్తశుద్ధి లోపం వల్లనే ప్రజలకు నష్టం జరుగుతోందన్నారు ''మనమేమన్నా వాళ్లను చంద్రున్ని, చుక్కలను తెచ్చి ఇమ్మంటున్నామా...? మన జీవితానికి అత్యవసరమైన మనకు ప్రకృతి అందుబాటులో ఉంచిన, తాగునీటిని, సాగు నీటిని విద్యుత్‌ను మాత్రమే ఇవ్వమని అడుగుతున్నం. ''చాంద్ సితారో చోడో....పానీ బిజిలీ జోడో''(చాంద్ సితారలను వదిలేయండి మాకు నీళ్ల విద్యుత్తును అందించండి) అని అన్నారు.

50మంది మహారాష్ట్ర సర్పంచ్‌ల చేరిక

మహారాష్ట్రలోని పలు గ్రామాలకు చెందిన యాభై మంది సర్పంచులు బుధవారం నాడు సీఎం కేసీఆర్ సమక్షంలో పార్టీలో చేరారు. పార్టీలో చేరడానికి ముందు తెలంగాణ వ్యాప్తంగా పర్యటించారు. వ్యవసాయం తాగునీరు, సాగునీరు, విద్యుత్ రోడ్లు సహా పలు రంగాల్లో రాష్ట్రంలో జరుగుతున్న అభివృద్ధిని పరిశీలించారు.

బీఆర్ఎస్‌లోకి ఆనంద్‌రాయ్

మధ్యప్రదేశ్‌కు చెందిన ప్రముఖ సామాజిక కార్యకర్త, సంచలనం రేపిన వ్యాపమ్ స్కామ్‌ను వెలుగులోకి తెచ్చిన ఆనంద్ రాయ్ బుధవారం ప్రగతిభవన్‌లో ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్ రావు సమక్షంలో బీఆర్ఎస్ పార్టీలో చేరారు. ఆయనతోపాటు పలువురికి కేసీఆర్.. గులాబీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. మధ్యప్రదేశ్‌లో గిరిజనుల హక్కుల కోసం పోరాడుతున్న గిరిజన హక్కుల వేదిక 'జై ఆదివాసి యువశక్తి సంఘటన్'(జేపీవైఎస్) కూడా బీఆర్ఎస్‌కు మద్దతు ప్రకటించింది. ఈ సంస్థ అధ్యక్షుడు లాల్ సింగ్ బర్మన్‌తో పాటు మరికొందరు బీఆర్ఎస్‌లో చేరారు. తెలంగాణలో కేసీఆర్ పాలనలో సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు మానవీయ కోణంలో కొనసాగుతున్నాయని జేఏవైఎస్ స్థాపకుడు విక్రమ్ అచ్చాలియా తెలిపారు. కేసీఆర్ దేశ ప్రజల ఆకాంక్షలను నెరవేరుస్తారనే విశ్వాసం అంతటా కలుగుతోందని, అందుకే జాతీయస్థాయిలో ప్రత్యామ్నాయ రాజకీయ వేదికగా బీఆర్ఎస్ ఎదుగుతోందని ఆయన చెప్పారు.

రేపు సంక్షేమ దినోత్సవం

- మంచిర్యాలలో సీఎం చేతుల మీదుగా బీసీ కులవృత్తుల లబ్ధిదారులకు చెక్కుల పంపిణీ
- చేతి వృత్తులపై ఆధారపడ్డ వర్గాల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం
- 9న ప్రతి జిల్లాలో కనీసం 50 యూనిట్లు గ్రౌండ్ చేయాలి
- జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్‌లో మంత్రి గంగుల కమలాకర్
- సంగారెడ్డి నుంచి కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న మంత్రి హరీశ్‌రావు



వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న మంత్రి హరీశ్‌రావు

సాక్షి, హైదరాబాద్: వెనుకబడిన కులాల్లోని చేతి వృత్తులపై ఆధారపడ్డ వర్గాల అభ్యున్నతిపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి పెట్టిందని రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి గంగుల కమలాకర్ తెలిపారు. బీసీ కుల వృత్తుల వారికి బ్యాంకు లింకేజీ లేకుండా లక్ష రూపాయల గ్రాంటును అందించే పథకానికి సంబంధించి బుధవారం మంత్రి గంగుల కమలాకర్, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి.. జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి హరీశ్‌రావు సంగారెడ్డి నుంచి వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి గంగుల మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర దశాబ్ది అవతరణ ఉత్సవాల్లో భాగంగా ఈ నెల 9న నిర్వహించనున్న సంక్షేమ దినోత్సవాన్ని విజయవంతంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేయాలని కలెక్టర్లను ఆదేశించారు. 9వ తేదీన ప్రతి జిల్లాలో కనీసం 50 యూనిట్లు గ్రౌండ్ చేయాలని సూచించారు. మంచిర్యాలలో ముఖ్యమంత్రి స్వయంగా వారి చేతుల మీదుగా చెక్కులను అందించి, కార్యక్రమాన్ని ప్రారంభిస్తారని చెప్పారు. పథకం దుర్వినియోగానికి ఆస్కారం లేకుండా కలెక్టర్లు అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

ప్రతినెలా 15వ తేదీన...

ఇది నిరంతర కార్యక్రమం అని, దీని కింద లబ్ధిదారులను గుర్తించి ప్రతినెలా 15వ తేదీన లబ్ధిదారులకు ఆయా నియోజకవర్గాల ఎమ్మెల్యేలతో చెక్కులు పంపిణీ చేస్తామని మంత్రి గంగుల తెలిపారు. ఈ దరఖాస్తులను ఆన్‌లైన్‌లో మాత్రమే స్వీకరిస్తామని స్పష్టం చేశారు. రెండో విడత గొర్రెల పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించాలని కలెక్టర్లను మంత్రి కోరారు. ఆర్థికశాఖ మంత్రి హరీశ్‌రావు మాట్లాడుతూ జిల్లా ఇన్‌చార్జి మంత్రి ఆమోదంతో లబ్ధిదారులను గుర్తించాలన్నారు.

ఆరోగ్య దినోత్సవంపై మంత్రి హరీశ్‌రావు సమీక్ష

మంత్రి హరీశ్‌రావు ఆరోగ్య దినోత్సవ కార్యక్రమాలపై జిల్లా కలెక్టర్లతో సమీక్షించారు. ఈ నెల 14వ తేదీన ప్రతి నియోజకవర్గంలో 15 మంది గర్భిణులను గుర్తించి కేసీఆర్ పౌష్టికాహార కిట్లను పంపిణీ చేయాలని ఆదేశించారు. ఏఎన్ఎంలు, ఆశా వర్కర్లకు చీరలు, బీపీ తనిఖీ పరికరాల పంపిణీకి ఏర్పాట్లు చేయాలని కలెక్టర్‌లకు సూచించారు. వీడియో కాన్ఫరెన్స్‌లో పశుసంవర్ధక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అధర్ సిన్హా, బీసీ సంక్షేమశాఖ ముఖ్య కార్యదర్శి బి వెంకటేశం, ఎస్సీ డెవలప్‌మెంట్ కార్యదర్శి రాహుల్ బొజ్జా, ఆర్థికశాఖ కార్యదర్శి టీకే శ్రీదేవి, గిరిజన సంక్షేమ శాఖ కార్యదర్శి క్రిస్టినా జోంగ్తు, ఆరోగ్య శాఖ కార్యదర్శి రిజ్వీ పాల్గొన్నారు.

మీడియా సెంటర్‌లో చోరీ జరగలేదు

సచివాలయం చీఫ్ సెక్యూరిటీ ఆఫీసర్

సాక్షి, హైదరాబాద్: నూతన సచివాలయం పక్కన మీడియా సెంటర్‌లో దొంగతనం జరిగిందంటూ కొన్ని పత్రికలు(సాక్షి కాదు), సోషల్ మీడియాలో వచ్చిన వార్తల్లో ఎలాంటి నిజం లేదని సచివాలయ చీఫ్ సెక్యూరిటీ అధికారి వెంకట్రాముడు స్పష్టం చేశారు. ఇప్పటికే మీడియా సెంటర్లో పనులు పూర్తయ్యి, పూర్తిస్థాయిలో జర్నలిస్టులు వినియోగించుకుంటున్నారని తెలిపారు. సచివాలయ ప్రాంగణంలోనూ, దాని చుట్టుప్రక్కలా తగినంత పోలీసు సిబ్బందితో పటిష్టమైన నిఘా, భద్రత నిరంతరం కొనసాగేట్లు ఏర్పాటు చేశామని వివరించారు. గట్టి నిఘా ఉన్నందున సచివాలయ పరిసరాల్లో ఎలాంటి దొంగతనం జరిగేందుకు ఆస్కారమే లేదని వెంకట్రాముడు తెలిపారు.

19 నుంచి జోసా కౌన్సెలింగ్

- 18న జేఈఈ అడ్వాన్స్‌డ్ ఫలితాలు
- 19 నుంచి రిజిస్ట్రేషన్, 25న తొలిదశ సీట్ల కేటాయింపు
- షెడ్యూల్ విడుదల చేసిన జోసా



సాక్షి, హైదరాబాద్: జాతీయ ఇంజనీరింగ్ కాలేజీలు (నిట్), ట్రిపుల్ ఐటీ, కేంద్ర ప్రభుత్వ నిధులతో నడిచే ఇంజనీరింగ్ కాలేజీల్లో ప్రవేశాల ప్రక్రియ ఈ నెల 19 నుంచి మొదలవుతుంది. జేఈఈ అడ్వాన్స్‌డ్ ఫలితాలు ఈ నెల 18న విడుదలవుతాయి. ఆ మర్నాడే జోసా కౌన్సెలింగ్ ప్రారంభమవుతుంది. జేఈఈలో వచ్చిన ర్యాంకుల ఆధారంగా జోసా పరిధిలోని కాలేజీల్లో సీట్లు కేటాయిస్తారు. ఇందుకు సంబంధించిన షెడ్యూల్‌ను జాయింట్ సీట్ అలొకేషన్ అథారిటీ (జోసా) బుధవారం విడుదల చేసింది.

కౌన్సెలింగ్ షెడ్యూల్

తేదీ	ప్రక్రియ
జూన్ 19	జోసా రిజిస్ట్రేషన్
జూన్ 25	మాక్ సీట్ అలకేషన్-1
జూన్ 27	మాక్ సీట్ అలకేషన్-2 (అభ్యర్థులు ఆప్షన్స్ లాక్ చేయొచ్చు)
జూన్ 29	అభ్యర్థులు డేటా మార్పులు
జూన్ 30	తొలి విడత సీట్ల కేటాయింపు
జూలై 4	ఆన్‌లైన్ రిపోర్టింగ్
జూలై 5	తొలి విడత కేటాయింపుపై సందేహాల నివృత్తి
జూలై 6	రెండో దశ సీట్ల కేటాయింపు
జూలై 6-10	ఆన్‌లైన్ రిపోర్టింగ్
జూలై 12	మూడో దశ సీట్ల కేటాయింపు
జూలై 12-14	ఆన్‌లైన్ రిపోర్టింగ్
జూలై 16	నాల్గో దశ సీట్ల కేటాయింపు
జూలై 16-19	ఆన్‌లైన్ రిపోర్టింగ్
జూలై 21	ఐదో దశ సీట్ల కేటాయింపు
జూలై 21-24	ఆన్‌లైన్ రిపోర్టింగ్
జూలై 26	6వ దశ సీట్ల కేటాయింపు
జూలై 26-28	ఆన్‌లైన్ రిపోర్టింగ్

క్లుప్తంగా...

'భూములపై' శ్వేతపత్రం ప్రకటించండి

బీజేపీ నేత లక్ష్మణ్ డిమాండ్



సాక్షి, హైదరాబాద్: రాష్ట్రవ్యాప్తంగా ఎన్ని కంపెనీలకు ఎంత భూములిచ్చారు, ఎన్ని ఉద్యోగాలు కల్పించారన్న అంశంపై కేసీఆర్ సర్కార్ శ్వేత పత్రం ప్రకటించాలని బీజేపీ ఓబీసీ మోర్చా జాతీయ అధ్యక్షుడు కె.లక్ష్మణ్ డిమాండ్ చేశారు. ముఖ్యంగా ఐటీ రంగానికి కేటాయించిన భూములు.. వచ్చిన ఉద్యోగాల సంఖ్యపై వివరాలు వెల్లడించాలన్నారు. పెట్టుబడుల ఆకర్షణ పేరిట మంత్రులు విదేశాల్లో తిరుగుతూ ప్రజాధనం దుర్వినియోగం చేస్తున్నారని ధ్వజమెత్తారు. డొల్ల కంపెనీలకు విలువైన భూములను అప్పనంగా కట్టపెడుతున్నరని ఆరోపించారు. హైదరాబాద్‌లో గతం నుంచే ఐటీ పరిశ్రమలు ఉన్నాయని పేర్కొన్నారు. దేశంలోకి వచ్చిన విదేశీ ప్రత్యక్ష పెట్టుబడుల్లో తెలంగాణకు 2% కూడా రాకపోవడానికి కేసీఆర్ అసమర్థత కారణం కాదా? అని ప్రశ్నించారు. బుధవారం లక్ష్మణ్ మీడియాతో మాట్లాడుతూ 9 ఏళ్ల పాలనలో తెలంగాణను కేసీఆర్ భ్రష్టు పట్టించారని మండిపడ్డారు. ఎన్నికలప్పుడు, ఆ తర్వాత ప్రజలకు ఇచ్చిన హామీలను తుంగలో తొక్కారన్నారు.

'పూటకో మాట.. గడికో హామీ.. కేసీఆర్ నైజం'



సాక్షి, హైదరాబాద్: ఇచ్చిన హామీలు నెరవేర్చకుండా తప్పించుకుని తిరుగుతూ, ఎన్నికల సమయంలోనే ప్రజలకు కనిపించి పూటకో మాట.. గడికో హామీలివ్వడం కేసీఆర్ నైజమని వైఎస్సార్ తెలంగాణ పార్టీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల బుధవారం విడుదల చేసిన ఓ ప్రకటనలో తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. 'దళారి దొంగలు, కొత్త వేషగాళ్లు, దోపిడీదారులు'అంటూ దొర మాట్లాడుతుంటే.. దొంగలే భుజాలు తడుముకున్నట్లు ఉందని వ్యాఖ్యానించారు. కేసీఆర్ అండ్ కో కన్నా ఈ దేశంలో దళారులు ఎవరని నిలదీశారు. 3 కోట్ల మంది తెలంగాణ బిడ్డల ఉద్యమ ఆకాంక్షను నమ్మి చేతుల్లో పెడితే నట్టేట ముంచిందెవరన్నారు. బడి నుంచి సాగుబడి వరకు అన్ని ప్రాజెక్టులపై లక్ష కోట్ల కమీషన్లు తిన్న దోపిడీ దారులెవరని ప్రశ్నించారు. కట్టిన అతికొద్ది డబుల్ బెడ్రూం ఇళ్లలో 5 లక్షలు, దళితబంధులో 3 లక్షలు, ఇళ్ల స్థలాల క్రమబద్ధీకరణకు 3 లక్షలు, కాంట్రాక్టర్ల బిల్లుల్లో 30 శాతం కమీషన్లు, ఇసుక, మట్టి, మాఫియాతో వేల కోట్లు దోచుకుతింటున్న దళారులెవరని ఆమె సూటిగా ప్రశ్నించారు. కాళేశ్వరం ప్రాజెక్టు మీదుగా విదేశాలకు నేర్పే పాఠాలేంటో చెప్పాలని కేటీఆర్‌ను నిలదీశారు.

రణమా..ఊడిగమా?

- బీఆర్‌ఎస్ నేతలు తేల్చుకోవాలి
- టీపీసీసీ అధికార ప్రతినిధి సుధీర్ రెడ్డి



సాక్షి, హైదరాబాద్: మిగులు బడ్జెట్ ఉన్న రాష్ట్రాన్ని అప్పుల పాలు చేసి, ప్రజల జీవితాలను అల్లకల్లోలం చేస్తున్న ముఖ్యమంత్రి కేసీఆర్‌కు బీఆర్‌ఎస్ నేతలు ఎన్నాళ్లు ఊడిగం చేస్తారని టీపీసీసీ అధికార ప్రతినిధి సుంకేపల్లి సుధీర్‌రెడ్డి ప్రశ్నించారు. రణమో.. ఊడిగమో తేల్చుకోవాల్సిన సమయం ఆసన్నమైందని, కేసీఆర్‌పై బీఆర్‌ఎస్ నేతలు తిరుగుబాటు చేయాలని ఆయన కోరారు. బుధవారం ఆయన గాంధీభవన్‌లో విలేకరులతో మాట్లాడుతూ, ప్రత్యేక తెలంగాణ రాష్ట్రంలో కేసీఆర్ కుటుంబం మాత్రమే బాగుపడిందని అన్నారు. ప్రభుత్వ ఉద్యోగులకు సకాలంలో జీతాలిచ్చే పరిస్థితి లేదని, కనీసం బస్తీ దవాఖానాల్లో డాక్టర్లు కూడా ఉండని పరిస్థితి తెలంగాణలో ఉందని విమర్శించారు. ధరణి పోర్టల్‌ను రద్దు చేస్తే రైతుబంధు రాదని, రైతుబీమా రాదని చెపుతూ సీఎం కేసీఆర్ రైతులను బెదిరిస్తున్నారని వ్యాఖ్యానించారు. ధనికులకు మాత్రమే ధరణి బాగుంటుందని అన్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చాక ధరణి పోర్టల్‌ను రద్దు చేసి తీరుతామని సుధీర్‌రెడ్డి స్పష్టం చేశారు.

పార్టీ వీడే ప్రసక్తే లేదు: నందీశ్వర్‌గౌడ్

సాక్షి, హైదరాబాద్: తాను పార్టీని వీడుతున్నట్టు జరుగుతున్న ప్రచారాన్ని బీజేపీ నేత, మాజీ ఎమ్మెల్యే నందీశ్వర్ గౌడ్ ఖండించారు. తాను బీజేపీని వీడే ప్రసక్తే లేదని, ప్రాణం ఉన్నంతవరకు పార్టీలోనే ఉంటానని స్పష్టం చేశారు. సీఎం కేసీఆర్ కోవర్టులే ఇలాంటి ప్రచారాలు చేస్తున్నారని ఆరోపించారు. బుధవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. కొద్ది మందికి డబ్బు ఇచ్చి కేసీఆర్ తన కోవర్టులుగా మార్చుకున్నారని ఆరోపించారు. తనను రాజకీయంగా డ్యామేజ్ చేయాలని కాంగ్రెస్‌లో చేరుతున్నట్టు ఒక పత్రిక (సాక్షి కాదు)లో వార్త వచ్చిందన్నారు. ఈ వార్త రాయించిన కోవర్టులు ఎవరో కూడా తనకు తెలుసని, వారు ప్రవర్తన మార్చుకోకపోతే వారి పేర్లను 15 రోజుల్లో బయటపెడతానని తెలిపారు. వారి పేర్లను పార్టీ రాష్ట్ర, జాతీయ నేతల దృష్టికి తీసుకెళ్లినట్టు చెప్పారు. ఉప ఎన్నికల్లో డిపాజిట్లు కూడా రాని కాంగ్రెస్ రాష్ట్రంలో అధికారంలోకి ఎలా వస్తుందని ప్రశ్నించారు. అధికారానికి వస్తామంటూ కాంగ్రెస్ నేతలు పగటికలలు కంటున్నారని ఎద్దేవా చేశారు. మరో అంశంపై గవర్నర్ తమిళిసై సౌందరరాజన్‌ను నందీశ్వర్‌గౌడ్ బుధవారం కలిసి ఫిర్యాదు చేసినట్టు సమాచారం.

ఇక ప్రియాంక ఫుల్ ఫోకస్!

రాష్ట్రంలో కాంగ్రెస్ వ్యవహారాలన్నీ ఆమె కనుసన్నల్లోనే..

- ఉత్తర్‌ప్రదేశ్ ఇన్‌చార్జి బాధ్యతల నుంచి పూర్తిగా తప్పుకోనున్న ప్రియాంకాగాంధీ... ఈ నెలలోనే అక్కడ కొత్త ఇన్‌చార్జి నియామకం
- తెలంగాణ సహా ఎన్నికలు జరిగే నాలుగు రాష్ట్రాల్లో పూర్తి ప్రచార బాధ్యతలు ప్రియాంకకు అప్పగింత
- రాష్ట్రంలో నెలకో పర్యటన ఉండేలా అధిష్టానం వ్యూహరచన



సాక్షి, న్యూఢిల్లీ: కర్ణాటక గెలుపుతో ఊపు మీదున్న కాంగ్రెస్ పార్టీ అదే తరహా జోరును తెలంగాణలోనూ కొనసాగించే క్రమంలో పార్టీ పటిష్టతపై మరింత దృష్టి పెట్టింది. ఇందులో భాగంగానే తెలంగాణ ఎన్నికల వ్యవహారాలన్నీ ఇకపై పార్టీ ప్రధాన కార్యదర్శి ప్రియాంకగాంధీ కనుసన్నల్లో జరిగేలా ప్రణాళిక సిద్ధం చేస్తోంది. మరికొన్ని నెలల్లో ఎన్నికలు జరగనున్న తెలంగాణ సహా మధ్యప్రదేశ్, రాజస్తాన్, చత్తీస్‌గఢ్ రాష్ట్రాలకు పూర్తి సమయం కేటాయించేలా ప్రియాంకగాంధీని ఉత్తర్‌ప్రదేశ్ రాష్ట్ర ఇన్‌చార్జి బాధ్యతల నుంచి తప్పించాలని యోచిస్తోంది. సీనియర్ నేతలు హరీశ్ రావత్, తారిఖ్‌అన్వర్‌లో ఒకరిని అక్కడ నియమించనుంది. ఈ నెలలోనే కొత్త నియామక ప్రక్రియను పూర్తిచేసి ప్రియాంకగాంధీని తెలంగాణ సహా మిగతా రాష్ట్రాల్లో ప్రచారాస్త్రంగా ప్రయోగించనుంది.

సమన్వయం..ప్రచారం.. సమూహాలతో మమేకం

కర్ణాటక ఎన్నికల ముందు నుంచే తెలంగాణపై ప్రధానంగా ఫోకస్ పెట్టిన ప్రియాంక ఇప్పటికే పలుమార్లు కాంగ్రెస్ సీనియర్ నేతలతో ఢిల్లీలో సమావేశాలు నిర్వహించారు. నేతల మధ్య సమన్వయానికి ప్రయత్నాలు చేశారు. అనంతరం ఆమె పూర్తి సమయం కర్ణాటక ఎన్నికలపై ప్రధానంగా దృష్టిపెట్టారు. ఈ నేపథ్యంలో రాష్ట్ర కాంగ్రెస్‌లో మళ్లీ గ్రూపు తగాదాలు పెరిగాయని, ఎవరికివారే యమునాతీరే అన్న చందంగా వ్యవహరిస్తున్నారే విమర్శలు వచ్చాయి. చాలా నియోజకవర్గాల్లోలు గ్రూపుల మధ్య వివాదాలు నిత్యకృత్యమయ్యాయి. మరోవైపు ఢిల్లీలో ఉన్న పెద్దల అండదండలున్నాయంటూ ఎవరి అ నుచరులను వారు ఎమ్మెల్యేల అభ్యర్థులు గా ప్రచారం చేసుకుంటున్నారు. దీనిపై ఇప్పటికే పార్టీ దూత లు నదీమ్‌జావెద్, రోహిత్ చౌదరి అధిష్టాన పెద్దలకు నివేదికలిచ్చారు. ఇవన్నీ పరిగణనలోకి తీసుకొని ఇకపై తెలంగాణలో పార్టీని పూర్తిగా గాడిలో పెట్టే బాధ్యతను ప్రి యాంక భుజస్కంధాలపై పెట్టాలని అధిష్టానం నిర్ణయించింది. మరో నాలుగైదు రోజుల్లో రాష్ట్ర కాంగ్రెస్ నేతలతో నిర్వహించే సమావేశాల్లోనూ ప్రియాంక పాల్గొననున్నారు.

కర్ణాటక ఫార్ములానే ఇక్కడా..

ముఖ్యంగా రాష్ట్ర నేతల మధ్య సమన్వయాన్ని పూర్తిగా ఆమె పర్యవేక్షించనున్నారు. కర్ణాటకలో మాదిరే సీనియర్లకు పార్టీ పటిష్టత బాధ్యతలు కట్టబెట్టే వ్యూహాలను ప్రియాంక అమలుచేయనున్నట్లు తెలుస్తోంది. ఈ నేపథ్యంలో ప్రియాంక పర్యటనలు, రోడ్‌షోలు, ర్యాలీలు ఎక్కువగా ఉండేలా ప్రణాళిక సిద్ధం కానుంది. కర్ణాటక ఎన్నికల్లో ప్రియాంక 17 రోడ్‌షోలలో పాల్గొనడమే కాకుండా 13 బహిరంగసభలలో ప్రసంగించారు. దీంతోపాటే యువత, మహిళా, కార్మికులతో సమావేశాలు నిర్వహించారు. ముందస్తు ప్రణాళికలో భాగంగా అనేక దేవాలయాలను సందర్శించారు. ఇదే ఫార్ములాను తెలంగాణలోనూ అమలుచేసే అవకాశాలున్నాయి. తెలంగాణ ఉద్యమంలో కీలంగా వ్యవహరించిన వర్గాలతో మమేకం, అమరవీరుల కుటుంబాలకు భరోసా కల్పించేలా ఆమె పర్యటనలు రూపొందించనున్నారు. అన్నింటికన్నా ముఖ్యంగా కర్ణాటకలో '40 శాతం కమీషన్'ప్రభుత్వ నినాదాన్ని ప్రియాంక బలంగా ప్రజల్లోకి తీసుకెళ్లగలిగారు. అదేరీతిన ఇక్కడి ప్రభుత్వ అవినీతి, కుటుంబపాలన, ఇతర అంశాలు ప్రియాంక ద్వారా ప్రజల్లోకి వెళ్లేలా చేయాలని భావిస్తున్న కాంగ్రెస్ పెద్దలు ఈ మేరకు వ్యూహాలు రచిస్తున్నారు. ఈ నెల మొదలు అక్టోబర్ వరకు నెలకో పర్యటన, బహిరంగసభ ఉండేలా పర్యటనల రోడ్‌మ్యాప్ సిద్ధమైందని ఏఐసీసీ సీనియర్ నేత ఒకరు తెలిపారు.

ఇతరుల చేతుల్లోకి వెళ్తే ఆగమే

- రాష్ట్రం కేసీఆర్ చేతుల్లో ఉంటేనే ప్రజలకు న్యాయం
- 'సంగమేశ్వర ఎత్తిపోతల' భూమిపూజలో మంత్రి హరీశ్



'సంగమేశ్వర ఎత్తిపోతల'కు భూమిపూజ చేస్తున్న మంత్రి హరీశ్‌రావు తదితరులు

సాక్షిప్రతినిధి, సంగారెడ్డి: పోరాడి సాధించుకున్న తెలంగాణ ఇతరుల చేతుల్లోకి వెళ్తే ఆగం అవుతుందని, ఉద్యమనేత కేసీఆర్ చేతుల్లో ఉంటేనే రాష్ట్ర ప్రజలకు న్యాయం జరుగుతుందని మంత్రి హరీశ్‌రావు వ్యాఖ్యానించారు. సాగునీరు, తాగునీరు వంటి సమస్యలకు కేసీఆర్ హయాంలోనే పరిష్కారం లభించిందని, దీన్ని అన్ని వర్గాల ప్రజలు ఆలోచించాలని విజ్ఞప్తి చేశారు. సంగారెడ్డి జిల్లాలో 2.19 లక్షల ఎకరాలకు సాగునీరందించడమే లక్ష్యంగా రూ.2,653 కోట్లతో నిర్మించతలపెట్టిన సంగమేశ్వర ఎత్తిపోతల పథకానికి ఆయన బుధవారం భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన బహిరంగసభలో మాట్లాడుతూ.. తెలంగాణ రాకపోతే, కేసీఆర్ సీఎం కాకపోతే రాష్ట్రంలో సాగునీటి ప్రాజెక్టుల నిర్మాణం జరిగేదా? తాగునీటి సమస్య పరిష్కారం అయ్యేదా? అని ప్రశ్నించారు. దేశంలో ఎక్కడా లేనివిధంగా వ్యవసాయానికి 24 గంటల విద్యుత్ ఇస్తున్న ఘనత సీఎం కేసీఆర్‌కే దుక్కుతుందన్నారు. సింగూరు ప్రాజెక్టు కోసం మెదక్ రైతులు భూములు కోల్పోతే నీళ్లు హైదరాబాద్‌కు వెళ్లాయన్నారు. సింగూరు జలాలు మెదక్, నిజామాబాద్ జిల్లాలకే దక్కాలని సీఎం కేసీఆర్ సంగమేశ్వర, బసవేశ్వర ఎత్తిపోతల పథకాలకు శ్రీకారం చుట్టారని తెలిపారు. గోదావరి, కృష్ణా జలాలతో హైదరాబాద్ తాగునీటి కష్టాలు తీర్చారని వివరించారు.

రైతులతో ముచ్చట...: సంగారెడ్డి జిల్లా సదాశివపేట్ మండల తహసీల్దార్ కార్యాలయాన్ని మంత్రి ఆకస్మికంగా తనిఖీ చేసి, రైతులతో ముచ్చటించారు. అందోల్ ఎమ్మెల్యే చంటి క్రాంతికిరణ్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఎంపీ బీబీ పాటిల్, మాణిక్‌రావు, ఎమ్మెల్సీ రఘోత్తంరెడ్డి, హెచ్‌డీసీ రాష్ట్ర చైర్మన్ చింతా ప్రభాకర్, జెడ్పీ చైర్‌పర్సన్ మంజుశ్రీ జైపాల్‌రెడ్డి, డీసీఎంఎస్ చైర్మన్ శివకుమార్, కలెక్టర్ డాక్టర్ శరత్ పాల్గొన్నారు. కాగా, మంత్రి హరీశ్‌రావు బుధవారం రాత్రి సిద్దిపేటలో రంగనాయసాగర్ రిజర్వాయర్ వద్ద నిర్వహించిన సాగునీటి దినోత్సవంలోనూ పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నది లేకుండా ఒక ప్రాజెక్ట్ ఉందంటే అది మానవ నిర్మితమైన మల్లన్నసాగర్ ఒక్కటే అన్నారు. కాళేశ్వరం ప్రాజెక్ట్ కోసం ఢిల్లీలో పర్యావరణ అనుమతుల కోసం ఆఫీసుల చుట్టూ ఓపికగా తిరిగిన రోజులను ఆయన గుర్తుచేసుకున్నారు.

ఎస్‌ఎల్‌బీసీపై నిర్లక్ష్యపు కుట్ర

- బీఆర్‌ఎస్ సర్కారు తీరుతో పాలమూరు, నల్లగొండ జిల్లాలకు నష్టం
- సీఎల్పీ నేత భట్టి విక్రమార్క ధ్వజం



ఎస్‌ఎల్‌బీసీ టన్నెల్ పరిశీలిస్తున్న సీఎల్పీ నేత భట్టి విక్రమార్క

అచ్చంపేట: తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత ఎస్‌ఎల్‌బీసీ పనులు చేపట్టకుండా బీఆర్‌ఎస్ ప్రభుత్వం కుట్రపూరితంగానే నిర్లక్ష్యం చేస్తూ రెండు జిల్లాల ప్రజలకు తీరని ద్రోహం చేస్తోందని సీఎల్పీ నేత భట్టి విక్రమార్క ధ్వజమెత్తారు. పీపుల్స్‌మార్చ్ పాదయాత్రలో భాగంగా 83వ రోజు ఆయన నాగర్‌కర్నూల్ జిల్లా అచ్చంపేట మండలం మన్నెవారిపల్లి ఎస్‌ఎల్‌బీసీ టన్నెల్‌ను పరిశీలించారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో పాలమూరు, నల్లగొండ జిల్లాలకు సాగు, తాగునీరు అందించేందుకు జలయజ్ఞంలో భాగంగా దివంగత సీఎం వైఎస్ రాజశేఖరరెడ్డి ఈ ప్రతిష్టాత్మక ప్రాజెక్టుకు శ్రీకారం చుట్టారని గుర్తుచేశారు. గ్రావిటీ ద్వారా 4లక్షల ఎకరాలకు సాగునీరు, వందల గ్రామాలకు తాగునీరు ఇచ్చేలా డిజైన్ చేసిన ఈ ప్రాజెక్టుకు రూ.2,259 కోట్లు మంజూరు చేసి 2008 మార్చి 26న టీబీఎం మిషన్ ప్రారంభించారని భట్టి చెప్పారు. కాంగ్రెస్ ప్రభుత్వ హయంలో 23.5 కిలోమీటర్ల సొరంగం పనులు జరిగితే బీఆర్‌ఎస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత 10 కిలోమీటర్ల మేర మాత్రమే పని జరిగిందన్నారు. ఈ ప్రభుత్వ కాలయాపనతో అంచనా వ్యయం 4,776.42 కోట్లకు పెరిగిందన్నారు. ఎస్‌ఎల్‌బీసీ నుంచి నీళ్లు తీసుకుపోవాలనే సోయి నల్లగొండ జిల్లా మంత్రికైనా ఉండాలి కదా? ఆయన పదేళ్లుగా ఏం చేస్తున్నట్లు? అని భట్టి ప్రశ్నించారు. ప్రాణహిత చేవెళ్ల ప్రాజెక్టు, ఎస్‌ఎల్‌బీసీలాంటి ప్రాజెక్టులు పూర్తిచేసి ఉంటే మిషన్ భగీరథకు రూ.42వేల కోట్లు ఖర్చుచేయాల్సిన అవసరం ఉండేది కాదన్నారు. ఆయన వెంట టీపీసీసీ ఉపాధ్యక్షుడు మల్లురవి, మాజీ ఎమ్మెల్యే వంశీకృష్ణ ఉన్నారు.

ఇక సామాన్యుడి పరిస్థితి ఏంటి?

- అధికారుల తీరుపై హైకోర్టు తీవ్ర ఆగ్రహం
- సుప్రీంకోర్టు ఉత్తర్వులన్నా లెక్కలేదా?
- 'ప్రతాప్ రిసార్ట్' భూవివాదంపై ఉన్నత న్యాయస్థానం



సాక్షి, హైదరాబాద్: భూ వివాదంలో ఓ రిసార్టు యాజమాన్యం హైకోర్టు, సుప్రీంకోర్టును ఆశ్రయించి న్యాయం పొందినా స్పందించని అధికారుల తీరుపై హైకోర్టు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. 'ఇక సామాన్య ప్రజలు ఎక్కడికి పోతారు? ఎలా న్యాయం పొందుతారు? అత్యున్నత న్యాయస్థానం ఇచ్చిన ఉత్తర్వులన్నా ఇంత లెక్కలేనితనమా? ఏళ్లుగా కోర్టుల చుట్టూ తిరిగి న్యాయం పొందినా అధికారులకు జాలి, దయ లాంటి ఏవీ ఉండవా? తదుపరి విచారణ నాటికి రంగారెడ్డి జిల్లా కలెక్టర్, ఆర్డీవో, గండిపేట తహసీల్దారు సదరు భూమికి సంబంధించిన పాస్ పుస్తకంతో కోర్టుకు హాజరుకావాలి. ఆ పాస్ పుస్తకాన్ని పిటిషనర్‌కు కోర్టే నేరుగా అందిస్తుంది. బుక్‌తో రాకుంటే కఠిన చర్యలు తీసుకోవాల్సి వస్తుంది'అని హైకోర్టు హెచ్చరించింది. విచారణను ఈ నెల 20కి వాయిదా వేసింది. రంగారెడ్డి జిల్లా గండిపేట్ మండలం ఖానాపూర్‌లో ప్రతాప్ జంగిల్ రిసార్టుకు 20 ఎకరాల భూమి ఉంది. భూములను ధరణిలో అప్‌లోడ్ చేయడం, కొత్త పాస్ పుస్తకాలు ఇచ్చే సయమంలో ఈ భూమి ప్రభుత్వానిదంటూ రెవెన్యూ అధికారులు వివాదానికి తెరతీశారు. దీనిపై రిసార్టు యాజమాన్యం 2019లో హైకోర్టును ఆశ్రయించింది. విచారణ జరిపిన సింగిల్ జడ్జి... ఆ భూమి రిసార్టుదేనని ఉత్తర్వులు ఇచ్చారు. దీనిపై అదే సంవత్సరం ప్రభుత్వం ద్విసభ్య ధర్మాసనం వద్ద అప్పీల్ చేసినా ఎదురుదెబ్బే తగిలింది. అనంతరం ప్రభుత్వం సుప్రీంకోర్టును ఆశ్రయించింది. అక్కడ కూడా 2021లో రిసార్టు యాజమాన్యానికి అనుకూలంగానే తీర్పు వచ్చింది. అయినా అధికారులు పాస్ పుస్తకం ఇవ్వకపోవడంతో రిసార్టు యాజమాన్యం 2022లో హైకోర్టులో ధిక్కరణ కేసు దాఖలు చేసింది. సుప్రీంకోర్టు ఆదేశాలను పాటించడం లేదని, ఉద్దేశపూర్వకంగానే ఉత్తర్వులపై నిర్లక్ష్యం వహిస్తున్నారని పిటిషన్‌లో పేర్కొంది. దీనిపై ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఉజ్జల్ భూయాన్, జస్టిస్ తుకారాంజీ ధర్మాసనం విచారణ చేపట్టింది. వాదనలు విన్న ధర్మాసనం.. తదుపరి విచారణకు కలెక్టర్, ఆర్డీవో, తహసీల్దార్ అంతా పాసు పుస్తకంతో హాజరుకావాలని ఆదేశిస్తూ, విచారణను వాయిదా వేసింది.

ఈ కండక్టర్ల తీరు బాగోలేదు..!

ఆర్టీసీలో వివాదాస్పదమైన ఫ్లెక్సీ ప్రదర్శన



సాక్షి, హైదరాబాద్: సాధారణంగా మంచి పనితీరు ప్రదర్శించిన వారి వివరాలతో ఫ్లెక్సీలు పెట్టడం చూస్తుంటాం. కానీ పనితీరు సరిగా లేని సిబ్బంది ఫొటోలు ముద్రించి ఫ్లెక్సీలు పెట్టడం ఉండదు. కానీ ఆర్టీసీలో ఈ ఘటన జరిగింది. ఉత్తమ పనితీరు కనబరిచిన సిబ్బందితోపాటు పనితీరులో చివరి స్థానంలో నిలిచిన వారి పేర్లు, ఫొటోలు ముద్రించిన ఫ్లెక్సీని ప్రదర్శించటం ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది. టీ24 టికెట్ల విక్రయంలో ఉత్తమంగా నిలిచిన కండక్టర్ల వివరాలు, ఫొటోలతో ఫ్లెక్సీలను ఆయా డిపోల్లో ఏర్పాటు చేస్తున్నారు. కానీ, టికెట్లు తక్కువగా అమ్మారంటూ కొంతమంది కండక్టర్ల ఫొటోలతో కూడిన పెద్ద ఫ్లెక్సీని తాజాగా మేడ్చల్ డిపోలో ఏర్పాటు చేశారు. పనితీరు సరిగా లేని వారిని హెచ్చరిస్తూ వ్యక్తిగతంగా మాట్లాడటం, వారికి నోటీసులు ఇవ్వటం పరిపాటే. కానీ ఫొటోలను ముద్రించి ఫ్లెక్సీని ఏర్పాటు చేయటం వివాదాస్పదమైంది. ఈ ఫొటో బయటకు రావటంతో ఆర్టీసీ ఉన్నతాధికారులు సీరియస్‌గా స్పందించారు. వెంటనే దాన్ని తొలగించాలని ఆదేశించారు.

పొరపాటు జరిగింది.. తొలగించాం..: 'బాగా పనిచేసిన వారి ఫొటోలతో కూడిన ఫ్లెక్సీ పెట్టమన్నాం. కానీ పనితీరు సరిగా లేని వారి పేర్లను నోటీసు బోర్డులో మాత్రమే ఏర్పాటు చేయమన్నాం. పొరపాటున వారి ఫొటోలతో కూడా ఫ్లెక్సీ ఏర్పాటు చేశారు. పొరపాటు గుర్తించి వెంటనే తొలగించాలని ఆదేశించాం.' అని ఓ ఉన్నతాధికారి 'సాక్షి'కి వెల్లడించారు.

ఆర్టీసీ కార్మికులు ఏకమై బీఆర్‌ఎస్‌ను దించాలి: రాములు నాయక్

సాక్షి, హైదరాబాద్: ఆర్టీసీ కార్మికులంతా ఏకమై బీఆర్‌ఎస్‌ను గద్దె దించాలని మాజీ ఎమ్మెల్సీ రాములు నాయక్ కోరారు. ఆయన బుధవారం గాంధీభవన్‌లో విలేకరులతో మాట్లాడుతూ తెలంగాణ రాగానే ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేసుకుని ప్రభుత్వ ఉద్యోగులతో సమానంగా జీతాలిస్తామని కేసీఆర్ హామీ ఇచ్చారని గుర్తు చేశారు. ఆంధ్రప్రదేశ్‌లో ఆర్టీసీని ప్రభుత్వం విలీనం చేసినా.. తెలంగాణలో మాత్రం చేయలేదని ఆవేదన వ్యక్తం చేశారు. తెలంగాణ రాష్ట్రంలో ఆర్టీసీ కార్మికులు సమ్మెకు వెళ్లినప్పుడు సీఎం కేసీఆర్ వారిని స్వయంగా ప్రగతి భవన్‌కు పిలిపించుకుని అనేక హామీలిచ్చి అమలు చేయలేదని పేర్కొన్నారు.

డింపుల్‌కు నోటీసులు ఇచ్చాకే విచారించాలి

పోలీసులకు హైకోర్టు ఆదేశం

సాక్షి, హైదరాబాద్: తమపై జూబ్లీహిల్స్ పోలీసులు నమోదు చేసిన కేసును కొట్టేయాలని కోరుతూ సినీనటి డింపుల్ హయాతి, న్యాయవాది విక్టర్ డేవిడ్ దాఖలు చేసిన పిటిషన్‌పై హైకోర్టు స్పందించింది. వారిద్దరికీ సీఆర్‌పీసీ 41ఏ నోటీసు జారీ చేశాకే విచారణ చేయాలని పోలీసులను ఆదేశించింది. ఈ మేరకు జస్టిస్ జి.అనుపమా చక్రవర్తి బుధవారం ఆదేశాలు వెలువరించారు. పిటిషనర్లపై తప్పుడు కేసు నమోదు చేశారని న్యాయవాది వాదించారు. ట్రాఫిక్ డీసీపీ రాహుల్ హెగ్డే ఒత్తిడితోనే ఆయన కారు డ్రైవర్ చేతన్ కుమార్ తప్పుడు ఫిర్యాదు చేశారని చెప్పారు. పిటిషనర్లను అరెస్టు చేయకుండా ఉత్తర్వులు జారీ చేయాలని కోరారు. పోలీసుల తరఫున అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్ గణేష్ వాదనలు వినిపించారు. అనంతరం న్యాయమూర్తి పిటిషనర్లకు 41ఏ నోటీసులు ఇవ్వాలని పోలీసులను ఆదేశించారు.

పగ్గాల మార్పుకే మొగ్గు?

▶ మొదటి పేజీ తరువాయి

వేయలేకపోయామని భావిస్తున్న జాతీయ నేతలు.. తెలంగాణ బీజేపీలోనూ పాత, కొత్త నాయకుల మధ్య పూర్తిస్థాయిలో సత్సంబంధాలు ఏర్పడకపోవడం, బీఆర్‌ఎస్, కాంగ్రెస్‌లను రాష్ట్ర నేతలు ఐక్యంగా ఎదుర్కోకపోవడం, పార్టీలో సమన్వయ లేమి, పార్టీని, రాష్ట్ర నాయకత్వాన్ని, నేతల ఆత్మస్థైర్యాన్ని దెబ్బతీసేలా కొందరు వ్యాఖ్యానాలు చేయడం వంటి వాటిని తీవ్రంగా పరిగణిస్తున్నట్టు తెలిసింది. అధికార బీఆర్‌ఎస్‌తో కొందరు పార్టీ నేతలు కుమ్మక్కు రాజకీయాలు చేస్తున్నారనే ఆరోపణలు కూడా వారి దృష్టికి వచ్చాయి. మరి కొందరు పార్టీ ప్రయోజనాలను దెబ్బతీసే కుట్ర చేస్తున్నారనే ఫిర్యాదులు కూడా వెళ్లినట్టు తెలుస్తోంది. ఈ నేపథ్యంలోనే అధినాయకత్వం అప్రమత్తమైందని చెబుతున్నారు. గత మూడు, నాలుగు రోజులుగా ఢిల్లీలో ఐదు రాష్ట్రాల ఎన్నికలపై కీలక నేతలు మేథోమథనం చేస్తుండడంతో, అతి త్వరలోనే ఈ రాష్ట్రాలకు సంబంధించి ఎన్నికల వ్యూహాలు, పొత్తులు, కార్యాచరణ ప్రణాళికపై స్పష్టమైన ప్రకటన వెలువడనుందని, ఈ మేరకు తమకు సంకేతాలు అందినట్టుగా ముఖ్యనేతలు చెబుతున్నారు.

ఈ కృషి సరిపోదు..!

గత మూడేళ్లలో ప్రస్తుత రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్ పార్టీని బలోపేతం చేసి అధికార బీఆర్‌ఎస్‌తో ఢీ అంటే ఢీ అనే స్థాయికి తీసుకొచ్చారనే అభిప్రాయంతో పలువురు నేతలున్నారు. అయితే పార్టీ ప్రతిష్టాత్మకంగా భావిస్తున్న అసెంబ్లీ ఎన్నికల్లో అధికార బీఆర్‌ఎస్, ప్రధాన ప్రతిపక్షాన్ని ఎదుర్కొనేందుకు ప్రస్తుతం అనుసరిస్తున్న వ్యూహాలు, విధానాలు, కార్యక్రమాలు సరిపోవని కొందరు నేతలు జాతీయ నాయకత్వం దృష్టికి తీసుకెళ్లినట్టు విశ్వసనీయ సమాచారం. దీంతోపాటు ఇతర పరిస్థితులన్నీ పరిగణనలోకి తీసుకుని రాష్ట్ర అధ్యక్షుడి మార్పుతో పాటు పార్టీ ఎన్నికల కమిటీ, మేనిఫెస్టో కమిటీ, సంస్థాగతంగా వివిధ స్థాయిల్లో మార్పులపై జాతీయ నాయకత్వం దృష్టి సారించిందనే ఊహాగానాలు సాగుతున్నాయి. ఇంతవరకు రాష్ట్రంలో పార్టీని సమర్థంగా నడిపించిన సంజయ్‌కు కేంద్రమంత్రి పదవి కట్టబెట్టి సముచిత గౌరవాన్ని కల్పిస్తారనే ప్రచారం ఢిల్లీ స్థాయిలో జరుగుతోంది. జాతీయ నాయకత్వం చేపట్టబోయే మార్పులకు సంబంధించిన సమాచారాన్ని ప్రస్తుతం ఇక్కడ పర్యటిస్తున్న అధిష్టానం దూతలు రాష్ట్ర పార్టీ ముఖ్యనేతలతో సూచాయగా పంచుకున్నట్టు తెలిసింది. కీలక పదవులు అప్పగించే వారితో వారు భేటీ కూడా అయినట్టు సమాచారం. రాష్ట్రంలో రాజకీయంగా బలమైన రెడ్డి సామాజికవర్గానికి చెందిన వ్యక్తికి అధ్యక్ష పదవి, బీసీ వర్గానికి చెందిన ముఖ్య నేతకు ఎన్నికల నిర్వహణకు సంబంధించిన కీలకమైన పదవిని కట్టబెట్టడం లేదా బీసీ నేతకు అధ్యక్ష పదవి, రెడ్డి సామాజికవర్గ నేతకు ఎన్నికల బాధ్యతలు అప్పగించే అవకాశాన్ని కొట్టిపారేయలేమని పలువురు నేతలు అంటున్నారు.



ప్రభుత్వాల వైఫల్యాలను యువతే ఎండగట్టాలి

▶ మొదటి పేజీ తరువాయి

నిర్వీర్యం అయిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఏడాదికి రెండు కోట్ల ఉద్యోగాలిస్తామని అధికారంలోకి వచ్చిన మోదీ ఉన్న ఉపాధిని పోగొడుతున్నారని, దశాబ్దాలుగా కాంగ్రెస్ పార్టీ ఏర్పాటు చేసి కాపాడుకుంటూ వస్తున్న ప్రభుత్వ రంగ సంస్థలను మూసివేయడం ద్వారా ఉపాధిపై దొంగదెబ్బ కొడుతున్నారని విమర్శించారు. ఈ రెండు పార్టీలకు బుద్ధి చెప్పేలా యూత్ కాంగ్రెస్ ప్రజల్లోకి వెళ్లి పని చేయాలని, యువతను జాగృతం చేయడం ద్వారా దేశ భవిష్యత్తును కాపాడాలని కోరారు. యూత్‌కాంగ్రెస్ జాతీయ కార్యవర్గ సమావేశాల ప్రారంభం సందర్భంగా ఒడిశా రైలు ప్రమాద మృతులకు రెండు నిమిషాల పాటు మౌనం పాటించి సంతాపం వ్యక్తం చేశారు. తొలి రోజు సమావేశాల్లో ఏఐసీసీ కార్యదర్శి వంశీచందర్‌రెడ్డి, టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ బి. మహేశ్‌కుమార్‌గౌడ్, యూత్‌కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు బి.వి.శ్రీనివాస్, రాష్ట్ర ఇంచార్జి కృష్ణ, తెలంగాణ యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు శివసేనారెడ్డితో పాటు దేశంలోని పలు రాష్ట్రాల నుంచి వచ్చిన యూత్ కాంగ్రెస్ ప్రతినిధులు పాల్గొన్నారు. సమావేశాల ప్రారంభ సూచికగా జాతీయ జెండాను ఆవిష్కరించారు.




జాతీయ కార్యవర్గ సమావేశాలను ప్రారంభిస్తున్న శివసేనారెడ్డి తదితరులు

5 రాష్ట్రాల ఎన్నికలపై చర్చిస్తాం: యూత్ కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షుడు శివసేనారెడ్డి

జాతీయ కార్యవర్గ సమావేశాల సందర్భంగా తెలంగాణ యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు శివసేనారెడ్డి మాట్లాడుతూ తొలిసారిగా యూత్‌కాంగ్రెస్ జాతీయ స్థాయి సమావేశాలను హైదరాబాద్‌లో నిర్వహిస్తున్నామని చెప్పారు. మూడు రోజుల పాటు జరిగే ఈ సమావేశాల్లో త్వరలో జరగబోయే 5 రాష్ట్రాల ఎన్నికల్లో యూత్ కాంగ్రెస్ పాత్ర, యూత్ కాంగ్రెస్ నేతలకు టికెట్ల కేటాయింపు లాంటి అంశాలపై చర్చిస్తామని ఆయన వెల్లడించారు.

ప్రజల్లోకి 'యూత్ డిక్లరేషన్'... గజ్వేల్ నుంచి బస్సు యాత్ర

ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో కాంగ్రెస్ పార్టీ చేసిన 'యూత్ డిక్లరేషన్'ను విస్తృతంగా ప్రజల్లోకి తీసుకెళ్లాలని యువజన కాంగ్రెస్ నిర్ణయించింది. ఇందుకోసం బస్సుయాత్ర చేపట్టనుంది. గజ్వేల్ నియోజకవర్గం నుంచి ప్రారంభం కానున్న ఈ యాత్ర రాష్ట్ర వ్యాప్తంగా జరగనుంది. అయితే, ఇందుకు సంబంధించిన తేదీలను ఖరారు చేయాల్సి ఉంది. ఈ యాత్రలో భాగంగా రాష్ట్రంలోని నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పన, జాబ్ కేలండర్, టీఎస్‌పీఎస్సీ ప్రక్షాళన, కొత్త యూనివర్సిటీల ఏర్పాటు, విద్యార్థులు ఫీజు రీయింబర్స్‌మెంట్ చెల్లింపు, యూత్ కమిషన్ ఏర్పాటు ద్వారా నిరుద్యోగుల స్వయం ఉపాధికి రూ.10లక్షల రుణం లాంటి అంశాలను ప్రజల్లోకి తీసుకెళ్లి వారిలో భరోసా కల్పించనున్నారు. తీవ్ర నైరాశ్యంలో ఉన్న యువతను ఈ యాత్ర ద్వారా జాగృతం చేస్తామని, కాంగ్రెస్ పార్టీ విజయం కోసం కృషి చేసేలా యువతను సిద్ధం చేస్తామని యూత్ కాంగ్రెస్ నేతలు చెబుతున్నారు.





ఉదయం పూట నడక ఆ రోజు మొత్తానికీ ఆశీర్వాదం లాంటిది.
– హొనొరే డె బాల్జాక్

సాక్షి

గురువారం, 8 జూన్ 2023

చరిత్ర క్షమించని మహా నేరం

కొన్ని సంఘటనలు సమకాలీన చరిత్రను మలుపు తిప్పుతాయి. అనూహ్య పరిణామాలకు ఆరంభమవుతాయి. ఉక్రెయిన్‌లో సాగుతున్న సుదీర్ఘ యుద్ధంలో మంగళవారం నాటి ఘటన అలాంటిది. దక్షిణ ఉక్రెయిన్‌లో నిప్రో నదిపై ఉన్న కీలకమైన నోవా కఖోవ్కా ఆనకట్ట పాక్షికంగా పేల్చివేతకు గురై, ఆ పక్కనే ఉన్న అణువిద్యుత్కేంద్రం ముప్పులో పడ్డ ఘటనతో ప్రపంచం ఉలిక్కిపడింది. రష్యా సాగించిన జీవావరణ తీవ్రవాద చర్య ఇది అని ఉక్రెయిన్ నిందిస్తుంటే, ఇది పూర్తిగా ఉక్రెయిన్ విద్రోహచర్య అని రష్యా ఆరోపిస్తోంది. ఈ నిందారోపణల్లో నిజానిజాలు ఏమైనా, ప్రపంచంలోనే అత్యధిక జలసామర్థ్యం ఉన్న డ్యామ్‌లలో ఒకటైన ఈ ఆనకట్టపై పడ్డ దెబ్బతో నీళ్ళు ఊళ్ళను ముంచెత్తి, వేల మంది ఇల్లూవాకిలి పోగొట్టుకున్నారు. లక్షలాది గొడ్డూగోదా సహా జనం తాగేందుకు గుక్కెడు నీరైనా లేక ఇక్కట్లలో పడ్డారు. అన్నిటికన్నా మించి ఉక్రెయిన్ ఇప్పుడు అణుప్రమాదం అంచున ఉందనే ఆందోళన కలుగుతోంది.

ఈ డ్యామ్ పరిసర ప్రాంతాలు రష్యా నియంత్రణలోనే ఉన్నాయి. కానీ, డ్యామ్ ధ్వంసంలో తన పాత్ర లేదనేది రష్యా మాట. అది అంత తేలిగ్గా నమ్మలేం. ఇటీవల సరిహద్దు ఆవల నుంచి రష్యా భూభాగంపై దాడులు చేస్తూ, డ్రోన్లతో దెబ్బ తీస్తూ ఉక్రెయిన్ వేడి పెంచింది. ప్రతిగా రష్యా ఇప్పుడు శత్రుదేశం దృష్టిని మరల్చి, సుస్థిరతను దెబ్బతీసే ఎత్తుగడ వేసిందని ఓ వాదన. ఉక్రెయిన్‌కూ, ఆ ప్రాంతంలో వ్యవసాయానికీ కీలకమైన 5 అతి పెద్ద ఆనకట్టల్లో ఒకదానికి భారీ గండి పడేలా చేయడం అందులో భాగమే కావచ్చు. వ్యవసాయ, తాగునీటి అవసరాలకు కీలకమైన ఆనకట్టను ధ్వంసం చేసుకోవడం వల్ల ఉక్రెయిన్‌కు వచ్చే లాభమేమీ లేదు. నిజానికి, మునుపటి దాడుల్లో ఆనకట్ట నిర్మాణం బలహీనపడి ఉండవచ్చు. ఆ ప్రాంతాన్ని నియంత్రిస్తున్న రష్యా ఆక్రమణదారులు రిజర్వాయర్‌లో నీళ్ళు అసాధారణ స్థాయికి చేరినా నిమ్మకు నీరెత్తినట్టు ఉండి ఉండవచ్చు. ఆ నిర్లక్ష్యం ఫలితమే ఇప్పుడీ డ్యామ్ విధ్వంసమనేది ఒక కథనం.

ఉక్రెయిన్ దళాలు దాడులు పెంచిన మర్నాడే ఈ ప్రమాదం జరగడం గమనార్హం. శత్రువును వరదలతో ముంచెత్తడమూ తమ ఆయుధమేనంటూ గతంలో మాస్కో తన ఆలోచనను బయట పెట్టిన సంగతీ మర్చిపోలేం. దక్షిణ ఉక్రెయిన్‌లో రష్యా, ఉక్రెయిన్ సేనలను విడదీస్తున్న నిప్రో నదిపై ఈ ఆనకట్ట ఉంది. ఆహార ధాన్యాలు అధికంగా పండించే దక్షిణ మధ్య ఉక్రెయిన్‌లోని మెట్ట భూములకు సాగునీరు, రష్యా ఆక్రమిత క్రిమియా సహా అనేక భారీ నగరాలకు తాగునీరు ఈ రిజర్వాయరే అందిస్తుంది. నది దాటి ఇవతలకు వచ్చేందుకు యుద్ధంలో వ్యూహాత్మకంగానూ ఇది కీలకమైనదే. అందుకే, ఈ విధ్వంసం మానసిక పోరుకు మించినది. రిజర్వాయర్‌లో నీళ్ళన్నీ ఖాళీ అయితే పక్కనే జపోరీషియా అణువిద్యుత్కేంద్రానికి తగినంత నీటి సరఫరా జరగదు. ఇప్పటికే అందులో ఆరు రియాక్టర్లను మూసివేశారు కాబట్టి, చల్లబరిచేందుకు పొరుగునే ఉన్న కొలను నీరు సరిపోవచ్చు. అయినా సరే, ఆ అణువిద్యుత్కేంద్రాన్ని యుద్ధంలో అస్త్రంగా వాడరని చెప్పలేం. మరమ్మతులకు కనీసం అయిదేళ్ళు పట్టే ఈ ఆనకట్ట విధ్వంసం వల్ల దీర్ఘకాలిక మానవ, పర్యావరణ సంక్షోభం, సైనిక పర్యవసానాలూ తప్పవు. నదీగర్భంలో మిగిలిన చెర్నోబిల్ ప్రమాదం నాటి అణు వ్యర్థాలు వరదలతో మళ్ళీ పైకొచ్చే ప్రమాదమూ పొంచి ఉంది.

నిజానికి, ఈ డ్యామ్‌పై దాడికి దిగకుండా రష్యాను హెచ్చరించాలనీ, దాడి జరిగితే అది అతి పెద్ద విపత్తుగా పరిణమిస్తుందనీ గత అక్టోబర్‌లోనే ఉక్రెయిన్ అధ్యక్షుడు అన్నారు. డ్యామ్‌లో రష్యా సేనలు పేలుడు పదార్థాలు ఉంచాయని అప్పట్లో ఆయన అనుమానించారు. ఇప్పుడు డ్యామ్ విధ్వంసంతో ఏడాది పైచిలుకుగా సాగుతున్న ఉక్రెయిన్ యుద్ధం మరింత సంక్లిష్టం కానుందని తేలిపోయింది. అలాగని ఉక్రెయిన్ సైతం తక్కువ తినలేదు. రష్యా నుంచి జర్మనీకి వెళ్ళే కీలకమైన నార్డ్ స్ట్రీమ్ సహజవాయు పైప్‌లైన్లపై నీటిలో పేలుళ్ళ ద్వారా గత ఏడాది సెప్టెంబర్‌లో ఉక్రెయిన్ బృందం దాడులు చేసింది. ఆ సంగతి అంతకు మూడు నెలల ముందే అమెరికా గూఢచర్య సంస్థకు తెలుసని తాజాగా బయటపడింది. అప్పట్లో సహజవాయు పైప్‌లైన్లు, ఇప్పుడు భారీ ఆనకట్ట... పరస్పర విధ్వంసంలో పైచేయి కోసం తపిస్తున్న రష్యా, ఉక్రెయిన్‌లు ఇలా ఎంత దాకా వెళతాయో!

యుద్ధం ఎవరిదైనా, అందులో ఎవరి చేయి పైనా కిందా అయినా – చివరకు నష్టపోయేది ప్రజలే. యుద్ధం సాకుతో సాధారణ పౌరుల పైన, కీలకమైన ప్రాథమిక వసతి సౌకర్యాల పైన దాడులు ఏ రకంగానూ సమర్థనీయం కావు. అంతర్జాతీయ మానవతావాద చట్ట ఉల్లంఘనలుగా ఇవన్నీ యుద్ధ నేరాల కిందకే వస్తాయి. ఐరాస ప్రధాన కార్యదర్శి అభ్యర్థించినట్టు ఇలాంటి దాడులు ఆగాలి. అంతర్జాతీయ చట్టాన్ని అంతా గౌరవించాలి. ఇప్పటికైనా రష్యా, ఉక్రెయిన్‌లు రెండూ ఈ నియమాలు పాటించడం అవసరం. ఇక, ఆనకట్ట విధ్వంసంతో డ్యామ్ నుంచి కనీసం 150 మెట్రిక్ టన్నుల చమురు లీకైందని పర్యావరణ మంత్రి మాట. పర్యావరణ రీత్యా ఆ ప్రాంతం కోలుకోవడానికి కొన్ని దశాబ్దాలు పడుతుందని నిపుణుల విశ్లేషణ. గత కొన్ని దశాబ్దాల్లో ఐరోపాలో అతి పెద్ద మానవ కల్పిత పర్యావరణ విపత్తు ఇదేనంటున్నది అందుకే! విషాదం ఏమిటంటే, 1986లో చెర్నోబిల్ అణుప్రమాదం బారిన పడ్డ గడ్డపైనే మళ్ళీ ఇలాంటి మహా విపత్తు సంభవించడం! అదీ మానవత మరిచిన యుద్ధంలో మనిషి చేజేతులా చేసింది కావడం! ఇది చరిత్ర క్షమించని మహా యుద్ధనేరం. మానవాళికి మరో శాపం.

గ్రహం అనుగ్రహం

శ్రీ శోభకృత్ నామ సంవత్సరం, ఉత్తరాయణం, గ్రీష్మ ఋతువు, జ్యేష్ఠ మాసం, **తిథి:** బ.పంచమి రా.10.51 వరకు, తదుపరి షష్ఠి, **నక్షత్రం:** శ్రవణం రా.10.58 వరకు, తదుపరి ధనిష్ఠ, **దుర్ముహూర్తం:** ఉ.9.51 నుండి 10.43 వరకు, తిరిగి ప.3.04 నుండి 3.58 వరకు, **అమృతఘడియలు:** 3.14 నుండి 2.44 వరకు, మృగశిర కార్తె ప్రారంభం.

సూర్యోదయం : 5.28
సూర్యాస్తమయం: 6.28
రాహుకాలం : ప.1.30 నుండి 3.00 వరకు
యమగండం : ఉ. 6.00 నుండి 7.30 వరకు

మన వ్యవస్థ పట్టాలు తప్పిందెక్కడ?

విశ్లేషణ



అలోక్ కుమార్ వర్మ

భారతదేశంలో రైళ్ల వేగం సగటున గంటకు 50 కిలోమీటర్లు మాత్రమే ఉన్నప్పటికీ, ప్రమాదాలు జరుగుతున్నాయి. అభివృద్ధి చెందిన రైల్వే వ్యవస్థలున్న దేశాలలో ప్రమాదాలు అత్యంత అరుదు. ప్రధాన ట్రంక్ రూట్లలో తీవ్రమైన రద్దీ అనేది రైళ్ల వేగంలో స్తబ్ధతకూ, అభద్రతకూ దోహదపడే ప్రాథమిక అంశంగా ఉంటోంది. 1950లో చైనా రైలు నెట్ వర్క్ పొడవు భారత్‌తో పోలిస్తే సగం కంటే తక్కువ. కానీ, ప్రస్తుతం చైనా మొత్తం రైలు మార్గం పొడవు భారత్ కంటే రెండు రెట్లు ఎక్కువ. గత 20 సంవత్సరాలుగా, భారతీయ రైల్వేలు విమాన, రోడ్డు రవాణాకు తన మార్కెట్ వాటాను స్థిరంగా కోల్పోతున్నాయి. కొత్త లైన్ల నిర్మాణం చేపట్టడం, ఉన్నవి అప్‌గ్రేడ్ చేయడమే శరణ్యం.

జూన్ 2న ఒడిశాలోని బాలాసోర్‌లో రెండు ఎక్స్‌ప్రెస్ ప్యాసింజర్ రైళ్లు, ఒక నిలిచివున్న సరుకు రవాణా రైలు ఢీకొనడం, బహుశా గత 20 సంవత్సరాల్లో జరిగిన ఘోరమైన రైలు ప్రమాదం కావచ్చు. ఇటీవలి అధికారిక గణాంకాల ప్రకారం, ఇది 275 మరణాలకు దారితీసింది. 1,000 కంటే ఎక్కువ మంది గాయపడ్డారు. 2002 జూన్ 24న టాంజానియాలో జరిగిన చివరి రైలు ప్రమాదం చాలామంది మరణాలకు కారణమైంది. ఒక ప్రయాణీకుల రైలు ఒక సరుకు రవాణా రైలు పర్వత ప్రాంత రైలు మార్గంలో ఢీకొనడంతో 281 మంది చనిపోయారు.

వేగం తక్కువ ప్రమాదాలు ఎక్కువ

ఈ వాస్తవాలను పరిశీలిస్తే భారత్‌లో రైలు భద్రతా పరిస్థితి తీవ్రతను అర్థం చేసుకోవచ్చు. జపాన్, చైనా, టర్కీ వంటి అభివృద్ధి చెందిన రైల్వే వ్యవస్థలు... ఫ్రాన్స్, స్పెయిన్, జర్మనీ, ఇటలీ, స్వీడన్, బ్రిటన్ వంటి అనేక యూరోపియన్ దేశాలలో ప్రయాణీకుల రైళ్ల ప్రమాదాలు అత్యంత అరుదు, అసాధారణం. ఈ రైల్వేలలో, అనేక ప్యాసింజర్ రైళ్లు గరిష్ఠంగా గంటకు 200–350 కిలోమీటర్ల వేగంతో ప్రయాణిస్తాయి. వీటి సగటు వేగం గంటకు 150–250 కిలోమీటర్లు. భారతదేశంలో రైళ్ల వేగం గంటకు దాదాపు 50 కిలోమీటర్లు. ఇంత తక్కువ వేగం ఉన్నప్పటికీ, ఘోరమైన ప్రమాదాలు జరుగుతున్నాయి. భద్రతా పనితీరు ఆధారంగా ప్రపంచంలోని ప్రధాన రైల్వేల ర్యాంకింగులను సిద్ధం చేస్తే, భారతదేశం బహుశా ఈజిప్ట్, మెక్సికో, టాంజానియా, డెమొక్రాటిక్ రిపబ్లిక్ ఆఫ్ కాంగో, నైజీరియా, ఇంకా పాకిస్తాన్ దేశాల కంటే కొంచెం పైస్థాయిలో మాత్రమే ఉంటుంది.

వాయు, రోడ్డు రవాణాల వేగవంతమైన సాంకేతిక అభివృద్ధితో సమర్థవంతంగా పోటీ పడటానికి, అభివృద్ధి చెందిన దేశాలు 1970 నుండి ఉనికిలో ఉన్న తమ రైలు నెట్‌వర్క్‌లను విస్తరింపజేసుకుంటూ ఆధునికీకరించడం ప్రారంభించాయి. దాని భౌగోళిక పరిమాణం, జనాభా సారూప్యతల కారణంగా భారత్‌కు చైనా మంచి పోలిక అవుతుంది. 1950లో చైనా రైలు నెట్ వర్క్ మొత్తం పొడవు (21,800 కి.మీ.) భారతదేశంతో (53,596 కి.మీ.) పోలిస్తే సగం కంటే తక్కువ. భారతదేశ మొత్తం రైలు మార్గం పొడవును (62,900 కి.మీ.) 1997 నాటికి చైనా (66,000 కి.మీ.) అధిగమించింది. ప్రస్తుతం చైనా మొత్తం రైలు మార్గం పొడవు (1,55,000 కి.మీ.). ఇది భారతదేశం (68,100 కి.మీ.) కంటే రెండు రెట్లు ఎక్కువ.

చైనా తన నెట్‌వర్క్‌ను దాదాపు రెండు దశల్లో అప్‌గ్రేడ్ చేసింది. 1995 నుండి 2010 వరకు, దాని ఎనిమిది ట్రంక్ రూట్లలో (నాలుగు నిలువు, నాలుగు అడ్డం) ముందునుంచీ ఉన్న లైన్లలో గంటకు 200–250 కిలోమీటర్ల వేగాన్ని సాధించడంపై దృష్టి పెట్టింది.



తరువాత, గంటకు 200–250 కిలోమీటర్లు (హై స్పీడ్), గంటకు 300–350 కిలోమీటర్ల (అల్ట్రా హై స్పీడ్) వేగంతో నడిచే ప్యాసింజర్ రైళ్ల కోసం ప్రత్యేకంగా కొత్త లైన్లను నిర్మించింది. ప్రస్తుతం, ఇది మొత్తం 16 (ఎనిమిది నిలువు, ఎనిమిది క్షితిజ సమాంతరాలు) ట్రంక్ మార్గాలను విస్తరించే పనిలో ఉంది. 2030 నాటికి, మొత్తం రైలు మార్గం పొడవు 1,75,000 కిలోమీటర్లకు పెంచడానికి ప్రణాళిక రూపొందించారు. వీటిలో దాదాపు 55,000 కి.మీ. హై స్పీడ్, అల్ట్రా హై స్పీడ్ లైన్లుగా ఉంటాయి.

రద్దీయే అసలు సమస్య

భారత రైల్వే బోర్డు 2017–18లో ప్రాజెక్ట్ మిషన్ రఫ్తార్‌ను ప్రకటించింది. గంటకు 25 కిలోమీటర్లు ఉన్న సరుకు రవాణా రైళ్ల సగటు వేగాన్ని రెట్టింపు చేయడం, ప్యాసింజర్ రైళ్ల వేగాన్ని ఐదేళ్లలో గంటకు 50 కి.మీ. నుండి 75 కి.మీ. వరకు పెంచడం లక్ష్యాలుగా దీన్ని ప్రకటించింది. కానీ, 'కాగ్ ఆఫ్ ఇండియా' తన నివేదికలో పేర్కొన్నట్లుగా, ఈ ప్రణాళిక రైళ్ల వేగాన్ని పెంచడానికి దారితీయలేదు. చైనాలా భారతదేశం తన ప్రధాన ట్రంక్ మార్గాల్లో, ముఖ్యంగా స్వర్ణచతుర్భుజి, దానితోపాటు ఢిల్లీ, చెన్నై, ముంబై, కోల్‌కతాలను కలిపే కర్ణాలలో కొత్త జంట లైన్లను నిర్మించలేదు.

భారతీయ రైల్వే ప్రధాన ట్రంక్ రూట్లలో తీవ్రమైన రద్దీ అనేది రైళ్ల వేగంలో స్తబ్ధతకూ, భద్రత విషయంలో పేలవమైన రికార్డ్‌కూ దోహదపడే ప్రాథమిక అంశంగా ఉంటోంది. గత 20 సంవత్సరాలుగా, భారతీయ రైల్వేలు విమాన, రోడ్డు రవాణాకు తన మార్కెట్ వాటాను స్థిరంగా కోల్పోతున్నాయి. సుమారు 10,000 కి.మీ.ల ట్రంక్ రూట్లలో సామర్థ్యం 125 శాతానికి మించి ఉంటోంది. ఈ తీవ్రమైన రద్దీ కారణంగా రైల్వే ట్రాక్, ఎలక్ట్రికల్, సిగ్నలింగ్ నిర్వహణ వ్యవస్థలు ఇబ్బందులను ఎదుర్కొంటున్నాయి. ఇది సమయపాలన లేక పోవడానికి దారితీస్తోంది. దీనివల్ల మితిమీరి పని చేయాల్సిన డ్రైవర్లు, స్టేషన్ మాస్టర్లు, ట్రాక్‌మెన్ వల్ల భద్రతపై ప్రతికూల ప్రభావం పడుతోంది.

2005లో, రైల్వే బోర్డు 2,843 కి.మీ. పొడవుతో రెండు ప్రత్యేక సరుకు రవాణా కారిడార్‌లను (డీఎఫ్‌సీలు) నిర్మించాలని నిర్ణయించింది. భవిష్యత్తులో మరో మూడు కారిడార్లను నిర్మించేందుకు ప్రణాళికలు సిద్ధం చేసింది. ఈ డీఎఫ్‌సీలు ఇప్పటికీ అసంపూర్తిగా ఉన్నాయి. వీటిని పూర్తి చేయడానికి మరో రెండు నుండి నాలుగేళ్లు పట్టవచ్చు. ప్రత్యేక ప్యాసింజర్ లైన్లకు బదులుగా ప్రత్యేక సరకుల లైన్‌లను నిర్మించడంలోని అనుచితాన్ని గ్రహించి, రైల్వే బోర్డు మరిన్ని డీఎఫ్‌సీలను నిర్మించే ప్రణాళికను వాయిదా వేసినట్లు కనిపిస్తోంది.

అనూహ్య వ్యయం

భారతదేశం 2017లో ముంబై, అహ్మదాబాద్ మధ్య స్టాండర్డ్ గేజ్‌లో స్వతంత్ర అల్ట్రా హై స్పీడ్ (బుల్లెట్ రైలు) లైన్ నిర్మాణాన్ని ప్రారంభించింది. ఇలాంటి మరిన్ని లైన్ల కోసం వివరణాత్మక ప్రాజెక్ట్ నివేదికలను (డీపీఆర్‌లు) తయారు చేశారు. అనధికార అంచనాల ప్రకారం, ఈ లైన్‌కు ప్రతి కిలోమీటర్‌కు రూ.350 కోట్లు ఖర్చు అవుతుంది. ఈ వ్యయం 160 కిలోమీటర్ల సెమీ హైస్పీడ్ లైన్ కంటే 10 రెట్లు ఎక్కువ. అలాగే గంటకు 200–250 కిలోమీటర్ల హైస్పీడ్ లైన్ నిర్మాణ వ్యయం కంటే ఏడు రెట్లు ఎక్కువ. ముంబై–అహ్మదాబాద్ బుల్లెట్ రైలు లైన్ నిర్మాణ పురోగతి నెమ్మదిగా ఉండగా, మరిన్ని బుల్లెట్ రైలు మార్గాలను నిర్మించే ప్రణాళిక కూడా మందకొడిగా ఉంది.

బ్రాడ్ గేజ్ ప్రయోజనాలను పరిగణనలోకి తీసుకుని, భారతదేశం గంటకు 200–250 కిలోమీటర్లు ప్రయాణించే హై స్పీడ్ లైన్లను నిర్మించాలి. ప్రస్తుతం ఉన్న 15,000 కిలోమీటర్ల ట్రంక్ మార్గాలను 160–200 కిలోమీటర్ల వేగానికి అప్‌గ్రేడ్ చేయాలి. దీనికీ, 10,000 కి.మీ. హై స్పీడ్ బ్రాడ్ గేజ్ లైన్ల నిర్మాణానికీ కలిపి దాదాపు రూ.7 లక్షల కోట్లు ఖర్చవుతుందని అంచనా. దీన్ని 15 సంవత్సరాలలో పూర్తి చేయవచ్చు. ఈ విస్తరించిన, అప్‌గ్రేడ్ చేసిన నెట్‌వర్క్... 2060–2070 వరకు ప్రయాణీకులు, సరకు రవాణా రెండింటి అవసరాలను తీర్చగలిగే తగిన సామర్థ్యాన్ని కలిగి ఉంటుంది. తద్వారా రైల్వేలు భారత దేశ రవాణాకు జీవనాధారంగా తమ పాత్రను తిరిగి పొందగలుగుతాయి.

వ్యాసకర్త 'ఇండియన్ రైల్వే సర్వీస్ ఆఫ్ ఇంజినీర్స్' (ఐఆర్‌ఎస్‌ఈ)లో పనిచేశారు.
('ది ఇండియన్ ఎక్స్‌ప్రెస్' సౌజన్యంతో)

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!



సోషల్ మీడియా

అవగాహనా రాహిత్యం



సైబర్ వంచకులకు ఒక రిటైర్డ్ కల్నల్ 2.5 కోట్ల రూపాయలు మోసపోయారని వార్త. నాకు ఇది అర్థం కాదు. వీళ్లు పత్రికలు చదవరా? కనీసం ఆన్‌లైన్ కథనాలు చూడరా? ఇంత సులువుగా ఎలా మోసపోతారు? లేదా సులభంగా డబ్బులు రావాలనే దురాశ వీళ్లను గుడ్డివాళ్లను చేస్తుందా?

– మోహన్ సిన్హా, జర్నలిస్ట్

శాంతి కావాలి



మణిపూర్ కేవలం శాంతిని కోరుకుంటోంది. మెయితైలు, కుకీలు– ఇరువురూ సహజీవనాన్ని కోరుకుంటున్నారు. ఎవరూ ఈ హింసను కోరుకోవడం లేదు. డిమాండ్లు పక్కనపెడితే, అన్ని వర్గాలూ సురక్షితంగా ఉన్నామన్న భావనను కాంక్షిస్తున్నాయి.

– రామీ నిరంజన్ దేశాయి, ఆంత్రొపాలజిస్ట్

విషాదకరం



ఎలాంటి వక్రోక్తి! 16,000 గుండె ఆపరేషన్లు చేసిన గుజరాత్‌కు చెందిన 41 ఏళ్ల కార్డియాలజిస్ట్ గౌరవ్ గాంధీ గుండె పోటుతో చనిపోయారు. ఆయన ఆత్మకు శాంతి కలుగుగాక. ఓం శాంతి.

– అనూ సెహగల్, ఇమేజ్ కన్సల్టెంట్

అనారోగ్య ధోరణి



ఈమధ్య కాలంలో ఎంతోమంది మహిళలకు పొత్తి కడుపులో, ముఖ్యంగా గర్భాశయంలో లేదా దాని చుట్టూ సిస్టులు లేదా ఫైబ్రాయిడ్లు(కంతులు) లేదా ట్యూమర్లు ఉంటున్నాయి. ఇది ఎంతో ఆందోళనకరం.

– ఆంత్రీన్ ఖైదీ, రచయిత్రి

అవమానకరం



కెనడాలో జరిగిన పరేడ్‌లో ఇందిరా గాంధీ హత్యను చూపించే శకటాన్ని ప్రదర్శించారు. దీన్ని కెనడా ఎలా అనుమతించింది? ఒక భారత మాజీ ప్రధాని హత్యను ఉత్సవం చేయడం కూడా భావస్వేచ్ఛ అవుతుందా? తన ఓటు బ్యాంకు కోసం జస్టిన్ ట్రూడో ఖాలిస్తానీ శక్తుల మీద ఆధారపడటం సిగ్గుచేటు.

– అన్షుల్ సక్సేనా, జర్నలిస్ట్

మరెందుకిలా?



మహమ్మద్ రిజ్వాన్ (పాకిస్తాన్ క్రికెటర్) నమాజ్ చేయడానికి అమెరికా వీధుల్లో తన కారు నిలిపారని వార్త. అసలు అక్కడ దాదాపు ప్రతి చోటా 'ఫెయిత్ రూమ్స్' ఉన్నాయి. అమెరికాలోగానీ, బ్రిటన్‌లోగానీ నేనూ, నా కుటుంబమూ ఎప్పుడూ వీధుల్లో ప్రార్థించాల్సిన అవసరం రాలేదు.

– రేహమ్ ఖాన్, పాక్ పొలిటికల్ యాక్టివిస్ట్

అవి తినొద్దయితే!



పోర్చుగీస్ సంస్కృతి తాలూకు అన్ని చిహ్నాలనూ తుడిచేయాలని గోవా ముఖ్యమంత్రి అనుకుంటున్నారట. అయితే, ఆలుగడ్డ, టొమాటో, వేరుశనగ, అనాస, జీడిపప్పు, క్యాప్సికమ్, మిర్చి, జామ, సపోటా, మొనంజి... వీటన్నింటిని కూడా 16వ శతాబ్దంలో ఇండియాకు తెచ్చింది పోర్చుగీసువాళ్లే. కాబట్టి గోవా ముఖ్యమంత్రి, బీజేపీ మద్దతుదారులు ఈ విదేశీ ఆహారోత్పత్తులను కూడా నిషేధించాలి.

– అద్వైద్, చరిత్రకారుడు

ఇన్‌బాక్స్

మారనున్న ఎజెండా

కర్ణాటక ఎన్నికల ఫలితాలు రిజర్వేషన్లపై ఆసక్తికరమైన చర్చకు తెరతీశాయి. అక్కడ ముస్లిం రిజర్వేషన్లను రద్దుచేసి రాజకీయ ప్రాబల్యం కలిగిన లింగాయత్, ఒక్కలిగ కులాలకు పంపిణీ చేసింది బీజేపీ ప్రభుత్వం. ఇలాగే రానున్న అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల్లోనూ బీసీ లేదా ఓబీసీ రిజర్వేషన్ల అంశం ప్రధాన పాత్ర వహించబోతోందని ప్రధాన రాజకీయ పక్షాల ధోరణి తెలియజేస్తోంది.

2011–12 నిర్వహించిన సామాజిక, ఆర్థిక కులగణన నివేదికను విడుదల చేయాలని కర్ణాటక ఎన్నికల ప్రచారంలో భాగంగా రాహుల్ గాంధీ డిమాండ్ చేశారు. అదే సమయంలో ప్రతిపక్ష నాయకులు స్టాలిన్, నితీష్ కుమార్, అఖిలేష్ యాదవ్, తేజస్వి యాదవ్ వంటి నాయకులు కుల గణన జరగాలని డిమాండ్ చేస్తున్నారు. ప్రముఖ సోషలిస్టు నాయకుడు రామ్ మనోహర్ లోహియా అప్పట్లో వెనుకబడిన వర్గాలకు 60 శాతం రిజర్వేషన్ కల్పించాలని ప్రకటించారు. రాహుల్ గాంధీ అదే నినాదాన్ని ఎత్తుకున్నారు.

మండల్ కమిషన్ సిఫార్సులను అమలు చేసే సందర్భంలో పార్లమెంట్‌లో రాజీవ్ గాంధీ మాట్లాడుతూ ఓబీసీ రిజర్వేషన్‌లను తీవ్రంగా వ్యతిరేకించారు. ఇప్పుడు రాహుల్ గాంధీ అదే మండల్ కమిషన్ నివేదికను అమలు చేస్తామంటున్నారు. మండల్ కమిషన్ సిఫార్సుల అమలును వ్యతిరేకించిన బీజేపీ ఆలోచనలోనూ మార్పు వచ్చింది. కర్ణాటకలో ఇప్పటికే బీసీ రిజర్వేషన్ కార్డ్ ప్రయోగించింది. ఇలా ఈ ప్రధాన పార్టీలు వెనుకబడిన వర్గాలకు రిజర్వేషన్లు కల్పించే విషయంలో సానుకూలంగా ఉన్నట్లు చెబుతున్నా... వారి మాటల్లో నిజాయతీ ఎంత ఉందో అని ప్రజలు అనుమానిస్తున్నారు. విద్యా, ఉద్యోగాలలో రిజర్వేషన్లు ఇస్తామనే హామీ ఇచ్చినంత మాత్రాన పెద్దగా ప్రయోజనం లేదు. రాజకీయాలలో సైతం ఈ రిజర్వేషన్లు ఉండాలి. చట్టసభలలో బీసీలకు వారి వాటా వారికి లభించాలి. అప్పుడే రిజర్వేషన్ల వల్ల వెనుకబడిన వర్గాలు సంపూర్ణ ప్రయోజనం పొందుతాయి. కాబట్టి వివిధ రాష్ట్రాల్లో రాబోయే ఎన్నికల్లో బీసీ ఓటర్లను కేంద్రంగా చేసుకొని హామీలు గుప్పించే పార్టీలు ఈ విషయాన్ని దృష్టిలో ఉంచుకోవాలి.

– ఎర్రోజు శ్రీనివాస్
తెలంగాణ వికాస సమితి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి

తొమ్మిదేళ్లలో వజ్రం లాంటి ఆర్థిక వ్యవస్థ!

అభిప్రాయం



ఎస్. విష్ణువర్ధన్ రెడ్డి

'వజ్రం ఎప్పటికీ నిలిచి ఉంటుంది' ఇది ఓ యాడ్ క్యాప్షన్. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పాలనలో దేశ ఆర్థిక వ్యవస్థ కూడా ఆ వజ్రమంత బలంగా మారింది. 'ప్రపంచం మొత్తం తీవ్రమైన ఆర్థిక మాంద్యంలో ఇరుక్కున్నా భారత్‌పై పడే ప్రభావం స్వల్పమే' అని అంతర్జాతీయ ఆర్థిక నిపుణులు ఇటీవల అంతర్జాతీయ సదస్సుల్లో చెబుతున్నారు. ఎందుకంటే భారత్ ఎలాంటి విపత్తునైనా తట్టుకునే శక్తిని గత తొమ్మి దేళ్లలో సాధించింది కనుక. విదేశీ మారక ద్రవ్య నిల్వలు ఊహించనంత స్థాయికి పెరిగాయి. కొన్ని దేశాల వాణిజ్య చెల్లింపులు డాలర్లలో కాక రూపాయల్లో జరపడం ఈ సందర్భంగా గమనార్హం.

'తొమ్మిదేళ్ల కిందట మీరెలా ఉన్నారు?' ఇది దేశంలో ప్రతి ఒక్కరూ వేసుకోవాల్సిన ప్రశ్న. అప్పుడు పేదలుగా ఉన్నవారు ఇవాళ మధ్యతరగతి జీవులయ్యారు. మధ్య తరగతి జీవులుగా ఉన్నవారు ఇప్పుడు ఎగువ మధ్య తరగతి వారయ్యారు. ఇలా అవడానికి వారి కష్టం మాత్రమే కారణం కాదు. నరేంద్ర మోదీ ఆర్థిక సంస్కరణలు కూడా దోహదం చేశాయి. ప్రపంచ ఆర్థిక వృద్ధిపై అంతర్జాతీయ ఆర్థిక సంస్థ 'ఇంటర్నేషనల్ మానెటరీ ఫండ్' (ఐఎంఎఫ్) తాజా అంచనాలలో భారతదేశాన్ని ప్రపంచంలో అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న ప్రధాన ఆర్థిక వ్యవస్థగా గుర్తించింది. జీఎస్టీ వసూళ్లలో బలమైన పెరుగుదల, మూలధన వ్యయం పెరుగుదల, ఎగుమతులలో రికార్డు వృద్ధి, మహమ్మారి ప్రభావాల నుండి కోలుకుని పరుగులు పెడుతున్న తీరు... శక్తిమంతమైన, అభివృద్ధి చెందుతున్న ఆర్థిక వ్యవస్థను సూచిస్తున్నాయని ఐఎంఎఫ్ ప్రకటించింది. 'మహమ్మారిని ఎదుర్కొని ఆర్థిక పతనాన్ని నివారించి స్థిరమైన అభివృద్ధి దిశగా ఇండియా వెళ్లడానికి ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేయడానికి 2014 నుండి చేసిన స్థిరమైన ప్రయత్నాలే కారణం' అని ఐఎంఎఫ్ ప్రకటించింది.

తయారీ రంగంలో భారతదేశాన్ని స్వావలంబన దేశంగా మార్చేందుకు మోదీ ప్రభుత్వం 'ఆత్మనిర్భర్



భారత్'తో పాటు 'మేక్ ఇన్ ఇండియా' కింద అనేక కార్యక్రమాలను ప్రారంభించింది. ప్రొడక్షన్ – లింక్డ్ ఇన్సెంటివ్ (పీఎల్ఐ) పథకంతో ఈ రంగం మరింత ఊపందుకుంది. పీఎల్ఐ వెనుక ఉన్న లక్ష్యం దేశీయ తయారీని ప్రపంచవ్యాప్తంగా పోటీదారుగా మార్చడం. పీఎల్ఐ పథకాలు లక్షలాది ఉద్యోగాలను సృష్టించాయి. భారత ఆర్థిక వ్యవస్థను వేగవంతమైన వృద్ధి పథంలో ఉంచాయి. కోవిడ్ మహమ్మారి సమయంలో ప్రభుత్వం 'ఎమర్జెన్సీ క్రెడిట్ లైన్ గ్యారెంటీ' పథకం కింద కోటి కంటే ఎక్కువ చిన్న తరహా పరిశ్రమలను కాపాడింది.

దేశీయ ఔత్సాహిక పారిశ్రామికవేత్తలను ప్రోత్సహించడానికి, విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులను (ఎఫ్‌డీఐలు) ఆకర్షించడానికి కేంద్ర ప్రభుత్వం అనేక చర్యలను చేపట్టింది. పెట్టుబడులకు అనువైన ఒక వాతావరణాన్ని సృష్టించడానికి 'ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్', ఆర్థిక వ్యవస్థకు చెందిన పలు రంగాల కోసం ఎఫ్‌డీఐ పాలసీ సరళీకరణ, శాసనపరమైన సంస్కరణలు, తదితర చర్యలను చేపట్టింది మోదీ ప్రభుత్వం. ఈ చర్యలు మంచి ఫలాలను అందించాయి. ఉదాహరణకు 2014–15 ఆర్థిక సంవత్సరానికి 45 బిలియన్ డాలర్లుగా నమోదైన ఎఫ్‌డీఐ 2021–22 ఆర్థిక సంవత్సరానికి 83.57 బిలియన్ డాలర్లకు పెరిగింది.

'నేడు ప్రపంచం భారతదేశాన్ని పెట్టుబడికి ఆకర్షణీయమైన గమ్యస్థానంగా చూస్తోంది. ప్రపంచ కంపెనీలు ఇక్కడ వ్యాపారాలను స్థాపించాలనుకుంటున్నాయి' అని ప్రపంచబ్యాంక్ తన ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ ఎనాలిసిస్‌లో అభిప్రాయం వ్యక్తం చేసింది.

2014కి ముందు భారత్‌లో దాదాపు 350 స్టార్టప్‌లు మాత్రమే ఉన్నాయి. మోదీ ప్రభుత్వం 'స్టార్టప్ ఇండియా' వంటి పథకాల ప్రోత్సాహంతో గత తొమ్మిదేళ్లలో స్టార్టప్‌ల సంఖ్య 260 రెట్లు పెరిగింది. నేడు దేశం 68 యూనికార్న్‌లకు నిలయంగా ఉంది. ప్రపంచ బ్యాంకు ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ ఇండెక్స్‌లో భారత్ ర్యాంకింగ్ 2014లో 142 ఉంటే 2019 నాటికి 63కి చేరుకుంది. ప్రపంచ బ్యాంకు లాజిస్టిక్ పనితీరు సూచిక-2023లో భారతదేశం ఆరు స్థానాలు ఎగబాకింది. ఇప్పుడు 139 దేశాల సూచికలో 38వ స్థానంలో ఉంది.

గతంలో మౌలిక సదుపాయాల ప్రాజెక్టులను పూర్తిచేయడంలో విపరీతమైన జాప్యం జరిగేది. కానీ ఇప్పుడు పరిస్థితి మారింది. మౌలిక సదుపాయాల కల్పనకు సంబంధించి మోదీ సర్కారు విజయగాథల్లో జాతీయ రహదారుల నిర్మాణం ఒకటిగా నిలిచిపోతుంది. అయితే 'బుల్లెట్ ట్రెన్' ప్రాజెక్టు లాంటి పలు పెద్ద ప్రాజెక్టులు నేటికీ వెలుగు చూడలేదు. 2014–15 ఆర్థిక సంవత్సరంలో దేశంలో మొత్తం జాతీయ రహదారుల నిడివి 97.8 వేల కి.మీ.లు ఉండగా 2022 డిసెంబర్ మాసాంతానికి అది 1.44 లక్షల కి.మీ.లకు చేరుకుంది. భారతీయ రైల్వే గత తొమ్మిదేళ్లలో లైన్ డబ్లింగ్, రైల్వే ట్రాక్‌ల విద్యుదీకరణ ద్వారా భారీ సామర్థ్యాన్ని సంతరించుకుంది.

'వందే భారత్ ఎక్స్‌ప్రెస్', భారతదేశపు మొట్టమొదటి స్వదేశీ సెమీ హై-స్పీడ్ రైల్ 'మేక్ ఇన్ ఇండియా' అద్భుతమైన విజయగాథ. మోదీ ప్రభుత్వం తీసుకున్న చర్యల కారణంగా టైర్-3 నగరాలకూ విమానాలు తిరుగుతున్నాయి. గత తొమ్మిదేళ్లలో 20 నగరాలకు మెట్రో రైలు ప్రాజెక్టులు చేరుకున్నాయి. మల్టీమోడల్ కనెక్టివిటీ, లాజిస్టిక్స్ సామర్థ్యాన్ని మెరుగుపరచడానికీ, క్లిష్టమైన మౌలిక సదుపాయాల అంతరాలను పరిష్కరించడానికీ సంబంధిత మంత్రిత్వ శాఖలు/విభాగాల్లో సమగ్ర ప్రణాళిక కోసం ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ 'పీఎమ్ గతి శక్తి నేషనల్ మాస్టర్ ప్లాన్'ను ప్రకటించారు.

గతంలో ప్రపంచంలో ఏ మూల ఆర్థిక మాంద్యం వచ్చినా ఇండియాలో ఇబ్బందులు పడాల్సి వచ్చేది. అనేక రంగాలు ఇబ్బందులు పడేవి. కానీ ఇప్పుడు పరిస్థితి మారిపోయింది. రాబోయే రోజుల్లో భారత్ ప్రపంచ ఆర్థిక వ్యవస్థలో అగ్రగామిగా నిలుస్తుంది. ఇది తథ్యం!

వ్యాసకర్త బీజేపీ ఏపీ ప్రధాన కార్యదర్శి

క్లుప్తంగా...

మా గల్లీకి రోడ్డు పోయించండి సారూ..

● కలెక్టర్‌ను కోరిన చిన్నారులు



కలెక్టర్‌కు వినతిపత్రం ఇస్తున్న చిన్నారులు

నర్సింహులపేట: 'కలెక్టర్ సార్.. మా గల్లీకి రోడ్డు పోయించండి.. వర్షాకాలంలో బురదలో నడవలేక ఇబ్బందులు పడుతున్నాం'.. అంటూ ఇద్దరు చిన్నారులు కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. మహబూబాబాద్ జిల్లా నర్సింహులపేట మండల కేంద్రంలో బుధవారం జరిగిన సాగునీటి వేడుకలకు కలెక్టర్ శశాంక, ఎమ్మెల్యే రెడ్యానాయక్ హాజరయ్యారు. అనంతరం వారు వెళ్తుండగా మండల కేంద్రానికి చెందిన వేటకారి వెంకట్రాములు కుమార్తెలు పూజిత, నందిని కలెక్టర్ వద్దకు వెళ్లారు. 'సార్ హైస్కూల్ పక్కన తోట బజార్‌లో మా ఇల్లు ఉంది, గల్లీలో రోడ్డు లేదు, పోయించండి'.. అంటూ చిన్న కాగితంపై రాసిన వినతిపత్రాన్ని అందజేశారు. కలెక్టర్ శశాంక చిరునవ్వుతో వారి ధైర్యాన్ని మెచ్చుకొని.. తప్పనిసరిగా రోడ్డు వేయిస్తామని హామీ ఇచ్చారు. కలెక్టర్ ఆదేశాలతో వెంటనే మండల అధికారులు సీసీ రోడ్డు నిర్మాణానికి పరిశీలించారు.

నా స్నేహితులపై అక్రమ కేసులు: కూర రాజన్న



సిరిసిల్ల అర్బన్: జనశక్తి నిషేధిత పార్టీ కాదని, తనను ఆదరించిన స్నేహితులపై పోలీసులు బెదిరింపులకు పాల్పడుతూ అక్రమంగా కేసులు పెడుతున్నారని జనశక్తి అగ్రనేత కూర రాజన్న ఆరోపించారు. ఆయన రాజన్నసిరిసిల్ల జిల్లా కేంద్రం ప్రెస్‌క్లబ్‌లో బుధవారం మాట్లాడుతూ తీవ్ర అనారోగ్యంతో బాధపడుతున్న తనపై పోలీసులు తప్పుడు కేసులు పెట్టారని పేర్కొన్నారు. వేములవాడలోని ఇల్లు శిథిలం కావడంతో తనకు ఆశ్రయమిచ్చిన స్నేహితుల్ని స్థానిక సీఐ బెదిరిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తనతో మాట్లాడిన కుంటయ్యతోపాటు మరి కొందరిపై అక్రమ కేసులు బనాయించి ఇబ్బందులకు గురి చేస్తున్నారన్నారు. అక్రమ కేసులకు భయపడేది లేదని, పోరాటాన్ని కొనసాగిస్తానని స్పష్టం చేశారు. సిరిసిల్ల, వేములవాడ సీఐలు.. విధుల్లో చేరినప్పుడు వారి ఆస్తి ఎంత ఉందో, ఇప్పుడు ఎంత ఉందో సీబీఐతో విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు.

పాపం పసివాళ్లు




వెంకటేశ్వరరావు, అఖిల దంపతుల కుమారులు

అన్నపురెడ్డిపల్లి: కుటుంబ కలహాలతో తల్లి దండ్రులిద్దరూ రోజు వ్యవధిలోనే కన్ను మూయడంతో ఇద్దరు పసిబిడ్డలు అనాథలుగా మిగిలారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అన్నపురెడ్డిపల్లి మండలం జానకిపురం గ్రామానికి చెందిన కోలా వెంకటేశ్వరరావు (28) 2019లో తల్లాడ మండలం నూతనకల్ గ్రామానికి చెందిన అఖిలను వివాహం చేసుకున్నాడు. వెంకటేశ్వరరావు లారీ డ్రైవర్‌గా పనిచేస్తుండగా.. ఈ దంపతులకు 18 నెలలు, ఎనిమిది నెలల వయసున్న ఇద్దరు కుమారులున్నారు. కొంతకాలంగా వెంకటేశ్వరరావు కుటుంబంలో తరచూ గొడవలు జరుగుతున్నాయి. సోమవారం రాత్రి కూడా భార్యాభర్తల మధ్య గొడవ జరగడంతో మనస్తాపానికి గురైన అఖిల మంగళవారం ఇంట్లో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుంది. ఈ విషయం తెలియగానే వెంకటేశ్వరరావు కూడా పురుగు మందు తాగడంతో కుటుంబ సభ్యులు కొత్తగూడెం తరలించారు. అక్కడ చికిత్స పొందుతున్న వెంకటేశ్వరరావు బుధవారం మరణించాడు.

ఒకేరోజు 3 బోర్లు వేసినా.. చుక్క నీరు పడలేదు

● లక్షన్నర ఖర్చు.. సాగుకు చేసిన అప్పులతో రైతు ఆత్మహత్య



లక్ష్మయ్య

దుబ్బాక: ఒకేరోజు 3 బోర్లు వేసినా చుక్క నీరు పడకపోవడంతో తీవ్ర మనోవేదనకు గురైన రైతు ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ ఘటన సిద్దిపేట జిల్లా పరిధిలో జరిగింది. దుబ్బాక ఎస్‌ఐ బత్తుల మహేందర్ కథనం ప్రకారం.. చెల్లాపూర్‌కు చెందిన కంకణాల లక్ష్మయ్య(67) పొలంలో మంగళవారం రాత్రి ఒక బోరు వేయించాడు. దాంట్లో చుక్క నీరు పడలేదు. వెంటనే మరొక బోరు వేయించగా, అందులోనూ నీరు రాలేదు. సాగునీటికోసం ఆశతో మూడో బోరు వేయించాడు. అదీ పనిచేయలేదు. మొత్తంగా లక్షన్నర రూపాయలు ఇందుకోసం వెచ్చించాడు. ఈ క్రమంలో తీవ్ర మనోవేదనకు గురయ్యాడు. వ్యవసాయానికి చేసిన అప్పులకు తోడు బోర్లు వేసేందుకు అయిన ఖర్చులో మనస్తాపానికి గురైన ఆయన బుధవారం ఉదయం పొలం వద్దకు వెళ్లి తిరిగి రాలేదు. మధ్యాహ్నం లక్ష్మయ్య మనవడు రాహుల్ పొలం వద్దకు వెళ్లి చూడగా చింతచెట్టుకు ఉరి వేసుకుని కనిపించాడు. వెంటనే దుబ్బాక ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా, పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు చెప్పారు. కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

కాళేశ్వరం జలాలకు లక్ష జన హారతి

● వండర్ బుక్ ఆఫ్ రికార్డ్ ఇంటర్నేషనల్‌లో చోటు
● మంత్రి జగదీశ్‌రెడ్డి నేతృత్వంలో ప్రతిష్టాత్మక కార్యక్రమం
● మూడు నియోజకవర్గాలు, 68 కిలోమీటర్ల కాలువ పొడవునా జన హారతి
● పాల్గొన్న ఆరు మండలాలు, 126 గ్రామాలకు చెందిన 1,16,142 మంది ప్రజలు



కాళేశ్వరం జలాలకు హారతిఇచ్చేందుకు సిద్ధంగా ఉన్న మహిళలు. (ఇన్‌సెట్‌లో) హారతి ఇస్తున్న మంత్రి జగదీశ్ రెడ్డి

సాక్షి ప్రతినిధి, నల్లగొండ: కాళేశ్వరం జలాలకు ఇచ్చిన లక్ష జన హారతి.. వండర్ బుక్ ఆఫ్ రికార్డ్స్ ఇంటర్నేషనల్‌లో చోటు దక్కించుకుంది. రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా బుధవారం విద్యుత్తు శాఖ మంత్రి జగదీశ్‌రెడ్డి నేతృత్వంలో సూర్యాపేట జిల్లాలోని నాగారం మండలం ఈటూరు నుంచి పెన్‌పహాడ్ మండలం చీదెళ్ల చెరువు వరకు 68 కిలో మీటర్ల పొడవున, 126 గ్రామాల పరిధిలో శ్రీరాంసాగర్ ప్రాజెక్టు రెండో దశ డీబీఎం–71 కాలువ ద్వారా ప్రవహించే గోదావరి జలాలకు లక్ష హారతి కార్యక్రమం నిర్వహించారు. చివ్వెంల మండలం కాలువ వద్ద నిర్వహించిన సంబరాల్లో మంత్రి జగదీశ్‌రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా వండర్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్‌కు చెందిన ఐడబ్ల్యూఎస్‌ఆర్ చీఫ్ డాక్టర్ బి.నరేందర్‌గౌడ్, తెలంగాణ కోఆర్డినేటర్ గంగాధర్, మెడల్, మెమెంటో, ప్రశంసాపత్రాన్ని మంత్రి జగదీశ్‌రెడ్డికి అందజేశారు. కోదాడ ఎమ్మెల్యే బొల్లం మల్లయ్య యాదవ్‌కు చివ్వెంల వద్ద, జాజిరెడ్డిగూడెం మండలం తిమ్మాపురం వద్ద తుంగతుర్తి ఎమ్మెల్యే గ్యాదరి కిషోర్‌కు మెమెంటోలు అందజేశారు.

లక్ష అనుకుంటే అంతకు మించి జనం

మంగళవారం సాయంత్రం నుంచి బుధవారం మధ్యాహ్నం 12 గంటల వరకు ఆరు మండలాలకు చెందిన 126 గ్రామాల్లో వండర్ వరల్డ్ బుక్ ఆఫ్ రికార్డ్ ప్రతినిధుల బృందం పర్యటించింది. కాళేశ్వరం జలాలకు లక్ష మందితో జన హారతి అనుకున్నప్పటికి కార్యక్రమంలో 1,16,142 మంది పాల్గొన్నట్లు బృందం నిర్ధారించింది. ఇందులో 65,042 మంది మహిళలు, 51,100 మంది పురుషులు పాల్గొన్నట్లు వెల్లడించింది.

107 వీడియో కెమెరాలు, 8 డ్రోన్లతో చిత్రీకరణ

వండర్ బుక్ ఆఫ్ ఇంటర్నేషనల్‌కు చెందిన మూడు బృందాల నేతృత్వంలో ఈ కార్యక్రమాన్ని చిత్రీకరించేందుకు 107 వీడియో కెమెరాలు, 8 డ్రోన్లను వినియోగించారు. 62 కళా బృందాలు, 126 చోట్ల డప్పు మేళాలు, 54 బతుకమ్మ బృందాలు ఇందులో పాల్గొన్నాయి. కాలువ పొడవునా లక్ష మందికీ భోజన ఏర్పాట్లు చేశారు. కార్యక్రమాన్ని పర్యవేక్షించిన జిల్లా కలెక్టర్ వెంకట్రావు, అదనపు కలెక్టర్ హేమంత్ కేశవ్ పాటిల్, జిల్లా ఎస్పీ రాజేంద్రప్రసాద్‌ను వండర్ బుక్ ఆఫ్ రికార్డ్స్ ప్రతినిధులు సన్మానించారు.

కేసీఆర్‌తోనే సాధ్యమైంది: మంత్రి జగదీశ్‌రెడ్డి

విద్యుత్ శాఖ మంత్రి గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి మాట్లాడుతూ.. నీళ్లు, నిధులు, నియామకాల పేరుతో ప్రత్యేక రాష్ట్ర ఉద్యమానికి శ్రీకారం చుట్టిన కేసీఆర్ సూర్యాపేట, తుంగతుర్తి నియోజకవర్గాలలో పర్యటించినప్పుడు.. ఈ ప్రాంతానికి నీరు అందాలి అంటే గోదావరి జలాలే శరణ్యం అని భావించారని గుర్తుచేశారు. ముఖ్యమంత్రి అయిన తర్వాత మేడిగడ్డ వద్ద ప్రాజెక్టు నిర్మాణానికి శ్రీకారం చుట్టారన్నారు. కేసీఆర్ కృషితోనే తుంగతుర్తి, సూర్యాపేట, కోదాడ ప్రాంతాలకు నీళ్లు పారుతున్నాయన్నారు. అందుకు సీఎంకి కృతజ్ఞత చెప్పుకునేందుకు దశాబ్ది ఉత్సవాల సందర్భంగా నీటిపారుదల దినోత్సవం రోజున ఈ ప్రాంత రైతాంగం కాళేశ్వరం జలానికి లక్ష జన హారతి నిర్వహించామన్నారు.

'గట్టు' కోసం గొడ్డళ్లతో దాడి..

● సోదరులు, వారి కుమారుల మధ్య ఘర్షణ.. నలుగురికి తీవ్ర గాయాలు
● యాదాద్రి జిల్లా మానాయికుంటలో ఘటన

అడ్డగూడూరు: యాదాద్రి భువనగిరి జిల్లా అడ్డగూడూరు మండలం మానాయికుంటలో భూ వివాదం భగ్గుమంది. రెండెకరాల భూమి గట్టు పంచాయితీ సోదరుల మధ్య చిచ్చురేపడంతో ఒకరిపై ఒకరు గొడ్డళ్లతో దాడి చేసుకోగా నలుగురికి తీవ్ర గాయాలయ్యాయి. పోలీసుల కథనం ప్రకారం.. మానాయికుంటకు చెందిన మార్త బుచ్చయ్య, లచ్చమ్మ దంపతులకు వీరయ్య, సైదులు కుమారులు. గ్రామ శివారులో తల్లిదండ్రులకు చెందిన రెండెకరాల భూమిని సోదరులిద్దరూ చెరో ఎకరం పంచుకుని సాగుచేసుకుంటున్నారు. కొంతకాలంగా వీరి మధ్య గట్టు పంచాయితీ నడుస్తోంది.

అరకతో అచ్చుతోలుతుండగా..

వీరయ్య తన కుమారుడు ప్రభాస్‌తో కలసి బుధవారం ఉదయం పొలంలో అరకతో అచ్చుతోలుతున్నాడు. విషయం తెలుసుకున్న చిన్నకుమారుడు సైదులు, తన కుమారుడు శేఖర్‌తో కలసి భూమి వద్దకు వెళ్లి వీరయ్యతో వాగ్వాదానికి దిగాడు. ఈ క్రమంలో నలుగురి మధ్య తీవ్రస్థాయిలో వాగ్వాదం జరుగుతుండగా సైదులు కుమారుడు శేఖర్ గొడ్డలితో పెద నాన్న కుమారుడు ప్రభాస్‌పై దాడి చేశాడు. దీంతో ఒకరిపై మరొకరు దాడి చేసుకోవడంతో సైదులు ఎడమచెయ్యి తెగిపోవడంతో పాటు ముగ్గురికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానిక రైతులు దాడిని అడ్డుకున్నారు. క్షతగాత్రులకు ప్రాథమిక చికిత్స చేయించిన తర్వాత హైదరాబాద్‌కు తీసుకెళ్లారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ ఉదయ్ కిరణ్ తెలిపారు.



పరస్పర దాడిలో గాయపడిన వీరయ్య, సైదులు, ప్రభాస్, శేఖర్

కేసీఆర్ అంటే కాళేశ్వర చంద్రశేఖర్‌రావు

● కేసీఆర్ అంటే నీళ్లు, అమ్మ తీరుగా ఆలోచించడం
● అభివర్ణించిన ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత



నిజామాబాద్, నాగారం: కేసీఆర్ అంటే కాలువలు, చెక్‌డ్యాములు, రిజర్వాయర్లని... శివుని నెత్తిపై గంగమ్మ ఉంటే తెలంగాణ నెత్తిమీద కాళేశ్వర గంగను నెలకొల్పిన మన కేసీఆర్‌ను కాళేశ్వర చంద్రశేఖర్‌రావు అని పిలుచుకోవాల్సిందేనని నిజామాబాద్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత అభివర్ణించారు. బుధవారం నిజామాబాద్ జిల్లా కేంద్రంలో తెలంగాణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా ఇరిగేషన్ శాఖ ఏర్పాటు చేసిన సాగునీటి దినోత్సవంలో ఆమె మాట్లాడారు. కేసీఆర్ అంటే... నీళ్లు. కేసీఆర్ అంటే... అమ్మ తీరుగా ఆలోచించడం అని కవిత వ్యాఖ్యానించారు. తెలంగాణ ఉద్యమ సమయంలో ఎండిపోయిన పొలాలను చూసి కేసీఆర్ దుఃఖించిన తీరును తాను చూశానని చెప్పారు. గతంలో ఎండిపోయిన పాలమూరు ఇవాళ పచ్చని పైరు కప్పుకున్నదని సీఎం కేసీఆర్ సంతోషిస్తున్నారని తెలిపారు. కాళేశ్వరం ప్రాజెక్ట్‌కు జాతీయ హోదా కల్పించాల్సిందేనని కేంద్రాన్ని ఆమె డిమాండ్ చేశారు. ఇక్కడ బీజేపీ నాయకులు కనీసం నిధులు ఎలాగూ ఇప్పించలేరని... ప్రపంచంలోనే అతిపెద్దదైన కాళేశ్వరానికి జాతీయ హోదా ఇప్పించేలా పోరాటాలు చేయాలని డిమాండ్ చేశారు.

బాలిక ప్రాణం తీసిన 'నింద'

● దొంగతనం చేశావంటూ దూషించిన పక్కింటివారు
● మనస్తాపంతో ఉరేసుకుని బాలిక ఆత్మహత్య



వందన (ఫైల్)

నవీపేట: పక్కింటివారు దొంగతనం నింద మోపడంతో అవమానానికి గురైన ఓ బాలిక ఆత్మహత్యకు పాల్పడింది. నిజామాబాద్ జిల్లా నవీపేట మండలం శివతండా గ్రామంలో మంగళవారం రాత్రి ఈ ఘటన జరిగింది. తండాకు చెందిన తేజావత్ లక్ష్మి, ధనుకు నలుగురు కుమార్తెలు. మూడవ కుమార్తె నిఖితను హైదరాబాద్‌లోని ఆమె భర్త దగ్గర దింపేందుకు లక్ష్మి, ధనులు మంగళవారం సాయంత్రం తమ కూతురుతో కలసి వెళ్లారు. ఇంటి దగ్గర ఒంటరిగా ఉన్న నాలుగో కూతురు వందన (16) పక్కింట్లో ఉండే బానోత్ ప్రవీణ్ ఫోన్ తీసుకుని తల్లిదండ్రులతో మాట్లాడి ఎక్కడి వరకు వెళ్లారో తెలుసుకుంది. తర్వాత ఫోన్‌ను తిరిగి ఇచ్చేసింది. కొద్దిసేపటి తరువాత బానోత్ ప్రవీణ్, అతని తల్లి.. వందన ఇంటికి వచ్చి ఫోన్ పౌచ్‌లో దాచిన రూ.600 దొంగతనం చేశావంటూ ఇష్టానుసారం దూషించారు. దీంతో వందన రోదిస్తూ మరొకరి ఫోన్ ద్వారా ఈ విషయం తల్లిదండ్రులకు చెప్పింది. అనంతరం ఫ్యాన్ కడ్డీకి ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. తల్లీ, కొడుకులు బూలిబాయి, ప్రవీణ్‌లు దూషించడంతో మనస్తాపం చెందిన వందన ఆత్మహత్యకు పాల్పడిందని మృతురాలి తల్లి పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఆమె ఫిర్యాదు మేరకు ఇద్దరిపై కేసు నమోదు చేశామని ఎస్సై రాజారెడ్డి బుధవారం తెలిపారు.

రైతు ఆదాయం పెంచే దిశలో మరో అడుగు

● ఎమ్మెస్పీ పెంపుతో రైతులకు భరోసా పెరిగిందన్న కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి



సాక్షి, న్యూఢిల్లీ: అన్నదాతల సంక్షేమానికి కట్టుబడి ఉన్న కేంద్ర ప్రభుత్వం.. ఇచ్చిన హామీ మేరకు రైతు ఆదాయాన్ని పెంచే దిశగా మరో అడుగు ముందుకేసిందని కేంద్ర సాంస్కృతిక, పర్యాటక శాఖ మంత్రి జి.కిషన్ రెడ్డి అన్నారు. పంటల మద్దతు ధరను పెంచుతూ ఆర్థిక వ్యవహారాల కేబినెట్ కమిటీ నిర్ణయం తీసుకోవడంపై కిషన్‌రెడ్డి హర్షం వ్యక్తం చేశారు. కేంద్ర ప్రభుత్వ నిర్ణయంతో తెలంగాణ రైతులకు చాలా మేలు జరిగిందన్నారు. తెలంగాణలో పండే అన్ని పంటలకు 2014తో పోలిస్తే.. 60% నుంచి 80% వరకు కనీస మద్దతు ధర పెరిగిందని తెలిపారు. గరిష్టంగా సన్‌ఫ్లవర్ (పొద్దుతిరుగుడు పువ్వు)కు 80 శాతం పెరిగిందని, తెలంగాణలోని పత్తి రైతులతోపాటు చేనేత పరిశ్రమకు అండగా నిలిచేందుకు పత్తి ధరలో 75% పెంచిందని కిషన్‌రెడ్డి వెల్లడించారు. వరితోపాటుగా మొక్కజొన్న, సోయా వంటి వాటికీ దాదాపు 50 శాతం కనీస మద్దతు ధర పెరిగిందని, ఖరీఫ్ మార్కెటింగ్ సీజన్ 2023–24 నుంచి ఈ మద్దతు ధర అందుబాటులోకి రానుందని వివరించారు. భిన్నమైన పంటలు వేసేలా (క్రాప్ డైవర్సిఫికేషన్) రైతులను ప్రోత్సహించేందుకు ఎమ్మెస్పీ పెంపుదల దోహద పడుతుందని ఆయన అభిప్రాయపడ్డారు.

మద్దతు ధరలపై కేంద్ర నిర్ణయం హర్షణీయం



సాక్షి, హైదరాబాద్: వివిధ పంటలకు కనీస మద్దతుధరలను పెంచుతూ కేంద్ర కేబినెట్ నిర్ణయం తీసుకోవడంపై బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్ హర్షం వ్యక్తం చేశారు. ప్రధాని మోదీ ఆధ్వర్యంలోని కేంద్ర సర్కార్ రైతు పక్షపాతి అని మరోసారి రుజువైందన్నారు. గత ప్రభుత్వాలతో పోల్చితే పంటలకు రెట్టింపు ధర అందించడమే బీజేపీ లక్ష్యమని బుధవారం ఆయన ఒక ప్రకటనలో పేర్కొన్నారు. వరి పంటకు క్వింటాల్‌పై రూ.143 పెంపుదలతో రాష్ట్ర రైతాంగానికి ఎంతో మేలు జరుగుతుందని తెలిపారు. యూపీఏ హయాంలో సాధారణ రకం వడ్ల ధర క్వింటాలుకు రూ.1,360 ఉంటే.. తాజాగా అది రూ.2,183లకు చేరుకుందన్నారు. గతంతో పోలిస్తే వడ్లకు కనీస మద్దతు ధర రూ.823 పెరిగిందని చెప్పారు. గతంలో ఎన్నడూ లేని విధంగా పత్తి పంటకు రూ.540 నుంచి రూ.640, పల్లీలకు రూ.527, నువ్వులకు రూ.805, కందులకు రూ.400, మినుములకు రూ.350 ధర పెంచడం హర్షణీయమన్నారు. పెసర్ల కనీస మద్దతు ధరను 10.4 శాతం మేర పెంచి.. క్వింటాల్‌కు కనీస మద్దతు ధర రూ. 8,558 నిర్ణయించడం హర్షణీయమని సంజయ్ పేర్కొన్నారు. కాగా, పంటలకు కనీస మద్దతు ధర పెంచుతూ కేంద్ర కేబినెట్ తీసుకున్న నిర్ణయాన్ని బీజేపీ జాతీయ ఉపాధ్యక్షురాలు డీకే అరుణ స్వాగతించారు. అలాగే పార్టీ జాతీయ కార్యవర్గ సభ్యులు జితేందర్‌రెడ్డి, వివేక్ వెంకటస్వామి, గరికపాటి మోహన్‌రావులు వేర్వేరు ప్రకటనల్లో హర్షం ప్రకటించారు.

పంటలకు మద్దతు ధర అరకొరేనా!

● స్వామినాథన్ సిఫార్సులు దేవుడెరుగు.. అసలు సాగు ఖర్చులు కూడా ఇవ్వలేని కేంద్ర ఎంఎస్పీ
● రాష్ట్ర ప్రభుత్వం పత్తికి అడిగింది రూ. 16,500
● కేంద్ర ప్రభుత్వం ప్రకటించింది రూ. 7,020
● వరికి క్వింటాలుకు రాష్ట్రం అడిగింది రూ. 5,100
● కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధర రూ. 2,203



సాక్షి, హైదరాబాద్: కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన వివిధ పంటలకు మద్దతు ధరలు ఆశాజనకంగా లేవని రాష్ట్ర వ్యవసాయశాఖ వర్గాలు చెబుతున్నాయి. వివిధ పంటల సాగు ఖర్చుల ప్రకారం స్వామినాథన్ సిఫార్సులను అమలు చేయాలని తాము కోరితే కేంద్రం పెడచెవిన పెట్టిందని అంటున్నాయి. కేంద్రం విడిల్చే లెక్క ప్రకారం రైతులు పండించిన పంటకు వచ్చేది నష్టమే తప్ప లాభం లేదని అంటున్నాయి. 2023–24 ఆర్థిక సంవత్సరంలో వ్యవసాయ సీజన్లలో రైతులు పండించే పంటలకు కేంద్రం బుధవారం ప్రకటించిన కొత్త మద్దతు ధరలు భరోసా ఇచ్చే పరిస్థితి లేదంటున్నాయి.

సీఏసీపీకి ఇచ్చిన నివేదికల ప్రకారం..: రాష్ట్రంలో రైతులు పంటల సాగుకు పెడుతున్న పెట్టుబడి ఖర్చులపై రాష్ట్ర వ్యవసాయశాఖ భారత వ్యవసాయ వ్యయ, ధరల కమిషన్ (సీఏసీపీ)కి నివేదించింది. సీఏసీపీకి రాష్ట్ర వ్యవసాయశాఖ పంపిన నివేదికల ప్రకారం తెలంగాణలో క్వింటా వరి సాధారణ (కామన్) రకం ధాన్యానికి రూ. 3,300, ఏ గ్రేడ్ ధాన్యం పండించాలంటే రూ. 3,400, పత్తికి రూ. 11 వేలు, మొక్కజొన్నకు రూ. 2 వేలు, సోయా పంటకు రూ. 4,500 రైతు గతేడాది ఖర్చు చేశారు. ఈ ఖర్చులకు స్వామినాథన్ సిఫార్సుల ప్రకారం 50 శాతం అదనంగా కలపాలని రాష్ట్రం సూచించింది. ఆ ప్రకారం మద్దతు ధరలను ఖరారు చేయాలని కోరింది. ఉదాహరణకు పత్తి క్వింటాకు రూ. 11 వేలు ఖర్చు అయితే, స్వామినాథన్ సిఫార్సుల ప్రకారం అందులో 50 శాతం కలపాలి. ఆ ప్రకారం మద్దతు ధరగా రూ. 16,500 ప్రకటించాలని రాష్ట్రం ప్రతిపాదించింది. అయితే కేంద్రం పత్తికి మద్దతు ధర కేవలం రూ. 7,020 మాత్రమే ఖరారు చేసింది. స్వామినాథన్ సిఫార్సులను పక్కన పెట్టినా వాస్తవ ఖర్చు ప్రకారమైనా మద్దతు ధర ప్రకటించలేదన్న విమర్శలు ఉన్నాయి. స్వామినాథన్ సిఫార్సులు అమలుచేస్తున్నామని కేంద్రం చెప్పుకుంటోంది. కానీ క్షేత్రస్థాయి లెక్కలు అందుకు విరుద్ధంగా ఉన్నాయని వ్యవసాయశాఖ వర్గాలు అంటున్నాయి.

రాష్ట్ర ప్రభుత్వ ప్రతిపాదనలు...
మద్దతు ధరల పెంపు (క్వింటాలుకు.. రూ.లలో)

పంట	రాష్ట్రం ప్రతిపాదన	కేంద్ర మద్దతు ధర
వరి (కామన్)	4,950	2,183
వరి ఏ గ్రేడ్	5,100	2,203
పత్తి	16,500	7,020
సోయా	6,750	4,600
కంది	11,000	7,000
పెసర	12,000	8,558

'ధాన్యం డబ్బులు సకాలంలో జమ చేయాలి'

సాక్షి, హైదరాబాద్: రైతుల వద్ద కొనుగోలు చేసిన వరి ధాన్యం డబ్బులను జాప్యం లేకుండా సకాలంలో రైతుల అకౌంట్లలో జమ చేయాలని తెలంగాణ రైతు ఐక్యవేదిక అధ్యక్షుడు నర్సారెడ్డి డిమాండ్ చేశారు. హైదరాబాద్‌లో బుధవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ ఐకేపీ, ఇతర సహకార సంఘాల ద్వారా వరి ధాన్యాన్ని కొనుగోలు చేసిన తర్వాత 48 గంటలలో రైతుల ఖాతాల్లో డబ్బులు జమ చేస్తామని చెప్పిన ప్రభుత్వం, నెలరోజులు గడిచినా జమ చేయకపోవడం విచారకరమన్నారు. పెట్టుబడి సాయం అని చెప్పే సీఎం ఖరీఫ్ సీజన్ ప్రారంభమైనప్పటికీ రైతుబంధు ఎందుకు విడుదల చేయడం లేదని ప్రశ్నించారు.

ఏం సాధించారని ఉత్సవాలు?

సాక్షి, హైదరాబాద్: తొమ్మిదేళ్ల తెలంగాణ ప్రస్థానంలో ఏం సాధించారని ఉత్సవాలు నిర్వహిస్తున్నారో అర్థం కావడం లేదని తెలుగుదేశం పార్టీ అధికార ప్రతినిధి తిరునగరి జ్యోత్స్న ఎద్దేవా చేశారు. ఆమె ఎన్టీఆర్ ట్రస్ట్ భవన్‌లో బుధవారం విలేకరులతో మాట్లాడుతూ తెలంగాణతో కష్టాలు నెరవేరుతాయని భావించిన ఉద్యోగులు, కార్మికులు, రైతులు బీఆర్ఎస్ పాలనలో సాధించిందేమీ లేక తల్లడిల్లుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఆర్టీసీని కాపాడుకునేందుకు రూ.వెయ్యి కోట్లు ఇస్తానన్న కేసీఆర్ ఆ హామీని మర్చిపోయారని విమర్శించారు.

ప్రతి ఎకరాకూ నీటిని అందించడమే లక్ష్యం

శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి



గన్‌ఫౌండ్రీ: తెలంగాణ రాష్ట్రంలోని ప్రతి ఎకరానికి నీటిని అందించడమే సీఎం కేసీఆర్ లక్ష్యమని శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి అన్నారు. తెలంగాణ రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా నీటిపారుదల శాఖ ఆధ్వర్యంలో సాగునీటి దినోత్సవ వేడుకలను బుధవారం రవీంద్రభారతిలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం నీటిపారుదల శాఖకు అత్యంత ప్రాధాన్యతను ఇస్తున్నట్లు తెలిపారు. ఉమ్మడి రాష్ట్రంలో తెలంగాణ ప్రాంతం ఎడారిని తలపించేదని, నీటివనరులు ఉన్నప్పటికీ వాటి వినియోగంలో విస్మరణకు గురైందన్నారు. 1996లోనే నీటి వివక్షతపై సీఎం కేసీఆర్ మాట్లాడారని గుర్తుచేశారు. మిషన్ కాకతీయ విజయవంతమైందని ఇందులో నీటిపారుదలశాఖ అధికారుల పాత్ర ఎంతగానో ఉందన్నారు.

ట్రాక్‌పై పడుకొని యువకుడి ఆత్మహత్యాయత్నం

ఘట్‌కేసర్: ఆత్మహత్యాయత్నం చేసిన ఓ వ్యక్తిని ఘట్‌కేసర్ పోలీసులు బుధవారం సాయంత్రం కాపాడారు. సీఐ మహేందర్‌రెడ్డి తెలిపిన మేరకు.. జనగాం జిల్లా నెల్లుట్ల గ్రామానికి చెందిన గొరిగే శ్రీనివాస్ (29) ఘట్‌కేసర్ మున్సిపాలిటీ ఎన్‌ఎఫ్‌సీనగర్ రైల్వే ట్రాక్‌పై ఉండి.. తాను చనిపోతున్నానని తండ్రికి బుధవారం సాయంత్రం ఫోన్ చేసి సమాచారం ఇచ్చాడు. ఈ విషయాన్ని 100 డయల్ కాల్ ద్వారా విషయం తెలుసుకున్న పోలీస్ మొబైల్ సిబ్బంది సురేశ్, రాజన్న, ఎస్సై అశోక్ యువకుడి ఫోన్ లొకేషన్ తెలుసుకొని అక్కడి వెళ్లారు. అతను ఉన్న లొకేషన్‌లో వెతకగా కొంత దూరంలో శ్రీనివాస్ రైలు పట్టాలపై పడుకొని కనిపించాడు. అదే సమయంలో ఆ ట్రాక్‌పై వస్తున్న రైలును గమనించిన పోలీసులు పరుగెత్తి రైలు ఢీకొట్టకుండా చాకచక్యంగా ప్రాణాలు కాపాడారు.

క్లుప్తంగా...

బీజేపీపై వ్యతిరేకత ఉంది

దేశ ప్రజలు మార్పు కోరుకుంటున్నారు: శరద్‌పవార్

ఔరంగాబాద్: ప్రస్తుతం దేశంలో బీజేపీ వ్యతిరేక పవనాలు వీస్తున్నాయని, ప్రజలు మార్పు కోరుకుంటున్నారని నేషనలిస్ట్ కాంగ్రెస్ పార్టీ (ఎన్సీపీ) చీఫ్ శరద్ పవార్ తెలిపారు. ఇదే కొనసాగితే దేశం రాబోయే ఎన్నికల్లో మార్పును చూస్తుందన్నారు. ఈ విషయం చెప్పడానికి జ్యోతిష్యుని అవసరం లేదని, కర్ణాటక ఫలితాలు పరిగణనలోకి తీసుకుంటే సరిపోతుందని వ్యాఖ్యానించారు. ఔరంగాబాద్‌లో బుధవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. లోక్‌సభ, మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికలు ఒకేసారి జరిగే విషయమై ప్రశ్నించగా తనతోపాటు తమ పార్టీ మిత్రపక్షాలు కూడా అదే కోరుకుంటున్నాయని తెలిపారు. అయితే.. కర్ణాటక ఎన్నికల ఫలితాల దృష్ట్యా ఒకేసారి రెండు ఎన్నికలు నిర్వహించడానికి బీజేపీ సిద్ధపడదని ఆయన వ్యాఖ్యానించారు. రైతులకు పెట్టుబడి సాయంలో 'తెలంగాణ మోడల్'పై ఆయన స్పందిస్తూ.. చిన్న రాష్ట్రం కాబట్టి అది సాధ్యమయ్యిందని, దానికి బదులుగా రైతులకు మౌలిక వసతుల కల్పనకు నిధులను వెచ్చిస్తే సరిపోతుందని అభిప్రాయపడ్డారు. మహారాష్ట్రలో ప్రతి చిన్న ఘటనకూ మతం రంగు పులుముతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇది మంచి సంకేతం కాదన్నారు. రాష్ట్రంలో రైతుల సమస్యలపై శరద్‌పవార్ ఆందోళన వ్యక్తం చేశారు. రైతుల నుంచి ఇంతవరకూ ప్రభుత్వం పత్తిని కొనుగోలు చేయలేదని, చెరుకు రైతులకు మద్దతు ధరలేదని, ఈ విషయంలో రైతుల పోరాటానికి తమ పార్టీ మద్దతు ఉంటుందని హామీ ఇచ్చారు.

హార్ట్ స్పెషలిస్టు గుండెపోటుతో మృతి

జామ్‌నగర్: విధి వైచిత్రి ఇది. గుండె ఆపరేషన్లలో పేరుగాంచిన డాక్టర్ గౌరవ్‌గాంధీ 41 ఏళ్ల వయసులో గుండెపోటుకు గురై మరణించారు. ఆరోగ్యకరమైన యువ డాక్టర్, మంచి జీవనశైలిని కలిగి ఉన్న వ్యక్తి నిద్రలోనే గుండెపోటుతో కన్నుమూయడం జామ్‌నగర్ వైద్యవర్గాలను విస్మయానికి గురిచేసింది. డాక్టర్ గౌరవ్ గాంధీకి కెరీర్‌లో 16,000 పైచిలుకు గుండె ఆపరేషన్లు నిర్వహించిన అనుభవం ఉంది. సోమవారం రాత్రి ఎప్పటిలాగే కొందరు పేషెంట్లను చూసి ఇంటికి వచ్చిన గౌరవ్ ఆహారం తీసుకొని నిద్రకు ఉపక్రమించారు. రోజూ ఉదయం ఆరు గంటలకల్లా నిద్రలేచే ఆయన మంగళవారం సమయం దాటినా లేవకపోవడంతో కుటుంబీకులు గౌరవ్‌ను తట్టిలేపగా.. ఎలాంటి స్పందనా లేదు. వెంటనే ఆసుపత్రికి తరలించగా అప్పటికే డాక్టర్ గౌరవ్ మరణించినట్లు వైద్యులు ధ్రువీకరించారు. నిద్రలోనే గుండెపోటు రావడంతో తుదిశ్వాస విడిచినట్లు తెలిపారు.

ఎన్నికల చిత్రం మారుతోంది!

మన దేశంలో ఎన్నికల తీరుతెన్నులను 2014కు ముందు, తర్వాత అని స్పష్టంగా ఒక విభజన రేఖ గీయొచ్చు. కేంద్రంలో నరేంద్ర మోదీ నాయకత్వంలో బీజేపీ అధికారంలోకి వచ్చిన తర్వాత ఎన్నికల్లో విభిన్నమైన ధోరణులు కనిపించాయి. ఒకప్పుడు వివిధ రాష్ట్రాల్లో బహుముఖ పోరు ఉంటే, ఇప్పుడు రెండు పార్టీలే నేరుగా తలపడుతున్న రాష్ట్రాల సంఖ్య పెరుగుతోంది. బీజేపీ వివిధ రాష్ట్రాల్లో బలపడడం, కాంగ్రెస్ బలహీనపడడం , రాష్ట్రాల్లో మొదటి, రెండు స్థానాల్లో ఉండే కీలక పార్టీల వైపే ఓటర్లు మొగ్గు చూపిస్తూ ఉండడంతో ఎన్నికల ట్రెండ్స్ మారిపోతున్నాయి. ఇటీవల జరిగిన కర్ణాటక ఎన్నికల్లో త్రిముఖ పోరు నెలకొంటుందని అందరూ భావించినప్పటికీ జేడీ(ఎస్) తన ప్రాభవాన్ని కోల్పోయి బీజేపీ, కాంగ్రెస్‌ల మధ్యే నేరుగా పోటీ జరగడం అతి పెద్ద ఉదాహరణ. ఇకపై ఎన్నికల్లో కింగ్‌మేకర్లు అన్న పదమే వినిపించేలా లేదన్న కామెంట్లు వినిపిస్తున్నాయి.

- హిందీ హార్ట్‌ల్యాండ్‌గా పిలుచుకునే రాష్ట్రాలైన ఛత్తీస్‌గఢ్, రాజస్థాన్, మధ్యప్రదేశ్, హిమాచల్ ప్రదేశ్, ఉత్తరాఖండ్, ఢిల్లీ రాష్ట్రాల్లో ఒకప్పుడు ముఖాముఖి పోరు నెలకొని ఉండేది. ఇప్పుడు ఎన్నికల తీరుతెన్నుల్ని చూస్తే ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, ఒడిశా, ఉత్తరప్రదేశ్, పశ్చిమ బెంగాల్ వంటి రాష్ట్రాల్లో కూడా రెండు పార్టీల మధ్యే ప్రధానంగా పోరు నెలకొని ఉంది. గుజరాత్, పంజాబ్, తెలంగాణ రాష్ట్రాల్లో రెండు పార్టీల మధ్య పోరు ఉంటే, ఇప్పుడు ఆ రాష్ట్రాల్లో పార్టీల మధ్య బహుముఖ పోరాటం నెలకొంది.
- కొన్ని రాష్ట్రాల్లో ప్రధాన పార్టీలే మారిపోయే పరిస్థితి వచ్చింది. ఉదాహరణకి ఢిల్లీ తీసుకుంటే 2014కి ముందు ఆ రాష్ట్రంలో కాంగ్రెస్, బీజేపీ మధ్య ముఖాముఖి పోరు ఉండేది. కానీ కాలక్రమంలో ఆమ్ ఆద్మీ పార్టీ పుంజుకోవడం, కాంగ్రెస్ బలహీనపడడం మొదలైంది. దీంతో దేశరాజధానిలో ఆప్, బీజేపీ మధ్య ముఖాముఖి పోరు నెలకొంది. మరోవైపు హరియాణాలో బీజేపీ బలం పుంజుకోవడంతో అక్కడ ముఖాముఖి పోరు కాస్త బహుముఖ పోరుగా మారింది. బీజేపీ, ఇండియన్ నేషనల్ లోక్‌దళ్ (ఐఎన్‌ఎల్‌డీ), జననాయక్ జనతా పార్టీ (జేజేపీ)ల మధ్య ఎన్నికల్లో రసవత్తరంగా పోరు నడుస్తోంది.
- కొన్ని రాష్ట్రాల్లో పోలయిన ఓట్లను విశ్లేషిస్తే రెండు ప్రధాన పార్టీలకే ఓట్లు వేసే ధోరణి కనిపిస్తుంది. ఒకటి, రెండు స్థానాల్లో ఉండే పార్టీలే అత్యధిక ఓటు షేర్‌ని సొంతం చేసుకున్నాయి. ఉత్తరప్రదేశ్‌లో మాయావతికి చెందిన బీఎస్పీ, కర్ణాటకలో జేడీ(ఎస్), బెంగాల్‌లో వామపక్ష పార్టీలకు ఓట్లు వేసినా ఉపయోగం లేదన్న భావన ఓటర్లలో వచ్చింది. అందుకే రెండు పార్టీల్లో ఏదో ఒకదానిపైనే మొగ్గు చూపించే రోజులొచ్చాయని విశ్లేషణలు వినిపిస్తున్నాయి.

రాష్ట్రాల్లో పెరుగుతున్న ముఖాముఖి పోరు
తగ్గిపోతున్న త్రిముఖ, బహుముఖ పోరాటాలు
బీజేపీ బలపడుతుండటమే ప్రధాన కారణం

2014 నుంచి పెరిగిపోతున్న కొత్త ధోరణి

రెండు ప్రధాన పార్టీలు | ఇతరులు (శాతాల్లో)

మధ్యప్రదేశ్ ముఖాముఖి పోరు

లోక్‌సభ	రెండు ప్రధాన పార్టీలు	ఇతరులు
2009	83.6	16.4
2014	88.9	11.1
2019	92.5	7.5
అసెంబ్లీ		
2008	70.1	29.9
2013	81.3	18.7
2018	81.9	18.1

తమిళనాడు బహుముఖ పోరు

లోక్‌సభ	రెండు ప్రధాన పార్టీలు	ఇతరులు
2009	48	52
2014	67.9	32.1
2019	52.3	47.7
అసెంబ్లీ		
2011	60.8	39.2
2016	72.4	27.6
2021	70.9	29.1

పంజాబ్ ముఖాముఖి నుంచి బహుముఖ పోరు

లోక్‌సభ	రెండు ప్రధాన పార్టీలు	ఇతరులు
2009	79.1	20.9
2014	59.3	40.7
2019	67.6	32.4
అసెంబ్లీ		
2012	74.8	25.2
2017	63.7	36.3
2022	64.9	35.1

పశ్చిమ బెంగాల్ బహుముఖ నుంచి ముఖాముఖి పోరు

లోక్‌సభ	రెండు ప్రధాన పార్టీలు	ఇతరులు
2009	64.3	35.7
2014	62.1	37.9
2019	83.5	16.5
అసెంబ్లీ		
2011	69.1	30.9
2016	64.7	35.3
2021	85.9	14.1

2014లో కేంద్రంలో బీజేపీ అధికారంలోకి వచ్చాక రాష్ట్రాల అసెంబ్లీలలో కమలనాథులు పట్టు బిగిస్తే, కాంగ్రెస్ పార్టీ ప్రాభవం తగ్గుతూ వచ్చింది. ఒడిశా, త్రిపుర రాష్ట్రాలే దీనికి ఉదాహరణ. ఈశాన్య రాష్ట్రాల్లో బీజేపీ పాగా వేస్తూ ఇతర పార్టీల ఓటు బ్యాంకును కొల్లగొట్టడం వల్ల ఎన్నికల తీరు మారిపోయి రెండు పార్టీల మధ్య పోరు నెలకొంది.

పలు రాష్ట్రాల్లో ఎన్నికల పోరాటాల తీరుతెన్నులు మారుతూ వస్తున్న వైనం

2014కు ముందు	2019 తర్వాత
ముఖాముఖి పోరు ఛత్తీస్‌గఢ్, రాజస్థాన్, ఢిల్లీ, పంజాబ్, మధ్యప్రదేశ్, హిమాచల్‌ప్రదేశ్, ఉత్తరాఖండ్, ఏపీ, గుజరాత్	**బహుముఖ పోరు** గుజరాత్, పంజాబ్, తెలంగాణ
బహుముఖ పోరు కర్ణాటక, ఒడిశా, ఉత్తరప్రదేశ్ పశ్చిమ బెంగాల్, ఒడిశా, బిహార్ జార్ఖండ్, హరియాణా, కేరళ, మహారాష్ట్ర, తమిళనాడు	**ముఖాముఖి పోరు** కర్ణాటక, ఒడిశా, పశ్చిమబెంగాల్, ఉత్తరప్రదేశ్

రైతుకు మరింత దన్ను

- 2023–24 ఖరీఫ్ సీజన్‌కు గానూ 14 రకాల పంటలకు కనీస మద్దతు ధర పెంచిన కేంద్రం
- వరి మద్దతు ధరపై రూ.143 పెంపు.. సాధారణ రకం క్వింటాల్ రూ.2,183, గ్రేడ్‌–ఎ రకం రూ.2,203
- పెసరపై ఏకంగా రూ.803 పెంపు, మద్దతు ధర రూ.8,558



సాక్షి, న్యూఢిల్లీ: దేశ వ్యాప్తంగా నైరుతి రుతుపవనాలు విస్తరిస్తున్న వేళ రైతులకు కేంద్రం తీపికబురు చెప్పింది. ఖరీఫ్ సీజన్ ఆరంభమవుతున్న వేళ 2023–24 మార్కెటింగ్ సీజన్‌కు సంబంధించి 14 రకాల పంటల కనీస మద్దతు ధరలు పెంచుతూ నిర్ణయం చేసింది. వ్యవసాయదారుల ఉత్పత్తులకు లాభదాయక ధరలు నిర్ధారించేలా, పంటల వైవిధ్యతను ప్రోత్సహించేలా మద్దతు ధరల పెంపునకు బుధవారం ప్రధాని నరేంద్ర మోదీ అధ్యక్షతన జరిగిన ఆర్థిక వ్యవహారాల కేబినెట్ కమిటీ ఆమోదం తెలిపింది. వరి సాధారణ, గ్రేడ్‌–ఏ రకాలపై ప్రస్తుతం ఉన్న మద్దతు ధరను రూ.143 పెంచింది. దీంతో ప్రస్తుతం సాధారణ రకం వరి క్వింటాల్ ధర రూ.2,040 ఉండగా, అది ప్రస్తుత కేంద్రం నిర్ణయంతో రూ.2,183కి పెరగగా, గ్రేడ్‌–ఏ రకం వరి ధర రూ.2,060 నుంచి రూ.2,203కి చేరింది.

పప్పుధాన్యాలకు పెరిగిన మద్దతు..

ఇటీవలి కాలంలో కేంద్రం పప్పుధాన్యాలు, నూనెగింజలు, తృణధాన్యాల పంటల సాగును ప్రోత్సహిస్తోంది. రాష్ట్రీయ కృషి వికాస్ యోజన, జాతీయ ఆహార భద్రతా మిషన్ వంటి పథకాల ద్వారా పంటల వైవిధ్యం ఉండేలా రైతులను ప్రోత్సహిస్తోంది. 2022–23 మూడవ ముందస్తు అంచనాల ప్రకారం, దేశంలో మొత్తం ఆహారధాన్యాల ఉత్పత్తి రికార్డు స్థాయిలో 330.5 మిలియన్ టన్నులుగా అంచనా వేయగా, ఇది మునుపటి ఏడాది 2021–22తో పోలిస్తే 14.9 మిలియన్ టన్నులు ఎక్కువగా ఉంది. వీటన్నింటినీ దృష్టిలో పెట్టుకొని పప్పుధాన్యాలు, నూనెగింజల ధరలను కేంద్రం గరిష్ఠంగా పెంచింది. పెసర ధరను ఏకంగా రూ.803కి పెంచింది. దీంతో పెసర ధర రూ.7,755 నుంచి రూ.8,558కి పెరిగింది. కంది మద్దతు ధరను రూ.400, మినప ధరను రూ.350 మేర పెంచింది. నూనెగింజల విషయంలో వేరుశనగకు రూ.527, సన్‌ఫ్లవర్ రూ.360, సోయాబీన్ రూ.300, నువ్వులు రూ.805 చొప్పున ధరలు పెంచింది. వ్యవసాయ ఖర్చులు ధరల కమిషన్ సిఫార్సుల ఆధారంగా ఎప్పటికప్పుడు మద్దతు ధరని నిర్ణయిస్తున్నామని, గత ఏడాదులతో పోలిస్తే ఈ ఏడాది అత్యధికంగా ధరలను పెంచామని కేంద్ర ఆహార, ప్రజా పంపిణీ వ్యవహారాల శాఖ మంత్రి పియూశ్‌గోయల్ పేర్కొన్నారు.

పంటల వారిగా ప్రకటించిన ధరలు, పెంపుదల ఇలా... (క్వింటాల్‌కు రూపాయల్లో)

పంట	గత ధర	ప్రస్తుత ధర	పెంపు
వరి(సాధారణం)	2,040	2,183	143
వరి (ఏ)	2,060	2,203	143
జొన్న(హైబ్రిడ్)	2,970	3,180	210
జొన్న(మల్దండి)	2,990	3,225	235
సజ్జలు	2,350	2,500	150
రాగి	3,578	3,846	268
మొక్కజొన్న	1,962	2,090	128
కందులు	6,600	7,000	400
పెసర	7,755	8,558	803
మినుములు	6,600	6,950	350
వేరుశనగ	5,850	6,377	527
పొద్దుతిరుగుడు	6,400	6,760	360
సోయాబీన్	4,300	4,600	300
నువ్వులు	7,830	8,635	805
ఒడిసలు(నైగర్‌సీడ్)	7,257	7,734	447
పత్తి (మీడియం స్టేపుల్	6,080	6,620	540
పత్తి(లాంగ్ స్టేపుల్)	6,380	7,020	640

రైతు సంక్షేమ సంస్కరణల్లో భాగమిది: మోదీ

దాదాపు 14 ఖరీఫ్ పంట రకాలకు కనీస మద్దతు ధర పెంచడంపై ప్రధాని మోదీ స్పందించారు. 'గత తొమ్మిదేళ్లలో రైతు సంక్షేమం కోసం మా ప్రభుత్వం చేపట్టిన పలు సంస్కరణల క్రమంలో భాగమే ఈ ఎంఎస్పీ పెంపు నిర్ణయం. ఈ పెంపుతో రైతులు తమ పంటకు లాభసాటి ఆదాయం పొందటంతోపాటు వైవిధ్య పంటల సాగు విధానం మరింత పటిష్టమవనుంది' అని మోదీ ట్వీట్‌చేశారు. వరికి క్వింటాల్‌కు రూ.143 పెంచుతూ కేంద్ర కేబినెట్ నిర్ణయించడంపై మోదీ సంతోషం వ్యక్తం చేశారు. గత దశాబ్దకాలంలో ఇంతగా ధర పెంచడం ఇది రెండోసారి. గత పదేళ్లలో చూస్తే గరిష్ఠంగా 2018–19లో క్వింటాల్‌కు రూ.200 పెంచారు. 2023–24 ఖరీఫ్ పంటలకు 5.3 శాతం నుంచి 10.35 శాతం శ్రేణిలో కనీస మద్దతు ధర పెంచారు.



వరద నీటితో నిండా మునిగిపోయిన ఖేర్సన్‌లోని వీధులు



స్థానికులను సురక్షిత ప్రాంతాలకు తరలిస్తున్న ఉక్రెయిన్ సైనికులు

ఉక్రెయిన్‌ను ముంచెత్తిన వరద

సురక్షిత ప్రాంతాలకు వలసపోతున్న జనం

ఖేర్సన్(ఉక్రెయిన్): ఉక్రెయిన్ భూభాగాలపై రష్యా దురాక్రమణకు దిగాక ఇన్నాళ్లూ బాంబుదాడులకు భయపడి ప్రాణాలు అరచేత పట్టుకుని వలసపోయిన జనం ఇప్పుడు వరదరూపంలో వచ్చిన జలఖడ్గం దాటికి సురక్షిత ప్రాంతాలకు తరలిపోతున్నారు. నీపర్ నదీ ప్రవాహంపై నిర్మించిన కఖోవ్కా ఆనకట్ట, జలవిద్యుత్ ప్లాంట్‌పై బాంబుల వర్షం నేపథ్యంలో డ్యామ్ బద్దలై వరదనీరు దిగువ ప్రాంతాలను ముంచెత్తింది. దీంతో దక్షిణ ఉక్రెయిన్ ప్రాంతాలు జలమయమయ్యాయి. కొందరు ఇళ్లపైకి ఎక్కి అక్కడే గడిపారు. ఎమర్జెన్సీ ఆపరేషన్ మొదలుపెట్టి స్థానిక పాలనా యంత్రాంగాలు పౌరులను వేరే చోట్లకు హుటాహుటిన తరలిస్తున్న దృశ్యాలు అంతర్జాతీయ మీడియాలో ఆవిష్కృతమయ్యాయి.

దొరికింది తీసుకెళ్తూ ఏదో ఒకదాంట్లో వలసపోతూ..

చేతికందినంత నిత్యావసర వస్తువులు తీసుకుని మిలటరీ ట్రక్కులు, రాఫ్టలపై ఎక్కి జనం ఓవైపు వలసపోతుంటే శతఘ్ని పేలుళ్ల చప్పుళ్లతో ఆ ప్రాంతం భయానకంగా మారింది. ఇంకొందరు బస్సుల్లో, రైళ్లలో వెళ్లిపోయారు. డ్యామ్ కుప్పకూలి 24 గంటలు గడుస్తున్నా ఇంతవరకు ఆ దాడికి కారకులు ఎవరో తెలియరాలేదు. మీరంటే మీరని ఉక్రెయిన్, రష్యాలు పరస్పర దూషణలు మాత్రం ఆపట్లేవు. కొంతకాలంగా రష్యా ఆక్రమిత భూభాగంలో ఉన్న ఈ డ్యామ్ పరిసరాల్లో తరచూ బాంబు దాడులు జరుగుతున్నాయి. రణక్షేత్రంగా మారిన ఈ ప్రాంతంపై ఇరుపక్షాల్లో ఒకరు పొరపాటున భారీ దాడి చేసిఉంటారని, నిర్లక్ష్యం కూడా అయి ఉండొచ్చని నిపుణులు అభిప్రాయపడుతున్నారు. ఆగకుండా వస్తున్న వరదనీటితో దిగువ ప్రాంతాల్లో వచ్చే 20 గంటల్లో మరో మూడు అడుగులమేర నీరు నిలుస్తుందని అధికారుల ఆందోళన వ్యక్తంచేశారు. విస్తారమైన ప్రాంతాలకు తాగునీరు, సాగునీరు అందిస్తున్న ప్రపంచంలోని అతిపెద్ద రిజర్వాయర్‌లలో కఖోవ్కా డ్యామ్ కూడా ఒకటి. గత ఏడాది రష్యా ఆక్రమించిన ఖేర్సన్ ప్రాంతంలోనే ఈ డ్యామ్ ఉంది. ఖేర్సన్ సిటీకి కేవలం 44 మైళ్లదూరంలో ఈ డ్యామ్ ఉండటంతో ఇప్పటికే వరదనీరు సిటీలోకి ప్రవేశించింది. వరదనీటి మట్టం పెరిగితే ఖేర్సన్‌కు కష్టాలు పెరుగుతాయి. డ్యామ్ పూర్తిగా పాడవలేదని, ఇంకా చాలా నీరు నిల్వ ఉందని, కొద్దిరోజుల్లో మొత్తం డ్యామ్ నేలమట్టమైతే మరో దఫా వరద ఖాయమని బ్రిటన్ రక్షణ శాఖ తన తాజా అప్‌డేట్‌లో పేర్కొంది. ఈ శాఖ తరచూ యుద్ధసమాచారాన్ని అందరితో పంచుకుంటోంది.

తాగేందుకు నీరే లేదు: జెలెన్‌స్కీ

'కుట్ర పన్ని రష్యా ఈ డ్యామ్‌ను నేలమట్టం చేసింది. వేలాది మంది ప్రజలకు కనీసం తాగు నీరు లేకుండా పోయింది' అని ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ టెలిగ్రామ్‌లో పోస్ట్‌చేశారు.

ఇది రష్యా పనే: అమెరికా మేథో సంస్థ

'నీపర్ దిగువ ప్రాంతాలను వరదమయం చేస్తే రష్యాకే మేలు. ఉక్రెయిన్ సేనలు మళ్లీ ఆప్రాంతాలను చేజిక్కించుకోకుండా ఆలస్యం చేయడం రష్యా ఎత్తుగడ. అందుకే తమకు కొంచెం నష్టం జరుగుతుందని తెల్సికూడా ఇలా డ్యామ్‌ను పేల్చేసింది' అని రక్షణ, విదేశీవ్యవహారాల విశ్లేషణ మేథోసంస్థ, అమెరికాకు చెందిన లాభాపేక్షలేని 'స్టడీ ఆఫ్ వార్' వ్యాఖ్యానించింది.

పొంచి ఉన్న ధరాఘాతం

గోధుమలు, బార్లీ, పొద్దుతిరుగుడు నూనె, ఇతర ఆహార ఉత్పత్తుల్ని భారీ స్థాయిలో పండిస్తూ ప్రపంచ ఆహార అవసరాలు తీర్చడంలో ఉక్రెయిన్ కీలక భూమిక పోషిస్తోంది. డ్యామ్ వరదనీటితో పంట నష్టం వాటిల్లి ఇక్కడి నుంచి విదేశాలకు ఎగుమతులు తగ్గి డిమాండ్ పెరిగి ధరలు ఎక్కువయ్యే ప్రమాదం పొంచి ఉంది. డ్యామ్ కూలిన ఈ కొద్ది గంటల్లోనే గోధుమ ధరలు 3 శాతం ఎగబాకాయి. ఆఫ్రికా, మధ్య ప్రాచ్యం, ఆసియాలోని కొన్ని దేశాలు ఉక్రెయిన్ ఆహార ఉత్పత్తులపై ఆధారపడుతున్నాయి. డ్యామ్ కూల్చివేత కారణంగా కలిగే నష్టాన్ని ఇప్పుడే అంచనా వేయలేమని రష్యా, ఉక్రెయిన్, ఐక్యరాజ్యసమితి అధికారులు చెబుతున్నారు. డ్యామ్‌ను బాగుచేసి మళ్లీ పూర్వ స్థితికి తీసుకురావాలంటే ఈ యుద్ధతరుణంలో ఎన్నేళ్లు పడుతుందో చెప్పలేని పరిస్థితి.

ఆర్డినెన్స్ విషయంలో అండగా ఉంటాం

కేజ్రీవాల్‌కు ఎస్పీ చీఫ్ అఖిలేశ్ భరోసా



లక్నో: ఢిల్లీ రాష్ట్రంలో ప్రభుత్వ ఉన్నతాధికారుల పదోన్నతి, బదిలీల వంటి పాలనా సేవలపై సర్వాధికారం విషయంలో కేంద్ర ప్రభుత్వం తెచ్చిన ఆర్డినెన్స్‌ను తాము వ్యతిరేకిస్తామని సమాజ్‌వాదీ పార్టీ(ఎస్పీ) ప్రకటించింది. ఈ విషయంలో మద్దతు కోరుతూ తనను కలవడానికి వచ్చిన ఢిల్లీ ముఖ్యమంత్రి కేజ్రీవాల్‌కు ఎస్పీ చీఫ్ అఖిలేశ్ యాదవ్ అభయహస్తం అందించారు. రాజ్యసభలో ఆర్డినెన్స్‌ను నిలువరించేందుకు తగిన బలం పెంచుకునేందుకు పలు విపక్ష పార్టీల అగ్రనేతలను కలుస్తున్న ఆప్ చీఫ్ కేజ్రీవాల్ లక్నోలో బుధవారం ఎస్పీ చీఫ్‌తో భేటీ అయ్యారు. తర్వాత కేజ్రీవాల్ మీడియాతో మాట్లాడారు. ' రాజ్యసభలో ఆర్డినెన్స్ వచ్చినపుడు ఎస్పీ పార్టీ మాకు మద్దతు ఇస్తుందని అఖిలేశ్ హామీ ఇచ్చారు. అందుకు మా కృతజ్ఞతలు' అని కేజ్రీవాల్ అన్నారు. 'ఆర్డినెన్స్ పూర్తి అప్రజాస్వామికం. ఈ విషయంలో మా పూర్తి మద్దతు మీకే. ఢిల్లీలో విద్య, ఆరోగ్యరంగాల్లో మీరు చేసిన మంచి పనులు బీజేపీకి నచ్చడం లేదు. ఎందుకంటే ఆ మంచి పని బీజేపీని ఎన్నికల్లో తుడిచిపెట్టేస్తుందని వారి భయం' అని అఖిలేశ్ వ్యాఖ్యానించారు. ' బీజేపీయేతర పార్టీలన్నీ ఏకమై సభలో బిల్లును ఓడిస్తే అది రాజ్యసభలో మెజారిటీ లేని బీజేపీకి సెమీఫైనల్‌లా నిలుస్తుంది. ఆర్డినెన్స్ ఓటమి వచ్చే సార్వత్రిక ఎన్నికలకు బలమైన సందేశాన్ని పంపుతుంది' అని కేజ్రీవాల్ అన్నారు. సీపీఐ(ఎం) ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి, తెలంగాణ ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్ రావు, శివసేన(యూబీటీ) చీఫ్ ఉద్ధవ్ ఠాక్రే, ఎన్సీపీ అధినేత శరద్ పవార్, పశ్చిమబెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీలను నేరుగా కలిసి కేజ్రీవాల్ వారి మద్దతు కోరారు. బిహార్ ముఖ్యమంత్రి, జేడీ(యూ) చీఫ్ నితీశ్ కుమార్, తమిళనాడు ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ సైతం కేజ్రీవాల్‌కు తమ మద్దతు ప్రకటించారు. ఢిల్లీలో గ్రూప్‌–ఏ అధికారుల నియామకాలు, బదిలీలుసహా రాష్ట్రంలో పాలనాసేవలపై సర్వాధికారం ఆ రాష్ట్ర సర్కార్‌కే ఉంటుందని సుప్రీంకోర్టు రాజ్యాంగ ధర్మాసనం మే 11న తీర్పు చెప్పడం తెల్సిందే. పోలీసు, శాంతిభద్రతలు, భూములు మినహా మిగతా అధికారాలు రాష్ట్రానికే ఉంటాయని తీర్పు చెప్పింది. అయితే తీర్పు వెలువడిన వారం రోజులకే దానికి పూర్తి భిన్నంగా ఆ అధికారం లెఫ్టినెంట్ గవర్నర్‌కు కట్టబెడుతూ మోదీ సర్కార్ మే 19వ తేదీన ఒక ఆర్డినెన్స్ తేవడం విదితమే.

లక్నో కోర్టు ఆవరణలో గ్యాంగ్‌స్టర్ హత్య

సంజీవ్ మహేశ్వరి జీవాను కాల్చిన దుండగులు



లక్నో: ఉత్తరప్రదేశ్‌లోని లక్నో సివిల్ కోర్టు ఆవరణలో పట్టపగలే దారుణం జరిగింది. గ్యాంగ్‌స్టర్ సంజీవ్ మహేశ్వరి జీవా దారుణ హత్యకు గురయ్యాడు. లాయర్ దుస్తుల్లో వచ్చిన షూటర్లు కాల్పులు జరిపినట్టు ప్రత్యక్ష సాక్షులు తెలిపారు. ఘటనలో ఒక పోలీసు, ఓ మైనర్ బాలిక గాయపడ్డారని, నిందితుడిని అక్కడికక్కడే పట్టుకున్నట్లు పోలీసులు తెలిపారు. ఓ క్రిమినల్ కేసులో జీవాను కోర్టులో హాజరు పరిచేందుకు తీసుకొచ్చిన సమయంలో ఈ ఘటన జరిగిందని లక్నో పోలీస్ కమిషనర్ ఎస్‌బీ శిరాద్కర్ తెలిపారు. కాల్పులు అనంతరం కోర్టు ఆవరణలో పోలీసులను భారీగా మోహరించారు. గాయపడిన కానిస్టేబుల్, బాలికను ఆస్పత్రికి తరలించారు. బాలిక పరిస్థితి ఆందోళనకరంగా, కానిస్టేబుల్ ఆరోగ్యం నిలకడగా ఉందని పోలీసులు తెలిపారు. వివాదాస్పద నేత ముఖ్తార్ అన్సారీకి అనుచరుడైన జీవా (48) ముజఫర్‌నగర్ జిల్లా వాసి. బీజేపీ ఎమ్మెల్యే కృష్ణానంద్‌రాయ్, మాజీ మంత్రి, బీజేపీ సీనియర్ నేత బ్రహ్మ దత్తా ద్వివేది హత్య కేసులో నిందితుడు. మరో 24 కేసుల్లోనూ నిందితుడిగా ఉన్నాడు. 1997 ఫిబ్రవరిలో ఫరూఖాబాద్ జిల్లాలో ద్వివేది హత్యకు గురయ్యాడు. ద్వివేదితోపాటు అతని గన్‌మెన్ హత్య కేసులో ట్రయల్‌కోర్టు జీవాను దోషిగా నిర్ధారించింది. జీవిత ఖైదు విధించింది. కోర్టు ఆవరణలోనే కాల్పుల ఘటన చోటుచేసుకోవడంతో పోలీసులకు వ్యతిరేకంగా న్యాయవాదులు ఆందోళనకు దిగారు. శాంతిభద్రతల పరిరక్షణలో, భద్రతా ఏర్పాట్లో విఫలమయ్యాయని ఆరోపించారు.

వాన నుంచి తప్పించుకోబోతే ప్రాణాలు పోయాయి

ఒడిశాలో మరో విషాద రైలు ప్రమాద ఘటన

భువనేశ్వర్: జోరువానలో తడవకుండా ఉందామని ఆగి ఉన్న గూడ్సు రైలు కింద తలదాచుకున్న ఆరుగురు రైల్వే కార్మికులు ప్రాణాలు పోగొట్టుకున్నారు. ఆగి ఉన్న రైలు బోగీ హఠాత్తుగా కదలడంతో దాని చక్రాల కింద నలిగి రైల్వే కార్మికులు మరణించిన విషాద ఘటన ఒడిశాలోని జాజ్‌పూర్‌రోడ్ రైల్వేస్టేషన్ సమీపంలో బుధవారం జరిగింది. సంబంధిత వివరాలను తూర్పుతీర రైల్వే అధికార ప్రతినిధి వెల్లడించారు. 'జాజ్‌పూర్ కియోన్‌ఝర్ రైల్వేస్టేషన్ వద్ద రైల్వే సైడింగ్ వద్ద కొందరు రైల్వే కార్మికులు పనిలో నిమగ్నమై ఉండగా ఒక్కసారిగా భారీ వర్షం ముంచెత్తింది. భారీ ఈదురుగాలులు దానికి తోడయ్యాయి. దాంతో తలదాచుకుందామని అప్పటికే అక్కడే నిలిపి ఉంచిన ఒక గూడ్సు రైలు బోగీ కిందకు చేరారు. ఆ బోగీకి ఇంజన్ అనుసంధానం లేదు. అయితే హఠాత్తుగా ఆ రైలు కదలడం మొదలైంది. దీంతో బయటకు వచ్చే వీలులేక ఆ చక్రాల కింద నలిగి ఆరుగురు రైల్వే కార్మికులు ప్రాణాలు కోల్పోయారు. మరో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. వీరిని కటక్‌లోని ఆస్పత్రిలో చేర్పించి చికిత్స అందిస్తున్నారు.

మణిపూర్‌లో హింసకు మరో ముగ్గురు బలి

- అంబులెన్స్‌కు నిప్పుపెట్టిన అరాచక మూక
- తల్లి, కుమారుడు సహా ముగ్గురు దుర్మరణం

కోల్‌కతా: నివురుగప్పిన నిప్పులా మారిన మణిపూర్ మరో ముగ్గురు అమాయకుల ప్రాణాలు బలితీసుకుంది. రాష్ట్రంలోని పశ్చిమ ఇంఫాల్ జిల్లాలో చిన్నారిని తరలిస్తున్న ఒక అంబులెన్సుకు అల్లరిమూక నిప్పుపెట్టింది. దీంతో అంబులెన్సులో ఉన్న ఎనిమిదేళ్ల బాలుడు, అతని తల్లి, మరో బంధువు ప్రాణాలు కోల్పోయారు. ఆదివారం సాయంత్రం జరిగిన ఈ ఘటన తాలూకు వివరాలు తాజాగా వెలుగుచూశాయి. సంబంధిత వివరాలను అధికారులు వెల్లడించారు. కాంగ్‌చుప్ ప్రాంతంలోని అస్సాం రైఫిల్స్ బలగాల శిబిరం వద్ద మెయితీ వర్గానికి చెందిన ఒకావిడ తన కుమారుడితో కలిసి నివసిస్తోంది. ఆదివారం సాయంత్రం క్యాంప్‌పైకి కాల్పులు మొదలయ్యాయి. ఈ ఘటనలో బాలుడి తలకు బుల్లెట్ గాయమైంది. దీంతో బాలుడిని హుటాహుటిన అంబులెన్సులో తల్లి, ఆమె బంధువు తరలిస్తున్నారు. కొంతదూరం వీరికి రక్షణగా వచ్చిన అస్సాం రైఫిల్స్ బలగాలు తర్వాత ఆ బాధ్యతను స్థానిక పోలీసులకు అప్పజెప్పి వెనుతిరిగారు. కాంగ్‌పోకీ జిల్లా సరిహద్దుకు రాగానే ఐసోసెంబా ప్రాంతంలో అంబులెన్సును ఓ అల్లరిమూక అడ్డుకుని తగలబెట్టింది. దీంతో మంటల్లో చిక్కుకుని బాలుడు, అతని తల్లి, బంధువు ప్రాణాలు కోల్పోయారు. ఘటన జరిగిన ప్రాంతంలో కుకీ గిరిజనుల గ్రామాలు ఎక్కువ. మృతులు మెయిటీ సామాజిక వర్గానికి చెందినవారు. ఈ ప్రాంతంలో కొద్దిరోజులుగా ఇరువర్గాల మధ్య హింస, ఎదురుకాల్పుల ఘటనలు జరుగుతున్నాయి.

షా ఇంటివద్ద కుకీ వర్గీయుల నిరసన

ఢిల్లీలోని కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్ షా నివాసం వద్ద మణిపూర్ కుకీ వర్గీయులు నిరసనకు దిగారు. 'కుకీల ప్రాణాలు కాపాడండి' అంటూ నినాదాలు ఇచ్చారు. నలుగురు కుకీ ప్రతినిధులను షా ఇంట్లోకి సమావేశం కోసం అనుమతించామని మిగతా వారిని జంతర్‌మంతర్‌కు తరలించామని ఢిల్లీ పోలీసులు చెప్పారు. కుకీ, మెయిటీ వర్గాల మధ్య మొదలైన జాతి వైరం హింసాత్మకంగా మారి నెలరోజుల వ్యవధిలో 98 మంది ప్రాణాలు బలిగొంది.

మున్సిపల్ నియామకాల్లో అవకతవకలు

బెంగాల్‌లో 20 చోట్ల సీబీఐ సోదాలు

న్యూఢిల్లీ/కోల్‌కతా: పశ్చిమబెంగాల్‌లో మున్సిపల్ కార్పొరేషన్లలో నియామకాల్లో భారీ స్థాయిలో అవకతవకలు జరిగాయన్న ఆరోపణలపై కేంద్ర దర్యాప్తు సంస్థ(సీబీఐ) రంగంలోకి దిగింది. బుధవారం రాష్ట్రవ్యాప్తంగా 20 చోట్ల సోదాలు నిర్వహించినట్లు సీబీఐ అధికారులు తెలిపారు. డమ్ డమ్, హలీసహర్, బడా నగర్ మున్సిపల్ కార్పొరేషన్లుసహా మొత్తం 14 కార్పొరేషన్ల కార్యాలయాల్లో సోదాలు జరిగాయి. ఈ అవకతవకలకు పాల్పడ్డట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న నిందితులు అయాన్ సిల్, అతని ఆఫీస్, మరో ముగ్గురికి చెందిన ప్రాంతాల్లోనూ తనిఖీలు చేశారు. సాల్ట్ లేక్ ప్రాంతంలోని రాష్ట్ర పట్టణాభివృద్ధి శాఖ కార్యాలయంలోనూ సోదాలు కొనసాగాయి. ముడుపులు తీసుకుని కొలువులు కట్టబెట్టారనే ఆరోపణలు వెల్లువెత్తడంతో సీబీఐ రంగప్రవేశం చేసింది. అయితే ఇదంతా కేంద్రంలోని బీజేపీ సర్కార్ కుట్రలో భాగమని పశ్చిమబెంగాల్ రాష్ట్ర మున్సిపల్ వ్యవహారాలు, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి ఫిర్హాద్ హకీమ్ వ్యాఖ్యానించారు.

సాక్షి
కరీంనగర్
గురువారం | 8 | జూన్ | 2023

9న ఇంటర్వ్యూ
కరీంనగర్‌టౌన్: జిల్లాలోని ఆర్‌జీఎస్‌కే బస్తీ దవాఖానా, ఎస్‌ఆర్‌సీ అండ్ ఎస్‌ఎన్‌సీయూల లో కాంట్రాక్ట్ పద్ధతిన పనిచేసేందుకు, ఏడు గురు వైద్యాధికారులు, ముగ్గురు పిల్లల వైద్యుల ను భర్తీచేసేందుకు ఈనెల 9న డీఎంహెచ్‌వో ఆఫీసులో వాక్- ఇన్ ఇంటర్వ్యూ నిర్వహించను న్నట్లు డీఎంహెచ్‌వో లలితాదేవి తెలిపారు. సం బంధిత విద్యార్హత ఒరిజినల్ పత్రాలు, పాస్‌పోర్ట్ సైజ్‌ఫొటోతో హాజరుకావాలన్నారు.



పత్తిధర రూ.7,300
జమ్మికుంట: జమ్మికుంట మార్కెట్‌లో పత్తి క్వింటాల్‌కు రూ.7,300 పలికింది. మార్కెట్‌కు 17వాహనాల్లో 234 క్వింటాళ్ల పత్తిని రైతులు అమ్మకానికి తీసుకొచ్చారు. మోడల్ ధర రూ.7,100, కనిష్ట ధర రూ.6,800 పలికింది.

గరిష్టం/కనిష్టం
41.0/29.0

వాతావరణం
ఆకాశం పాక్షికంగా మేఘావృతమవుతుంది. జిల్లాలో స్వల్పంగా వర్షం కురిసే అవకాశం ఉంది. గాలిలో తేమ అధికంగా ఉంటుంది. వడగాలులు వీస్తాయి.

న్యూస్‌రీల్

నేటి నుంచి రేషన్ పంపిణీ



మంత్రితో చర్చల్లో డీలర్ల నాయకుడు శ్రీనివాస్

కరీంనగర్ అర్బన్: రేషన్ డీలర్ల ఆందోళనకు తెరపడింది. మంత్రి గంగుల కమలాకర్‌తో జరిగిన చర్చలు సఫలమవడంతో గురువారం నుంచి బియ్యం పంపిణీ చేయాలని నిర్ణయిం చారు. జిల్లావ్యాప్తంగా ఉన్న 566 మంది డీలర్లు కార్డుదారులకు రేషన్ పంపిణీ చేయా లని రేషన్ డీలర్ల సంఘం జిల్లా అధ్యక్షుడు రొడ్డ శ్రీనివాస్ కోరారు. 20 డిమాండ్లకు జీవో కాపీ విడుదల చేయడంతో పాటు గౌరవ వేత నం కోసం జూలైలోపు 9మంది ప్రతినిధులతో సీఎంను కలిపేందుకు మంత్రి అంగీకరించార ని వివరించారు. కాగా 4050 మెట్రిక్ టన్నుల బియ్యం సరఫరా చేయాల్సి ఉండగా 30శాతం మాత్రమే రేషన్ దుకాణాలకు చేరింది. సమ్మె క్రమంలో మూవ్‌మెంట్ ఆగిపోయింది.

10న చినజీయర్ స్వామి రాక



మాట్లాడుతున్న గౌతమరావు

కరీంనగర్‌కల్చరల్: విద్యాలయవనంలో విలువ ల పరిమళాలు అనేఅంశంపై ప్రజ్ఞవికాస్, వికా సతరంగిణి, ట్రస్మా సంయుక్త ఆధ్వర్యంలో ఈ నెల 10న బైపాస్‌రోడ్‌లోని వీ కన్వెన్షన్‌లో నిర్వ హించే విద్యావేత్తల సమ్మేళనానికి త్రిదండి శ్రీమన్నారాయణ రామానుజ చినజీయర్‌స్వా మి హాజరు కానునున్నట్లు వికాస తరంగణి జిల్లా అధ్యక్షుడు కె.గౌతమ్‌రావు అన్నారు. 10న సాయంత్రం 4:30గంటల వరకు రిజిస్ట్రే షన్ ఉంటుందని, 5నుంచి 8గంటల వరకు సమావేశం కొనసాగుతుందని పేర్కొన్నారు.

టీఎన్జీవోల భూమిపూజ



భూమిపూజలో ఉద్యోగసంఘం నేతలు

కరీంనగర్ అర్బన్: టీఎన్జీవో ఫంక్షన్‌హాల్ ఆధు నీకరణ, మరమ్మతులకు బుధవారం భూమి పూజ చేశారు. సంఘం జిల్లా అధ్యక్షుడు దారం శ్రీనివాస్‌రెడ్డి ఆధ్వర్యంలో కేంద్ర సంఘం అధ్యక్షుడు మామిళ్ల రాజేందర్, ప్రధాన కార్యద ర్శి మారం జగదీశ్వర్ కొబ్బరికాయ కొట్టి పను లు ప్రారంభించారు. మంత్రి కమలాకర్ నియో జకవర్గ అభివృద్ధి నిధి నుంచి ఇటీవల రూ.10 లక్షలు మంజూరు చేశారని కొనియాడారు. జిల్లా కార్యదర్శి సంగెం లక్ష్మణ్‌రావు, రాష్ట్ర, జిల్లా నేతలు ఎం.ఏ.హమీద్, రాజయ్యగౌడ్, నాగుల నర్సింహస్వామి, హరికృష్ణ, కోశాధి కారి ముప్పిడి కిరణ్ కుమార్, రాగి శ్రీనివాస్, ఒంటెల రవీందర్‌రెడ్డి, ప్రసాద్‌రెడ్డి, జి.రమేశ్ గౌడ్, మహిళా అధ్యక్షురాలు శారద ఉన్నారు.

పార్కును కబ్జా చేశారు..!

- గ్రహాంతరవాసులపై అనుమానంతో పోలీసులకు ఫిర్యాదు!
- 1982లో రాంనగర్ గ్రామపంచాయతీ నుంచి కరీంనగర్‌కు బదిలీ
- 2021లో పార్కు పనులు ప్రారంభించిన మేయర్, కమిషనర్
- పట్టణ ప్రగతి కింద రూ.40 లక్షలు మంజూరు చేసిన బల్దియా
- తనకు ఇంకా పనులు అప్పగించలేదంటున్న కాంట్రాక్టర్

మార్కండేయనగర్ ఉద్యానవనం ఎక్కడ?

కొంతకాలంగా కనిపించడం లేదని కాలనీవాసుల ఆవేదన



సర్వే నంబరు 1040లో 917 గజాల పార్కు స్థలం అంటూ బల్దియా ఇచ్చిన పత్రం

పార్క్ స్థలం కళ్ల ముందే కబ్జా అవుతోందని మార్కండేయనగర్‌కాలనీవాసులు వాపోతు న్నారు. అక్రమార్కులు అందులో నిర్మాణాలు చేపట్టారని అధికారులకు ఫిర్యాదు చేసినా ప్ర యోజనంలేదంటున్నారు. అదీగాక.. నిర్మాణా లు చేపట్టిన స్థలం, పార్క్ స్థలం ఒకటేనా? అని చులకన చేసి మాట్లాడుతున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. స్థలాన్ని గ్రహాంతర వాసులేమైనా ఎత్తుకెళ్లారా? అని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. మాయమైన స్థలాన్ని వెతికి పెట్టాల్సిన బాధ్యత అధికారులపై ఉందని, అలా చేయకుంటే ప్రత్యక్ష నిరసనలకు దిగుతామని కాలనీవాసులు హెచ్చరిస్తున్నారు.



స్థానికులు ఆరోపిస్తున్న పార్కు స్థలం

సాక్షి ప్రతినిధి, కరీంనగర్: కరీంనగర్‌లో భూమి దొంగలు సంచరిస్తున్నారని, వారే తమ కాలనీలో ఉన్న 917 చదరపు గజాల స్థలాన్ని కబ్జా చేశారని 15వ డివిజన్ ప్రజలు సరికొత్త వాదనను తెరపైకి తీసుకొచ్చారు. ముప్పై ఏళ్లుగా తమ కాలనీలోనే ఉన్న పార్కు స్థలం కొన్ని నెలలుగా కనిపించకుం డా పోయిందని, ఆ స్థలం తప్పకుండా గ్రహాంతర వాసులే ఎత్తుకెళ్లి ఉంటారని అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయంలో పోయిన తమ స్థలాన్ని వెతికిపెట్టాలంటూ టూటౌన్ పోలీసులకు ఫిర్యా దు చేసేందుకు సిద్ధమవుతున్నారు. మూడు దశాబ్దాలుగా తాము ఎంతో ఆశగా పార్కు నిర్మిం చుకుందామనుకున్న స్థలం ఇప్పుడు తమకు దక్క కుండా పోయిందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

అసలేం జరిగింది?

కరీంనగర్‌లోని రాంనగర్ పరిధి మార్కండేయనగ ర్(15వ డివిజన్) మార్కండేయ ఆలయం రోడ్డు లో దాదాపు 917 చదరపు గజాల స్థలం పార్కు కోసం కేటాయించారు. 1982 వరకు రాంనగర్ గ్రామపంచాయతీగా ఉండేది. అదే ఏడాది ఆగస్టు 17న కరీంనగర్ మున్సిపాలిటీలో విలీనమైంది. ఆ సమయంలో రాంగనర్ లే అవుట్‌లోని సర్వేనంబర్ 1040లోని 917 చదరపు గజాల విస్తీర్ణం గల 17, 18, 19 మూడు ప్లాట్లను పార్కు స్థలంగా అభివృద్ధి చేయాలని రాంనగర్ గ్రామపంచాయతీ తీర్మానిం చి, కరీంనగర్ బల్దియాకు అప్పగించింది. ఈ స్థలం లో 2015, 2016, 2017లో స్థలం తమకు చెందు తుందంటూ కొందరు ఆక్రమించే ప్రయత్నం చేశా రు. స్థానికులు బల్దియాకు ఫిర్యాదు చేశారు. వెం టనే రంగంలోకి దిగిన అధికారులు ఆక్రమించేందు కు యత్నించిన వారిని ఖాళీ చేయించారు. స్థలం ఇ లాగే ఉంటే అన్యాక్రాంతమవుతుందన్న స్థానికుల ఆందోళనతో 2020, నవంబరు 13న పట్టణ ప్రగతి కింద పార్కు నిర్మించేందుకు బల్దియా ముందు కొచ్చింది. ఇందుకోసం ఇంజినీరింగ్, పరిపాలన అనుమతి తదితరాలు పూర్తి చేసుకుని టెండర్లు పిలిచింది. టెండర్లలో పాల్గొన్న మాధవ కన్‌స్ట్రక్షన్స్ టెండరు(ఐడీ: 207543) దక్కించుకుంది. రూ.40 లక్షలకు పార్కు అభివృద్ధి పనులు మాధవ కన్‌స్ట్ర క్షన్స్‌కు అవార్డు అయ్యాయి. మేయర్ సునీల్‌రావు, అప్పటి మున్సిపల్ కమిషనర్, ఐఏఎస్ అధికారి క్రాంతి పార్కు నిర్మాణానికి కొబ్బరికాయ కూడా కొట్టారు. కానీ, ఇంతవరకూ అక్కడ మార్కింగ్ చే యడం, కాంట్రాక్టర్‌కు పనులు అప్పగించడం వం టివి ఏం జరగలేదు. టెండరు ముందు, తరువాత తనకు వివిధ చార్జీల పేరిట రూ.1.20 లక్షల వరకు ఖర్చయిందని, నేటికీ ఎలాంటి పనులు అప్పగించ లేదని సదరు కాంట్రాక్టర్ 'సాక్షి'తో వాపోయారు.

ప్రజావాణిలో ఫిర్యాదు

2017లో పార్కు నిర్మించాలని ప్రతిపాదించిన స్థలం స్వాధీనం చేసుకునేందుకు పలువురు ప్రయత్నించడంతో కాలనీవాసులు బల్దియాకు ఆర్టీఐ ద్వారా దరఖాస్తు చేసుకున్నారు. నగరం లో బల్దియా ఆధ్వర్యంలో ఉన్న మొత్తం పార్కుల జాబితా తీసుకున్నారు. అందులో మార్కండేయనగర్‌లోని సర్వే నంబరు 1040లోని పార్కు ప్రతిపాదిత స్థలం 917 చద రపు గజాలుగా బల్దియా స్పష్టం చేసింది. అయితే, ఇటీవల ఆ స్థలంలో తిరిగి నిర్మాణాలు మొదలయ్యాయి. స్థానికులు అడ్డుచెప్పాలని చూసినా నిర్మాణాలు ఆగలేదు. దీంతో కాల నీవాసులంతా ప్రజావాణిలో మొత్తం ఆధారాల తో ఫిర్యాదు చేశారు. ఆ సమయంలో అధికారు లు ఆధారాలు చూపాలని సూచించారు. దీంతో 1982లో రాంనగర్ గ్రామపంచాయతీ లేఅవుట్, తీర్మానం కాపీలను బల్దియా అధికారులకు అందజేశారు. అయితే, ఆ స్థలం ఈ స్థలం రెండూ ఒకటేనా? అని ఓ ఉన్న తాధికారి వ్యంగ్యంగా మాట్లాడారు. దీంతో కాలనీవాసులు తమ పార్కు స్థలం ఎక్కడుం ది? ముప్పై ఏళ్లుగా కళ్ల ముందున్న స్థలం అది కాకపోతే.. మా పార్కు స్థలాన్ని ఎవరు ఎత్తుకె ళ్లారో? చెప్పాలని డిమాండ్ చేస్తున్నారు. సాధా రణంగా వస్తువులను దొంగలు ఎత్తుకెళ్తారు.. భూమిని గ్రహాంతరవాసులే ఎత్తుకెళ్లే సాంకే తికత కలిగి ఉంటారని, తమ స్థలాన్ని వెదికి పెట్టాలని వినూత్న ఉద్యమానికి దిగనున్నారు.

మొన్నటిదాకా ఉండే..



నా చిన్నతనం నుం చి ఇక్కడ పార్కు కోసం స్థలం వదిలారు. 1982 నుంచి మేము అదే స్థలంలో ఆడుకుం టూ పెరిగాం. బల్దియా రికార్డుల్లోనూ అది పార్కు స్థలంగానే ఉంది. అధికారు లు మాత్రం అది, ఇదీ ఒకటేనా? అం టూ వెటకారంగా మాట్లాడుతున్నారు. అలాంటప్పుడు మా పార్కు స్థలాన్ని ఎవరు ఎత్తుకెళ్లారో? చెప్పాల్సిన బాధ్యత అధికారులదే.

– మంచికట్ల కిశోర్, కాలనీవాసుడు

అన్ని ఆధారాలు ఇచ్చాం



పార్కు స్థలాన్ని కాపాడుకునేందుకు స్థానికులం సర్వశక్తు లు ఒడ్డుతున్నాం. గతంలో కొందరు వచ్చి స్వాధీనం చేసు కునేందుకు యత్నించిన సమయంలో మూడుసార్లు అడ్డుకున్నాం. అప్పుడు వేగంగా స్పందించి చర్యలు తీసుకున్న అధికారులు ఇప్పుడు ఎన్నిసార్లు విజ్ఞప్తి చేసినా పట్టించుకోవడం లేదు.

– గాజర్ల రాజమల్లు, స్థానికుడు

ప్రతీరోజు తాగునీరు

- రెండు రిజర్వాయర్ల పరిధిలో సమస్య
- త్వరలో మరమ్మతులు పూర్తి
- మేయర్ సునీల్‌రావు



పనులు ప్రారంభిస్తున్న మేయర్ సునీల్‌రావు

కరీంనగర్‌కార్పొరేషన్: నగరంలోని రెండు రిజర్వా యర్ల పరిధిలో తలెత్తిన సమస్యను పరిష్కరించి త్వరలో ప్రతీరోజు తాగునీరు అందిస్తామని మేయర్ యాదగిరి సునీల్‌రావు తెలిపారు. మానేరు డ్యాంలో ఏడు టీఎంసీలకు నీటిమట్టం చేరడంతో రెండు రిజర్వాయర్ల పరిధిలో రెండు రోజులుగా సమస్య ఏర్పడిందన్నారు. మానేరుడ్యాం గేట్ల మర మ్మతులు జరుగుతుండడంతో నీరు వదలడం లేదని, మరమ్మతులు పూర్తి కాగానే ప్రతీరోజు తాగునీటి సరఫరాను పునరుద్ధరిస్తామన్నారు. బుధ వారం నగరంలోని 28వ డివిజన్‌లోని నాకాచౌరస్తా సమీపంలో రూ.34 లక్షల నిధులతో ఎస్‌ఆర్ డీజీ పాఠశాల నుంచి ఎస్ఎస్‌గార్డెన్ వరకు నిర్మిస్తున్న సీసీ రోడ్డు పనులకు ఆయన భూమి పూజ చేశారు. 28 డివిజన్‌లోని అన్ని సమస్యలను పరిష్కరించేం దుకు కృషి చేస్తున్నామన్నారు. నాకాచౌరస్తా నుంచి బొమ్మ వెంకన్న భవనం వరకు, నాఖా చౌరస్తా నుం చి ఎస్ఎస్ గార్డెన్స్‌వరకు అంతర్గత రోడ్లను, డ్రైనే జీలను అభివృద్ధి చేశామన్నారు. మోతాజ్‌ఖానా, ఖాన్‌పురా ప్రాంతాల్లోనూ అభివృద్ధి పనులు చేప ట్టామన్నారు. నగరపాలకసంస్థ కమిషనర్ సేవా ఇస్లావత్, కార్పొరేటర్‌లు నాంపెల్లి శ్రీనివాస్, తోట రాములు, గుగ్గిళ్ల జయశ్రీ శ్రీనివాస్, ఈఈ కిష్టప్ప తదితరులు పాల్గొన్నారు.

రెవెన్యూగార్డెన్స్‌లో ఫిష్ ఫెస్టివల్

- నేటి నుంచి మూడురోజుల పాటు నిర్వహణ
- నేడు రాష్ట్ర మంత్రి గంగుల చేతుల మీదుగా ప్రారంభం

కరీంనగర్ అర్బన్: వివిధ రకాలైన చేపల ఆహార ఉత్పత్తులు, పోషక విలువలు, వివిధ రకాల రుచు లు పరిచయం చేయుటకు మత్స్య ఉత్పత్తుల ఆహారమేళా(ఫిష్ ఫెస్టివల్) వినూత్న కార్యక్రమం ఈ నెల 8 నుంచి 10వరకు రెవెన్యూ గార్డెన్స్‌లో నిర్వహిస్తున్నట్లు జిల్లా మత్స్య శాఖ అధికారి బం డారి దేవేందర్ తెలిపారు. దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా తెలంగాణ ప్రభుత్వం మత్స్య శాఖ కమిష నర్ ఆదేశాల మేరకు ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తు న్నట్లు వివరించారు. మూడు రోజులపాటు జరిగే ఈ కార్యక్రమాన్ని గురువారం రాష్ట్ర బీసీ సంక్షేమ, పౌరసరఫరాల శాఖ మంత్రి గంగుల కమలాకర్ ప్రారంభిస్తారని తెలిపారు. 20 స్టాల్స్‌లలో వివిధ రకాలైన రుచికరమైన చేపలు, రొయ్యలు, పీతల ఆహార ఉత్పత్తుల వంటకాలు నగర ప్రజలకు అం దుబాటులో ఉంటాయని అన్నారు. చేపల వేపుడు, రొయ్యల వేపుడు, చేప బిర్యాని, రొయ్య బిర్యాని, చేపల పకోడీ, చేపల పులుసు, చేపల మంచూ రియా అందుబాటులో ఉంటాయని పేర్కొన్నారు. ఇప్పటికే దాదాపు 20 మంది మహిళలకు ఎన్ఐటీ హెచ్ఎం హైదరాబాద్‌లో చేపల వంటకాలు తయా రీలో శిక్షణ ఇచ్చామని పేర్కొన్నారు. ఔత్సాహికులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

సాగునీటి రంగంలో విప్లవాత్మక మార్పులు

- మానేరు రివర్‌ఫ్రంట్‌తో టూరిస్ట్ హబ్‌గా కరీంనగర్
- కాళేశ్వరం ప్రాజెక్టుతో చెరువులకు జలకళ
- సాగునీటి దినోత్సవంలో కలెక్టర్ ఆర్వీ కర్ణన్



మాట్లాడుతున్న కలెక్టర్ ఆర్వీ కర్ణన్

కరీంనగర్: తెలంగాణ ఆవిర్భావం అనంతరం సాగు నీటిరంగంలో విప్లవాత్మక మార్పులు జరిగాయని కలెక్టర్ ఆర్వీ.కర్ణన్ అన్నారు. దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా బుధవారం జిల్లాకేంద్రంలోని వీకన్వెన్షన్ లో సాగునీటి దినోత్సవం నిర్వహించారు. కలెక్టర్ ఆర్వీ కర్ణన్ ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడుతూ.. రాష్ట్రం ఏర్పడిన 9ఏళ్లలో విప్లవాత్మక మార్పులు వచ్చాయని తెలిపారు. కాళేశ్వరం ప్రాజెక్టుతో భూగర్భ జలాలు పెరిగాయని అన్నారు. రూ.410 కోట్లతో నిర్మిస్తున్న మానేరు రివర్ ఫ్రంట్‌తో కరీంన గర్ టూరిస్ట్ హబ్‌గా ఎదగనుందని పేర్కొన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టుతో 365రోజులు చెరువుల్లో జల కళ సంతరించుకుంటోందని అన్నారు. గతంలో ఇదే ప్రాంతంలో రూ.4లక్షలు పలికిన భూమి ప్రస్తుతం రూ.20 లక్షల నుంచిరూ.25లక్షలకు చేరిందంటే అది కేవలం కాళేశ్వరంతోనే సాధ్యమైందని తెలిపారు. పదేళ్లలో ఇంతపెద్దస్థాయిలో ఇరిగేషన్ ప్రాజెక్టులను చేపట్టిన ఏకైక రాష్ట్రం ఒక్క తెలంగాణ మాత్రమేనని కొనియాడారు. మేయర్ వై.సనీల్‌రావు మాట్లా డుతూ.. రాష్ట్ర ఆవిర్భావానికి పూర్వం జిల్లాలో తాగు నీటి కోసం యుద్ధాలు చేసే పరిస్థితులు, మంచినీటి ట్యాంకర్ల కోసం పడిగాపులుకాచే దుస్థితి నెలకొని ఉండేదని, కాళేశ్వరం నిర్మాణంతో డెడ్‌స్టోరేజీకి చేరు కున్న ఎల్ఎండీ నిండుకుండలా మారిందన్నారు. అనంతరం ఉత్తమ ఇంజినీర్‌గా రాష్ట్రస్థాయి పురస్కా రాన్ని అందుకున్న ఇరిగేషన్‌శాఖ ఎగ్జిక్యూటివ్ ఇం జినీర్ నాగభూషణ్‌ను కలెక్టర్ సత్కరించారు. ఈ కార్యక్రమంలో సుడా చైర్మన్ జీవీ.రామకృష్ణారావు, కొత్తపల్లి మున్సిపల్ చైర్మన్ రుద్రరాజు, మార్కెట్ కమిటీ చైర్మన్ రెడ్డవేణి మధు, పీఏసీ చైర్మన్ సురేంద ర్‌రెడ్డి, ఇరిగేషన్ ఎస్ఈ శివప్రసాద్, కరీంనగర్ ఆర్డీవో ఆనంద్ కుమార్, వ్యవసాయశాఖ అధికారి శ్రీధర్, తదితరులు పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

కరీంనగర్: బీసీ సంక్షేమశాఖ ఆధ్వర్యంలో జిల్లాలో వెనుకబడిన తరగతులకు చెందిన కుల, చేతివృత్తి దారులకు ప్రభుత్వం రూ.లక్ష ఆర్థిక సాయం అందిస్తోందని, ఇందుకోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా బీసీ సం క్షేమశాఖ అధికారి రాజమనో హర్ ఒక ప్రక టనలో తెలిపారు. దరఖాస్తుదారులు 18- 55 ఏళ్లలోపు ఉండి, గ్రామీణప్రాంతాల్లో రూ. 1,5000, పట్టణ ప్రాంతాల్లో రూ.2లక్షల వార్షిక ఆదాయం కలిగి ఉండాలన్నారు. గత ఐదు సంవత్సరాలలోపు ప్రభుత్వం నుంచి ఆర్థికసాయం పొందినవారు అనర్హులని పేర్కొన్నారు. దరఖాస్తులకు ఈనెల 20వరకు గడువు ఉందని, ఆన్‌లైన్‌లో కులధ్రువీకరణ పత్రం, ఆదాయ ధ్రువీకరణపత్రం, ఆధార్ కార్డు, ఆహార భద్రతకార్డు, బ్యాంకు పాస్‌బు క్, పాస్‌పోర్టు సైజ్ ఫొటోతో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

మెడికల్ కాలేజీలో అడ్మిషన్లు



మెడికల్ కాలేజీగా మారనున్న జిల్లా ప్రభుత్వ ప్రధానాసుపత్రి భవనం

- ఈ ఏడాది నుంచే ప్రారంభం
- జిల్లా ఆసుపత్రికి అనుబంధంగా ఏర్పాటు
- కొత్తపల్లి విత్తనాభివృద్ధి సంస్థ ప్రాంగణంలో తరగతులు

కరీంనగర్‌టౌన్: కరీంనగర్ జిల్లా ప్రజల చిరకాల వాంఛ నెరవేరింది. మెడిసిన్ చదవాలనుకున్న విద్యార్థుల కల ఫలించింది. జిల్లా కేంద్రంలో ప్రభుత్వ మెడికల్ కళాశాల ఏర్పాటుకు నేషనల్ మెడికల్ కౌన్సిల్ గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. రాష్ట్ర వ్యాప్త గా 9 జిల్లాల్లో ఈఏడాది ప్రారంభంకానున్న వైద్య కళాశాలల్లో కరీంనగర్ ఒకటి. అయితే ఇప్పటికే అన్ని వైద్య కళాశాలలకు ఎన్ఎంసీ పచ్చజెండా ఊపినా.. కరీంనగర్ కళాశాల అనుమతుల విష యంలో జాప్యం జరిగింది. తరగతులు, ల్యాబ్‌ల పునరుద్ధరణ పనుల్లో ఆలస్యం కావడంతో ఈఏడాది అనుమతి వస్తుందా? లేదా? అనే సందే హాలు వ్యక్తమయ్యాయి. బుధవారం ఎన్ఎంసీ మెడికల్ కాలేజీ ఏర్పాటుకు గ్రీన్ సిగ్నల్ ఇవ్వడం .. ఈ ఏడాది నుంచే తరగతులు నిర్వహించేం దుకు అనుమతులు మంజూరు చేయడంతో జిల్లా ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

100 సీట్లు..

మెడికల్ కళాశాలకు సంబంధించి 2023-24 విద్యాసంవత్సరంలోనే తరగతులు నిర్వహించేలా వంద సీట్లతో లెటర్ ఆఫ్ ఇండెంట్ విడుదలైంది. వారంరోజుల్లో పూర్తి స్థాయిలో కళాశాల ఏర్పా టుకు చర్యలు ప్రారంభించనున్నారు. ఇప్పటికే 24 మంది ప్రొఫెసర్లు, నాన్‌టీచింగ్ స్టాఫ్ నియా మకం కూడా పూర్తయ్యింది.

జిల్లా ఆసుపత్రికి అనుబంధంగా...

కరీంనగర్‌లోని 500 పడకల జిల్లా ప్రభుత్వ ప్రధా నాసుపత్రికి అనుబంధంగా మెడికల్ కాలేజీ నిర్వ హించనున్నారు. తరగతులు, ల్యాబ్‌ల నిర్వహణ కోసం కొత్తపల్లిలోని విత్తనాభివృద్ధి సంస్థ గోదాములు కేటాయించారు. తరగతుల ఆధునీ కరణ, ల్యాబ్‌ల ఏర్పాటుకు రూ.25 కోట్లు మం జూరు చేశారు. తొలుత రూ.10 కోట్లు విడుదల య్యాయి. అనాటమీ, బయోకెమిస్ట్రీ, మైక్రోబయా లజీ, ఫోరెనిక్స్, సోషల్ ప్రివెంటివ్ మెడిసిన్ వంటి నాన్ క్లినికల్ విభాగాలను ఏర్పాటు చేస్తున్నారు. వసతి గృహాల ఏర్పాటుకూ చర్యలు తీసుకుంటు న్నారు. జిల్లాకు మెడికల్ కాలేజీ మంజూరు కావ డంపై ప్రణాళిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు బోయినపల్లి వినోద్ కుమార్ హర్షం వ్యక్తం చేశారు. సీఎం కేసీఆర్, వైద్యారోగ్యశాఖ మంత్రి హరీశ్‌రావుకు ధన్యవాదాలు తెలిపారు.

నిత్యసాధనతో సత్ఫలితాలు

- క్రీడల్లో రాణించినవారు అన్ని రంగాల్లో రాణిస్తారు
- రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు వినోద్‌కుమార్
- ముగిసిన వేసవి క్రీడా శిక్షణ శిబిరాలు



ప్రశంసా పత్రాలతో చిన్నారులు, ప్రముఖులు



ఆకట్టుకున్న చిన్నారుల నృత్యం

కరీంనగర్‌స్పోర్ట్స్:క్రీడల్లో నిత్యసాధనతో సత్ఫలితా లు సాధిస్తారని రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు వినోద్‌కుమార్ అన్నారు. నగరపాలక సంస్థ ఆధ్వ ర్యంలో గత 30రోజులుగా అంబేద్కర్ స్టేడియంలో జరుగుతున్న వేసవి శిక్షణ శిబిరాలు బుధవారంతో ముగిశాయి. కార్యక్రమానికి వినోద్‌కుమార్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. కరీంనగర్ క్రీడారం గంలో ముందంజలో నిలుస్తోందని అన్నారు. మేయ ర్ యాదగిరి సునీల్‌రావు మాట్లాడుతూ.. కార్పొరే షన్ ఆధ్వర్యంలో నగరాభివృద్ధికి అన్ని చర్యలు తీసు కుంటున్నామని వివరించారు. కలెక్టర్ ఆర్వీ. కర్ణన్ మాట్లాడుతూ.. 3,200మంది విద్యార్థులు 27క్రీడాం శాల్లో శిక్షణను తీసుకోవడం అభినందనీయమన్నా రు. జిల్లాలో ఒలింపిక్ సంఘం ఆధ్వర్యంలో ఎన్నో క్రీడాంశాలు సభ్యత్వం కలిగి ఉన్నాయని, క్రీడాకార్య క్రమాలు, సమావేశాలు, సెమినార్లు నిర్వహించుకు నేందుకు స్టేడియంలో ఒలింపిక్ భవన్‌ను మంజూరు చేయాలని సంఘం బాధ్యులు ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు వినోద్ కుమార్‌ను కోరారు. ఆయన స్పందిస్తూ స్టేడియంలో ఒలింపిక్ భవన్ నిర్మాణానికి హామీ ఇస్తున్నట్లు తెలిపారు. జెడ్పీ చైర్‌పర్సన్ కనుమ ల్ల విజయ, సుడా చైర్మన్ జీవీ.రామకృష్ణారావు, డిప్యూటీ మేయర్ చల్లా స్వరూపరాణి, అడిషనల్ కలె క్టర్ గరిమా అగర్వాల్, అసిస్టెంట్ కలెక్టర్ లెనిన్ వాత్సల్, గ్రంథాలయ చైర్మన్ అనిల్ కుమార్‌గౌడ్, మున్సిపల్ కమిషనర్ సేవా ఇస్లావత్, డీవైఎస్‌వో కీర్తిరాజవీరు, వివిధ క్రీడా సంఘాల నాయకులు, క్రీడాకారులు, కోచ్‌లు పాల్గొన్నారు.

క్లుప్తంగా

గాయత్రి పంపుహౌజ్‌ను సందర్శించిన విద్యార్థులు



రామడుగు: తెలంగాణ దశాబ్ది ఉత్సవాలను పురస్కరించుకుని రామడుగు మండలం లక్ష్మీపూర్ గ్రామ పరిధిలో ఉన్న బహుబలి గాయత్రి పంపుహౌజ్‌ను బుధవారం పలు కళాశాలకు చెందిన విద్యార్థులతో కలెక్టర్ ఆర్వీ కర్ణన్ సందర్శించారు. విద్యార్థులకు పంపుహౌజ్ విశేషాలు కలెక్టర్ వివరించారు. శిక్షణ కలెక్టర్ లెనిన్, తహసీల్దార్ రాజ్‌కుమార్, తదితరులు ఉన్నారు.

గడ్డి, పైపులు దగ్ధం



గంగాధర(చొప్పదండి): గంగాధర మండలకేంద్రంలోని మోతె వీరయ్య, ఎడవెల్లి పర్శరాములు పంటపొలాల వద్ద బుధవారం ప్రమాదవశాత్తు గడ్డికి నిప్పంటుకుని దగ్ధమైంది. సమీపంలోని పైపులుసైతం కాలిపోయాయి. సర్పంచు మడ్లపల్లి గంగాధర్ పంచాయతీ వాటర్‌ట్యాంకర్‌తో మంటలు ఆర్పివేయించాడు.

ఆరులీటర్ల నాటుసారా స్వాధీనం



రామడుగు: జగిత్యాల జిల్లా పెగడపల్లి మండలపరిధిలోని ఎల్లాపూర్ తండా నుంచి రామడుగు మండలం తిర్మలాపూర్ గ్రామానికి ఆరు లీటర్ల గుడుంబాను తరలిస్తున్న వ్యక్తిని ఎక్సైజ్ పోలీసులు బుధవారం పట్టుకున్నారు. సీఐ చంద్రమోహన్ వివరాల మేరకు.. ఎల్లాపూర్ తండా నుంచి తిర్మలాపూర్‌కు కొందరువ్యక్తులు గుడుంబా తరలిస్తున్నట్లు అందిన సమాచారంతో ఎక్సైజ్ అధికారులు రూట్‌వాచ్ నిర్వహించారు. చంద్రయ్య అనే వ్యక్తి ద్విచక్రవాహనంపై ఆరు లీటర్ల గుడుంబా తరలిస్తుండగా తిర్మలాపూర్ శివారులో పట్టుకున్నారు. చంద్రయ్యపై కేసునమోదు చేసి వాహనాన్ని సీజ్ చేశారు. ఎస్సై శ్రీనివాస్, హెచ్‌సీ మోసిన్, కమలాకర్, కుమార్‌యాదవ్, కమాలుద్దీన్, సంతోష్ పాల్గొన్నారు.

విద్యుత్‌చౌర్యం కేసులో నిందితుడికి జరిమానా

కొత్తపల్లి(కరీంనగర్): కేశవపట్నం మండలం ఇప్పలపల్లి గ్రామానికి చెందిన గడ్డం శ్రీనివాస్ తనఇంటికి అక్రమంగా విద్యుత్‌ను వినియోగిస్తూ విజిలెన్స్ అధికారుల తనిఖీలో పట్టుబడగా కేసు నమోదు చేసి మొదటినేరం కింద రూ.వేయి జరిమానా విధించారు. అదే వ్యక్తి రెండోసారి పటుబడగా కేసునమోదు చేసి కోర్టులో ప్రవేశపెట్టారు. పూర్వాపరాలు పరిశీలించిన జిల్లా మొదటి అదనపు న్యాయమూర్తి శ్రీవాణి నిందితుడికి రూ.7,542 జరిమానా విధించారు. లేకుంటే రెండు నెలల సాధారణ జైలు శిక్ష అనుభవించాలని తీర్పునిచ్చినట్లు విద్యుత్ విజిలెన్స్ ఇన్‌స్పెక్టర్ స్వామి తెలిపారు. ఆయన వెంట ఎస్సైలు ఎ.నిరంజన్ రెడ్డి, టి.నరేష్, సిబ్బంది ఉన్నారు.

అక్రమాలపై విచారణ చేపట్టాలి

కరీంనగర్‌కార్పొరేషన్: నగరంలో జరుగుతున్న స్మార్ట్‌సిటీ పనుల్లో చోటుచేసుకుంటున్న అక్రమాలపై విచారణ జరిపించాలని రిపబ్లికన్ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు కుతాడి శివరాజ్ కలెక్టర్‌కు వినతిపత్రం అందచేశారు. స్మార్ట్‌సిటీ పనుల్లో నాణ్యత లేకపోవడంతో సిమెంట్ బ్రిక్స్, డిజైన్ బ్రిక్స్ కొన్ని రోజులకే ఊడిపోతున్నాయన్నారు. అధికారులు లేకుండా పనులు చేస్తున్నారని, రోడ్లపై గుంతలు తవ్వి వదిలేస్తున్నారన్నారు. కాంట్రాక్టర్‌పై చర్యతీసుకోవాలని కోరారు. రాష్ట్ర ఉపాధ్యక్షుడు చిలుముల ఎల్లయ్య, లేబర్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కారుకూరి శ్రీనివాస్, క్రాంతి సంక్షేమ సంఘం నాయకుడు బి.రాజయ్య ఉన్నారు.

వడ్లకు రూ.143.. పత్తికి రూ.640

- అన్నదాత ఆశలకు కేంద్రం మద్దతు
- జిల్లా రైతులకు రూ.120కోట్లపైనే ప్రయోజనం
- అమల్లోకి వచ్చిన కొత్త ధరలు

జిల్లాలో ఖరీఫ్‌సాగు అంచనా

మొత్తం రైతులు: 1,93,205
సాగువిస్తీర్ణం: 3,39,050ఎకరాలు
వరి: 2,72,500 ఎకరాలు
పత్తి: 48,000
మొక్కజొన్న: 4,500
కందులు: 2,500
పెసలు: 1,000
ఇతర పంటలు: 10,643



గత, ప్రస్తుత మద్దతు ధరలిలా

పంట	2022-23	2023-24
మేలిమి ధాన్యం	2,060	2203
కామన్ ధాన్యం	2,040	2,183
మొక్కజొన్న	1,962	2,090
సోయాబీన్	4,250	4,600
పత్తి(లాంగ్‌స్టెపుల్)	6,380	7,020
పత్తి(మీడియంస్టెపుల్)	6,220	6,620
జొన్నలు(హైబ్రిడ్)	2,970	3,180
జొన్నలు(మల్దండి)	3,000	3,225
నువ్వులు	7,826	8,635
పొద్దుతిరుగుడు	6,400	6,760
కందులు	6,600	7,000
వేరుశనగ	5,850	6,377

కరీంనగర్ అర్బన్: అన్నదాతల ఆశలకు జీవంపోస్తూ కేంద్రం నిర్ణయం తీసుకుంది. వివిధ పంటలకు మద్దతు ధరలు పెంచుతూ కర్షకుల్లో ఆనందం నింపింది. అపరాల సాగుకు పెద్దపీట వేసిన కేంద్రం, మద్దతు ధరలను ఏకబిగి పెంచేసింది. అపరాలు సాగు చేసిన రైతులకు లాభాల పంటే పండనుంది. ధాన్యం మద్దతు ధర పెంచడంతో రైతన్నకు కొంతలో కొంత ఊరట. గత ఏడాది కన్నా ఈసారి అన్నదాతకు సుమారు రూ.120కోట్ల మేర లబ్ధి చేకూరనుంది. పెరుగుదల రేటులోనూ ఈ ఏడాది పెంపు కనిపించింది. అంతకుముందు క్వింటాల్‌కు రూ.100 వంతునే పెంపు కనిపించేది. ప్రస్తుతం రూ.143– 600లకు పైగా పెంచడం కాస్త సంతోషకరమే.

అపరాల రైతుల్లో ఆనందం

గతంలో పప్పుల సంవత్సరంగా ప్రకటించిన కేంద్రం ఈసారి అపరాల ధరలపై ప్రధానంగా దృష్టి సారించింది. గతంలో కందులు, పెసలు, మినుములు, నువ్వులు, వేరుశనగ, శనగలు, అవాలు పంటలకు తక్కువ ధర పలికేది. జిల్లాలో వరిసాగు పెరగగా మొక్కజొన్న, కందులు, పెసలు, మినుములు, వేరుశనగ, శనగలు సాగుచేసే వారి సంఖ్య తగ్గింది. గతంలో సుమారు 15వేల హెక్టార్లలో పంటలను సాగు చేసేవారు క్రమేణా 3వేల హెక్టార్లలోపే సాగు చేయడం గమనార్హం. పప్పులు సాగు చేయడం .. మార్కెటింగ్ సౌకర్యం అంతంతమాత్రమే కాగా మద్దతు ధర దక్కిన దాఖలాలు తక్కువే. పంట అయిపోయాకా వ్యాపారులే లాభపడటం ప్రతిఏటా జరుగుతోంది.

ధాన్యం రైతులకు ఊరట

గత ఖరీఫ్‌లో ప్రభుత్వం నేరుగా రైతుల నుంచి ధాన్యాన్ని కొనుగోలు చేయడంతో మద్దతు ధర బాగానే లాభించింది. ఈ ఏడాదిలో మరో రూ.143 అదనంగా పెంచడంతో కచ్చితంగా దాన్ని దృష్టిలో ఉంచుకునే ధాన్యాన్ని కొనుగోలు చేయాల్సిన పరిస్థితి వ్యాపారులకు ఎదురుకానుంది. జిల్లాలో సగటు దిగుబడి హెక్టారుకు 42.88 క్వింటాళ్లు. ఆ మేరకు 20లక్షల క్వింటాళ్ల ధాన్యం ఉత్పత్తి అవుతుంది. ప్రస్తుతం ప్రభుత్వం ఈ వానకాలంలో క్వింటాల్ ఏ గ్రేడు ధాన్యాన్ని రూ.2203లకు కొనుగోలు చేయనున్నట్లు ప్రకటించింది. అదే సాధారణ రకం ధాన్యాన్ని క్వింటాల్‌కు రూ.2183 చెల్లిస్తామని స్పష్టం చేసింది.

ప్రభుత్వ కనుసన్నలో కొనుగోళ్లు

ప్రభుత్వం లెవీ విధానాన్ని రద్దు చేసిన విషయం తెలిసిందే. ప్రభుత్వమే రైతుల నుంచి ధాన్యం కొనుగోళ్లు చేయిస్తోంది. ఆ ధాన్యాన్ని మిల్లర్లకే అప్పగించి వారి నుంచి 67శాతం బియ్యాన్ని సేకరించేలా ఎప్పటిమాదిరిగానే ఏర్పాట్లు చేసుకుంటుంది. ఆ బియ్యాన్నే చౌకధరల దుకాణాల ద్వారా పేదలకు కిలో రూపాయికి సరఫరా చేస్తోంది. ఇక పత్తి పంటకు రూ.540 చొప్పున మద్దతు ధర పెంచారు. మీడియం స్టెపుల్‌కు రూ.6620, లాంగ్ స్టెపుల్‌కు రూ.7020గా నిర్ణయించారు. జిల్లాలో 48వేల ఎకరాల్లో పత్తి సాగవనుంది.

దశాబ్ది ఉత్సవాల పేరుతో భ్రమలు కల్పిస్తున్నారు

- కాంగ్రెస్ నగర అధ్యక్షుడు కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డి



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న నరేందర్‌రెడ్డి

కరీంనగర్‌టౌన్: తెలంగాణ రాష్ట్రం ఏర్పడి పది సంవత్సరాలు గడుస్తున్న బీఎస్ ప్రభుత్వంలో ఎవరికి న్యాయం జరుగలేదని నగర కాంగ్రెస్ అధ్యక్షుడు కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డి అన్నారు. బుధవారం నగర కాంగ్రెస్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ... రైతులకు రుణమాఫీ చేయకుండా... అకాలవర్షాలతో తీవ్రంగా నష్ట పోయిన రైతును ఆదుకోకుండా, క్వింటాలుకు అయిదు కిలోలు కోతలు విధించిన బీఆర్ఎస్ ప్రభుత్వానికి రైతు ఉత్సవాలు జరిపే అర్హత లేదన్నారు. ఏసీడీ పేరు మీద ఒక్కొక్క సర్వీసుపై వేల రూపాయలు చార్జీలు వేస్తే కాంగ్రెస్ పార్టీ మెడలు వంచి రద్దు చేయించిందని, మళ్లీ ఏఎస్డీ పేరు మీద నోటీసులు ఇస్తున్నారని... నోటీసులు తీసుకెళ్లే సిబ్బందిని ప్రజలే నిలదీస్తున్నారని పేర్కొన్నారు. ఎక్కడికక్కడ చెరువులు కుంటలు బీఆర్ఎస్ నాయకుల వల్ల కబ్జాలకు గురయ్యాయని మిషన్ కాకతీయ కాస్త కమీషన్ కాకతీయగా మారిందని, కాళేశ్వరం ప్రాజెక్టుతో రిజర్వాయర్‌లు ఎప్పుడూ నిండుకుండలా ఉంటాయని ప్రగల్భాలు పలికిన బీఆర్ఎస్ నాయకులు మానేరు రిజర్వాయర్ డెడ్ స్టోరేజ్‌కు దగ్గర్లో ఉన్నదానికి ఏం సమాధానం చెప్తారని ప్రశ్నించారు. సమద్ నవాబ్, శ్రవణ్ నాయక్, గుండాటీ శ్రీనివాస్ రెడ్డి, లింగం పల్లి బాబు, కుర్ర పోచయ్య, ఎండి చాంద్, షబానా మహమ్మద్, షేక్ షెహెన్న, పొరండ్ల రమేష్, ముల్కల కవిత,అన్నే జ్యోతి, నెన్నెల పద్మ, తమ్మడి ఎజ్రా, కీర్తి కుమార్, మామిడి సత్యనారాయణ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆకాంక్షది హత్యే..

- ఖనికి చేరిన ఆకాంక్ష మృతదేహం
- హతుడు అర్పిత్ కోసం అన్వేషణ
- పరారీలో నిందితుడు



ఆకాంక్ష(ఫైల్)

గోదావరిఖని/యశవంతపుర: బెంగళూరులో అనుమానాస్పదస్థితిలో విగతజీవిగా కనిపించిన పెద్దపల్లి జిల్లా గోదావరిఖని చెందిన ఆకాంక్షది హత్యగా పోలీసులు నిర్ధారించారు. ఆమె స్నేహితుడే గొంతు నులిమి హతమార్చినట్లు గుర్తించారు. ఈ కేసులో బెంగళూరు జీవన్‌బీమానగర పోలీసులు నిందితుడి కోసం అన్వేషణ చేపట్టారు. బీకాం పూర్తి చేసిన ఆకాంక్ష బెంగళూరులో మార్కెటింగ్ సంస్థలో పనిచేసేది. ఢిల్లీకి చెందిన అర్పిత్ కూడా ఆకాంక్ష పనిచేస్తున్న సంస్థలోనే ఉద్యోగంలో చేరాడు. వీరి మధ్య స్నేహం పెరిగి, ప్రేమకు దారితీసినట్లు తెలుస్తోంది. కొద్దిరోజుల క్రితం అర్పిత్ హైదరాబాద్‌కు బదిలీ అయ్యాడు. అప్పటినుంచి ఆకాంక్ష స్నేహితురాలితో కలిసి ఓ అపార్ట్‌మెంట్‌లో ఉంటోంది.

ఆత్మహత్యగా చిత్రీకరించే ప్రయత్నం

ఆకాంక్ష, అర్పిత్ మధ్య కొద్దిరోజులుగా విభేదాలు పొడచూపినట్లు సమాచారం. ఈ క్రమంలో హైదరాబాద్ నుంచి బెంగళూరు వెళ్లిన అర్పిత్ సోమవారం ఆకాంక్షను కలుసుకున్నాడు. ఇద్దరి మధ్య గొడవ చోటుచేసుకోవడంతో ఆమెను గొంతునులిమి హత్య చేశాడు. తరువాత గొంతుకు చున్నీచుట్టి ఫ్యాన్‌కు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నట్లు చిత్రీకరించే ప్రయత్నం చేశాడు. అయితే ఫ్యాన్‌కు వేలాడదీయలేక నేలమీద పడుకోబెట్టి ఫ్లాట్ తాళం వేసి పరారయ్యాడు. ఆకాంక్షతోపాటు అదే ఫ్లాట్‌లో ఉన్న స్నేహితురాలు కొన్ని గంటల తరువాత వచ్చి పోలీసులకు ఫిర్యాదు చేసింది.

తల్లిదండ్రుల రాక

హైదరాబాద్ నుంచి తల్లిదండ్రులు, బంధువులు చేరుకుని విగతజీవిగా ఉన్న ఆకాంక్షను చూసి బోరున విలపించారు. తమ కూతురిని అర్పిత్ హత్య చేసినట్లు మృతురాలి తల్లిదండ్రులు జీవన్ బీమానగర పోలీసులకు ఫిర్యాదు చేశారు. పరారీలో ఉన్న అతడిని పట్టుకునేందుకు పోలీసులు గాలింపు చేపట్టారు.

పూర్తయిన అంత్యక్రియలు

బెంగళూరులో హత్యకు గురైన ఆకాంక్ష మృతదేహాన్ని బుధవారం స్వగ్రామానికి తీసుకొచ్చారు. కన్నీటి మధ్య ఆమెకు అంత్యక్రియలు నిర్వహించారు. తన కూతురు మరణానికి కారణమైన నిందితుడిని కఠినంగా శిక్షించాలని తండ్రి జ్ఞానేశ్వర్ డిమాండ్ చేశారు.

శిశువు ప్రాణాలు కాపాడిన 108 సిబ్బంది

సిరిసిల్లటౌన్/తంగళ్లపల్లి(సిరిసిల్ల): తంగళ్లపల్లి మండలంలోని ఇందిరమ్మ కాలనీకి చెందిన సంధ్య రెండో కాన్పు కోసం సిరిసిల్ల ప్రభుత్వ ఆస్పత్రిలో చేరి, బుధవారం ఆడబిడ్డకు జన్మించింది. ఆ శిశువు శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది తలెత్తి, అపస్మారక స్థితిలోకి వెళ్లింది. వైద్యులు మెరుగైన చికిత్స కోసం కరీంనగర్ వెళ్లాలని సూచించారు.108కి సమాచారం అందించగా సిబ్బంది అనిల్‌కుమార్, పెద్ది శ్రీనివాస్ వచ్చి, పాపను తరలించే క్రమంలో ఆక్సిజన్ అందిస్తూ ఉన్నారు. పాప కళ్లు తెరవడంతో సంతోషం వ్యక్తం చేశారు.

మోటార్ల దొంగల అరెస్టు

వీణవంక(హుజూరాబాద్): వ్యవసాయ బావుల వద్ద బిగించిన మోటార్లు దొంగలించిన ముగ్గురిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై శేఖర్‌రెడ్డి తెలిపారు. మండలంలోని కనపర్తి గ్రామానికి చెందిన బొల్లు సదానందం, కర్ర సదయ్య వ్యవసాయ బావుల వద్ద విద్యుత్ మోటార్లను గుర్తు తెలియని వ్యక్తులు చోరీకి పాల్పడ్డారని బాధితులు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేసి మండలంలోని కనగర్తి గ్రామానికి చెందిన పర్లపల్లి రాజకుమార్, మోరే కుమారస్వామితోపాటు జయశంకర్ జిల్లా భూపాలపల్లి మొగుల్లపల్లి గ్రామానికి చెందిన వనము సమ్మయ్య కలిసి దొంగలించినట్లు గుర్తించారు. మోటార్లను విక్రయించేందుకు ఆటోలో తరలిస్తున్నరనే సమాచారంతో వల్బాపూర్ గ్రామం వద్ద పట్టుకొని, నిందితులను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై శేఖర్‌రెడ్డి తెలిపారు. కేసును ఛేదించిన హెడ్‌కానిస్టేబుల్ సదయ్య, హోంగార్డు రవికుమార్‌ను అభినందించారు.

వృద్ధుడి దుర్మరణం

కమాన్‌పూర్(మంథని): మండలంలోని జూలపల్లి గ్రామానికి చెందిన అడెపు భూమయ్య (67) మంగళవారం రాత్రి ద్విచక్ర వాహనం ఢీకొని మృతి చెందాడు. భూమయ్య కమాన్‌పూర్ నుంచి జూలపల్లికి నడుచుకుంటూ వెళ్తుండగా కమాన్‌పూర్ వైపు వస్తున్న ద్విచక్ర వాహనం ఢీకొంది. తలకు తీవ్రగాయాలుకాగా కుటుంబ సభ్యులు పెద్దపల్లి ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకెళ్లారు. అప్పటికే భూమయ్య మృతి చెందాడని వైద్యులు తెలిపారు. భూమయ్య కుమారుడు సారయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేస్తున్నట్లు ఎస్సై షేక్‌మస్తాన్ తెలిపారు.

బాలుడిపై కుక్కల దాడి

సిరిసిల్లఅర్బన్: పట్టణంలోని బీవైనగర్‌కు చెందిన తొమ్మిదేళ్ల బాలుడు ఆడెపు విశ్వక్‌పై మంగళవారం రాత్రి వీధికుక్క దాడి చేసింది. ఈ దాడిలో గాయపడ్డ బాలుడిని కుటుంబ సభ్యులు సిరిసిల్ల ఏరియా ఆసుపత్రికి తీసుకెళ్లి చికిత్స చేయించారు. మళ్లీ బుధవారం అదే కుక్కతోపాటు మరో నాలుగు వీధికుక్కలు దాడికి పాల్పడ్డాయి. ఈ దాడిలో బాలుడి పొట్ట, వీపు, కాళ్లపై గాయాలయ్యాయి. ఆసుపత్రికి తరలించి మరోసారి చికిత్స చేయించారు. వీధుల్లో కుక్క ల బెడద ఎక్కువగా ఉందని, పలుమార్లు మున్సిపల్ సిబ్బందికి ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని కాలనీవాసులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

అగ్ని ప్రమాదం

కొండగట్టు(చొప్పదండి): కొడిమ్యాల మండలంలోని నాచుపెల్లి గ్రామంలో అక్కపెల్లి అనిల్ ఇంట్లో బుధవారం సిలిండర్ లీకై, మంటలంటుకొని, ఇంట్లోని వస్తువులు దగ్ధమయ్యాయి. అగ్నిమాపక శాఖ సిబ్బందికి సమాచారం ఇచ్చిన స్థానికులు వారు వచ్చేలోపే మంటలను ఆర్పివేశారు.

వైద్య దంపతులకు బెదిరింపులు

- రూ.20 లక్షలు డిమాండ్
- పోలీసులను ఆశ్రయించిన బాధితులు.. కేసు నమోదు

కోరుట్ల: అక్రమ నిర్మాణం చేస్తున్నారని వైద్య దంపతులను బెదిరించి, రూ.20 లక్షలు డిమాండ్ చేసిన వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు కోరుట్ల సీఐ ప్రవీణ్‌కుమార్ తెలిపారు. ఆయన వివరాల ప్రకారం.. కోరుట్ల పట్టణంలోని రథాల పంపు ఏరియాలో డాక్టర్ రమేశ్ నిర్మిస్తున్న నూతన భవనం అక్రమమని, ఫిర్యాదులు చేస్తూ దాన్ని ఆపేస్తానని ఎ.మహేశ్ బుధవారం బెదిరింపులకు దిగాడు. ఎలాంటి ఇబ్బందులు ఉండొద్దంటే రూ.20 లక్షలు ఇవ్వాలని డిమాండ్ చేశాడు. బాధిత వైద్యుడి ఫిర్యాదు మేరకు మహేశ్‌పై కేసు నమోదు చేసినట్లు సీఐ పేర్కొన్నారు. ఇదే విషయంలో తనకు పలువురి నుంచి బెదిరింపు ఫోన్ కాల్స్ వస్తున్నాయని మున్సిపల్ కమిషనర్ అయాజ్ సైతం పోలీసులకు ఫిర్యాదు చేశారు.

మద్యం తాగి వాహనాలు నడిపిన నలుగురికి జైలు

ఇబ్రహీంపట్నం(కోరుట్ల): మద్యం తాగి, వాహనాలు నడిపిన నలుగురికి మెట్‌పల్లి కోర్టు జడ్జి అరుణ్‌కుమార్ బుధవారం జైలుశిక్ష విధించారని ఎస్సై ఉమాసాగర్ తెలిపారు. ఇబ్రహీంపట్నంకు చెందిన తోపారపు భూమేశ్, కొమటికొండాపూర్‌కు చెందిన రామగిరి సంతోష్, వర్షకొండకు చెందిన ఆవుల రంజిత్‌లకు మూడు రోజులు, ఇబ్రహీంపట్నంకు చెందిన పత్తిరెడ్డి రాజరెడ్డికి 5 రోజుల జైలుశిక్ష వేసినట్లు పేర్కొన్నారు. 82 మందికి ఒకొక్కరికి రూ.1,000 చొప్పున, ఆరుబయట మద్యం సేవించిన 12 మందికి ఒకొక్కరికి రూ.1,000 చొప్పున జరిమానా విధించారన్నారు.

బీఆర్‌ఎస్ భవన్‌కు భూ కేటాయింపు రద్దు చేయాలి

- వైఎస్సార్‌టీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి డాక్టర్ నగేశ్



కరీంనగర్‌లో ఇంటింటికి తిరుగుతున్న వైఎస్సార్‌టీపీ నాయకులు

కొత్తపల్లి(కరీంనగర్): హైదరాబాద్‌లోని బంజారాహిల్స్‌లో భారత రాష్ట్ర సమితి భవన్‌కు కేటాయించిన భూమిని వెంటనే రద్దు చేయాలని వైఎస్సార్‌టీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి డాక్టర్ కే.నగేశ్ డిమాండ్ చేశారు. కరీంనగర్‌లో ఇంటింటికి వైఎస్సార్‌టీపీ పేరిట బుధవారం కరపత్రాలు పంపిణీ చేశారు. రాష్ట్ర ప్రభుత్వ అధికార దుర్వినియోగానికి పాల్పడుతూ రూ.550 కోట్ల విలువ చేసే భూములను చౌకగా రూ.35 కోట్లకే కేటాయిరచడం చట్టరీత్యా నేరమన్నారు. తెలంగాణ ప్రజలను దగా చేస్తూ రాష్ట్రాన్ని అధోగతి పాలుచేస్తూ విలువైన భూములను అప్పనంగా దోచుకుంటున్న రాష్ట్ర ప్రభుత్వాన్ని ప్రజలు గద్దె దించాల్సిన సమయం ఆసన్నమైందన్నారు. బీఆర్‌ఎస్‌కు ఒక భవనం ఉండగా మరో భవనం ఎందుకని ప్రశ్నించారు. రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో బీఆర్‌ఎస్ భవనాలు, ఢిల్లీలో భవన నిర్మాణానికి అయ్యే రూ.1200 కోట్లు ఎక్కడి నుంచి వచ్చాయో ప్రజలకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు.

భూ కబ్జాదారుడిపై క్రిమినల్ కేసు నమోదు చేయాలి



హద్దు పిల్లర్లను పరిశీలిస్తున్న సీపీఐ నాయకులు

తిమ్మాపూర్: మండలంలోని రామకృష్ణకాలనీ పరిధిలోని ఎస్సారెస్పీ భూమికి గతేడాది అధికారులు ఏర్పాటు చేసిన హద్దులు తొలగించి భూకబ్జాకు యత్నించిన వ్యక్తిపై కేసు నమోదు చేయాలని సీపీఐ రాష్ట్ర కౌన్సిల్ మెంబర్ పొనగంటి కేదారి, మండల కార్యదర్శి బోయిని తిరుపతి డిమాండ్ చేశారు. హద్దులు తొలగించిన స్థలాన్ని బుధవారం ఆయన పరిశీలించారు. తిరుపతి మాట్లాడుతూ సర్వేనంబర్ 1183, 1184, 1190 అనుకుని ఉన్నటువంటి ఎస్సారెస్పీ ఒక ఎకరా భూమిని గతంలో గ్రామానికి చెందిన రియల్టర్ తన సొంత భూమిలో కలుపుకున్నారని ఆరోపించారు. దీనిపైన 2022లో సీపీఐ ఆధ్వర్యంలో రెవెన్యూ ఎస్ఆర్ఎస్పీ అధికారులు, కలెక్టర్‌కు ఫిర్యాదు చేశామని తెలిపారు. ఫిర్యాదు అనంతరం ల్యాండ్ రికార్డ్ ఏడీ డీఐ రవీంద్రచారి స్థానిక రెవెన్యూ, ఎస్ఆర్ఎస్పీ అధికారులతో సర్వే చేశారు. సర్వేలో ఎస్సారెస్పీ భూమి ఎకరం ఉందని తేలడం జరిగిందని తెలిపారు. దాని ప్రకారం ఎస్సారెస్పీ అధికారులు పిల్లర్ దిమ్మలు వేయడం జరిగిందని వివరించారు. అయితే ఇప్పుడు ఆ పిల్లర్‌లను జేసీబీతో రాత్రికి రాత్రి తొలగించి చెట్లపొదల్లో పడేయడం జరిగిందని తెలిపారు. హద్దులు తొలగించిన రియల్టర్‌పై చర్య తీసుకోవాలని కోరారు. నాయకులు గంగిపల్లి శంకర్, స్వామి మేకల శ్రీనివాస్, మాచర్ల అంజయ్య, రమేశ్ గ్రామస్తులు పాల్గొన్నారు.

బీసీలకు రూ.10 లక్షలు ఇవ్వాలి



మాట్లాడుతున్న ఎన్నం ప్రకాశ్

కరీంనగర్: రాష్ట్ర ప్రభుత్వం బీసీలకు రూ.లక్ష కేటాయించడం సరికాదని, రూ.పదిలక్షలు ఇవ్వాలని బీసీ సంక్షేమ సంఘం ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు ఎన్నం ప్రకాశ్ డిమాండ్ చేశారు. బుధవారం సంఘ కార్యాలయంలో జిల్లా అధ్యక్షుడు నాగుల కనుకయ్య గౌడ్ అధ్యక్షతన జరిగిన రౌండ్‌టేబుల్ సమావేశంలో మాట్లాడుతూ గత ఎన్నికల్లో కూడా బీసీ రుణాలు అని అప్పుడు కూడా రూ.50వేలకు మించి ఇవ్వలేదని మండిపడ్డారు. ప్రస్తుతం ఎన్నికలు దగ్గరపడ్డాయని నామమాత్రంగా ఇచ్చి చేతులు దులుపుకుంటారని మండిపడ్డారు. బీసీబంధు ప్రకటించి ప్రతిఒక్కరికి రూ.10లక్షలు ఇవ్వాలని కోరారు. తెలంగాణ దశాబ్ది ఉత్సవాలు జరుపుకుంటున్న సందర్భంగా ఈ నెల 16న తెలంగాణ చౌక్‌లో బీసీ మహిళా సంఘం జిల్లా అధ్యక్షురాలు గంగిపెల్లి అరుణ ఆధ్వర్యంలో ఘనంగా కార్యక్రమాలు నిర్వహిస్తామని తెలిపారు. నాయకులు రాచమల్ల రాజు, దొగ్గలి శ్రీధర్, దుంపట మురళీ, మాదాసు సంజీవ్, నారోజు రాకేశ్‌చారి, గంగిపెల్లి అరుణ, సంతోషి, జ్యోతి, స్వరూపరాణి, శ్రీలత, వరలక్ష్మి, కిరణ్, రమేశ్, శ్రీనివాస్, బ్రహ్మచారి, రవికుమార్ పాల్గొన్నారు.

నేడు అంగారిక టౌన్‌షిప్ ప్లాట్ల వేలం

కరీంనగర్ అర్బన్: ఈనెల 8న అంగారిక టౌన్ షిప్ 4వ విడత ప్లాట్ల ప్రత్యక్ష వేలం నిర్వహించడం జరుగుతుందని కలెక్టర్ ఆర్వీ.కర్ణన్ తెలిపారు. తిమ్మాపూర్ మండలం మహత్మానగర్‌లోని శ్రీ వెంకటేశ్వర కల్యాణమండపంలో అంగారిక టౌన్ షిప్‌లోని 75 ప్లాట్ల అమ్మకం ప్రక్రియను నిర్వహించడం జరుగుతుందని ప్రకటనలో పేర్కొన్నారు. నివాసస్థలం ప్లాట్లకు చదరపు గజానికి రూ.6,000 చొప్పున, వాణిజ్యస్థలం చదరపు గజానికి రూ.8,000 చొప్పున వేలంవేయడం జరుగుతుందని వివరించారు. వేలం కార్యక్రమంలో పాల్గొనదలచిన వారు దరఖాస్తుతో పాటు దరావత్తు సొమ్ము డిస్ట్రిక్ట్ కలెక్టర్ కరీంనగర్, రాజీవ్ స్వగృహ పేరున (ఈఎండీ) రూ.10000 డీడీ తీయాలని, పాత రాజీవ్ స్వ గృహ దరఖాస్తుదారులు ఎవరైతే రూ.3000, రూ.5,000 రిజిస్ట్రేషన్ రుసుము చెల్లించారో ఆ ఒరిజినల్ ఈ–సేవ రసీదు, ఏవేని రెండు ఐడెంటి ప్రూఫ్స్‌లను సుడా కార్యాలయంలో అందజేసి టోకెన్ పొంది 8న జరిగే వేలం కార్యక్రమంలో పాల్గొనాలన్నారు. వేలంలో ప్లాట్ తీసుకున్న వారు పూర్తి సొమ్మును ఏడు రోజులలోపు 33శాతం, 45రోజులలోపు 33శాతం, 90రోజుల లోపు 33శాతం చెల్లించాలన్నారు. పూర్తి సొమ్మును నెల లోపు చెల్లించినట్లయితే 2శాతం డిస్కౌంట్ సౌలభ్యం కలదని తెలిపారు. ఇదే చివరి అవకాశమని, కాబట్టి ఆశావహులు, ఔత్సాహికులు అధిక సంఖ్యలో పాల్గొనాలని సూచించారు.

మద్యానికి బానిసై ఒకరి ఆత్మహత్య

- మృతుడి స్వస్థలం ఆంధ్రప్రదేశ్‌లోని సింగనపాలెం

జగిత్యాల క్రైం: జిల్లా కేంద్రంలోని గోవిందుపల్లిలో మంగళవారం రాత్రి తేళ్ల నాగేశ్వర్‌రావు(32) ఆత్మహత్యకు చేసుకున్నాడు. వివరాల్లోకి వెళ్తే.. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని ఒంగోలు జిల్లా ముళ్లమాడు మండలం సింగనపాలెం గ్రామానికి చెందిన నాగేశ్వర్‌రావుకు భార్య శిరీష, ఇద్దరు పిల్లలున్నారు. అతను మూడేళ్లుగా జగిత్యాల పట్టణంలోని గోవిందుపల్లిలో కుటుంబసభ్యులతో కలిసి నివాసం ఉంటూ తాపీమేస్త్రీగా పని చేస్తున్నాడు. ఈ క్రమంలో కొద్దికాలంగా మద్యానికి బానిసై, నిత్యం భార్యతో గొడవ పడుతున్నాడు. మంగళవారం రాత్రి మద్యం మత్తులో మళ్లీ గొడవ పడ్డాడు. దీంతో ఆమె ఇంటి బయట ఉండగా నాగేశ్వర్‌రావు ఇంట్లోకి వెళ్లి, డోర్ పెట్టుకొని, ఫ్యాన్‌కు ఉరేసుకున్నాడు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని, దర్యాప్తు చేస్తున్నట్లు జగిత్యాల పట్టణ ఎస్సై రమేశ్ తెలిపారు. నాగేశ్వర్‌రావు ఆత్మహత్య చేసుకోవడంతో బుధవారం పోలీస్‌స్టేషన్ వద్ద మృతుడి భార్య శిరీషతో అతని అన్నదమ్ములు తీవ్ర వాగ్వాదానికి దిగారు. ఆమె ప్రవర్తనతోనే తమ సోదరుడు ఆత్మహత్య చేసుకున్నాడని ఆవేదన వ్యక్తం చేశారు.

చంపుతానని బెదిరించిన వ్యక్తిపై కేసు

జగిత్యాల క్రైం: జిల్లా కేంద్రంలోని మహబూబపూర్ ప్రాంతానికి చెందిన ఎండీ.అజీజ్‌ను చంపుతానని బెదిరించిన ఎండీ.సల్మాన్‌పై కేసు నమోదు చేసినట్లు జగిత్యాల పట్టణ ఎస్సై సంజీవ్ తెలిపారు. ఆయన వివరాల ప్రకారం.. సల్మాన్ కొంతకాలంగా అజీజ్ ఇంట్లో అద్దెకు ఉంటున్నాడు. సల్మాన్‌కు తన భార్యతో గొడవలు జరగడంతో ఆమె పుట్టింటికి వెళ్లిపోయింది. ఈ క్రమంలో ఇంటి యజమాని అజీజ్‌కు తన అత్తింటివారితోపాటు కుటుంబ సభ్యులు ఫోన్ చేస్తుండటంతో సల్మాన్ కోపం పెంచుకున్నాడు. మంగళవారం రాత్రి అజీజ్ ఇంటికి వెళ్లి, అతనిపై కత్తితో దాడి చేశాడు. తర్వాత ఫోన్ చేసి, అతనితోపాటు కుటుంబసభ్యులను చంపేస్తానని బెదిరించాడు. దీంతో బాధితుడి బుధవారం ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

అత్తింటివారిపై వరకట్న వేధింపులు

జగిత్యాలక్రైం: అదనపు కట్నం కోసం వివాహితను వేధించిన ఆమె అత్తింటివారిపై కేసు నమోదు చేసిన ట్లు జగిత్యాల పట్టణ ఎస్సై సంజీవ్ తెలిపారు. ఆయ న వివరాల ప్రకారం.. జిల్లా కేంద్రంలోని మంచినీళ్ల బావి ప్రాంతానికి చెందిన లావణ్యకు జగిత్యాల రూరల్ మండలం అంతర్గాం గ్రామానికి చెందిన బత్తిని శివశంకర్ ప్రసాద్‌తో 12 ఏళ్ల క్రితం వివాహం జరిగింది. వీరికి ఇద్దరు పిల్లలు ఉన్నారు. కొంతకా లంగా భర్తతోపాటు లావణ్య అత్త రాధ, మామ నీల య్య అదనంగా మరో రూ.2 లక్షల కట్నం తీసుకురా వాలంటూ ఆమెను శారీరకంగా, మానసికంగా వేధి స్తున్నారు. అంతేకాకుండా శివ శంకర్ ప్రసాద్ గుట్టుచప్పుడు కాకుండా ఆరు నెలల క్రితం మరో మహిళను వివాహం చేసుకున్నాడు. దీంతో బాధితురాలు బుధవారం ఇచ్చిన ఫిర్యాదు మేరకు శివశంకర్ ప్ర సాద్, రాధ, నీల య్యలపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు.

క్లుప్తంగా

రాజగోపుర అదివాస పూజలు



కరీంనగర్‌కల్చరల్: నగరంలోని మంకమ్మతోట వేంకటేశ్వర ఆలయంలో రాజగోపుర శిఖర ప్రతిష్ఠా మహా కుంభాభిషేక కార్యక్రమాల్లో భాగంగా బుధవారం ఉదయం చతుస్థానార్చన, ధాన్యాదివాసం, సాయంత్రం చతుస్థానార్చన, ఫల, పుష్ప, శయ్యాదివాసాలను శాస్త్రోక్తంగా నిర్వహించారు. వేదభవనం ప్రిన్సిపాల్, వేదపండితుడు డాక్టర్ వరప్రసాదాచార్యస్వామి రాజగోపుర విశిష్టతను భక్తులకు వివరించారు. కార్యక్రమంలో కార్యనిర్వహణాధికారి నాగారపు శ్రీనివాస్, అర్చకులు, భక్తులు పాల్గొన్నారు.

గర్భిణులు పౌష్టికాహారం తీసుకోవాలి



గర్భిణులకు సీమంతం నిర్వహిస్తున్న సిబ్బంది

కరీంనగర్‌కార్పొరేషన్: గర్భిణులు పౌష్టికాహారం తీసుకోవాలని 59వ డివిజన్ కార్పొరేటర్ గందె మాధవి అన్నారు. తెలంగాణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా డివిజన్‌లోని అంగన్‌వాడీ కేంద్రంలో బుధవారం సామూహిక సీమంతం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వం అందించే బాలామృతాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సీడీపీఓ ఉమాదేవి, సూపర్‌వైజర్ స్వప్న తదితరులు పాల్గొన్నారు.

చిన్నారులకు అన్నప్రాసన



కరీంనగర్‌రూరల్: కరీంనగర్ మండలం చెర్లభూత్కూర్‌లోని అంగన్‌వాడీ కేంద్రంలో బుధవారం ఇద్దరు చిన్నారులకు అన్నప్రాసన కార్యక్రమం నిర్వహించారు. అనంతరం న్యూట్రి గార్డెన్‌లో కూరగాయాల విత్తనాలు నాటారు. బడిబాట కార్యక్రమంలో భాగంగా ఇంటింటికీ తిరుగుతూ అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా అందిస్తున్న సేవలను వివరించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ దబ్బెట రమణారెడ్డి, పంచాయతీ కార్యదర్శి వాహెద్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ నిర్మల, అంగన్‌వాడీ టీచర్ భాగ్యలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

'నగర అభివృద్ధిలో నిర్లక్ష్యం'

కరీంనగర్‌టౌన్: కరీంనగర్ నగరపాలక సంస్థ అభివృద్ధి పనుల్లో అడుగడుగునా నిర్లక్ష్యం కనిపిస్తోందని కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు మల్యాల సుజిత్‌కుమార్ బుధవారం ఒక ప్రకటనలో ఆరోపించారు. ప్రధాన రోడ్లను వేస్తూ తవ్వుతూ మళ్లీ వేస్తూ నిత్యం వాహనదారులు, పాదాచారులకు నరకం చూపిస్తున్నారని అన్నారు. బాగున్న రోడ్లపై మళ్లీ ఎందుకు రోడ్లు వేస్తున్నారో తెలియడం లేదన్నారు. పాలకులు, అధికారులు ఇష్టారీతిలో వ్యవహరిస్తూ ప్రజాధనం దుర్వినియోగం చేస్తున్నారని పేర్కొన్నారు. ఇప్పటికైనా కలెక్టర్ దృష్టి సారించి అవసరం లేని పనులు చేస్తున్న తీరుపై చర్యలు చేపట్టాలని కోరారు.

సమ్మర్‌లో సరదాగా..

- ఉత్సాహంగా సాగిన వేసవి క్రీడా శిబిరాలు
- నగర పాలక సంస్థ నిర్వహణపై ప్రశంసలు
- నెల రోజుల శిక్షణతో రాష్ట్ర, జాతీయ స్థాయిలో రాణిస్తామంటున్న క్రీడాకారులు



బాస్కెట్‌బాల్ క్రీడాకారులతో డీవైఎస్‌వో రాజవీరు



చివరిరోజు బుధవారం ఉత్సాహంగా ఖోఖోలో సాధన చేస్తున్న చిన్నారులు

కరీంనగర్‌స్పోర్ట్స్: ప్రస్తుత కాలంలో సర్వరోగ నివారణకు క్రీడలు, వ్యాయామం ఒక్కటే ఔషదంగా భావిస్తున్నారు. క్రీడల్లో రాణించిన వారు అన్ని రంగాల్లో రాణిస్తారని పలువురు విశ్లేషకులు సైతం చెబుతున్నారు. కరీంనగర్ స్మార్ట్‌సిటీలో అందరూ స్మార్ట్‌గా ఉండాలనే ధ్యేయంతో ఆరోగ్యంగా ఉండాలన్న ఉద్దేశ్యంతో ఐదోసారి వేసవి క్రీడా శిక్షణ శిబిరాలను కరీంనగర్ నగరపాలక సంస్థ విజయవంతంగా నిర్వహించింది. మే 5 నుంచి అంబేడ్కర్ స్టేడియంలో ప్రారంభించిన శిక్షణ శిబిరాలు ఉత్సాహంగా ఉల్లాసంగా జరుగగా.. బుధవారంతో సమ్మర్ క్రీడా సందడి ముగిసింది. సుమారు 27 క్రీడాంశాల్లో ఇచ్చిన శిక్షణలో సుమారు 2వేల మంది పైగా చిన్నారులు పాల్గొన్నారు. కాగా వేసవి శిక్షణ ఉపయోగించుకున్న చిన్నారులను సాక్షి పలకరించగా భవిష్యత్‌లో ఏ స్థాయికి చేరుకుంటామో తదితర విషయాలు వెల్లడించారు. సమ్మర్ క్యాంప్ జోష్‌తో భవిష్యత్‌లో రాష్ట్ర, జాతీయస్థాయిలో రాణిస్తామంటున్నారు.

క్రీడా గ్రామంగా..

32 రోజులుగా అంబేడ్కర్ స్టేడియం ఒక గ్రామంగా మారింది. ఒలింపిక్స్, ఏషియన్ లాంటి మెగా ఈవెంట్స్ జరిగే సమయంలో క్రీడాకారులందరూ ఒకే చోట ఉండేలా ఏ విధంగానైతే ఒక క్రీడా గ్రామాన్ని నిర్మిస్తారో అలాగే మారిపోయింది. ప్రతిరోజూ ఉదయం సుమారు 2వేల మందికి పైగా క్రీడాకారులు రెండు గంటలపాటు ఆయా శిక్షణ శిబిరాల్లో పాల్గొన్న తీరు చూస్తుంటే మెగా టోర్నీలను చూస్తున్నట్లు అనిపించింది. చిన్నారులతో పాటు వారి తల్లిదండ్రులు సైతం స్టేడియం బాట పట్టడంతో సందడిగా మారింది. ఇలాంటి శిక్షణ శిబిరాలను కరీంనగర్ నగర పాలక సంస్థ ఏటా నిర్వహించాలని పలువురు ఆశాభావం వ్యక్తం చేశారు.

బాక్సింగ్ చాంపియన్ కావాలని..



కిక్ బాక్సింగ్‌లో చాంపియన్ కావాలనేది నా కోరిక. సమ్మర్ క్యాంప్‌తో పాటు రోజూ స్కూల్ అవర్ అయిపోయాక కూడా ప్రాక్టీస్ చేస్తా. కోచ్‌లు టెక్నిక్‌లు నేర్పించారు. చాలా హార్డ్ వర్క్ చేస్తున్న. పంచ్‌లు బాగా కొడుతున్నావని చాలా మంది అంటున్నారు. ఈయేడు జాతీయస్థాయి వరకు ఎదుగుతావని కోచ్ ప్రశంసించారు. సంతోషంగా ఉంది.

– ఏ.ఐషిని (కిక్ బాక్సింగ్)

ఇదో మంచి సంకల్పం



నగర పాలక సంస్థ ఆధ్వర్యంలో మూడేళ్లుగా సమ్మర్ క్యాంప్‌లు నిర్వహించడం గొప్ప సంకల్పంతో కూడుకున్నది. చాలా మంది పిల్లలకు ఇది మంచి అవకాశం. మా పిల్లలతో పాటు మేము కూడా వాకింగ్ చేయడం ప్రారంభించాం. ఏటా కొనసాగాలి.

– తాడూరి లక్ష్మీనారాయణ, పేరెంట్

ఏటా నిర్వహిస్తాం



ఏటా సమ్మర్‌లో నిర్వహిస్తున్న క్రీడా శిక్షణ శిబిరాలకు విశేష ఆదరణ వచ్చింది. నగర పాలక సంస్థ చేపట్టిన ఈ బృహత్తర కార్యక్రమం తెలంగాణకే తలమానికం. ఏటా సమ్మర్ క్యాంప్‌లు నిర్వహిస్తాం.

– సునీల్ రావు, మేయర్, కరీంనగర్

ఏటా వస్తున్న



ఏటా అంబేద్కర్ స్టేడియంలో నిర్వహిస్తున్న సమ్మర్ క్యాంప్‌కు వస్తున్న. గతేడాది తక్కువ మంది రాగా.. ఈ యేడు పెద్ద సంఖ్యలో వచ్చారు. క్యాంప్‌లో శిక్షణ బాగా ఇచ్చారు. క్రికెట్‌లో బ్యాట్స్‌మెన్‌గా రాణించాలని ఉంది.

– బి. అక్షయ కార్తీక్ (క్రికెట్)

టెక్నిక్స్ నేర్చుకున్న



రోజూ సమ్మర్ క్యాంప్‌కు హాజరయ్యా. ఖోఖో క్రీడలో త్రీత్రీటూ, జిగ్‌జాగ్ తదితర రన్నింగ్ టెక్నిక్స్ నేర్చుకున్న. రన్నర్‌గా రాణించాలనుకుంటున్న. కరుణాకర్ సార్ ఇచ్చిన కోచింగ్ బాగుంది.

– జ్యోత్స్న (ఖోఖో)

దుబాయ్ నుంచి వచ్చా..



మేము దుబాయ్‌లో ఉంటాం. సమ్మర్ హాలీడేస్‌కు ఏటా కరీంనగర్ వస్తాం. సమ్మర్ క్యాంప్‌లో పాల్గొని బాస్కెట్‌బాల్‌లో శిక్షణ తీసుకున్న. ఇంకా మూడు నెలలు ఉంటాం. బాస్కెట్‌బాల్‌లో ప్రాక్టీస్ చేస్తా. చాలా హ్యాపీగా ఉంది.

– సహర్ష్, (బాస్కెట్‌బాల్)

జాతీయస్థాయికి ఎదగాలని..



బాక్సింగ్‌లో జాతీయస్థాయికి ఎదగాలనేది నా ఆశయం. ప్రతిరోజూ కోచింగ్ క్యాంప్‌కు వచ్చా. కోచ్‌లు టెక్నిక్‌లు బాగా నేర్పించారు. చాలా హార్డ్‌వర్క్ చేశా. పంచ్‌లు బాగా ప్రాక్టీస్ చేశా.

– లక్ష్మీలీలా, (బాక్సింగ్)

టోర్నీలో ఆడేలా తయారయ్యా..



గతేడాది ఫుట్‌బాల్‌లో శిక్షణ తీసుకున్న. ఈయేడు కూడా పాల్గొని చాలా ప్రాక్టీస్ చేశా. ఫుట్‌బాల్ గేమ్ మొత్తం నేర్చుకున్న. టోర్నీలో కూడా ఆడేలా తయారయ్యా. ఫుట్‌బాల్‌లో చాంపియన్‌గా ఎదగాలనేది నా కోరిక.

– ఎండీ. గిలాయాన్, (ఫుట్‌బాల్)

బస్‌స్టేషన్ తనిఖీ



బస్‌స్టేషన్ తనిఖీ చేస్తున్న వినోద్‌కుమార్

విద్యానగర్(కరీంనగర్): కరీంనగర్ బస్‌స్టేషన్‌ను బుధవారం ఆర్టీసీ కరీంనగర్ జోన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సి.వినోద్‌కుమార్ తనిఖీ చేశారు. ప్రయాణికులకు అవసరమైన సదుపాయాలు, ఇబ్బంది కలగకుండా ఏర్పాట్లు చేయాలని బస్‌స్టేషన్ అధికారులకు సూచించారు. వివిధ స్టాల్స్‌ను తనిఖీ చేసి వస్తువులను ఎంఆర్‌పీ ధరలకే విక్రయించాలని అన్నారు. టాయిలెట్లను తనిఖీ చేసి ఎల్లప్పుడు శుభ్రంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. క్యాంటీన్, ప్రయాణికుల విశ్రాంతి గదిని పరిశీలించి పలు సూచనలు చేశారు. అనంతరం కరీంనగర్–1, 2 డిపో మేనేజర్ కార్యాలయాలు, ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ కార్యాలయాన్ని తనిఖీ చేశారు. ఆయన వెంట రీజినల్ మేనేజర్ సుచరిత, ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ వెంకటేశ్వర్లు, కరీంనగర్–1 డిపో మేనేజర్ ప్రణీత్, ఎగ్జికూటివ్ డైరెక్టర్ కార్యదర్శి యుగంధర్‌రెడ్డి, బస్‌స్టేషన్ మేనేజర్ అంజయ్య, సెక్యూరిటీ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి ఉన్నారు.

జాతీయ మానవ హక్కుల కమిటీ కార్యవర్గం



నియామక పత్రాలు అందిస్తున్న భద్రయ్య

కరీంనగర్‌రూరల్: జాతీయ మానవ హక్కుల కమిటీ కరీంనగర్ జిల్లా కార్యవర్గాన్ని బుధవారం రాష్ట్ర శాఖ అధ్యక్షుడు భద్రయ్య ప్రకటించారు. అధ్యక్షుడిగా ఆకుల సంజీవరావు(మానకొండూరు), ప్రధాన కార్యదర్శిగా మాసం సుధాకర్(కరీంనగర్‌రూరల్), ఉపాధ్యక్షులుగా రాం పద్మ(జమ్మికుంట), ఎండీ హబీబ్(హుజూరాబాద్), సంయుక్త కార్యదర్శిగా మాడ కరుణాకర్‌రెడ్డి(వీణవంక) నియమించారు. ఈమేరకు అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులకు నియామకపు పత్రాలను అందజేశారు.



విద్యుత్ దీపాల అలంకరణలో లోయర్ మానేర్ డ్యాం





సాగునీటి దినోత్సవం

కరీంనగర్: తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవ వేడుకల్లో భాగంగా బుధవారం నగరంలోని లోయర్ మానేరు డ్యాంపై ఇరిగేషన్ శాఖ ఆధ్వర్యంలో సాగునీటి దినోత్సవం నిర్వహించారు. రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు బోయినపల్లి వినోద్‌కుమార్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా నీటి ప్రాజెక్టుల నిర్మాణం తదితర వాటిపై రాష్ట్రం సాధించిన ఘనతను లేజర్ షో ద్వారా ప్రదర్శించారు. కలెక్టర్ ఆర్వీ కర్ణన్, అదనపు కలెక్టర్ గరిమా అగర్వాల్, మేయర్ సునీల్‌రావు, ఇరిగేషన్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ బడిలో చేరండి



బడిబాటలో హెచ్‌ఎం, ఉపాధ్యాయులు

కొత్తపల్లి: కొత్తపల్లి మండలం ఎలగందుల ప్రభుత్వ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయ బృందం ప్రొఫెసర్ జయశంకర్ బడిబాటలో భాగంగా బుధవారం ఇంటింటా తిరుగుతూ ప్రభుత్వ బడిలో చేరండి.. ఉన్నతంగా ఎదగండంటూ ప్రచారం నిర్వహించారు. ప్రభుత్వ పాఠశాలల్లో ప్రభుత్వం కల్పిస్తున్న రెండు జతల యూనిఫామ్స్, ఉచిత మధ్యాహ్న భోజనం, పాఠ్యపుస్తకాలతో పాటు మన ఊరు మనబడి సౌకర్యాలను వివరిస్తున్నారు. హెచ్‌ఎం తుమ్మ ఆనందం, ఉపాధ్యాయులు రాజరత్నం, వేణుగోపాల్‌రావు, సుధాకర్‌రెడ్డి, కనకయ్య, గంగారాం, సునీత, అరుణ, రాజేశ్వరి, రజిత, మనోహర్‌రెడ్డి, శ్రీనివాస్, ఉమాదేవి, సీఆర్పీలు నీలోఫర్, పరుశురాం పాల్గొన్నారు.

'గోవులను వధించొద్దు'

విద్యానగర్(కరీంనగర్): దేశంలోని చట్టాలను గౌరవిస్తూ దేశ సమైక్యత, సమగ్రత కోసం గోవులను వధించవద్దని రాష్ట్ర హజ్ కమిటీ సభ్యుడు, ఎంఐఎం నగర అధ్యక్షుడు సయ్యద్ గులాం అహ్మద్ హుస్సేన్ బుధవారం ఒక ప్రకటనలో ముస్లిం సమాజానికి సూచించారు. గోవులను వధించకూడదనే ప్రభుత్వ నిషేధాలు అమలులో ఉన్నప్పుడు వాటిని గౌరవించాల్సిన బాధ్యత ఉందని పేర్కొన్నారు. బక్రీద్ సందర్భంగా బలి ఇచ్చే జంతువుల్లో ఆవులు ఉండకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. గోవును జాతీయ జంతువుగా ప్రకటించి ప్రత్యేక ఆర్డినెన్స్ ద్వారా పార్లమెంట్‌లో బిల్లు పెట్టి ఆమోదింపజేయాలని డిమాండ్ చేశారు. నేటి నుంచి బక్రీద్ ముగిసే వరకు గ్రామీణ ప్రాంతాల్లో ఆవులను వార సంతలకు తీసుకెళ్లకుండా రాష్ట్ర ప్రభుత్వ యంత్రాంగం గ్రామాల్లో అవగాహన కార్యక్రమాలు చేపట్టాలన్నారు. కొంత మంది గోరక్షకుల ముసుగులో చట్టాన్ని చేతుల్లోకి తీసుకొని దాడులకు పాల్పడుతున్నారని, వారికి తమదైన రీతిలో సమాధానం చెబుతామని హెచ్చరించారు.

20లోపు దరఖాస్తు చేసుకోవాలి

కరీంనగర్: నాయీబ్రాహ్మణ కులస్తులు ప్రభుత్వం ప్రకటించిన రూ.లక్ష ఆర్థిక సహాయం కోసం ఈనెల 20వ తేదీలోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని నాయీ బ్రాహ్మణ ఐక్యవేదిక రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ గుంజపడుగు హరిప్రసాద్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 21–66 ఏళ్ల మధ్య వయస్సు ఉండి వార్షిక ఆదాయం గ్రామీణ ప్రాంతాల్లో రూ.1.50లక్షలు, పట్టణ ప్రాంతాల్లో రూ.2 లక్షలకు మించరాదని తెలిపారు. ఐదేళ్లలో ప్రభుత్వం నుంచి ఎలాంటి ఆర్థిక లబ్ధి పొందిన వారు అర్హులని ప్రకటించారు. కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రం, ఆధార్‌కార్డు, ఆహార భద్రత కార్డు, పాస్‌పోర్టు సైజ్ ఫొటో, బ్యాంక్ పాస్‌బుక్ జత చేస్తూ ఈనెల 20లోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

పవర్‌కట్ ప్రాంతాలు

కొత్తపల్లి: తీగలగుట్టపల్లి సరస్వతీనగర్‌లో ట్రాన్స్‌ఫార్మర్ మరమ్మతు పనులు చేపడుతున్నందున గురువారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు 11కేవీ ప్రతిమ ఫీడర్ పరిధిలోని విద్యారణ్యపురి, సరస్వతీనగర్, హనుమాన్‌నగర్, కేసీఆర్ భవన్ రోడ్, మాణికేశ్వరీ నగర్, కార్తికేయనగర్, విఘ్నేశ్వరనగర్, గాయత్రీనగర్, శ్రీనివాసనగర్, కేఆర్ కాలనీ, భదవాన్ కాలనీ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు కరీంనగర్ రూరల్ ఏడీఈ కొలుపు రాజు తెలిపారు. విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

ఆధ్యాత్మికం

వైభవంగా శ్రీవేంకటేశ్వర స్వామి కల్యాణం



కరీంనగర్‌కల్చరల్: భగత్‌నగర్ జెడ్పీ క్వార్టర్స్ ఆవరణలోని శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయంలో నిర్వహిస్తున్న వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా బుధవారం వేంకటేశ్వరస్వామి కల్యాణాన్ని వైభవంగా నిర్వహించారు. మేయర్ సునీల్‌రావు దంపతులు పాల్గొని అన్న ప్రసాదాన్ని భక్తులకు స్వయంగా వడ్డించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కార్యనిర్వహణాధికారి కొస్న కాంతారెడ్డి, ఉత్సవ నిర్వాహకులు విజయభాస్కర్, ఈద సతీశ్‌రెడ్డి, టి.రవీందర్‌రావు, ఆర్.తిరుపతిగౌడ్, రాచకొండ చక్రధర్‌రావు, తోట రాంబాబు, జి.సతీశ్‌కుమార్, జి.స్వామిరెడ్డి, అర్చకులు, సిబ్బంది తదితరలు పాల్గొన్నారు.

ఘనంగా మహారుద్రహోమం



కరీంనగర్‌రూరల్: కరీంనగర్ మండలం చామనపల్లిలో శీతలాదేవి విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవాల్లో భాగంగా బుధవారం మహా రుద్రహోమం వైభవంగా నిర్వహించారు. వేదపండితులు సత్యనారాయణశర్మ, రవీందర్‌శర్మల ఆధ్వర్యంలో సుప్రభాతం, స్థాపిత మండప దేవత పూజలతో పాటు శ్రీదేవి సహిత రుద్ర హోమం జరిపారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ బోగొండ లక్ష్మి–ఐలయ్య, ఉప సర్పంచ్ దావు నిర్మల–మహిపాల్‌రెడ్డి దంపతులు, ఆలయ కమిటీ చైర్మన్ అంజయ్యతో పాటు పలువురు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో సంకటహర చతుర్థి పూజలు



గౌరీశంకరాలయంలో గణపతికి అలంకారం



నగునూరులోని దుర్గాభవానీ ఆలయంలో..

కరీంనగర్‌కల్చరల్: నగరంలోని పలు ఆలయాల్లో బుధవారం సంకటహర చతుర్థి పూజలను భక్తులు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. భగత్‌నగర్ అంజనాద్రి లక్ష్మీగణపతి, జెడ్పీ క్వార్టర్స్ ఆవరణలోని అయ్యప్ప, రాంపూర్ గిద్దెపెరుమాండ్లు, అశోక్‌నగర్ వాసవీకన్యకాపరమేశ్వరి, ప్రకాశంగంజ్ వరసిద్ధి వినాయకస్వామి, పాతబజార్ గౌరీశంకర, చైతన్యపురి మహాశక్తి ఆలయాలతోపాటు పలు ఆలయాల్లో జరిగిన అభిషేక, అలంకార, అర్చనల్లో భక్తులు పాల్గొన్నారు.

విద్యానగర్(కరీంనగర్): సంకష్టహర చతుర్థి సందర్భంగా బుధవారం కరీంనగర్ మండలం నగునూర్‌లోని దుర్గాభవానీ ఆలయంలో ఆలయ ధర్మాధికారి పురాణం మహేశ్వరశర్మ ఆధ్వర్యంలో లక్ష్మీగణపతికి ఘన పూజలు జరిగాయి. స్వామి వారలకు విశేష అభిషేకం, ఫలపంచామృతాభిషేకం, విశేష హారతి కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయ ఫౌండర్, కమిటీ బాధ్యులు, భక్తులు పాల్గొన్నారు.

'చెరువుల పండుగ'కు రెడీ

- యుద్ధప్రాతిపదికన అధికారుల ఏర్పాట్లు
- నేడు ఊరూరా చెరువుల పండుగ



మొగ్దుంపూర్‌లో చెరువుకట్టపై జేసీబీతో తొలగిస్తున్న చెట్లు

కరీంనగర్‌రూరల్: తెలంగాణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా గురువారం ఊరూరా చెరువుల పండుగ నిర్వహించేందుకు అధికారులు యుద్ధప్రాతిపదికన ఏర్పాట్లు పూర్తి చేశారు. ఆయా గ్రామాల్లోని చెరువుల వద్ద సమావేశం నిర్వహణ, బతుకమ్మ ఆట, కోలాటం, భోజనాలకు అవసరమైన స్థలాలను గుర్తించి చదును చేశారు. ఉత్సవాల నిర్వహణకు ప్రభుత్వం ఒక్కో గ్రామానికి రూ.25వేలు మంజూరు చేయగా సర్పంచులు అవసరమైన ఏర్పాట్లు చేశారు. చెరువుల పండుగను విజయవంతం చేసేందుకు ఒక్కో చెరువుకు ఒక్కో అధికారిని ప్రత్యేకంగా నియమించారు.

27 చెరువుల వద్ద వేడుకలు

కరీంనగర్ నియోజకవర్గంలో మొత్తం 27 చెరువుల వద్ద పండుగ నిర్వహించేందుకు అధికారులు ఏర్పాట్లు చేశారు. కరీంనగర్‌రూరల్‌లో 17, కొత్తపల్లి మండలంలో 8, కొత్తపల్లి మున్సిపాలిటీలో కొత్తపల్లి చెరువు, కరీంనగర్ కార్పొరేషన్‌లో రేకుర్తిలోని పెంటకమ్మ చెరువు వద్ద వేడుకలు నిర్వహించనున్నారు. బుధవారం ఆయా గ్రామాల్లోని చెరువుల వద్ద సమావేశ వేదికతోపాటు భోజనం చేసే స్థలాలను సర్పంచులు చదును చేయించారు. టెంట్లు, కుర్చీలు, డీజే సౌండ్ సిస్టం, లైటింగ్ ఏర్పాటు చేశారు. సాయంత్రం కట్ట మైసమ్మకు పూజలు, మహిళలతో బోనాలు, బతుకమ్మ, కోలాటం తదితర ఆటలు నిర్వహించేందుకు అవసరమైన ఏర్పాట్లను చేస్తున్నారు. బుధవారం ఆర్డీవో ఆనంద్‌కుమార్, తహసీల్దార్ కన్నం నారాయణ, ఎంపీడీవో జగన్మోహన్‌రెడ్డి, పీఆర్ ఏఈ రమణారెడ్డి తదితరులు పలు గ్రామాల్లో పర్యటించి ఏర్పాట్లను పరిశీలించారు. చెరువు పండుగను విజయవంతం చేసేందుకు అవసరమైన చర్యలు చేపట్టాలని సర్పంచులు, కార్యదర్శులకు సూచించారు.

నగునూరులో చేపలు.. ఫకీర్‌పేటలో చికెన్ బిర్యాణి

చెరువుల పండుగలో పాల్గొనే గ్రామస్తులకు చికెన్‌తో పాటు కూరగాయల భోజనం పెట్టాలని అధికారులు సర్పంచులకు సూచించారు. అయితే అన్ని గ్రామాల్లోని సర్పంచులు చికెన్‌తో భోజనం పెడుతుండగా నగునూరులో మాత్రం సర్పంచ్ ఉప్పుల శ్రీధర్ గురువారం మృగశిర కార్తె ప్రవేశిస్తుండటంతో చికెన్‌కు బదులుగా చేపల కూరను పెట్టేందుకు నిర్ణయించారు. ఫకీర్‌పేటలో సర్పంచ్ కటకం నందయ్య చికెన్ భోజనానికి బదులుగా చికెన్ బిర్యాణి పెట్టేందుకు అవసరమైన ఏర్పాట్లు చేస్తున్నారు.



బొమ్మకల్ చెరువులో బతుకమ్మ ఘాట్ వద్ద తుంగను తొలగిస్తున్న కూలీలు

ప్రారంభానికి సిద్ధం



స్మార్ట్‌సిటీ అభివృద్ధిలో భాగంగా కరీంనగర్‌లోని తెలంగాణ చౌక్‌లో చేపట్టిన కూడలి పనులు పూర్తయ్యాయి. విద్యుత్ దీపాలతో అలంకరించి ప్రారంభానికి సిద్ధం చేశారు.

– సాక్షి ఫొటోగ్రాఫర్, కరీంనగర్

ఉద్యోగికి 'గ్యారంటీ' భరోసా

సీపీఎస్‌తో పోలిస్తే మరింత మెరుగ్గా జీపీఎస్

- రిటైర్‌మెంట్ తర్వాత చివరి నెల బేసిక్‌లో 50 శాతం మొత్తం పెన్షన్‌తో పాటు ఏటా 2 డీఆర్‌లు
- త్వరలో 12వ పీఆర్సీ ఏర్పాటు
- 10వేల మంది కాంట్రాక్టు ఉద్యోగుల క్రమబద్ధీకరణ
- 6,840 కొత్త పోస్టుల మంజూరు
- ప్రభుత్వంలో ఆంధ్రప్రదేశ్ వైద్య విధాన పరిషత్ విలీనం
- మంత్రివర్గ సమావేశం అనంతరం మీడియాకు వెల్లడించిన మంత్రి వేణుగోపాలకృష్ణ

సాక్షి, అమరావతి: ఆంధ్రప్రదేశ్‌లో శాశ్వత, కాంట్రాక్టు, సీపీఎస్ ఉద్యోగులకు ప్రభుత్వం తీపి కబురు చెప్పింది. కాంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీమ్ (సీపీఎస్) ఉద్యోగులకు మెరుగైన పెన్షన్ అందించేలా గ్యారంటీ పెన్షన్ స్కీమ్ (జీపీఎస్)ను రూపొందించింది. దీనిద్వారా ఉద్యోగ విరమణ తర్వాత ఆర్థిక భద్రత చేకూరనుంది. రిటైర్ అయిన ఉద్యోగి చివరి నెల మూలవేతనంలో 50 శాతం పెన్షన్, ప్రతి ఆర్నెల్లకు ఒకసారి కరువు భృతి (డీఆర్) ఇవ్వడం ద్వారా మెరుగైన పెన్షన్‌ను అందించనుంది. దీంతోపాటు ఉద్యోగులు అడగకుండానే 12వ పే రివిజన్ కమిషన్ (పీఆర్సీ) ఏర్పాటుతోపాటు 10 వేల మంది కాంట్రాక్టు ఉద్యోగుల క్రమబద్ధీకరణ లాంటి కీలక అంశాలకు బుధవారం సచివాలయంలో సీఎం వైఎస్ జగన్ అధ్యక్షతన సమావేశమైన మంత్రివర్గం ఆమోదం తెలిపింది. అనంతరం సమాచార, పౌరసంబంధాల శాఖ మంత్రి చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణ మీడియాకు వివరాలు వెల్లడించారు. మాటప్రకారం సీఎం జగన్ కాంట్రాక్టు ఉద్యోగుల దశాబ్దాల కలను నెరవేర్చారని చెప్పారు. రాష్ట్ర భవిష్యత్తు, ఉద్యోగుల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని జీపీఎస్‌ను తీర్చిదిద్దినట్లు వివరించారు. రిటైర్డ్ ఉద్యోగులకు పూర్తి భద్రతనిచ్చేలా రూపొందించిన జీపీఎస్ దేశానికే ఆదర్శంగా నిలుస్తుందని విశ్వాసం వ్యక్తం చేశారు. మంత్రి వేణు ఇంకా ఏమన్నారంటే..

జీపీఎస్‌తో గ్యారంటీ ఇలా..

సీపీఎస్‌కు ప్రత్యామ్నాయంగా రాష్ట్ర ప్రభుత్వం తీసుకొచ్చిన జీపీఎస్ విధానం ఉద్యోగ విరమణ తర్వాత పెన్షన్‌కు పూర్తి గ్యారంటీ ఇస్తుంది. ఇందులోనూ సీపీఎస్‌లో చెల్లించినట్లే ఉద్యోగి 10 శాతం పెన్షన్ వాటాగా చెల్లిస్తే ప్రభుత్వం కూడా అంతే కడుతుంది. ఉద్యోగ విరమణ సమయంలో చివరి జీతంలో బేసిక్‌లో 50 శాతం పెన్షన్‌గా అందుతుంది. ఇక్కడ సీపీఎస్‌తో పోలిస్తే పెన్షన్ 150 శాతం అధికంగా ఉంటుంది. ద్రవ్యోల్బణాన్ని దృష్టిలో పెట్టుకుని కేంద్ర ప్రభుత్వం ప్రతి ఆర్నెళ్లకు ఒకసారి ప్రకటించే డీఏలను పరిగణనలోకి



తీసుకుని రాష్ట్ర ప్రభుత్వం ఏడాదికి రెండు డీఆర్‌లు ఇస్తుంది. ఉదాహరణకు రిటైరైన ఉద్యోగి చివరి నెల బేసిక్ జీతం రూ.లక్ష ఉంటే అందులో రూ.50 వేలు పెన్షన్‌గా వస్తుంది. ఏడాదికి రెండు డీఆర్‌లతో కలుపుకొని ఇది ఏటా పెరుగుతుంది. 62 ఏళ్లకు రిటైర్ అయ్యే వ్యక్తి మరో ఇరవై ఏళ్ల తర్వాత అంటే 82 ఏళ్ల వయసులో జీపీఎస్ ద్వారా రూ.1,10,000 పెన్షన్‌గా తీసుకుంటారు. తద్వారా రిటైర్డ్ ఉద్యోగి జీవన ప్రమాణాలను కాపాడినట్లు అవుతుంది. సీపీఎస్‌లో ఇలాంటి వెసులుబాటు లేదు.

ముఖ్యమంత్రి వైఎస్ జగన్ పాదయాత్రలో ఇచ్చిన మాట ప్రకారం కాంట్రాక్టు ఉద్యోగుల క్రమబద్ధీకరణ ప్రతిపాదనకు మంత్రివర్గం ఆమోదం తెలిపింది. ఇది 2014 జూన్ 2 నాటికి ఐదేళ్లు సర్వీసు ఉన్న కాంట్రాక్టు ఉద్యోగులందరికీ వర్తిస్తుంది. కటాఫ్ తేదీకి 10 ఏళ్లు ఉండాలని అధికారులు సిఫార్సు చేస్తే సీఎం జగన్ ఐదేళ్లకు తగ్గించారు. జిల్లాల పునర్విభజన తర్వాత కొత్త జిల్లాల్లోనూ ఒకేలా హెచ్‌ఆర్‌ఏ ఉండేందుకు అన్ని జిల్లా కేంద్రాల్లో 16% హెచ్‌ఆర్‌ఏ ప్రతిపాదనకు మంత్రివర్గం ఆమోదముద్ర వేసింది. 2022 జనవరి 1వతేదీ నుంచి డీఏ, డీఆర్ 2.73 శాతం ఇచ్చేందుకు కేబినెట్ ఆమోదించింది. దీనివల్ల ప్రభుత్వంపై నెలకు రూ.200 కోట్ల అదనపు భారం పడనుంది.

6,840 కొత్త పోస్టుల మంజూరు

నిరుద్యోగులకు రాష్ట్ర ప్రభుత్వం శుభవార్త తెచ్చింది. వివిధ శాఖల్లో సుమారు 6,840 కొత్త పోస్టుల మంజూరుకు కేబినెట్ ఆమోదించింది. వీటిల్లో 3,920 రిజర్వ్ పోలీసు ఉద్యోగాలు సహా నూతన వైద్య కళాశాలలు, పలు విద్యా సంస్థల్లో భారీ ఎత్తున కొత్త పోస్టులను కల్పించింది. ఏపీ వైద్య విధాన పరిషత్ 1986 యాక్టును రద్దు చేసి 'డైరెక్టరేట్ ఆఫ్ సెకండరీ హెల్త్' శాఖగా మార్చి ప్రభుత్వంలో విలీనం చేయడానికి వీలుగా చట్ట సవరణకు మంత్రివర్గం ఆమోదం తెలిపింది. వైద్య విధాన పరిషత్ స్వయం ప్రతిపత్తి నుంచి ప్రభుత్వంలోకి మారడం ద్వారా 14,658 మంది ఉద్యోగులకు మేలు జరుగుతుంది. వీరికి ప్రభుత్వ ఉద్యోగుల మాదిరిగానే 010 పద్దు కింద వేతనాలను చెల్లించనుంది.

డ్రంకెన్ డ్రైవ్‌కు భయపడి..

రాంగ్‌రూట్లో వెళ్లిన యువకుడు

- ఆర్టీసీ బస్సు ఢీకొని అక్కడికక్కడే మృతి
- కరీంనగర్ జిల్లాకేంద్రంలో ఘటన.. స్థానికుల రాస్తారోకో


శ్రీనివాస్(ఫైల్)

కరీంనగర్ క్రైం: డ్రంకెన్ డ్రైవ్ తనిఖీలు చేస్తున్న పోలీసులను చూసి భయపడి ఓ యువకుడు.. బైక్ వెనక్కి తిప్పి రాంగ్‌రూట్లో వేగంగా వెళ్తుండగా ఎదురుగా వచ్చిన ఆర్టీసీ బస్సు ఢీకొని అక్కడికక్కడే మృతిచెందాడు. ఈ ఘటన కరీంనగర్ జిల్లాకేంద్రంలోని బైపాస్‌రోడ్డులో బుధవారం రాత్రి చోటుచేసుకుంది. స్థానికుల వివరాల మేరకు.. జిల్లాలోని హుజూరాబాద్ మండలం పోతిరెడ్డిపేటకు చెందిన ఎలువాక శ్రీనివాస్(33) పదేళ్లుగా స్థానిక విద్యానగర్‌లో ఉంటూ వెల్డింగ్ పనులు చేస్తున్నాడు. తన సోదరుడి కూతురు పుట్టినరోజు శుక్రవారం ఉండడంతో బుధవారం రాత్రి పనులు పూర్తిచేసుకుని బైక్‌పై స్వగ్రామానికి బయల్దేరాడు. నగరంలోని కోతిరాంపూర్ చౌరస్తా నుంచి బద్దంఎల్లారెడ్డి చౌరస్తా వైపు వెళ్తున్నాడు. అక్కడ పోలీసులు డ్రంకెన్‌డ్రైవ్ తనిఖీలు చేస్తున్నారు. గమనించిన శ్రీనివాస్ బైక్‌ను వెనక్కి తిప్పాడు. పోలీసులు సైతం శ్రీనివాస్‌ను గమనించి అతడు వెనక్కి వెళ్లకుండా ఆపేందుకు యత్నించారు. ఇంతలో బైక్‌ను వేగంగా నడిపిన శ్రీనివాస్ ఎదురుగా వస్తున్న హుజూరాబాద్ డిపోకు చెందిన ఆర్టీసీ బస్సును ఢీకొని అక్కడికక్కడే మరణించాడు.

స్థానికుల ఆందోళన

ఘటనను గమనించిన స్థానికులు పోలీసులపై మండిపడ్డారు. పెద్దఎత్తున గూమికూడి బద్దం ఎల్లారెడ్డి చౌరస్తా సమీపంలో రోడ్డుపై అరగంటపాటు ఆందోళనకు దిగారు. డ్రంకెన్ డ్రైవ్ తనిఖీల కారణంగానే శ్రీనివాస్ మృతిచెందాడని ఆరోపించారు. ట్రాఫిక్ జాం కావడంతో పోలీసు అధికారులు ఘటనాస్థలానికి చేరుకొని ఆందోళన విరమింపజేశారు. శ్రీనివాస్ మృతదేహాన్ని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

కల్తీ కల్లు అమ్మిన వ్యక్తికి పదేళ్ల జైలు

మనోహరాబాద్(తూప్రాన్): కల్తీ కల్లు అమ్మిన వ్యక్తికి మెదక్ కోర్టు 10 ఏళ్ల జైలు శిక్ష విధించింది. బుధవారం నర్సాపూర్ ఎక్సైజ్ సీఐ పద్మ ఈ కేసు వివరాలు వెల్లడించారు. 2016లో మనోహరాబాద్ మండలం ముప్పిరెడ్డిపల్లిలోని కల్లు దుకాణంలో తనిఖీలు నిర్వహించి కల్లు శాంపిల్‌ను నిజామాబాద్‌కు పంపగా అందులో నిషేధిత ఆల్‌ప్రాజోలం అనే మత్తు పదార్థం ఉన్నట్లు నిర్ధారణ అయింది. దీనిపై ఎక్సైజ్ అధికారులు కేసు నమోదు చేశారు. విచారణ అనంతరం ఈ ఘటనతో సంబంధమున్న నర్సాగౌడ్ అనే వ్యక్తికి మెదక్ అడిషనల్ జడ్జి లక్ష్మీశారద పదేళ్ల జైలు శిక్షతోపాటు లక్ష రూపాయల జరిమానా విధించింది. తీర్పు తర్వాత నర్సాగౌడ్‌ను ఎక్సైజ్ పోలీసులు సంగారెడ్డి జైలుకు తరలించారు.

విచారణకు శైలజ కిరణ్ సహకరించలేదు

పదే పదే ఆటంకాలు కల్పించారు

- ప్రశ్నించే అధికారులను అడ్డుకునేందుకు మార్గదర్శి సిబ్బంది ప్రయత్నించారు..
- 25% విచారణ కూడా పూర్తి కాలేదు.. చట్టానికి లోబడే మార్గదర్శి కేసు విచారణ
- శైలజతోపాటు రామోజీని మరోసారి విచారిస్తాం
- త్వరలో మార్గదర్శి నిధుల అటాచ్‌మెంట్ కోసం పిటిషన్
- చందాదారుల ప్రయోజనాల పరిరక్షణకే నిధుల అటాచ్‌మెంట్
- సీఐడీ అదనపు ఎస్పీ రవికుమార్

సాక్షి, అమరావతి: మార్గదర్శి చిట్‌ఫండ్స్ ఆర్థిక అక్రమాల కేసులో నిందితులుగా ఉన్న చెరుకూరి రామోజీరావు, శైలజ కిరణ్ విచారణకు ఏమాత్రం సహకరించడంలేదని, అయినప్పటికీ తాము చట్టానికి లోబడే విచారణ జరుపుతున్నామని సీఐడీ అదనపు ఎస్పీ రవికుమార్ స్పష్టం చేశారు. ఈనాడు, ఈటీవీ మీడియా సంస్థలు ఉద్దేశపూర్వకంగానే సీఐడీ విచారణపై నిరాధార ఆరోపణలతో తప్పుడు ప్రచారం చేస్తున్నాయన్నారు. ఆయన బుధవారం వెలగపూడిలోని సచివాలయంలో సీఐడీ ఐజీ సీహెచ్ శ్రీకాంత్‌తో కలిసి విలేకరుల సమావేశంలో మాట్లాడారు. తాము శైలజ కిరణ్‌ను ఎలాంటి వేధింపులకు గురిచేయలేదని, ఆమె పట్ల పూర్తి మర్యాదతో వ్యవహరించామని చెప్పారు. ఆమె భోజనం, టీ, మందుల కోసం అవసరమైన ప్రతిసారీ అవకాశం కల్పించామన్నారు. మార్గదర్శి చిట్‌ఫండ్స్ చట్టాన్ని ఉల్లంఘించి అక్రమాలకు పాల్పడినట్టు కచ్చితమైన ఆధారాలు లభించాయని రవికుమార్ స్పష్టం చేశారు. విచారణ కోసం మంగళవారం శైలజ కిరణ్ నివాసానికి వెళ్లినప్పుడు తమ సిబ్బందిలోని 10 మందిని అనుమతించకుండా అభ్యంతరం తెలిపారన్నారు. ఆర్థిక అక్రమాలను సంబంధించి ఆధారాలపై ప్రశ్నించాల్సిన సాంకేతిక అధికారులను అడ్డుకునేందుకు మార్గదర్శి చిట్‌ఫండ్స్ సిబ్బంది ప్రయత్నించారని తెలిపారు. తాము చట్టం పరిధిలోనే విచారిస్తున్నప్పటికీ శైలజ కిరణ్ విచారణకు ఏమాత్రం సహకరించకుండా పదే పదే ఆటంకాలు కల్పించేందుకు యత్నించారని చెప్పారు. అక్రమాలకు పాల్పడిన మార్గదర్శి చిట్‌ఫండ్స్ ఎండీగా పూర్తి సమాచారాన్ని ఆమె వద్ద ఉంచుకోలేదని, ఇది ఉద్దేశపూర్వకంగానే చేశారని తెలిపారు. ఎండీ వద్ద పూర్తి సమాచారం ఉండాల్సిన అవసరం లేదని కూడా ఆమె వ్యాఖ్యానించారని చెప్పారు. చట్టానికి విరుద్ధంగా నిధుల మళ్లింపుపై వాస్తవాలను కప్పిపుచ్చేందుకు ఆమె పదే పదే ప్రయత్నించారన్నారు. విచారించిన ప్రతిసారీ ఏదో సాకుతో తప్పించుకోవాలన్నదే ఆమె ఉద్దేశంగా ఉందన్నారు. శైలజ కిరణ్ పదే పదే ఆటంకాలు కల్పిస్తుండటంతో తాము అడగాల్సిన ప్రశ్నల్లో 25 శాతం కూడా అడగలేకపోయామని వివరించారు. అందుకే మరోసారి నోటీసులు జారీ చేసి ఆమెను విచారిస్తామని తెలిపారు. ఈ కేసులో రామోజీరావును కూడా మరోసారి విచారిస్తామని చెప్పారు. చందాదారుల ప్రయోజనాలను పరిరక్షించేందుకు మార్గదర్శి చిట్‌ఫండ్స్ నిధులు రూ.793.50 కోట్లను అటాచ్ చేసేందుకు న్యాయస్థానంలో త్వరలోనే పిటిషన్ దాఖలు చేస్తామని ఆయన తెలిపారు.


మీడియాతో మాట్లాడుతున్న సీఐడీ అధికారులు రవికుమార్, శ్రీకాంత్

ధనవంతుల కోసమే ధరణి: వీహెచ్

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలోని ధనిక రైతుల కోసమే ధరణి పోర్టల్ ఉపయోగపడుతోందని మాజీ ఎంపీ, సీనియర్ కాంగ్రెస్ నేత వి.హనుమంతరావు విమర్శించారు. ఆయన బుధవారం గాంధీ భవన్‌లో విలేకరులతో మాట్లాడుతూ నాగర్‌కర్నూల్ సభలో సీఎం కేసీఆర్ ధరణి పోర్టల్ గురించి చాలా దృఢమైన వ్యాఖ్యలు చేశారని, ఆయన ప్రజల నుంచి నేరుగా వాస్తవాలు తెలుసుకుని మాట్లాడితే బాగుండేదని చెప్పారు. గతంలో పేదలకు పంపిణీ చేసిన భూములపై ధరణి పోర్టల్ ద్వారా అప్పటి యజమానులు హక్కులు పొందుతున్నారని చెప్పారు.

మా రూటే సెప'రేటు'!

▶ మొదటి పేజీ తరువాయి

బ్రోకెన్ రైస్ ఉంటే ఎఫ్‌సీఐ తీసుకోదని.. బ్రోకెన్ తక్కువగా వచ్చే జిల్లాల నుంచి ధాన్యం తెచ్చి పెట్టేలా వెసులుబాటు ఇవ్వాలంటూ రాష్ట్ర పౌరసరఫరాల శాఖను కోరాలని వారికి సూచించడమే కాకుండా.. అన్నీ తానై చక్కదిద్దారు. అనుమతి రాగానే యాదాద్రి జిల్లా నుంచి బియ్యాన్ని దిగుమతి చేసుకునేలా మిల్లర్ల సంఘానికి చెందిన ఓ రాష్ట్ర స్థాయి నేతతో కుమ్మక్కయ్యారు.

డబ్బులు చెల్లించిన వారెవరంటే..

అయిజకు చెందిన దేవుడి పేరిట ఉన్న రెండు మిల్లుల యజమానులు సుమారు 35 ఏసీకేలు, గద్వాల ప్రాంతంలో బీరెల్లికి వెళ్లే రహదారి మార్గంలోని రెండు మిల్లుల యజమానులు సుమారు 20 ఏసీకేలు, జమ్ములమ్మ దేవాలయం ప్రాంతంలోని ఓ మిల్లు యజమాని సుమారు 8 ఏసీకేలు, కేటీదొడ్డి మండల పరిధిలో ఉన్న ఓ మిల్లు యజమాని 15 ఏసీకేలు, ఇటిక్యాల మండలం బీచుపల్లి పరిసర ప్రాంతంలోని ఓ మిల్లు యజమాని 25 ఏసీకేలకు సంబంధించిన డబ్బులను యాదాద్రి జిల్లాలోని రైస్ మిల్లు సంఘం రాష్ట్ర నాయకుడి ఖాతాలో జమ చేసినట్లు సమాచారం. దీనిపై గద్వాల జిల్లా డీసీఎస్‌ఓ రేవతిని సంప్రదించగా.. డబ్బులు తీసుకుంటున్నట్లు వచ్చిన ఆరోపణలు వాస్తవం కాదన్నారు.

ముగిసిన ఫుట్‌బాల్ పోటీలు

రామకృష్ణాపూర్: మంచిర్యాల జిల్లా రామకృష్ణాపూర్‌లోని సింగరేణి ఠాగూర్ స్టేడియంలో మూడు రోజులుగా నిర్వహిస్తున్న తెలంగాణ రాష్ట్రస్థాయి 9వ జూనియర్ బాలికల ఫుట్‌బాల్ ఛాంపియన్‌షిప్ పోటీలు బుధవారం ముగిశాయి. పోటీల్లో ఉమ్మడి ఎనిమిది జిల్లాల జట్లు పాల్గొనగా నల్గొండ జట్టు ప్రథమ స్థానం, నిజామాబాద్ జట్టు ద్వితీయ స్థానాలను కైవసం చేసుకున్నాయి. సెమీఫైనల్స్‌కు చేరిన మంచిర్యాల జట్టు, మెదక్ జిల్లా జట్టు మూడో స్థానంలో నిలిచాయి. ఫైనల్ మ్యాచ్ నల్గొండ, నిజామాబాద్ జట్ల హోరాహోరీగా సాగగా ఒకేఒక్క గోల్‌తో నల్గొండ విజేతగా నిలిచింది. జిల్లా ఫుట్‌బాల్ అసోసియేషన్ చైర్మన్ డాక్టర్ కుమారస్వామి, రిటైర్డ్ ఏసీపీ రవికుమార్ ముఖ్య అతిథులుగా హాజరై బహుమతులు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఫుట్‌బాల్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి పిన్నింటి రఘునాథ్‌రెడ్డి, జిల్లా ఉపాధ్యక్షుడు ఈశ్వరాచారీ, ఒలింపిక్ సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు కనపర్తి రమేష్, వివిధ క్రీడా సంఘాల బాధ్యులు పుల్లూరి సుధాకర్, బాబురావు, వెంకటేశ్వర్‌రెడ్డి, రామ్మోహన్ తదితరులు పాల్గొన్నారు.


విజేత నల్గొండ, రన్నరప్ నిజామాబాద్ జట్లకు బహుమతి ప్రదానం

'ఆరోపణలు కాదు.. ఆధారాలున్నాయి..'

బెల్లంపల్లిరూరల్: బెల్లంపల్లి ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య తనను లైంగిక వేధింపులకు గురిచేసిన పూర్తి ఆధారాలు ఉన్నాయని, ఆరోపణలు చేయడం లేదని ఆరిజిన్ డెయిరీ భాగస్వామి బోడపాటి శేజల్ తెలిపారు. బుధవారం సాయంత్రం ఆమె సామాజిక మాధ్యమాల్లో ఓ వీడియో, ఫొటో విడుదల చేసింది. చిన్నయ్య అనుచరులు తన వద్ద ఎలాంటి ఆధారాలు లేవని, కేవలం చిన్నయ్యను రాజకీయంగా దెబ్బతీయడానికి అసత్య ఆరోపణలు చేస్తున్నాననడం విడ్డూరంగా ఉందని పేర్కొంది. బిజినెస్ మీటింగ్ అని చెప్పి హైదరాబాద్‌లోని ఎమ్మెల్యే క్వార్టర్స్‌కు పిలిపించి బలవంతంగా మద్యం తాగించే యత్నం చేశాడని ఆరోపించింది. పోలీసులకు పూర్తి ఆధారాలతో ఫిర్యాదు చేస్తే ఆధారాలను డిలీట్ చేస్తున్నారని వాపోయింది. తన దగ్గర పూర్తి ఆధారాలు ఉన్నాయని, చిన్నయ్య అనుచరులు ఇష్టారీతిన మాట్లాడితే సహించేది లేదని హెచ్చరించింది.

ఇందారంలో లారీ డ్రైవర్ల ఆందోళన

జైపూర్: రైస్‌మిల్లర్లు లారీల్లో తెచ్చిన ధాన్యాన్ని దిగుమతి చేసుకోవడం లేదని, వెంటనే దించుకోవాలని డిమాండ్ చేస్తూ మంచిర్యాల జిల్లా జైపూర్ మండలం ఇందారం వరలక్ష్మి రైస్‌మిల్లు ఎదుట రాజీవ్ రహదారిపై బుధవారం లారీల డ్రైవర్లు ఆందోళన చేపట్టారు. ధాన్యం లోడ్‌తో ఉన్న లారీలను రోడ్డుపై అడ్డుగా ఉంచారు. జిల్లాలోని జైపూర్, భీమారం, చెన్నూర్, కోటపల్లి, నీల్వాయి, కన్నెపల్లి, భీమిని, బెల్లంపల్లి తదితర కొనుగోలు కేంద్రాల్లో నిర్వాహకులు సుమారు 48లారీల వరి ధాన్యాన్ని జైపూర్ మండలం ఇందారం వరలక్ష్మి రైస్‌మిల్లులో దించాలని సూచించారని తెలిపారు. లారీలను రైస్‌మిల్ దగ్గరకు తీసుకువచ్చి ఆరు రోజులుగా పడిగాపులు కాస్తున్నా ధాన్యం దించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. దుమ్ము, ధూళితో తిండితిప్పలు లేక తీవ్ర ఇబ్బంది పడుతున్నామని లారీ డ్రైవర్లు తెలిపారు. మాయిశ్చర్ రాలేదని, స్థలం లేదని, హమాలీ కొరత సాకులతో ధాన్యం దించుకోవడం లేదని వాపోయారు. ఆందోళకారులతో మంచిర్యాల జిల్లా అదనపు కలెక్టర్ సివిల్ సప్లయ్ అధికారులతో ఫోన్‌లో మాట్లాడి వెంటనే ధాన్యం దించుకునే విధంగా రైస్‌మిల్లర్ల యాజమాన్యంతో మాట్లాడి సమస్య పరిష్కరించాలని సూచించారు. హమాలీ కొరత మూలంగా కొంతజాప్యం చోటుచేసుకుంటోందని, వెంటనే ధాన్యం దించేలా ఏర్పాట్లు చేస్తామని హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు. వీరి ఆందోళనకు సమతా సైనిక్ దళ్ రాష్ట్ర నాయకుడు మార్షల్ దుర్గం నగేశ్ మద్దతు తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు బండారి శివశంకర్, మల్లేశ్, శివరామకృష్ణ, లింగయ్య, రమేశ్, బాబా, ఆవుల శ్రీను, హరిబాబు, అశోక్, సుమారు 40మందికిపైగా లారీ డ్రైవర్లు పాల్గొన్నారు.


ఇందారం వరలక్ష్మి రైస్ మిల్లు వద్ద రాజీవ్ రహదారిపై రోడ్డుపై అడ్డుగా లారీలు

ప్రశాంతంగా సెమిస్టర్ పరీక్షలు

భైంసా: నిర్మల్ జిల్లా బాసర ఆర్జీయూకేటీలో ఎండ్ సెమిస్టర్ పరీక్షలు ప్రశాంతంగా కొనసాగుతున్నాయి. పీయూసీ 1, 2 విద్యార్థులకు 19వరకు పరీక్షలు జరుగనున్నాయి. మొదటి పరీక్ష ప్రారంభం సందర్భంగా వర్సిటీ డైరెక్టర్ సతీష్‌కుమార్ పరీక్షలను పరిశీలించారు.


పరీక్షలు పరిశీలిస్తున్న డైరెక్టర్ సతీష్‌కుమార్

'సాక్ష్యం' పథకంతో అంగన్‌వాడీలకు మహర్దశ

- కేంద్రాల్లో కార్పొరేట్ వసతుల కల్పనకు కసరత్తు
- ఆటపాటల ద్వారా విద్యాబోధన
- విడతల వారీగా వసతుల ఏర్పాటు
- సెంటర్ల ఎంపికపై ఉన్నతాధికారులకు ప్రతిపాదనలు



కరీంనగర్: చిన్నారులకు పౌష్టికాహారం, ఆటపాటలతో పూర్వ ప్రాథమిక విద్యను అందించాలన్న లక్ష్యంతో ప్రభుత్వం అంగన్‌వాడీ కేంద్రాలను ఏర్పాటు చేసింది. ప్రస్తుతం వాటిని బలోపేతం చేసేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సిద్ధమయ్యాయి. మౌలిక వసతులు, సాంకేతిక సౌకర్యాలను కల్పించి తద్వారా పిల్లల విద్య విజ్ఞానాభివృద్ధికి చర్యలు చేపట్టేందుకు కేంద్ర మహిళా శిశుసంక్షేమ శాఖ శ్రీకారం చుట్టింది. 'సాక్ష్యం' అనే నూతన పథకం పేరిట అంగన్‌వాడీ కేంద్రాలను ఉన్నతీకరించి అభివృద్ధిపర్చేందుకు కసరత్తు ముమ్మరం చేసింది. ఈ పథకం ఆచరణలోకి వస్తే అంగన్‌వాడీ కేంద్రాల రూపురేఖలు మారనున్నాయి. ఈనేపథ్యంలో నిబంధనల ప్రకారం అన్ని వసతులున్న అంగన్‌వాడీ కేంద్రాల వివరాలను అందజేయాలని మహిళా శిశు సంక్షేమ శాఖ నుంచి జిల్లా అధికారులకు ఆదేశాలు జారీ అయ్యాయి. దీంతో సమగ్ర సమాచారాన్ని సేకరించి జిల్లాలో 190 కేంద్రాలను ప్రతిపాదిస్తూ వాటి వివరాలను పంపించారు. ఎంపికైన అంగన్‌వాడీ కేంద్రాల్లో నూతన పథకం ద్వారా నిధులను మంజూరు చేసి ఆధునిక సాంకేతిక వసతులు కల్పించనున్నారు..

పథకం అమలు నిబంధనలు

సాక్ష్యం పథకం అమలుకు అంగన్‌వాడీ కేంద్రాలు సొంత భవనాలు కలిగి ఉండాలి. చుట్టూ పెరటి తోటల పెంపకం కోసం అవసరమైన ఖాళీ స్థలం ఉండాలి. తాగునీరు, విద్యుత్ సౌకర్యాలతోపాటు ఇంకుడు గుంతల తవ్వకానికి స్థలం కలిగి ఉండాలని నిర్దేశించారు.

కరీంనగర్ జిల్లాలో 777 అంగన్‌వాడీ కేంద్రాలు

కరీంనగర్ జిల్లాలో మొత్తం నాలుగు ఐసీడీఎస్ ప్రాజెక్టులు ఉండగా వాటి పరిధిలో మొత్తం 777 అంగన్‌వాడీ కేంద్రాలు ఉన్నాయి. అందులో 281 కేంద్రాలకు సొంత భవనాలు ఉండగా, 255 కేంద్రాలు అద్దె భవనాల్లో నడుస్తున్నాయి. మిగతా 241 ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలల్లో కొనసాగుతున్నాయి. వీటిలో మొత్తం 7 నెలల నుంచి 3 ఏళ్లలోపు వయసు పిల్లలు 19,771 మంది, మూడేళ్ల నుంచి ఆరేళ్లలోపు 11,654 మంది పిల్లలు ఉన్నారు. మహిళా శిశు సంక్షేమ శాఖ నూతనంగా అమలు చేసే సాక్ష్యం పథకంకు ఎంపికైన అంగన్‌వాడీ కేంద్రాల్లో విడతల వారీగా రూ.లక్ష చొప్పున నిధులు మంజూరు చేస్తారు. వీటితో కేంద్రాల్లో ఇంటర్నెట్ సౌకర్యం కోసం కావలసిన పరికరాలను అమరుస్తారు. మినీ ఆర్వో ప్లాంటు ఏర్పాటు, టీవీ, వీడియో పద్ధతిలో పిల్లలకు ఆటపాటల ద్వారా బోధించేందుకు అవసరమైన ఉపకరణాలను అందుబాటులో ఉంచుతారు. గదుల్లో ఆధునిక బోర్డులతో పాటు పిల్లలు కూర్చుని చక్కగా రాసేందుకు వీలుగా లర్నింగ్ కార్నర్స్ పేరిట మూడు అడుగుల ఎత్తులో రంగురంగుల బోర్డులను ఏర్పాటు చేస్తారు. ఈ పథకం కింద ఎంపికైన అంగన్‌వాడీ కేంద్రాలను ఇక నుంచి 'సాక్ష్యం' అంగన్‌వాడీ కేంద్రాలుగా పిలుస్తారు.

విద్యాభివృద్ధికి దోహదం



'సాక్ష్యం' పథకం అంగన్‌వాడీ కేంద్రాల అభివృద్ధికి దోహదపడుతుంది. పిల్లలు ఆటపాటలతో చక్కగా చదువుకునేలా సాంకేతిక సౌకర్యాలు కల్పిస్తాం. జిల్లాలో మొత్తం 777 అంగన్‌వాడీ కేంద్రాలు ఉన్నాయి. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు సొంత భవనాలు, మౌలిక వసతులు కలిగిన కేంద్రాలను ప్రతిపాదిస్తూ వివరాలను పంపించాం.

– సంధ్యారాణి, జిల్లా మహిళా శిశు సంక్షేమ శాఖ అధికారి

బొగ్గుగని కార్మికుల పీఎఫ్ డిజిటలైజేషన్

- దేశంలోని 3 లక్షల మంది వివరాలు కంప్యూటరీకరణ
- సీఎంపీఎఫ్ కేంద్ర కమిషనర్ వీకే మిశ్రా

గోదావరిఖని: దేశంలోని మూడు లక్షల మంది బొగ్గు గని కార్మికుల కోల్‌మైన్స్ ప్రావిడెంట్ ఫండ్ వివరాలు డిజిటలైజేషన్ చేస్తున్నట్లు కేంద్ర సీఎంపీఎఫ్ కమిషనర్ వికేమిశ్రా వెల్లడించారు. బుధవారం పెద్దపల్లి జిల్లా గోదావరిఖనిలోని ఇల్లెందు క్లబ్‌లో కార్మిక సంఘాలు, సింగరేణి యాజమాన్యం, సీఎంపీఎఫ్ అధికారుల త్రైపాక్షిక సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. త్వరలో దీనికి సంబంధించిన యాప్‌ను అందుబాటులోకి తీసుకురానున్నట్లు వెల్లడించారు. దీనివల్ల ప్రతి కార్మికుడి సెల్‌ఫోన్‌లో పూర్తి సమాచారం అందుబాటులోకి వస్తుందన్నారు. పూర్తిస్థాయి డిజిటలీకరణ కోసం ప్రతి కంపెనీ నుంచి కార్మికులు, నామినీల సమాచారం వెంటనే అందించాలన్నారు. కార్మిక సంఘాల అభిప్రాయాలు తెలుసుకోవాలనే ఉద్దేశంతో దేశవ్యాప్తంగా సమావేశాలు నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. సింగరేణి డైరెక్టర్(పా) ఎన్.బలరాం మాట్లాడుతూ తమ కంపెనీలో కార్మికులకు సీఎంపీఎఫ్ ఉద్యోగ విరమణ చేసిన వెంటనే అందించేలా చర్యలు తీసుకున్నామన్నారు. ప్రతి ఏరియాలో రిటైర్డ్ అయిన కార్మికుల పింఛన్ తదితర సమస్యల పరిష్కారానికి ఏరియా టెర్మినల్ బెనిఫిట్ సెల్స్ ఏర్పాటు చేశామని పేర్కొన్నారు. కార్మికులకు సమస్యలు ఉంటే తమ దృష్టికి తీసుకొస్తే వారం రోజుల్లో పరిష్కరించేందుకు కృషి చేస్తామన్నారు. కార్మికులు గోదావరిఖనిలోని సీఎంపీఎఫ్ కార్యాలయానికి వెళ్లడంలో ఇబ్బందులు ఎదురవుతున్నాయని యూనియన్ నాయకులు ఫిర్యాదు చేయగా తాను స్వయంగా వెళ్లి మాట్లాడతానని డైరెక్టర్ హామీ ఇచ్చారు. డిజిటలీకరణకు సింగరేణి సంస్థ పూర్తి సహకారం అందిస్తుందన్నారు. ఇప్పటికే తమ వద్ద కార్మికులందరికీ సంబంధించిన సమగ్ర సమాచారం శాప్ ద్వారా అందుబాటులో ఉందని, ఇతర సమాచారం కూడా సమకూర్చి వెంటనే సీఎంపీఎఫ్ బోర్డుకు అందిస్తామని పేర్కొన్నారు. కార్మిక సంఘాల నాయకులు మాట్లాడుతూ దాదాపు 20 ఏళ్ల తర్వాత సింగరేణి ప్రాంతంలో సీఎంపీఎఫ్ కేంద్ర కమిషనర్ త్రైపాక్షిక సమావేశం నిర్వహించడం సంతోషకరమన్నారు. ఉద్యోగ విరమణ పొందిన కార్మికులు ఎదుర్కొంటున్న పీఎఫ్, పింఛన్ సమస్యలపై వివరించారు. కార్మిక సంఘాలు చేసిన సూచనలను పరిశీలిస్తామని కమిషనర్ హామీ ఇచ్చారు. పొరుగు సేవల కార్మికులు చేసిన పనిదినాల ఆధారంగానే 7 శాతం సీఎఫ్ వసూలు చేయాలన్న వినతిపై బోర్డ్ ఆఫ్ ట్రస్టీలతో చర్చించి నిర్ణయం తీసుకుంటామని తెలిపారు. జీఎంలు చింతల శ్రీనివాస్, కె.బసవయ్య, ఎ.కుమార్‌రెడ్డి, సుబ్బారావు, సీఎంపీఎఫ్ రీజినల్ కమిషనర్ హరిపచౌరి, అసిస్టెంట్ కమిషనర్ కనకమ్మ, ఏజీఎం (ఐఆర్) కవితానాయుడు, టీబీజీకేఎస్ అధ్యక్షుడు బి.వెంకట్రావ్, ఏఐటీయూసీ జనరల్ సెక్రటరీ సీతారామయ్య, ఐఎన్టీయూసీ జనరల్ సెక్రటరీ జనక్‌ప్రసాద్, హెచ్‌ఎంఎస్ జనరల్ సెక్రటరీ రియాజ్ అహ్మద్, కార్మిక నాయకులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న కేంద్ర కమిషనర్ మిశ్రా

ఉలెన్ గౌను అల్లాలంటే...
పాపాయి మనింట్లోనే ఉండాలా?
మన పాపాయి పెద్దయింది. ఓకే...
మరో ఇంటి బుజ్జి పాపాయి కోసమూ అల్లచ్చు.
మన చుట్టూ...
గౌను అల్లుకునే సమయం లేని అమ్మ ఉంటుంది.
అల్లుకోవడం చేతరాని అమ్మలు ఉంటారు.
ఖరీదైన గౌను కొనుక్కోలేని అమ్మ కూడా ఉంటుంది.
ఆ అమ్మల బిడ్డలకు తాను అమ్మమ్మ ఎందుకు కాకూడదు?
'ఇన్నేళ్లు... మన కోసం మనం జీవించాం.
ఇకపై సమాజం కోసమూ పని చేద్దాం'
తెన్నేటి మాట ఇది.

అనుబంధాల అల్లిక


తెన్నేటి విజయలక్ష్మీ రావు

తెన్నేటి విజయలక్ష్మీరావు 1984లో యూఎస్‌కి వెళ్లారు. పుట్టిన నేల నుంచి దూరంగా వెళ్లేటప్పుడు అదే తన స్థిరనివాసం అవుతుందని అనుకోలేదామె. దాదాపు నలభై ఏళ్లు... అక్కడి నేల, నీరు, గాలితో మమేకమై జీవించిన విజయలక్ష్మి చిన్నప్పటి హాబీలను పునరుద్ధరించుకున్నారు. విశ్రాంత జీవితాన్ని సమాజానికి అంకితం చేస్తున్న విజయలక్ష్మి 'సాక్షి'తో పంచుకున్న వివరాలివి.

అమ్మ ముందుచూపు!

మా అమ్మ చిన్నప్పుడు రకరకాల కుట్లు, అల్లికలు నేర్పించింది. ఇన్ని రకాలెందుకంటే... 'ప్రతిదీ ఒక కళ. అలాగే ఇవన్నీ అన్నం పెట్టే కళలు. ఎప్పుడు ఎలాంటి అవసరం వస్తుందో చెప్పలేం. ఎన్ని నేర్చుకుంటే జీవితానికి అంత భరోసా' అనేది. షార్ట్ హ్యాండ్, టైప్, డ్రాయింగ్, పెయింటింగ్, నిట్టింగ్, క్రోషియో అల్లకం, గార్మెంట్ మేకింగ్‌లో శిక్షణ ఇప్పించింది. అల్లికలతో ఇప్పుడు ప్రతి రోజునూ ఉత్సాహవంతంగా మార్చుకున్నాను. నా హాబీ కరోనా సమయంలో బాగా ఉపయోగపడింది. వందలాది క్లాత్ మాస్కులు కుట్టిచ్చాను. కుట్టిన వాటిని గేటుకు మెయిల్ బాక్స్ పక్కనే మరో బాక్స్ పెట్టి అందులో ఉంచితే అవసరమైన వాళ్లు తీసుకెళ్లేవారు. ఇక్కడి వాళ్లు కొన్ని విషయాల్లో చాలా మంచి విలువలు పాటిస్తారు. తనకు అవసరమైనంత వరకే తీసుకుని మిగిలిన వాటిని అలాగే ఉంచుతారు. ఇక్కడ వాతావరణానికి ఉలెన్ క్యాప్‌లు, సాక్స్, స్వెటర్, బ్లాంకెట్‌లు ఉండి తీరాలి. వాటిని అల్లడం నాకిష్టమైన వ్యాపకం. అవసరమైన వాళ్లకు ఇవ్వడం సంతోషకరం. చిన్న పిల్లల తల్లులు తమ ఉద్యోగాలు, ఇల్లు చూసుకోవడంతో రోజు పూర్తయిపోతుంది. అలాంటి వారికి నా సర్వీస్ చాలా ఉపయోగపడుతోంది. ఇక్కడ అందరికీ నన్ను ఆత్మీయురాలిని చేసింది ఈ హాబీలే. నా కొడుకు పిల్లలకు నానమ్మని. కానీ మా టౌన్‌లో పిల్లలందరికీ అమ్మమ్మని. నా మరో హాబీ వంట. నేను పుట్టింది, పెరిగింది నాగపూర్‌లో. నార్త్, సౌత్ అన్నీ వండుతాను. నేను ఎవరింటికి వెళ్తున్నా, ఏ వేడుకకు వెళ్తున్నా ఏదో ఒక వంట చేసుకుని వెళ్తాను. దాంతో ఫలానా వంట చేసుకురమ్మని మరీ చెబుతారు కూడా.


విజయలక్ష్మి అల్లిన ఊలు గౌను, పిల్లలు ఆడుకునే బొమ్మ.

రోజూ బిజీ!

నాకిప్పుడు 67 ఏళ్లు. మా వారితో కలిసి ఉదయం గార్డెనింగ్ చేస్తాను. నన్ను నేను బిజీగా ఉంచుకోవడానికి ఎన్ని పనులనైనా చేస్తాను. మన నేల మీద రూపుదిద్దుకున్న కళలు, మన సమాజం నేర్పించిన విలువలను ఈ తరానికి పరిచయం చేయడమే ప్రధానంగా ఉంటాయి మా ప్రోగ్రామ్‌లన్నీ. ఇప్పుడు కూడా మేముంటున్న మాన్లియుస్ పట్టణంలో రచయిత, స్వరకర్త వీణాపాణి గారి ప్రోగ్రామ్ కోసం ఏర్పాట్లు చేస్తున్నాం. ఈ పట్టణం న్యూయార్క్, గ్రేటర్ సైరక్యూజ్ పరిధిలోకి వస్తుంది. మాది చిన్న పట్టణం, చాలా సౌకర్యంగా ఉంటుంది జీవనం. యూఎస్ మమ్మల్ని బంధీని చేసినప్పటికీ ఇండియాకి తరచూ వస్తుంటాం.

ఇల్లు.. ఉద్యోగం.. స్నేహితులు

''మా వారు ఫిజిసిస్ట్, పోస్ట్ డాక్టోరల్ ఫెలోషిప్‌తో మనదేశ ఎల్లలు దాటాం. ఆ ఫెలోషిప్ పూర్తయిన తరవాత ఇండియాకి వచ్చేయాలనే ఉద్దేశమే అప్పట్లో. బిడ్డనెత్తుకుని అమెరికా విమానం ఎక్కాను. ఆ వెళ్లడం వెళ్లడం అలాగే ఉండిపోతామని ఏ మాత్రం ఊహించలేదు. ఇండియాలో ఎమ్‌ఈడీ, ఎం ఫిల్ చేసి ఇక్కడికి (యూఎస్) వచ్చాను. కొంతకాలం స్టోర్స్‌లో పార్ట్‌టైమ్ జాబ్స్ చేసి, ఆ తర్వాత కంప్యూటర్స్‌లో అసోసియేట్ డిగ్రీ చేసి క్యారియర్ కార్పొరేషన్‌లో ఉద్యోగంలో చేరాను. అమ్మానాన్న ఓ అబ్బాయి... ఇదీ మా న్యూక్లియర్ ఫ్యామిలీ. ఉద్యోగం, ఇల్లు చూసుకుంటూ భారతీయుల సమావేశాలకు హాజరుకావడం, సాంస్కృతిక, ధార్మిక, సామాజిక సేవా కార్యక్రమాల నిర్వహణలో స్వచ్ఛందంగా పని చేయడంలో చురుగ్గా ఉండేదాన్ని. దాంతో నాకు స్నేహితులూ ఎక్కువే.

జీవితం పరీక్ష పెట్టింది

ఇదిలా ఉండగా జీవితం పెట్టిన విషమ పరీక్ష మా కుటుంబాన్ని కదిలించి వేసింది. మా వారికి తీవ్రమైన అనారోగ్యం, ఆయనకు ఆపరేషన్‌లు జరుగుతుండగా నాకు తరచూ విపరీతమైన తలనొప్పి రావడం మొదలైంది. మొదట్లో ఆయన ఆరోగ్యం గురించి ఆందోళనతో ఒత్తిడి లోనవడంతో తలనొప్పి వస్తోందనుకున్నాం. నాకు 2009లో బ్రెయిన్ సర్జరీ చేయాల్సి వచ్చింది. జీవితం పెట్టిన పరీక్షలో ఇద్దరమూ నెగ్గాం. విజేతలుగా తిరిగి మా జీవితాన్ని కొనసాగించాం. అయితే ఆ పరీక్షలు మాలో చాలా మార్పు తెచ్చాయని తర్వాత తెలిసింది. జీవితం పట్ల, సమాజం పట్ల మా దృష్టి కోణం పూర్తిగా మారిపోయింది. హాబీల పునరుద్ధరణతో నా సెకండ్ ఇన్నింగ్స్ మొదలైంది'' అన్నారు తెన్నేటి విజయలక్ష్మీరావు.

– వాకా మంజులారెడ్డి,
సాక్షి ఫీచర్స్ ప్రతినిధి

రీసైకిల్

'మీ దగ్గర పాడైన పిల్లల సైకిళ్లుంటే ఇవ్వండి. రిపేరు చేసి పేద విద్యార్థులకు ఇస్తాం' అని కేరళలోని ఒక స్కూల్ విద్యార్థులు వాట్సప్‌లో ప్రచారం చేశారు. 30 సైకిళ్లు వస్తే గొప్ప అనుకున్నారు. కాని ఆ స్కూల్ ఉన్న ఊరే కాదు మొత్తం జిల్లాయే స్పందించింది. 122 సైకిళ్లు వచ్చిపడ్డాయి. కేరళ స్పీకర్ వచ్చి జెండా ఊపగా ఇంతకుముందు సైకిల్ లేని పిల్లలందరూ సైకిళ్ల మీద రయ్యిమని దూసుకెళ్లారు. ఎంత బాగుంది ఇది. మన ఊళ్లో చేద్దామా?





ఇలా మన ఊళ్లో చేద్దామా?

'ఇచ్చుటలో ఉన్న హాయి వేరెచ్చటనూ లేనే లేదు' అన్నాడో సినీ కవి. మన దగ్గర ఉన్న దానిలో కాస్తో కూస్తో అక్కర ఉన్నవారికి ఇస్తే, వారి కళ్లల్లో సంతృప్తిని చూస్తే కలిగే హాయి అంతా ఇంతా కాదని కవి భావం.

కేరళలోని కన్నూరు జిల్లాలోని పయ్యనూర్ అనే ఊళ్లో 'షెనాయ్ హయ్యర్ సెకండరీ స్కూల్' అనే స్కూల్ విద్యార్థులు ఈ పాఠం బాగానే వంట బట్టించుకున్నట్టున్నారు. 6 నుంచి 12 తరగతి విద్యార్థులు అక్కడ చదువుకుంటారు. అదే స్కూల్‌లో మన ఎన్.సి.సిలాగా 'స్టూడెంట్ పోలీస్ క్యాడెట్' విభాగం ఉంది. వేసవి సెలవుల్లో ఈ పోలీస్ క్యాడెట్‌లంతా సమ్మర్ క్యాంప్‌లో పాల్గొన్ని పాత వస్తువులను రీయూజ్ చేయడం ఎట్లా అనే అంశంపై ప్రయోగాలు చేశారు. ఆ సమయంలోనే ఆ క్యాడెట్‌కు శిక్షణ ఇచ్చే సి.వి.రాజు అనే టీచర్‌కు 'రీసైకిల్' ఆలోచన వచ్చింది.



స్కూల్‌కు సైకిల్ మీద

షెనాయ్ స్కూల్‌కు చాలా మంది విద్యార్థులు సైకిళ్ల మీద వస్తారు. అయితే సైకిల్ కొనుక్కోలేక, కాలి నడకన వచ్చే విద్యార్థులు చాలామంది ఉన్నారు. 'మాకో సొంత సైకిల్ ఉంటే' అనే భావన వారి కళ్లల్లో కనిపిస్తూ ఉంటుంది. 'చాలామంది తల్లిదండ్రులు సైకిళ్లు కొని పిల్లలు పెద్దవాళ్లయ్యారనో, పాతవయ్యాయనో, పాడయ్యాయనో వాడకుండా ఇళ్లల్లో పడేసి ఉంటారు. అలాంటివి డొనేట్ చేయమని అడుగుదాం. రిపేర్ చేసి మన స్కూల్‌లోని పేద పిల్లలకు ఇద్దాం' అని ఆ టీచర్ ప్రతిపాదిస్తే స్టూడెంట్స్ 'ఓఎస్' అన్నారు.

వాట్సప్ ప్రచారం

'మీరు వాడకుండా పడేసిన సైకిళ్లను పేద విద్యార్థుల కోసం ఇవ్వండి' అనే వాట్సప్ ప్రచారాన్ని షెనాయ్ స్కూల్ విద్యార్థులు మొదలెట్టారు. ఇరవయ్యో ముప్పయ్యో సైకిళ్లు వస్తాయని భావించారు. కాని పయ్యనూర్‌లో మాత్రమే కాదు కన్నూరు జిల్లాలో, పక్కనే కాసర్‌గోడ్ నుంచి కూడా ఎందరో ఫోన్లు చేసి 'సైకిల్ ఉంది తీసుకెళ్లండి' అని చెప్పారు. అనూహ్య స్పందన వచ్చింది. వీటిని సేకరించడానికి ఒక మహానుభావుడు వెహికిల్‌ను అరేంజ్ చేస్తే, కొంతమంది విద్యార్థులు ఆ వెహికిల్ మీద జిల్లా అంతా తిరిగి సైకిళ్లు తెచ్చారు. 122 సైకిళ్లు వచ్చాయి. ఇంకా ఫోన్ కాల్స్ వస్తూనే ఉన్నా చాలని ఆపారు. వచ్చి పడ్డ సైకిళ్లతో స్కూల్ సైకిల్ ఫ్యాక్టరీగా మారింది.

రిపేర్ సేన

ఇప్పుడు స్పేర్‌పార్ట్‌లు, రిపేర్లు ఎలా? కొంత మంది దాతలు స్పేర్‌పార్ట్‌లకు డబ్బులు ఇచ్చారు. కాని ఏ సైకిల్ మెకానిక్ దగ్గరకు వెళ్లి 'పుణ్యకార్యం... రిపేర్లు చేసి పెట్టండి' అంటే ఎవరూ రాలేదు. కాని ప్రేమ్‌రాజ్ అనే మెకానిక్ మాత్రం 'మీకు నేర్పుతాను. మీరే రిపేర్లు చేయండి' అని 44 మంది ఇంటర్ విద్యార్థులను సెలెక్ట్ చేసి మూడు నాలుగు రోజులు ట్రైనింగ్ ఇచ్చాడు. ఇక ఆ ఇంటర్ విద్యార్థులే సైకిల్ మెకానిక్‌లుగా మారి దశల వారీగా రిపేర్లు చేశారు. 'మా టీమ్‌లో అమ్మాయిలు, అబ్బాయిలు ఉన్నారు. అందరం మంచి మెకానిక్‌లుగా రిపేర్లు చేశాం. పెయింట్లు కూడా వేశాం' అని విద్యార్థులు తెలిపారు.

మంచి పనికి పెద్దలు

సైకిళ్లు రెడీ. ప్రతి క్లాస్‌లోని క్లాస్ టీచర్ ఆ క్లాస్‌లో అత్యంత నిరుపేద విద్యార్థులను ఎంపిక చేసి పట్టిక రెడీ చేశారు. ఈ మంచి పని గురించి తెలుసుకున్న అసెంబ్లీ స్పీకర్ ఏ.ఎన్. షమీర్ స్కూల్‌కు హాజరయ్యి విద్యార్థులకు సైకిళ్లు బహూకరించి జెండా ఊపారు. తమకంటూ ఒక సైకిల్ వచ్చినందుకు ఆ పిల్లలంతా సంబరంతో రయ్యిమని తొక్కుతూ ఉంటే అందరూ ఎంతో సంతోషించారు. షెనాయ్ స్కూల్లో సగంమందీ... మిగతా స్కూళ్ల నుంచి సగం మంది పేద విద్యార్థులు ఈ సంవత్సరం తమ సొంత సైకిళ్ల మీద స్కూళ్లకు వెళ్లనున్నారు.

ఇదేం పెద్ద పని కాదు. మన ఊళ్లో ట్రై చేద్దామా!

విజయపథం

టెకోస్టార్

పుణెలోని ఆ ఇంట్లో మరాఠీ, హిందీ పాటలతో పాటు పాఠాలు కూడా వినిపించేవి.

అయితే అవి క్లాస్‌రూమ్ పాఠాలు కాదు. ఎన్నో రంగాలలో ఎన్నో అద్భుత విజయాలు సాధించిన మహిళల గురించిన గెలుపు పాఠాలు. ఆ పాఠాలు వింటూ వింటూ 'నేను కూడా సాధిస్తాను' అన్నది చిన్నారి నేహ.

అవును ఆమె సాధించింది!

ఫోర్బ్స్ అమెరికా 'రిచెస్ట్ సెల్ఫ్–మేడ్ ఉమెన్–2023' జాబితాలో వివిధ రంగాలకు చెందిన వందమంది మహిళలకు చోటు దక్కింది. వీరిలో పదకొండు మంది నలభై ఏళ్ల వయసులోపు ఉన్నవారు. వారిలో ఒకరు 38 సంవత్సరాల టెక్నాలజీ ఎంటర్‌ప్రెన్యూర్ నేహ నర్ఖాడే....

మహారాష్ట్రలోని పుణెలో పుట్టి పెరిగింది నేహ. ఎనిమిది సంవత్సరాల వయసులో ఉన్నప్పుడు తల్లిదండ్రులు తనకు కంప్యూటర్ కొనిచ్చారు. అప్పుడు టెక్నాలజీపై మొదలైన ప్రేమ అలా కొనసాగుతూనే ఉంది. టెక్నాలజీ ఎంటర్‌ప్రెన్యూర్‌గా కొత్త కొత్త విజయాలు సాధించేలా చేస్తూనే ఉంది.

తన బలం 'తల్లిదండ్రులు' అని చెప్పుకుంటుంది నేహ. 'మొదట చదువు విలువ గురించి చెప్పారు. చదువుపై ఆసక్తి పెరిగేలా చేశారు. ఎంతోమంది మహిళా రోల్‌మోడల్స్ గురించి చెప్పేవారు. నువ్వు కూడా ఏదైనా సాధించాలి అంటూనే... యస్. నువ్వు సాధించగలవు అనే ధైర్యాన్ని ఇచ్చారు. ఎప్పటికప్పుడు కొత్త విషయాలు నేర్చుకునేలా ప్రోత్సహించారు' అంటుంది నేహ.

పుణె ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ కంప్యూటర్ టెక్నాలజీలో చదువుకున్న నేహ ... జార్జియా (యూఎస్)లో కంప్యూటర్ సైన్స్‌లో మాస్టర్స్ చేసింది.

జార్జియాలో చదువుకునే రోజుల్లో ఎలాంటి కెరీర్ ఎంచుకోవాలి అనే విషయంలో ఎంతోమంది స్నేహితులతో చర్చిస్తూ ఉండేది. 'ఒరాకిల్'లో ప్రిన్సిపల్ సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌గా తొలి ఉద్యోగం చేసిన నేహ ఆ తరువాత 'లింక్డ్ ఇన్'లో చేరింది. ఆ సమయంలో రకరకాల స్టార్టప్‌లు, వాటి విజయాల గురించి తెలుసుకోవడం మొదలుపెట్టింది.



సొంతంగా ఏదైనా చేయాలనే ఆలోచనతో 'అపాచీ కాఫ్కా' అనే ఓపెన్ సోర్స్ ప్లాట్‌ఫామ్‌కు శ్రీకారం చుట్టింది. కంపెనీలు తమ డాటాతో వేగంగా యాక్సెస్ అయ్యే అవకాశాన్ని ఈ ప్లాట్‌ఫామ్ కల్పిస్తుంది.

'ఎలాంటి జటిలమైన సమస్యను అయినా పరిష్కరించే సామర్థ్యాన్ని పెంచుకోవాలి' అనేది లక్ష్యంగా నిర్ణయించుకుంది. రెండు సంవత్సరాల తరువాత 'కన్‌ఫ్లూయెంట్' అనే ఫుల్–స్కేల్ డాటా స్ట్రీమింగ్ ప్లాట్‌ఫామ్‌ను ప్రారంభించింది నేహ. ప్రపంచవ్యాప్తంగా వేలాది కంపెనీలు 'కన్‌ఫ్లూయెంట్' నుంచి సేవలు పొందుతున్నాయి.

> **టైమ్ మేనేజ్‌మెంట్‌కు ప్రాధాన్యత ఇవ్వాలి. ఒత్తిడికి దూరంగా ఉండాలి. ఏ రోజైనా సరే... చేయాల్సిన పనిపై పక్కా ప్రణాళిక ఉండాలి.**
> – నేహ

కంపెనీకి సంబంధించి భాగస్వాములు, ఉద్యోగులను ఎంచుకోవడంలో నేహ అనుసరించే పద్ధతి ఏమిటి? ఆమె మాటల్లో చెప్పాలంటే... 'తెలివితేటలతో పాటు కష్టపడే స్వభావం ముఖ్యం. వీరితో ఐడియాలు షేర్ చేసుకుంటే సౌకర్యవంతంగా ఉంటుంది అనిపించాలి. సమస్య తలెత్తినప్పుడు మెరుపు వేగంతో పరిష్కరించే సామర్థ్యం ఉండాలి'

నేహ ఎంటర్‌ప్రెన్యూర్‌గా ప్రయాణం మొదలు పెట్టినప్పుడు స్టార్టప్ కల్చర్‌పై ఇప్పుడు ఉన్నంత అవగాహన లేదు. ప్రతి అడుగు ఆచితూచి వేసినా ఎక్కడో ఏదో తప్పు జరుగుతుండేది. వెంటనే ఆ తప్పును దిద్దుకొని ముందుకు సాగేది.

నేహ నర్ఖాడే విజయరహస్యం ఏమిటి?

'వ్యూహాలు, ప్రతివ్యూహాల సంగతి తరువాత. ఎంటర్‌ప్రెన్యూర్‌లకు తప్పనిసరిగా కావాల్సింది మానసిక బలం. ఆ బలం ఉంటే యుద్ధరంగంలో అడుగు ముందుకు వేయగలం. విజయాలు సాధించగలం. ఇది నా దారి... అంటూ పరుగెత్తడం కాదు. చుట్టూ ఏం జరుగుతుందో అనేదానిపై పరిశీలన దృష్టి ఉండాలి. మన తప్పుల నుంచే కాదు ఇతరుల తప్పుల నుంచి ఎన్నో పాఠాలు నేర్చుకోవచ్చు. టైమ్ మేనేజ్‌మెంట్‌కు ప్రాధాన్యత ఇవ్వాలి. ఒత్తిడికి దూరంగా ఉండాలి. ఏ రోజైనా సరే... చేయాల్సిన పనిపై పక్కా ప్రణాళిక ఉండాలి' అంటుంది నేహ.

నేహ ఇప్పుడు ఎంతోమంది మహిళలకు రోల్‌మోడల్, తన రోల్‌మోడల్ మాత్రం ఎలక్ట్రిక్ కార్ స్టార్టప్ 'నియో' ఫౌండర్, సీయివో పద్మశ్రీ వారియర్.

'రోల్‌మోడల్ స్థానంలో మనల్ని మనం చూసుకుంటే వారిలా విజయం సాధించడం కష్టం కాదు' అంటుంది నేహ నర్ఖాడే.

సైబర్ టాక్

టీచర్లూ.. డిజిటల్ పాఠాలకు సిద్ధమేనా?!

టెక్నాలజీ యుగం అవడంతో స్కూల్ పిల్లలు కూడా డిజిటల్ ప్లాట్‌ఫామ్స్‌ను ఎక్కువగా ఉపయోగిస్తున్నారు. గేమింగ్, బ్రౌజింగ్, షాపింగ్.. వంటివి ఎలాంటి సంకోచం లేకుండా వాడేస్తుంటారు. ఇక కొంతమంది పిల్లలు సోషల్‌మీడియా, వాట్సాప్ గ్రూప్‌ల్లో తమకు నచ్చే, నచ్చని టీచర్లపై కామెంట్స్ విసురుతుంటారు. టెక్నాలజీ వాడకంలో పిల్లల నైపుణ్యాలు ఎలా పెరగాలి? భవిష్యత్తు పట్ల వారు ఎంత సురక్షితంగా ఉండాలి? ఈ విషయాల గురించి స్టూడెంట్స్‌కు వివరించడానికి టీచర్లు తమను తాము సిద్ధం చేసుకోవాల్సిన సమయం ఇది.

త్వరలో స్కూళ్లు తిరిగి ప్రారంభమవబోతున్నాయి. ఇప్పటికే వేసవి సెలవుల్లో ఇంట్లో ఉన్న పిల్లలు చాలా వరకు డిజిటల్ అడిక్షన్‌కు లోనై ఉంటారు. దీనితో పాటు స్కూళ్లలో టెక్నాలజీ వాడకం ఈ రోజుల్లో తప్పనిసరి అయ్యింది. ఇలాంటప్పుడు ఆన్‌లైన్ ప్రయోజనాలను పొందుతూనే తమ డేటాను సురక్షితంగా ఉంచడానికి, డిజిటల్ టెక్నాలజీని వాడుతున్నప్పుడు తమను తాము సురక్షితంగా ఉంచుకోవడం ఎలాగో విద్యార్థులకు నేర్పడానికి టీచర్లు సిద్ధమవ్వాలి.

టెక్నాలజీ ప్రయోజనాలివి:

- పిల్లలకు వారి జ్ఞానాన్ని పెంపొందించడానికి వివిధ రకాల సమాచారాన్ని ఇస్తుంది.
- సాంకేతికత పిల్లలను ఒంటరి తనం నుంచి దూరం చేయడానికి, సామాజిక సంబంధాలను మెరుగుపరుచుకోవడానికి భౌతిక అడ్డంకులను తొలగిస్తుంది.
- సాంకేతికత అభ్యాసం వల్ల నైపుణ్యాలు మెరుగుపడతాయి.
- ఆన్‌లైన్ గేమ్‌లు, ఇతర కార్యకలాపాలు గ్రూప్ కృషిని, సృజనాత్మకతను మెరుగుపరుస్తాయి.
- పిల్లలకు శారీరకమైన కదలికలకు సంబంధించిన చురుకుదనం కలిగిస్తూ, అందులో నైపుణ్యాలను పెంచుతాయి.
- జ్ఞానానికి సంబంధించిన నైపుణ్యాలు మెరుగుపడతాయి.
- పోటీ నైపుణ్యాలు పెరుగుతాయి.

అనేక రకాల సోషల్ నెట్‌వర్కింగ్ సైట్‌లు, గేమింగ్ సైట్‌లను ఉపయోగిస్తున్నారు. డిజిటల్ ప్లాట్‌ఫారాల మీద ఇతరుల గొడవలకు సంబంధించిన రహస్యాలను బయటపెట్టడం, లింక్‌అప్‌లు, హుక్–అప్‌లు, ద్వేషం సర్వసాధారణం. వీటితో పాటు మరో చీకటి కోణాన్ని గమనించాల్సి ఉంటుంది. టీచర్లు, హెడ్‌మాస్టర్లపై ప్రేమ, సరస, వ్యంగ్యపూరితమైన కామెంట్స్ ఆందోళన కలిగిస్తుంటాయి. అందుకని, టీచర్లు తల్లిదండ్రులతో పరస్పరం చర్చించాలి. సాంకేతిక పిల్లల భవిష్యత్తు జీవితాన్ని ఎలా ప్రభావితం చేస్తుందో పేరెంట్స్‌కు తెలియజేయాలి.



టీచర్లు తల్లిదండ్రులకు చెప్పాల్సినవి..

ఈ రోజుల్లో ప్రీ–టీన్స్, టీనేజ్ పిల్లల రోజువారీ జీవితంలో ఇంటర్నెట్ భాగమైపోయింది. చాలా మంది టీనేజర్స్ స్మార్ట్‌ఫోన్ లేదా టాబ్లెట్‌ను ఉపయోగించి ఇంటర్నెట్‌ను వాడుతున్నారు. ఇతరులతో సంబంధాలను కొనసాగిస్తున్నారు.

- పిల్లలు వాడే కమ్యూనికేషన్ సాధనాల సమాచారాన్ని తల్లిదండ్రులు తప్పక చూడాలి. మూలాలను చెక్ చేయాలి.
- పిల్లల డిజిటల్ కార్యకలాపాల్లోని మంచి చెడులపై క్రాస్‌చెక్ ఉందా అని పర్యవేక్షించాలి.
- మీ పిల్లలు ఎవరి నుంచి సూచనలు పొందుతున్నారు, వారికి ఎవరు సూచనలు ఇస్తున్నారో తెలుసుకోవాలి. దీనివల్ల ప్లాట్‌ఫారంలో వారు ఎంత సురక్షితంగా ఉన్నారో తెలుస్తుంది.
- పై జాగ్రత్తలన్నింటి వల్ల మీ కమ్యూనిటీలో వారు సురక్షితంగా ఉంటారని గుర్తించాలి.

ఆన్‌లైన్ ప్రమాదాల గురించి టీచర్లు గుర్తించాల్సినవి..

- క్లాస్‌రూమ్‌ను సైబర్ సేఫ్టీగా మార్చాలి. అంటే, విద్యార్థుల వ్యక్తిగత డేటాను రక్షించడంలో ఇది మొదటి దశ.
- విద్యార్థులకు ఆన్‌లైన్ గోప్యత, భద్రత గురించి బేసిక్స్ నేర్పించాలి.
- టెక్నాలజీని మితిమీరి ఉపయోగించడం వల్ల కలిగే నష్టాలను కూడా తెలియజేయాలి. మానవ సంబంధాలను, భవిష్యత్తు కెరీర్, వ్యక్తిగత జీవితాలను ఎలా దెబ్బతీస్తుందో తెలియజేయాలి.
- క్లాస్‌రూమ్‌లో, ఇంట్లో టెక్నాలజీ వాడకం ఒక ప్రయోజనానికి మాత్రమేనని, అంతే తప్ప పరధ్యానంగా ఉండటానికి కాదని చెప్పాలి.

తల్లిదండ్రులకు సేఫ్టీ పద్ధతులు..

ఏదైనా ఇబ్బంది కలిగించే విషయం ఇంటర్నెట్‌లో కనిపిస్తే ఏం చేయాలో పిల్లలతో మాట్లాడాలి. మీరూ, పిల్లలూ పరస్పరం మాట్లాడుకోకపోతే, మీరు వారికి దగ్గరగా వెళ్లినప్పుడు ల్యాప్‌టాప్ మూసేస్తారు లేదా స్క్రీన్‌ను ఆఫ్ చేస్తారు. పిల్లల స్క్రీన్ సమయాన్ని నియంత్రించడం కష్టంగా ఉంటుంది. పిల్లలకు ఎంత స్క్రీన్ సమయం సరిపోతుందో పరిశీలించడానికి టీచర్లు తల్లిదండ్రులతో తప్పనిసరిగా ఇంటరాక్ట్ కావాల్సి ఉంటుంది.

- అన్ని యాప్స్, గేమింగ్, బ్రౌజర్లకు కంట్రోల్స్ ఆప్షన్లు ఉంటాయి. ఇవి పిల్లలు ఆన్‌లైన్‌లో గడిపే సమయాన్ని పరిమితం చేయడానికి, కంటెంట్ విషయంలో వారి యాక్సెస్‌ను పరిమితం చేయడానికి, షాపింగ్, చాటింగ్ వంటి ఫంక్షన్లను స్విచ్ ఆఫ్ చేయడానికి పెద్దలకు అవకాశం ఉంటుంది అని చెప్పాలి.
- యాప్ కొనుగోళ్లను ఆపేయాలంటే అన్ని అప్లికేషన్‌లు, గేమింగ్, ఇ–కామర్స్ సైట్‌లు తమ యూజర్లకు షాపింగ్, ఎక్స్‌ట్రా పాయింట్స్ కొనుగోలు చేయడం వంటి ఇతర ప్రయోజనాలను అందిస్తాయి. పిల్లలు మీకు తెలియకుండానే సులభంగా వాటిని కొనుగోలు చేయవచ్చు, జాగ్రత్త పడాలి.
- చిన్నపిల్లలకు ఆన్‌లైన్ ప్రమాదాల గురించి తెలియదు. తల్లిదండ్రులుగా మీరు మీ పిల్లలకు నాణ్యమైన సమయాన్ని కేటాయించాలి. భవిష్యత్తులో వారి కెరీర్‌ను ప్రభావితం చేసే సైబర్ బెదిరింపు, గోప్యతల గురించి వివరించాలి.
- ఫ్యామిలీ ఇమెయిల్ తప్పనిసరి అవసరం. ఆన్‌లైన్‌లో కొత్త గేమ్‌లు, వెబ్‌సైట్‌లకు సైన్‌అప్ చేసేటప్పుడు మీ పిల్లలు ఉపయోగించే ఫ్యామిలీ ఇమెయిల్ అకౌంట్‌ను సెటప్ చేయండి. అంటే, కుటుంబ సభ్యులందరూ ఈ ఇమెయిల్‌ను చూడవచ్చు అని వివరించాలి.
- మీ గూగుల్ సెర్చ్ ఇంజిన్‌లో 'గూగుల్ సేఫ్ సెర్చ్'ని యాక్టివేట్ చేయడం ద్వారా పిల్లలు అనవసరమైన కంటెంట్‌ను చూడకుండా చేసేందుకు like https://www.kiddle.co వంటి సెర్చ్ ఇంజన్‌లను ఉపయోగించవచ్చు.
- చిన్నపిల్లలు ఆన్‌లైన్‌లో ఆడే సురక్షితమైన గేమ్‌లనే తల్లిదండ్రులు ఎంచుకోవాలి. అన్ని గేమ్‌లకు రేటింగ్, ఏజ్ బార్స్ ఉంటాయి. వయసు పరిమితులను బట్టి ఉండే గేమ్స్‌కు, సైట్స్ సైన్ ఆప్ చేయడానికి సపోర్ట్ ఇవ్వవచ్చు.
- స్క్రీన్ టైమ్ ఒప్పందాన్ని ఇంట్లో అందరూ పాటించేలా చూడాలి. ముఖ్యంగా బెడ్‌రూమ్, భోజనం చేసేటప్పుడు, కార్.. వంటి టెక్‌ఫ్రీ జోన్ల గురించి పిల్లలకు అర్థమయ్యేలా చెప్పాలి.
- యాంటీ ర్యాగింగ్, జెండర్ ఈక్వాలిటీ మాదిరిగా డిజిటల్ వెల్‌బీయింగ్ కౌన్సిల్‌ను సృష్టించాలి. ఈ కౌన్సిల్ పిల్లలకు మంచి డిజిటల్ పరిశుభ్రత, సైబర్ నైతికతను పెంపొందించడానికి సహాయపడుతుంది.


ఇన్‌పుట్స్:
అనీల్ రాచమల్ల
డిజిటల్ వెల్‌బీయింగ్ ఎక్స్‌పర్ట్,
ఎండ్ నౌ ఫౌండేషన్



రెండో వన్డేలోనూ విండీస్‌దే విజయం

యూఏఈతో షార్జాలో జరిగిన రెండో వన్డేలో వెస్టిండీస్ 78 పరుగుల తేడాతో గెలిచి మరో మ్యాచ్ మిగిలి ఉండగానే సిరీస్‌ను 2-0తో దక్కించుకుంది. ముందుగా విండీస్ 49.5 ఓవర్లలో 306 పరుగులకు ఆలౌటైంది. ఓపెనర్లు బ్రాండన్ కింగ్ (64; 4 ఫోర్లు, 4 సిక్స్‌లు), జాన్సన్ చార్లెస్ (63; 8 ఫోర్లు, 3 సిక్స్‌లు) అర్ధ సెంచరీలు సాధించడంతోపాటు తొలి వికెట్‌కు 129 పరుగులు జోడించారు. అనంతరం యూఏఈ 50 ఓవర్లలో 7 వికెట్లకు 228 పరుగులు చేసి ఓడిపోయింది. అలీ నాసర్ (57; 6 ఫోర్లు, 3 సిక్స్‌లు) మినహా మిగతావారు విఫలమయ్యారు.

రాణించిన చమీరా: శ్రీలంకదే వన్డే సిరీస్


అఫ్గానిస్తాన్‌తో మూడో వన్డేలో శ్రీలంక తొమ్మిది వికెట్ల తేడాతో నెగ్గి సిరీస్‌ను 2-1తో సొంతం చేసుకుంది. హంబన్‌టోటాలో బుధవారం జరిగిన మ్యాచ్‌లో 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' చమీరా (4/63), హసరంగ (3/7) ధాటికి అఫ్గానిస్తాన్ 22.2 ఓవర్లలో 116 పరుగులకే కుప్పకూలింది. అనంతరం శ్రీలంక 16 ఓవర్లలో వికెట్ నష్టానికి 120 పరుగులు చేసి గెలిచింది. ఓపెనర్లు నిసాంక (51; 8 ఫోర్లు, 2 సిక్స్‌లు), కరుణరత్నే (56 నాటౌట్; 7 ఫోర్లు) అర్ధ సెంచరీలు చేశారు.



తొలి రోజే 'తల'పోటు...

పిచ్‌పై తేమ, కాస్త పచ్చిక, ఆకాశం మేఘావృతం ... అన్నీ పేస్ బౌలింగ్‌కు అనుకూలించే పరిస్థితులే. రోహిత్ శర్మ టాస్ గెలిచాడు. ఈ స్థితిలో ఏ కెప్టెనైనా ఏం చేస్తాడో అతను కూడా అదే చేస్తూ ఫీల్డింగ్ ఎంచుకున్నాడు. మ్యాచ్ ఆరంభంలో షమీ, సిరాజ్ బౌలింగ్ చూస్తుంటే ఫీల్డింగ్ ఎంచుకున్న నిర్ణయం సరైందనిపించింది... ఒక గంట గడిచింది. వాతావరణం అంతా మారిపోయింది... పిచ్ ఒక్కసారిగా బ్యాటర్ల పక్షాన చేరింది... హెడ్, స్మిత్ దీనిని అద్భుతంగా వాడుకున్నారు. సంపూర్ణ ఆధిపత్యం కనబరుస్తూ ఆసీస్ భారీ స్కోరుకు బాటలు వేశారు. మెరుపు వేగంతో ఆడిన హెడ్ సెంచరీతో చెలరేగగా, స్మిత్ శతకానికి చేరువయ్యాడు. చివరి సెషన్‌లోనైతే మన బౌలర్లు పూర్తిగా చేతులెత్తేసిన పరిస్థితి... డబ్ల్యూటీసీ ఫైనల్ పోరులో తొలి రోజు పూర్తిగా ఆస్ట్రేలియాదే. రెండో రోజు వారిని నిలువరించలేకపోతే భారత్ ఈ టెస్టుపై ఆశలు కోల్పోవాల్సిందే!

- 156 బంతుల్లో అజేయంగా 146 పరుగులు చేసిన ట్రవిస్ హెడ్
- స్టీవ్ స్మిత్ 95 బ్యాటింగ్
- ఆస్ట్రేలియా 327/3
- భారత్‌తో డబ్ల్యూటీసీ ఫైనల్



హెడ్



షమీ



సిరాజ్



స్మిత్

లండన్: వరల్డ్ టెస్టు చాంపియన్‌షిప్ (డబ్ల్యూటీసీ) ఫైనల్ మొదటి రోజును ఆస్ట్రేలియా ఘనంగా ముగించింది. భారత్‌తో బుధవారం ప్రారంభమైన ఈ మ్యాచ్‌లో ఆట ముగిసే సమయానికి ఆసీస్ తొలి ఇన్నింగ్స్‌లో 85 ఓవర్లలో 3 వికెట్ల నష్టానికి 327 పరుగులు చేసింది. ట్రవిస్ హెడ్ (156 బంతుల్లో 146 బ్యాటింగ్; 22 ఫోర్లు, 1 సిక్స్), స్టీవ్ స్మిత్ (227 బంతుల్లో 95 బ్యాటింగ్; 14 ఫోర్లు) చెలరేగారు. వీరిద్దరు నాలుగో వికెట్‌కు అభేద్యంగా 251 పరుగులు జోడించారు. భారత తుది జట్టులో అశ్విన్‌కు స్థానం దక్కకపోగా, కీపర్‌గా భరత్‌కే చోటు లభించింది. ఇటీవల ఒడిశాలో జరిగిన రైలు ప్రమాదంలో మరణించిన వారి కోసం టీమిండియా ఆటగాళ్లు మౌనం పాటించగా, ఇరు జట్ల క్రికెటర్లు నల్లబ్యాండ్‌లు ధరించి బరిలోకి దిగారు.

రాణించిన వార్నర్...

పేసర్లు షమీ, సిరాజ్ పదునైన బంతులతో ఆసీస్ ఆటగాళ్లను తీవ్రంగా ఇబ్బంది పెట్టారు. మొదటి మూడు ఓవర్లు మెయిడిన్ కాగా, తర్వాతి ఓవర్లో ఫలితం దక్కింది. సిరాజ్ బంతిని ఆడలేక ఉస్మాన్ ఖ్వాజా (10 బంతుల్లో 0) కీపర్ భరత్‌కు క్యాచ్ ఇచ్చి వెనుదిరిగాడు. తొలి గంటలో 12 ఓవర్లు ఆడిన ఆస్ట్రేలియా 29 పరుగులే చేసింది. చెరో 2 ఓవర్లు వేసిన షమీ, సిరాజ్ వేసిన అనేక బంతులు వార్నర్ (60 బంతుల్లో 43; 8 ఫోర్లు), లబుషేన్ (62 బంతుల్లో 26; 3 ఫోర్లు) శరీరానికి తాకాయి. అయితే ఇద్దరు బ్యాటర్లు పట్టుదలగా నిలబడి ఇన్నింగ్స్‌ను నడిపించారు. ఉమేశ్ ఓవర్లో నాలుగు ఫోర్లు బాది జోరు ప్రదర్శించిన వార్నర్ ఆ తర్వాతా దానిని కొనసాగించాడు. ఆసీస్ పటిష్ట స్థితికి చేరుతున్న దశలో శార్దుల్ భారత్‌కు కీలక వికెట్ అందించాడు. లంచ్ సమయానికి కాస్త ముందు లెగ్‌సైడ్ వెళుతున్న బంతిని వార్నర్ వెంటాడగా భరత్ అద్భుతంగా అందుకున్నాడు. వార్నర్, లబుషేన్ రెండో వికెట్‌కు 69 పరుగులు జోడించారు. విరామం తర్వాత షమీ చక్కటి బంతితో లబుషేన్‌ను బౌల్డ్ చేయడంతో భారత్ ఊపిరి పీల్చుకుంది.

భారీ భాగస్వామ్యం...

ఐదు పరుగుల వ్యవధిలో రెండు వికెట్లు పడగొట్టిన టీమిండియా ఆనందాన్ని తర్వాతి భాగస్వామ్యం పూర్తిగా దెబ్బ కొట్టింది. స్మిత్, హెడ్ కలిసి ఇన్నింగ్స్‌ను నిర్మించారు. తాను ఎదుర్కొన్న తొలి 16 బంతుల్లోనే 6 ఫోర్లతో దూకుడు చూపించిన హెడ్ 60 బంతుల్లోనే అర్ధ సెంచరీ పూర్తి చేసుకోగా, రెండో సెషన్‌లో భారత్‌కు వికెట్ దక్కలేదు. చివరి సెషన్ లోనూ ఈ జంట మరింత పట్టుదలగా ఆడింది. 144 బంతుల్లో స్మిత్ హాఫ్ సెంచరీ పూర్తయిన కొద్దిసేపటికే హెడ్ 106 బంతుల్లోనే కెరీర్‌లో ఆరో శతకాన్ని అందుకున్నాడు. ఇదే ఊపులో భాగస్వామ్యం 200 పరుగులు దాటగా, భారత బృందం బేలగా చూస్తుండిపోయింది.

స్కోరు వివరాలు

ఆస్ట్రేలియా తొలి ఇన్నింగ్స్: వార్నర్ (సి) భరత్ (బి) శార్దుల్ 43; ఖ్వాజా (సి) భరత్ (బి) సిరాజ్ 0; లబుషేన్ (బి) షమీ 26; స్మిత్ (బ్యాటింగ్) 95; హెడ్ (బ్యాటింగ్) 146; ఎక్స్‌ట్రాలు 17; **మొత్తం** (85 ఓవర్లలో 3 వికెట్లకు) 327. **వికెట్ల పతనం:** 1-2, 2-71, 3-76. **బౌలింగ్:** షమీ 20-3-77-1, సిరాజ్ 19-4-67-1, ఉమేశ్ 14-4-54-0, శార్దుల్ 18-2-75-1, జడేజా 14-0-48-0.

అంచనా తప్పి... అశ్విన్‌ను తప్పించి...



అగ్రశ్రేణి స్పిన్నర్ అశ్విన్‌కు తుది జట్టులో స్థానంపై మ్యాచ్ ముందు రోజే కెప్టెన్ రోహిత్ శర్మ సందేహం వ్యక్తం చేయగా, చివరకు అదే జరిగింది. 'పరిస్థితులను దృష్టిలో ఉంచుకొని' అశ్విన్‌ను ఆడించడం లేదని, బాధగా ఉన్నా తప్పట్లేదని రోహిత్ అన్నాడు. అయితే తొలిరోజు భారత బౌలర్ల ప్రదర్శనను చూసిన తర్వాత అశ్విన్ లేని లోటు కనిపించింది. ఆరంభంలో కొద్దిసేపు మాత్రమే పిచ్‌పై తేమ ఉండి ఆ తర్వాత అంతా సాధారణంగా మారిపోయింది. పరిస్థితుల విషయంలో భారత్ అంచనా తప్పిందని మాజీ క్రికెటర్లు పాంటింగ్, హాడిన్, మంజ్రేకర్ అభిప్రాయపడ్డారు. ఆస్ట్రేలియాపై అశ్విన్‌కు అద్భుత రికార్డు ఉండటంతోపాటు ఆ జట్టు టాప్-7లో నలుగురు ఎడంచేతి వాటం బ్యాటర్లు ఉన్నారు. పిచ్ ఎలా ఉన్నా అతను కచ్చితంగా ప్రభావం చూపేవాడని వారు విశ్లేషించారు. మ్యాచ్‌కు ముందు సచిన్ టెండూల్కర్ కూడా ఇదే అభిప్రాయం వ్యక్తం చేశాడు. అయితే టీమ్ మేనేజ్‌మెంట్ మాత్రం మరోలా ఆలోచించి నలుగురు పేసర్లకు అవకాశం కల్పించింది. మరోవైపు జడేజా కూడా పూర్తిగా విఫలమయ్యాడు. రెండేళ్ల క్రితం న్యూజిలాండ్‌తో ఫైనల్లో భారత్ ఇద్దరు స్పిన్నర్లతో ఆడగా, కివీస్ నలుగురు పేసర్లతో బరిలోకి దిగింది. పరిస్థితులన్నీ పేస్ బౌలింగ్‌కు అనుకూలించాయి. అప్పుడు 'పొరపాటు' చేసినట్లుగా గుర్తించిన జట్టు ఈసారి దానిని సరిదిద్దుకోబోయే మరో పొరపాటు చేసినట్లుంది!

15 వరకు నిరసనలకు విరామం

- ఆలోపు బ్రిజ్‌భూషణ్‌పై పోలీసుల విచారణ పూర్తి కావాలి
- కేంద్ర క్రీడల మంత్రితో చర్చల అనంతరం రెజ్లర్ల నిర్ణయం



క్రీడల మంత్రి నివాసంలో రెజ్లర్లు సత్యవర్త్, సాక్షి మలిక్, బజరంగ్ పూనియా

న్యూఢిల్లీ: లైంగిక వేధింపుల ఆరోపణలు ఎదుర్కొంటున్న భారత రెజ్లింగ్ సమాఖ్య (డబ్ల్యూఎఫ్ఐ) అధ్యక్షుడు, బీజేపీ ఎంపీ బ్రిజ్‌భూషణ్ సింగ్‌పై పోలీసుల విచారణ పూర్తయ్యే వరకు నిరసనలకు విరామం ఇవ్వాలని కేంద్ర క్రీడల మంత్రి అనురాగ్ ఠాకూర్ అభ్యర్థనకు రెజ్లర్లు అంగీకరించారు. ఈనెల 15వ తేదీ వరకు తాము నిరసన కార్యక్రమాలను తాత్కాలికంగా నిలిపి వేస్తున్నట్లు భారత స్టార్ రెజ్లర్లు బజరంగ్ పూనియా, సాక్షి మలిక్ తెలిపారు. క్రీడల మంత్రి అనురాగ్ ఠాకూర్ ఆహ్వానం మేరకు బుధవారం బజరంగ్, సాక్షి మలిక్, సాక్షి భర్త సత్యవర్త్ కడియాన్, జితేంద్ర కిన్హా తదితరులు మంత్రి నివాసానికి వెళ్లారు. రెజ్లర్లతో మంత్రి దాదాపు ఆరు గంటలపాటు చర్చించారు. రెజ్లర్ల డిమాండ్లకు సానుకూలంగా స్పందించిన మంత్రి బ్రిజ్‌భూషణ్‌పై విచారణ ముగిసేవరకు ఆందోళన కార్యక్రమాలకు విరామం ఇవ్వాలని కోరారు. మంత్రి అభ్యర్థనకు అంగీకరించిన రెజ్లర్లు ఈనెల 15లోపు బ్రిజ్‌భూషణ్‌పై విచారణ ముగియాలని... ఇప్పటికే ఆయన మూడు పర్యాయాలు సమాఖ్య అధ్యక్షుడిగా పనిచేశారని... ఆయన అనుచరులు కూడా ఈసారి ఎన్నికలకు దూరంగా ఉండాలని... మే 28న ఢిల్లీ పోలీసులు తమపై నమోదు చేసిన ఎఫ్ఐఆర్‌లను ఉపసంహరించుకోవాలని కోరారు. వీటన్నింటికి క్రీడల మంత్రి అంగీకరించడంతో రెజ్లర్లు కూడా మెట్టు దిగారు. ప్రభుత్వ విన్నపం మేరకు తాము ఈనెల 15 వరకు ఆందోళనకు విరామం ఇచ్చామని, అంతేగానీ తమ నిరసనను పూర్తిగా ముగించలేదని బజరంగ్, సాక్షి స్పష్టం చేశారు. భారత రెజ్లింగ్ సమాఖ్య ఎన్నికలు జూన్ 30లోపు జరుగుతాయని ... సమాఖ్యలో మహిళా అధ్యక్షురాలిగా అంతర్గత ఫిర్యాదుల విభాగాన్ని ఏర్పాటు చేస్తామని రెజ్లర్లతో చర్చల అనంతరం మంత్రి అనురాగ్ ఠాకూర్ వెల్లడించారు. హరియాణాలో ఉండటంతో మరో స్టార్ రెజ్లర్ వినేశ్ ఫొగాట్ క్రీడల మంత్రితో సమావేశానికి హాజరుకాలేదు.

సెమీస్‌లో స్వియాటెక్, బీత్రిజ్



స్వియాటెక్



బీత్రిజ్

పారిస్: ఫ్రెంచ్ ఓపెన్ గ్రాండ్‌స్లామ్ టెన్నిస్ టోర్నీ మహిళల సింగిల్స్ విభాగంలో డిఫెండింగ్ చాంపియన్ ఇగా స్వియాటెక్ (పోలాండ్), బీత్రిజ్ హదాద్ మయా (బ్రెజిల్) సెమీఫైనల్లోకి దూసుకెళ్లారు. బుధవారం జరిగిన క్వార్టర్ ఫైనల్స్‌లో టాప్ సీడ్ స్వియాటెక్ 6-4, 6-2తో గత ఏడాది రన్నరప్, అమెరికా టీనేజర్ కోకో గాఫ్‌ను ఓడించగా... 14వ సీడ్ బీత్రిజ్ 3-6, 7-6 (7/5), 6-1తో ప్రపంచ ఏడో ర్యాంకర్ ఆన్స్ జబర్ (ట్యునీషియా)ను బోల్తా కొట్టించింది. ఈ గెలుపుతో బీత్రిజ్ ఓపెన్ శకంలో (1968 నుంచి) ఫ్రెంచ్ ఓపెన్ టోర్నీలో సెమీఫైనల్ చేరిన తొలి బ్రెజిల్ క్రీడాకారిణిగా గుర్తింపు పొందింది. నేడు జరిగే సెమీఫైనల్స్‌లో కరోలినా ముకోవా (చెక్ రిపబ్లిక్)తో రెండో సీడ్ సబలెంకా (బెలారస్), స్వియాటెక్‌తో బీత్రిజ్ తలపడతారు.

అల్కరాజ్ అలవోకగా...

పురుషుల సింగిల్స్ విభాగంలో ప్రపంచ నంబర్‌వన్, టాప్ సీడ్ కార్లోస్ అల్కరాజ్ (స్పెయిన్) సెమీఫైనల్లోకి ప్రవేశించాడు. క్వార్టర్ ఫైనల్లో అల్కరాజ్ 6-2, 6-1, 7-6 (7/5)తో ఐదో సీడ్ సిట్సిపాస్ (గ్రీస్)పై గెలుపొందాడు. శుక్రవారం జరిగే సెమీఫైనల్లో మూడో సీడ్ జొకోవిచ్ (సెర్బియా)తో అల్కరాజ్ ఆడతాడు. మరో క్వార్టర్ ఫైనల్లో జ్వెరెవ్ (జర్మనీ) 6-4, 3-6, 6-3, 6-4తో ఎచెవరీ (అర్జెంటీనా)పై గెలిచి ఈ టోర్నీలో వరుసగా మూడో ఏడాది సెమీఫైనల్లోకి అడుగు పెట్టాడు.

సినిమా

మాస్ డ్యాన్స్ చేసేద్దాం...



● చిరంజీవి ● తమన్నా ● కీర్తీ సురేశ్

శంకర్ మంచి జోష్ మీద ఉన్నాడు. అందుకే జోరుగా స్టెప్పులు వేస్తున్నాడు. ఒక్కడే కాదు.. ప్రేయసితో, చెల్లెలితో, ఇంకా చాలామందితో కలిసి మాస్ డ్యాన్స్ చేసేద్దాం అంటూ రెచ్చిపోతున్నాడు. చిరంజీవి టైటిల్ రోల్‌లో రూపొందుతున్న 'భోళా శంకర్'లోని పాట గురించే చెబుతున్నాం. ఈ చిత్రంలో చిరంజీవి సరసన తమన్నా, చెల్లెలి పాత్రను కీర్తీ సురేశ్ చేస్తున్న విషయం తెలిసిందే. ఈ ముగ్గురితో పాటు చిత్రంలోని ఇతర ప్రధాన తారాగణం పాల్గొనగా హైదరాబాద్‌లో ఓ పాట చిత్రీకరిస్తున్నారు. ఈ పాట కోసం భారీ సెట్‌ని రూపొందించారు. చిత్ర సంగీతదర్శకుడు మహతి స్వర సాగర్ స్వరపరచిన ఈ మాస్ సాంగ్‌కు శేఖర్ మాస్టర్ కొరియోగ్రఫీ చేస్తున్నారు. మెహర్ రమేష్ దర్శకత్వంలో అనిల్ సుంకర ఏకే ఎంటర్‌టైన్‌మెంట్స్‌పై రామబ్రహ్మం సుంకర నిర్మిస్తున్న ఈ చిత్రం షూటింగ్ తుది దశకు చేరుకుంది. ఆగస్టు 11న విడుదల కానున్న ఈ చిత్రానికి కెమెరా: డడ్లీ, ఎగ్జిక్యూటివ్ నిర్మాత: కిషోర్ గరికిపాటి.

నా టైమ్ స్టార్ట్ అయినట్లు అనిపిస్తోంది - సిద్ధార్థ్



"నేనో సినిమా తీయాలనుకుంటే ఆ సినిమాను తీసేంత స్వేచ్ఛ నాకు కావాలి. ఇదే నా డ్రీమ్. తమిళంలో నేను చేయగలుగుతున్నాను. కానీ తెలుగులో నాకు అంతగా సపోర్ట్ లభించలేదు. అయినా తెలుగు ఆడియన్స్‌కు, నాకు ఫుల్‌స్టాప్ కాదు కదా.. చిన్న కామా కూడా పడలేదు.. తెలుగు ప్రేక్షకులకు నాకు మధ్యలో ఉన్నది చిన్న టైమ్ గ్యాప్ మాత్రమే. ఇప్పుడు 'టక్కర్'తో టైమ్ కలిసొచ్చినట్లుగా నాకు అనిపిస్తోంది" అని సిద్ధార్థ్ అన్నారు. సిద్ధార్థ్, దివ్యాంశా కౌశిక్ హీరో హీరోయిన్లుగా నటించిన చిత్రం 'టక్కర్'. కార్తీక్ జి. క్రిష్ దర్శకత్వంలో పీపుల్ మీడియా ఫ్యాక్టరీ బ్యానర్ పై అభిషేక్ అగర్వాల్ ఆర్ట్స్, ప్యాషన్ స్టూడియోస్‌తో కలిసి టీజీ విశ్వప్రసాద్ ఈ చిత్రాన్ని నిర్మించారు. ఈ నెల 9న తెలుగు, తమిళ భాషల్లో ఈ చిత్రం రిలీజ్ కానున్న సందర్భంగా విలేకరుల సమావేశంలో సిద్ధార్థ్ చెప్పిన విశేషాలు.

● ధనవంతుణ్ణి కావాలనే లక్ష్యంతో సిటీకి వస్తాడు ఓ కుర్రాడు. అయితే అన్నీ అతని ఊహలకు వ్యతిరేకంగా జరుగుతుంటే ఏం చేస్తాడు? ఎవరితో అతను ఘర్షణ పడాల్సి వస్తుంది? అన్నదే 'టక్కర్' కథాంశం. ఇద్దరు వ్యక్తుల మధ్య జరిగే ఘర్షణ చుట్టూ ఈ సినిమా సాగుతుంది. హీరో, హీరోయిన్ రిలేషన్‌షిప్‌లోనూ చాలా షేడ్స్ ఉంటాయి. డబ్బు, అహం, లింగబేధం, వయసు.. ఇలాంటి అంశాలు కథలో చర్చకు వస్తాయి. కార్తీక్ క్రిష్ ఈ సినిమాను బాగా డైరెక్ట్ చేశారు. ● లవ్‌స్టోరీస్ సినిమాల గురించి చర్చకు వస్తే.. వాటిలో 'బొమ్మరిల్లు', 'నువ్వొస్తానంటే నేనొద్దంటానా!' సినిమాలు కచ్చితంగా ఉంటాయి. ఇప్పుడు ఎవరైనా నాకు లవ్‌స్టోరీ చెబితే, దాదాపు నో చెబుతాను. ఎందుకంటే ఇప్పుడు నేను ఒక లవ్‌స్టోరీ సినిమా చేసి, అది హిట్ అయితే నాకు మళ్లీ ఓ పదేళ్ల పాటు లవ్‌స్టోరీలే వస్తాయి. నేను లవ్‌స్టోరీస్ మాత్రమే చేయడానికి ఇండస్ట్రీకి రాలేదు. యాక్టర్‌గా డిఫరెంట్ సినిమాలు చేయాలి. ● రచయితగా 'గృహం' ఫ్రాంచైజీకి కథలు రెడీ చేస్తున్నాను. మా ప్రొడక్షన్ హౌస్‌లో కొత్తవారితో సినిమాలు నిర్మిస్తున్నాం. భవిష్యత్‌లో దర్శకత్వం చేస్తాను. 'బొమ్మరిల్లు 2' ఆలోచన ఉంది. కానీ అది పెద్ద చాలెంజ్‌తో కూడుకున్న పని.. చూడాలి. ● యాక్టర్‌గా నేను మంచి ఫామ్‌లోకి వచ్చిన ఫీలింగ్ ఇప్పుడు కలుగుతోంది. మళ్లీ తెలుగులో నా టైమ్ స్టార్ట్ అయినట్లు అనిపిస్తోంది. ప్రస్తుతం 'ఇండియన్ 2'లో కీలక పాత్ర, 'ది టెస్ట్'లో ఓ లీడ్ రోల్, 'చిన్నా' సినిమా చేస్తున్నాను. ఓ స్ట్రయిట్ లవ్‌స్టోరీ ఫిల్మ్ షూటింగ్ పూర్తి కావొచ్చింది. కార్తీక్ క్రిష్‌తో మరో సినిమా చేయనున్నాను.

మీకు ఇంకా మ్యారేజ్ చేసుకునే ఏజ్ రాలేదంటారా? అని ఓ విలేకరి అడగ్గా... 'మ్యారేజ్ చేసుకునే ఏజ్ నాకు వచ్చినప్పుడు.. ఆ పెళ్లి భోజనం తింటున్నప్పుడు మీకు తెలుస్తుంది. ప్రస్తుతం ఆ పెళ్లి భోజనం నాకు గొంతు దిగడం లేదు. సో.. దానికి ఓ టైమ్ ఉంది. డైరెక్షన్ నా డ్రీమ్. నా మ్యారేజ్ నా పేరెంట్స్ డ్రీమ్. నా పెళ్లి, రిలేషన్‌షిప్స్ గురించి వార్తలు వచ్చాయంటే అవి రాసిన వారిని అడగాలి" అని అన్నారు సిద్ధార్థ్.

ఆగస్టులో అర్జున



● వరుణ్ తేజ్

గాండీవాన్ని ఎక్కుపెట్టి థియేటర్స్‌లోకి రావడానికి రెడీ అవుతున్నాడు అర్జున. వచ్చే తేదీని కూడా ఫిక్స్ చేసుకున్నాడు. వరుణ్ తేజ్ టైటిల్ రోల్‌లో ప్రవీణ్ సత్తారు దర్శకత్వంలో రూపొందుతోన్న యాక్షన్ ఎంటర్‌టైనర్ 'గాండీవధారి అర్జున'. బీవీఎస్ఎన్ ప్రసాద్ నిర్మిస్తున్నారు. ఈ చిత్రాన్ని ఆగస్ట్ 25న విడుదల చేయనున్నట్లు బుధవారం ప్రకటించారు. ప్రస్తుతం విదేశాల్లో షూటింగ్ జరుగుతోంది. ''స్టైలిష్ యాక్షన్ సీక్వెన్స్‌లతో రూపొందిస్తోన్న ఈ చిత్రంలో వరుణ్ తేజ్ పవర్‌ఫుల్ రోల్‌లో కనిపిస్తారు. ఇప్పటికే విడుదలైన వరుణ్ లుక్‌కి, వీడియో గ్లింప్స్‌కి మంచి స్పందన వచ్చింది. ఈ చిత్రంలో యాక్షన్ సీక్వెన్స్ హైలైట్‌గా నిలుస్తాయి. సినిమా చిత్రీకరణ తుది దశకు చేరుకుంది. మరోవైపు నిర్మాణానంతర కార్యక్రమాలు కూడా జరుగుతున్నాయి'' అని చిత్ర యూనిట్ పేర్కొంది. ఈ చిత్రానికి సంగీతం: మిక్కీ జే మేయర్, కెమెరా: ముఖేష్.

యాక్షన్.. థ్రిల్



● గోపీచంద్ మలినేని, చైతన్య, సాహస్

సాహస్, దీపికా ముఖ్య తారలుగా నటించిన సైన్స్ ఫిక్షన్ యాక్షన్ థ్రిల్లర్ '7:11'. నూతన నటీనటులతో చైతు మాదాలను దర్శకుడిగా పరిచయం చేస్తూ నరేన్ యనమదల, మాధురి రావిపాటి, వాణి కన్నెగంటి ఈ చిత్రాన్ని నిర్మించారు. ఈ చిత్రం టీజర్‌ను దర్శకుడు గోపీచంద్ మలినేని విడుదల చేశారు. ఈ సందర్భంగా చిత్ర యూనిట్ మాట్లాడుతూ– ''మానవుల మనుగడకు సంబంధించిన కీలకమైన సమాధానాల కోసం హంసలదీవి అనే చిన్న ఇండియన్ టౌన్‌కి చేరుకుంటారు ఏలియన్లు. అదే రోజున ఆ టౌన్‌ని నాశనం చేయడానికి ప్రయత్నాలు జరుగుతుంటాయి. హీరో తన చేతిలోని టైమర్‌ను రాత్రి 7:11 లోపు డీయాక్టివేట్ చేయాలి. గడువు కంటే ముందే అతను మిస్టరీని ఛేదించాలి.. లేదంటే కార్డియాక్ అరెస్ట్‌తో అతని గుండె ఆగిపోతుంది. ఆ తర్వాత ఏం జరిగింది? అనేది ఆసక్తికరంగా ఉంటుంది. త్వరలో విడుదల తేదీని ప్రకటిస్తాం'' అని తెలియజేసింది. ఈ చిత్రానికి సంగీతం: జ్ఞాని, కెమెరా: శివ శంకర్, ఫాబియో కాపోడివెంటో.

పోలీసులే నిందితులైతే...



● రాహుల్ విజయ్

సాధారణంగా హత్యలకు కారణమైన దోషులకు శిక్ష పడేలా బాధ్యతగా విధులు నిర్వర్తిస్తుంటారు పోలీసులు. అయితే ఓ హత్య కేసులో పోలీసులే నిందుతులు అయితే ఎలాంటి పరిణామాలు చోటు చేసుకుంటాయి? అన్న కథాంశంతో ఓ చిత్రం రూపొందుతోంది. తేజా మార్ని దర్శకత్వంలో శ్రీకాంత్, రాహుల్ విజయ్, వరలక్ష్మీ శరత్‌కుమార్ లీడ్ రోల్స్‌లో నటిస్తున్న చిత్రం ఇది. అల్లు అరవింద్ సమర్పణలో బన్నీ వాసు, విద్య నిర్మిస్తున్నారు. బుధవారం (జూన్ 7) రాహుల్ విజయ్ బర్త్ డే ఈ సందర్భంగా ఈ సినిమాలో ఎస్. రవి పాత్రను రాహుల్ విజయ్ చేస్తున్నట్లుగా వెల్లడించి, పోస్టర్ రిలీజ్ చేశారు. శివానీ రాజశేఖర్, పవన్ తేజ్, మురళీ శర్మ కీలక పాత్రలు పోషిస్తున్న ఈ సినిమాకు సంగీతం: మిధున్ ముకుందన్.

వాస్తవ ఘటనతో...



● అభి, రూప

గ్రామీణ నేపథ్యంలో రూపొందిన చిత్రం 'భీమదేవరపల్లి బ్రాంచి'. డా. బత్తిని కీర్తిలతా గౌడ్, రాజా నరేందర్ చెట్లపెల్లి నిర్మించిన ఈ చిత్రంలో 'బలగం' ఫేమ్ సుధాకర్ రెడ్డి, అంజి వల్గమాన్, సాయి ప్రసన్న, అభి, రూప ప్రధాన పాత్రల్లో నటించారు. రమేష్ చెప్పాల రచన–దర్శకత్వంలో రూపొందిన ఈ చిత్రం మైత్రీ మూవీస్ ద్వారా ఈ నెల 23న రిలీజ్ కానుంది. ''ఒక మారుమూల గ్రామంలో జరిగిన ఘటన దేశవ్యాప్తంగా సంచలనం అయింది. ఆ ఘటన ఆధారంగా ఈ చిత్రాన్ని రూపొందించాం. సహజమైన పాత్రలతో నవ్విస్తూనే భావోద్వేగానికి గురి చేసేలా ఈ సినిమా ఉంటుంది. ఈ సినిమా కంటెంట్ నచ్చి మైత్రీ మూవీ మేకర్స్ సంస్థ రిలీజ్ చేయడానికి ముందుకు వచ్చింది'' అని చిత్ర యూనిట్ పేర్కొంది.

ప్రత్యేక అతిథిగా...



● రాధికా ఆప్టే

విజయ్ సేతుపతి, కత్రినా కైఫ్‌ల వెండితెర క్రిస్మస్ వేడుకల్లో రాధికా ఆప్టే ప్రత్యేక అతిథిగా సందడి చేశారట. బాలీవుడ్ దర్శకుడు శ్రీరామ్ రాఘవన్ తాజా చిత్రం 'మెర్రీ క్రిస్మస్'లో విజయ్ సేతుపతి, కత్రినా కైఫ్ లీడ్ రోల్స్ చేస్తున్న సంగతి తెలిసిందే. ఈ చిత్రంలోని ఓ ప్రత్యేక అతిథి పాత్ర కోసం రాధికా ఆప్టేను ఎంపిక చేశారట. ఆమె పాత్ర చిత్రీకరణ పూర్తయిందని సమాచారం. హిందీ, తమిళ భాషల్లో రూపొంది, తెలుగులో కూడా విడుదల కానున్న ఈ సినిమా కొత్త విడుదల తేదీపై స్పష్టత రావాల్సి ఉంది. వాస్తవానికి గత ఏడాది క్రిస్మస్‌కి రిలీజ్ చేయాలనుకున్నారు. ఇక శ్రీరామ్ రాఘవన్ దర్శకత్వంలో వచ్చిన 'బదలాపూర్', 'అంధాధూన్'లో రాధికా ఆప్టే హీరోయిన్‌గా నటించిన విషయం గుర్తుండే ఉంటుంది.

మనిషి పుట్టిన క్షణం నుంచే..



● ప్రశాంత్ కార్తీ

ప్రశాంత్ కార్తీ హీరోగా నటించి, నిర్మించిన సైన్స్ ఫిక్షన్ ఫిల్మ్ 'అనంత'. రిత్తికా చక్రవర్తి హీరోయిన్‌గా, అనీష్ కురువిళ్ళ, లయ సింప్సన్, శ్రీనివాస్ జె గడ్డం కీలక పాత్రల్లో నటించారు. మధుబాబు దర్శకత్వం వహించిన ఈ చిత్రం ఈ నెల 9న విడుదల కానుంది. ఈ సందర్భంగా విలేకరుల సమావేశంలో ప్రశాంత్ కార్తీ మాట్లాడుతూ– ''నేను లీడ్ రోల్ చేసిన తొలి చిత్రం 'అనంత'. టైమ్ ట్రావెల్ కాన్సెప్ట్‌తో సాగే ఇన్వెస్టిగేటివ్ చిత్రం ఇది. 'మనిషి పుట్టిన మరు క్షణం నుంచే ఆ శరీరం మరణం వైపు ప్రయాణం చేస్తుంటుంది' అనే ఈ సినిమాలోని డైలాగ్ సినిమాలోని సోల్‌ను తెలియజేస్తుంది. మా సినిమాకు వచ్చే వసూళ్లలో థియేటర్స్ ఖర్చులు పోను మిగిలే నగదును ఒరిస్సా రైలు దుర్ఘటనలో మరణించిన వారి కుటుంబాలకు ఆర్థిక సహాయంగా అందించాలనుకుంటున్నాం'' అన్నారు.

స్టాక్ మార్కెట్లు				
దేశీ సూచీలు		విదేశీ సూచీలు (తొలి రెండు రాత్రి 11.30 గంటలకు)		
సెన్సెక్స్ ▲ 350 63,143	నిఫ్టీ ▲ 127 18,726	నాస్‌డాక్	13,142 ▽	134
		డోజోన్స్	33,638 ▲	65
		ఎఫ్‌టీఎస్‌ఈ 100	7,624 ▽	4
		డాక్స్	15,961 ▽	32
		షాంఘై	31,197 ▲	2
		నికాయ్	31,914 ▽	593

మరిన్ని బిజినెస్ వార్తల కోసం 'సాక్షి ప్లస్' చూడండి

•అమెరికా •బ్రిటన్ •జర్మనీ •చైనా •జపాన్

బులియన్ రూ.లలో		
ముంబై		
బంగారం (99.9 స్వచ్ఛత)		
60,028	▽	68
బంగారం (99.5 స్వచ్ఛత)		
59,788	▽	68
వెండి (కిలో)		
71,824	▽	80

బీఎస్‌ఎన్‌ఎల్‌కు రూ.89,047 కోట్ల ప్యాకేజీ

- 4జీ, 5జీ స్పెక్ట్రమ్ కేటాయింపులు
- కేంద్ర కేబినెట్ నిర్ణయం



న్యూఢిల్లీ: ప్రభుత్వరంగ టెలికం కంపెనీ బీఎస్‌ఎన్‌ఎల్ ప్రైవేటు కంపెనీలకు దీటుగా దేశవ్యాప్తంగా 4జీ, 5జీ సేవల ప్రారంభించేందుకు కీలక అడుగు పడింది. స్పెక్ట్రమ్ కేటాయింపులతో కూడిన రూ.89,047 కోట్ల విలువ చేసే మరో పునరుద్ధరణ ప్యాకేజీకి కేంద్ర కేబినెట్ ఆమోదం తెలిపింది. ఈక్విటీ రూపంలో బీఎస్‌ఎన్‌ఎల్‌కు 4జీ, 5జీ స్పెక్ట్రమ్ కేటాయింపు ఈ ప్యాకేజీలో భాగంగా ఉంది. రూ.46,338 కోట్లు విలువ చేసే 700 మెగాహెర్ట్జ్ బ్యాండ్ స్పెక్ట్రమ్, 3300 మెగాహెర్ట్జ్ బ్యాండ్‌లో 70 మెగాహెర్ట్జ్ ఫ్రీక్వెన్సీ స్పెక్ట్రమ్ (రూ.26,184 కోట్లు), 26 గిగాహెర్ట్జ్ బ్యాండ్‌లో స్పెక్ట్రమ్ (రూ.6,565 కోట్లు), 2500 మెగాహెర్ట్జ్ బ్యాండ్ స్పెక్ట్రమ్ (రూ.9,428 కోట్లు) కేటాయించనుంది. దీంతో బీఎస్‌ఎన్‌ఎల్ అధీకృత మూలధనం రూ.1,50,000 కోట్ల నుంచి రూ.2,10,000 కోట్లకు పెరగనుంది. ఈ స్పెక్ట్రమ్ కేటాయింపులతో బీఎస్‌ఎన్‌ఎల్ దేశ వ్యాప్తంగా 4జీ, 5జీ సేవలను గ్రామీణ ప్రాంతాల్లోనూ అందించేందుకు అవకాశం ఏర్పడుతుంది. కేంద్ర ప్రభుత్వం 2019లో మొదటిసారి బీఎస్‌ఎన్‌ఎల్, ఎంటీఎన్‌ఎల్‌కు రూ.69,000 కోట్ల విలువ చేసే ప్యాకేజీ ప్రకటించింది. 2022లో మరో రూ.1.64 లక్షల కోట్ల ప్యాకేజీని ఇచ్చింది. కేంద్రం సాయంతో బీఎస్‌ఎన్‌ఎల్ రుణ భారం రూ.22,289 కోట్లకు దిగొచ్చింది.

జిమ్నీ వచ్చేసింది.. ధర రూ.12.74 లక్షల నుంచి..



హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: మారుతీ సుజుకీ జిమ్నీ మోడల్ ధరను ప్రకటించింది. ఢిల్లీ ఎక్స్‌షోరూంలో ధర రూ.12.74 లక్షల నుంచి ప్రారంభం. ఫోర్ వీల్ డ్రైవ్, 5-స్పీడ్ మాన్యువల్ ట్రిమ్స్ రూ.12.74 లక్షల నుంచి రూ.13.85 లక్షల వరకు ఉంది. అలాగే 4-స్పీడ్ ఆటోమేటిక్ ట్రిమ్స్ రూ.13.94 లక్షల నుంచి రూ.15.05 లక్షల వరకు నిర్ణయించింది. 5 డోర్ల ఎస్‌యూవీ అయిన జిమ్నీ 1.5 లీటర్ పెట్రోల్ ఇంజిన్‌తో రూపొందింది. గ్రౌండ్ క్లియరెన్స్ 210ఎంఎం ఉంది. మైలేజీ ఆటోమేటిక్ ట్రి మ్స్ 16.94, మాన్యువల్ ట్రిమ్స్ 16.39 కిలోమీటర్లు ఇస్తుందని కంపెనీ తెలిపింది. దేశంలోనే అతి పెద్ద ఎస్‌యూవీ తయారీదారుగా అవతరించాలన్న లక్ష్యంలో జిమ్నీ కీలక పాత్ర పోషిస్తుందని మారుతీ ఎండీ, సీఈవో హిసాటీ టాకేయూచీ తెలిపారు.

ఆర్‌బీఐ పాలసీ వెల్లడికి ముందు లాభాలు

- ఆరు నెలల తర్వాత 63 వేలపైకి సెన్సెక్స్
- 18,700 స్థాయిపైకి నిఫ్టీ



ముంబై: ఆర్‌బీఐ ద్రవ్య పాలసీ ప్రకటనకు ముందురోజు స్టాక్ మార్కెట్ లాభాలతో ముగిసింది. ద్రవ్య పరపతి విధాన సమీక్ష నుంచి సానుకూల నిర్ణయాలు వెలువడొచ్చనే ఆశలతో బుధవారం స్టాక్ సూచీలు ఆరునెలల గరిష్టంపై ముగిశాయి. అధిక వెయిటేజీ షేర్లు రిలయన్స్ ఇండస్ట్రీస్, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, టీసీఎస్, ఇన్ఫోసిస్ సూచీల ర్యాలీకి దన్నుగా నిలిచాయి. విదేశీ ఇన్వెస్టర్లు తిరిగి కొనుగోళ్లు చేపట్టడం, ఫారెక్స్ మార్కెట్లో డాలర్ మారకంలో రూపాయి బలోపేతం అంశాలు కలిసొచ్చాయి. అంతర్జాతీయ మార్కెట్ల నుంచి మిశ్రమ సంకేతాలు అందాయి. సెన్సెక్స్ 403 పాయింట్లు దూసుకెళ్లి 63,196 వద్ద, నిఫ్టీ 140 పాయింట్లు ఎగసి 18,739 వద్ద గరిష్టాలను నమోదు చేశాయి. చివర్లో స్వల్పంగా లాభాల స్వీకరణ చోటు చేసుకోవడంతో సెన్సెక్స్ 350 పాయింట్ల లాభంతో 63,143 వద్ద స్థిరపడింది. ఆరు నెలల తర్వాత ఈ సూచి తొలిసారి 63 వేల స్థాయికి చేరుకుంది. అలాగే ఇందులోని 30 షేర్లలో ఐదు షేర్లు మాత్రమే నష్టపోయాయి. నిఫ్టీ 127 పాయింట్లు పెరిగి 18,726 వద్ద నిలిచింది. ముగింపు స్థాయిలు సూచీలకిది 6 నెలల గరిష్టం కావడం విశేషం. ముఖ్యంగా మెటల్, ఇంధన, ఎఫ్‌ఎంసీజీ షేర్లను కొనేందుకు ఇన్వెస్టర్లు ఆసక్తి చూపడంతో మిడ్, స్మాల్ క్యాప్ ఇండెక్సులు ఒకశాతానికి పైగా ర్యాలీ చేశాయి.

టెక్నో పెయింట్స్ ప్రచారకర్తగా మహేశ్ బాబు



మహేశ్ బాబుతో శ్రీనివాస్ రెడ్డి

హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: పెయింట్స్ తయారీలో ఉన్న టెక్నో పెయింట్స్ బ్రాండ్ అంబాసిడర్‌గా సినీ నటుడు మహేశ్‌బాబు నియమితులయ్యారు. 'యూత్ ఐకాన్‌గా మహేశ్‌బాబు బ్రాండ్ ఇమేజ్ సంస్థ విస్తరణకు దోహదం చేస్తుంది. దేశీయ పెయింట్స్ రిటైల్‌లో సుస్థిర స్థానం సంపాదించాలన్న మా లక్ష్యం నెరవేరుతుందన్న ధీమా ఉంది' అని టెక్నో పెయింట్స్‌ను ప్రమోట్ చేస్తున్న ఫార్చ్యూన్ గ్రూప్ ఫౌండర్ ఆకూరి శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. 'ఆంధ్రప్రదేశ్, తెలంగాణలో రూ.12,000 కోట్ల పెయింట్స్ పరిశ్రమలో 12–18 నెలల్లో 25% వాటాను లక్ష్యంగా చేసుకున్నాం. 5,000 కేంద్రాల్లో మా ఉత్పత్తులను చేరుస్తాం. వుడ్ అధెసివ్, టైల్ ప్రైమర్, వుడ్ పాలిష్, వాటర్ ప్రూఫింగ్ కాంపౌండ్స్‌ను కొత్తగా ప్రవేశపెట్టాం. అన్ని జిల్లాల్లో డిపోలు, సెంట్రల్ వేర్ హౌజ్‌లను ఏర్పాటు చేస్తున్నాం' అని వివరించారు.

ఏఐతో వ్యాపారాల్లో శరవేగంగా మార్పులు

- చాట్‌జీపీటీ, డాల్–ఈ తదితర టెక్నాలజీల ప్రభావం
- ఆశావహంగా మెజారిటీ దేశీ కంపెనీలు
- బోస్టన్ కన్సల్టింగ్ గ్రూప్ సర్వే

ముంబై: కొత్త తరం జనరేటివ్ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (జెన్‌ఏఐ) టెక్నాలజీలు వ్యాపార స్వరూపాలను శరవేగంగా మార్చేస్తున్నాయి. చాట్‌జీపీటీ నుంచి డాల్–ఈ తదితర సాంకేతికతలు పని ప్రదేశాల్లో చూపే సానుకూల ప్రభావాలపై దేశీయంగా మెజారిటీ కంపెనీలు ఆశావహంగా ఉన్నాయి. బోస్టన్ కన్సల్టింగ్ గ్రూప్ (బీసీజీ) నిర్వహించిన సర్వేలో ఈ అంశాలు వెల్లడయ్యాయి. 18 దేశాల్లో పలు పరిశ్రమలకు చెందిన ఎగ్జిక్యూటివ్‌లు మొదలుకుని ముందు వరుసలో పని చేసే సిబ్బంది వరకూ 12,800 మంది సిబ్బంది ఇందులో పాల్గొన్నారు. జెన్‌ఏఐ రంగం శరవేగంగా మారుతోందని, ప్రపంచవ్యాప్తంగా పని ప్రదేశాల్లో దానికి సంబంధించిన పరివర్తన ప్రభావాలు స్పష్టంగా తెలుస్తున్నాయని బీసీజీ ఎక్స్ (ఏఐ, సాఫ్ట్‌వేర్ విభాగం) గ్లోబల్ లీడర్ నికొలస్ డి బెల్‌ఫాండ్స్ తెలిపారు. సర్వేలో పాల్గొన్న దేశాలన్నింటిలోనూ భారతీయ ఎగ్జిక్యూటివ్‌లు ఏఐ ప్రభావాలపై అత్యంత ఆశావహంగా ఉన్నట్లు బీసీజీ ఎక్స్ ఇండియా హెడ్ నిపుణ్ కల్రా చెప్పారు. సర్వేలోని ముఖ్యాంశాలు..



- పని ప్రదేశాల్లో జెన్‌ఏఐ ప్రభావాలపై బ్రెజిల్ అత్యంత (71%) ఆశావహంగా ఉండగా, భారత్ (60%), మధ్యప్రాచ్యం (58%) తర్వాత స్థానాల్లో ఉన్నాయి. అమెరికా (46%), నెదర్లాండ్స్ (44%), జపాన్ (40%) దేశాల్లో అత్యంత తక్కువ స్థాయిలో ఆశావహ భావం నెలకొంది.
- ఏఐ గురించి ఆందోళనగా ఉన్న దేశాల్లో నెదర్లాండ్స్ (42 శాతం), ఫ్రాన్స్ (41 శాతం), జపాన్ (38 శాతం) ఉన్నాయి. పెద్దగా పట్టించుకోని ప్రాంతాల్లో మధ్యప్రాచ్యం (25 శాతం), బ్రెజిల్ (19 శాతం), భారత్ (14 శాతం) ఉన్నాయి.
- పని విషయంలో ఏఐ ప్రభావాలపై 2018లో 35 శాతం మంది సానుకూలంగా ఉండగా ప్రస్తుతం అది 52 శాతానికి చేరింది.
- భారత్ నుంచి సర్వేలో పాల్గొన్న 1,000 మంది ఉద్యోగుల్లో 61 శాతం మంది జెన్‌ఏఐ సాధనాలపై ఆశావహంగా ఉన్నారు. జెన్‌ఏఐతో పొంచి ఉన్న రిస్కులతో పోలిస్తే ప్రయోజనాలు ఎక్కువగా ఉంటాయని 72.8 శాతం మంది అభిప్రాయపడ్డారు. ఏఐతో తమ ఉద్యోగ విధుల్లో మార్పులు వచ్చే అవకాశం ఉందని దాదాపు 88 శాతం మంది భావించగా, ఏఐకి సంబంధించి నిర్దిష్ట నిబంధనలు అవసరమని 80 శాతం మంది అభిప్రాయపడ్డారు.
- సీనియర్ లీడర్లు మరింత తరచుగా జెన్‌ఏఐని ఉపయోగిస్తున్నారు. మిగతా ఉద్యోగులతో పోలిస్తే మరింత ఆశావహంగా ఉన్నారు. జెన్‌ఏఐపై వారిలో పెద్దగా ఆందోళన లేదు. 62 శాతం మంది లీడర్లు ఏఐ విషయంలో ఆశావహంగా ఉండగా, ముందు వరుసలో పని చేసే సిబ్బందిలో 42 శాతం మంది మాత్రమే సానుకూలంగా ఉన్నారు. మెజారిటీ లీడర్లు (80 శాతం) మంది తాము జెన్‌ఏఐ టూల్స్‌ను తరచుగా వినియోగిస్తున్నామని తెలపగా, ఇతర సిబ్బందిలో ఇది కేవలం 20 శాతంగానే ఉంది.
- జెన్‌ఏఐని తరచుగా ఉపయోగించే వారిలో 62 శాతం మంది దానిపై ఆశావహంగా ఉండగా, నాన్-యూజర్లలో ఇది 36 శాతంగా ఉంది. జెన్‌ఏఐని ఉపయోగించని వారిలో ఎక్కువగా ఫ్రంట్‌లైన్ సిబ్బందే (60 శాతం) ఉన్నారు.
- ఏఐ వల్ల తమ ఉద్యోగాలు పోతాయని భావిస్తున్నట్లు అంతర్జాతీయంగా 36% మంది తెలపగా, తమ నైపుణ్యాలను మెరుగుపర్చుకోవాల్సి ఉంటుందని విశ్వసిస్తున్నట్లు 86% మంది అభిప్రాయపడ్డారు.

డయాజియో సీఈవో ఇవాన్ కన్నుమూత



న్యూఢిల్లీ: ఆల్కహాలిక్ బేవరేజెస్ దిగ్గజం డయాజియోకి సారథ్యం వహిస్తున్న భారతీయ సీఈవో ఇవాన్ మాన్యుయెల్ మెనెజెస్ (64) లండన్‌లో కన్నుమూశారు. కడుపులో అల్సర్‌తో కొంత కాలంగా ఆయన ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. ఈ నెలాఖరులో ఆయన రిటైర్ కావాల్సి ఉంది. మెనెజెస్‌కు భార్య, ఇద్దరు సంతానం ఉన్నారు. కొత్త సీఈవోగా నియమితులైన డెబ్రా క్రూ.. మెనెజెస్ చికిత్సా కాలంలో తాత్కాలికంగా ఆయన బాధ్యతలు నిర్వర్తిస్తారని డయాజియో సోమవారమే ప్రకటించింది. ఆ ప్రకటన చేసిన రెండు రోజులకే మెనెజెస్ కన్నుమూశారు. మెనెజెస్ మృతిపై డయాజియో చైర్మన్ జేవియర్ ఫెరాన్ సంతాపం వ్యక్తం చేశారు. 1959 జూలై 10న పుణేలో జన్మించిన మెనెజస్ .. ఢిల్లీలోని ప్రతిష్టాత్మక సెయింట్ స్టీఫెన్స్ కాలేజీ, అహ్మదాబాద్ ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్‌లో విద్యాభ్యాసం చేశారు. వర్ల్‌పూల్, నెస్లే తదితర కంపెనీల్లో పనిచేసిన మెనెజెస్ 1997లో డయాజియో ఏర్పాటైనప్పుడు అందులో చేరారు. అంచెలంచెలుగా ఎదిగి 2013 జులైలో సీఈవో స్థాయికి చేరారు. ఆయనకు బ్రిటన్, అమెరికా, ప్రవాస భారతీయ పౌరసత్వం ఉంది. 2023 జనవరిలో బ్రిటన్ ఆయనకు నైట్‌హుడ్ ప్రకటించింది.

ఆధార్‌తో కూడా గూగుల్‌పే యాక్టివేషన్



న్యూఢిల్లీ: డిజిటల్ చెల్లింపు సేవల యాప్ గూగుల్ పే తాజాగా మరో కొత్త ఫీచర్‌ను ప్రవేశపెట్టింది. డెబిట్ కార్డు అవసరం లేకుండా ఆధార్ నంబరుతో కూడా యూపీఐని యాక్టివేట్ చేసుకోవచ్చని తెలిపింది. అయితే, మొబైల్ ఫోన్ నంబరు, బ్యాంకు ఖాతా, ఆధార్ నంబరు ఒకదానికి మరొకటి అనుసంధానమై ఉంటేనే ఇది పనిచేస్తుంది. దీనితో తమ యూజర్లు డెబిట్ కార్డు లేకుండానే తమ యూపీఐ పిన్ నంబరును సెట్ చేసుకోవచ్చని గూగుల్ పే తెలిపింది. గూగుల్ పే యాప్‌లో ఇకపై ఖాతా యాక్టివేషన్ కోసం డెబిట్ కార్డు, ఆధార్ నంబరు ఆప్షన్లు కనిపిస్తాయి. యూజర్లు వీటిలో ఏదైనా ఒకటి ఎంచుకుని యాక్టివేట్ చేసుకోవచ్చని గూగుల్ ప్రోడక్ట్ మేనేజ్‌మెంట్ డైరెక్టర్ శరత్ బులుసు తెలిపారు.

విద్య, ఉద్యోగ సమాచారం

ఏపీ ఆర్‌జీయూకేటీలో పీయూసీ, బీటెక్ ప్రవేశాలు

ఏపీలోని రాజీవ్ గాంధీ విజ్ఞాన, సాంకేతిక విశ్వవిద్యాలయం(ఆర్జీయూకేటీ)..2023–24 విద్యా సంవత్సరానికి సంబంధించి నాలుగు ట్రిపుల్ ఐటీ క్యాంపస్‌లలో ప్రవేశాలకు ప్రకటన విడుదల చేసింది.

» **ఏపీలో క్యాంపస్‌లు:** ఆర్‌కే వ్యాలీ క్యాంపస్, నూజివీడు క్యాంపస్, శ్రీకాకుళం క్యాంపస్, ఒంగోలు క్యాంపస్.
» **మొత్తం సీట్లు, వివరాలు:** మొత్తం నాలుగు క్యాంపస్‌లలో 4000 సీట్లు భర్తీ కానున్నాయి. ప్రతి క్యాంపస్‌కు 1000 సీట్లు కేటాయించారు. 10 శాతం ఈడబ్ల్యూఎస్ కోటా కింద మరో 400 సీట్లు అదనంగా భర్తీ చేస్తారు.
» మొత్తం సీట్లలో 85% రాష్ట్ర విద్యార్థులకు కేటాయిస్తారు. మిగిలిన 15% సీట్లకు రాష్ట్రంతోపాటు తెలంగాణ విద్యార్థులు కూడా పోటీపడతారు.
» **అర్హత:** ఈ ఏడాది పదో తరగతి ఉత్తీర్ణులైన వారు మాత్రమే ప్రవేశాలకు అర్హులు.
» **ఎంపిక విధానం:** ప్రభుత్వ పాఠశాలల్లో చదివిన విద్యార్థులకు ప్రాధాన్యం ఉంటుంది. ఒకవేళ ఇద్దరు విద్యార్థుల స్కోర్ సమానంగా ఉంటే ఏడు కొలమానాలను పరిగణనలోకి తీసుకుంటారు. మొదట గణితంలో, తర్వాత సైన్స్, ఆంగ్లం, సాంఘిక శాస్త్రం, ప్రథమ భాషలో గ్రేడ్‌ను పరిశీలించి సీట్లు కేటాయిస్తారు. అవీ సమానంగా ఉంటే పుట్టిన తేదీ ఆధారంగా ఎక్కువ వయసు ఉన్న వారికి ప్రవేశం ఖరారు చేస్తారు. అది కూడా సమానంగా ఉంటే హాల్‌టికెట్ ర్యాండమ్ నంబరు విధానాన్ని పరిగణనలోకి తీసుకుంటారు.

ముఖ్యమైన తేదీలు

» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా.
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 26.06.2023
» **పూర్తి వివరాలకు వెబ్‌సైట్:** www.rgukt.in

ట్రిపుల్‌ఐటీ బాసరలో ఇంటిగ్రేటెడ్ బీటెక్ ప్రవేశాలు

బాసర రాజీవ్‌గాంధీ విజ్ఞాన, సాంకేతిక విశ్వవిద్యాలయం(ఆర్జీయూకేటీ).. 2023–24 విద్యా సంవత్సరానికి సంబంధించి ట్రిపుల్‌ఐటీలో ప్రవేశాల కోసం ప్రకటన విడుదలచేసింది.

» **మొత్తం సీట్లు, వివరాలు:** మొత్తం 1650 ఇంటిగ్రెటెడ్ బీటెక్(ఇంటర్+బీటెక్) సీట్లు భర్తీ కానున్నాయి. యూనివర్సిటీలో 1500 సీట్లు ఉండగా.. 10 శాతం ఈడబ్ల్యూఎస్ కోటా కింద, మరో 150 అదనంగా భర్తీ చేస్తారు. మొత్తం సీట్లలో 85 శాతం రాష్ట్ర విద్యార్థులకు కేటాయిస్తారు. మిగిలిన 15 శాతం సీట్లకు రాష్ట్రంతోపాటు ఏపీ విద్యార్థులు కూడా పోటీపడతారు.
» **అర్హత:** ఈ సంవత్సరం పదో తరగతి ఉత్తీర్ణులైన వారు మాత్రమే ప్రవేశాలకు అర్హులు. ఈ ఏడాది డిసెంబర్ 31 నాటికి ఎస్సీ, ఎస్టీ విద్యార్థులకు 21 ఏళ్లు, మిగిలిన వారు 18 ఏళ్ల లోపు ఉండాలి.
» **ఎంపిక విధానం:** ప్రభుత్వ పాఠశాలల్లో చదివిన విద్యార్థులకు వారి పదో తరగతి గ్రేడ్‌కు 0.40 స్కోర్ కలుపుతారు. ఒకవేళ ఇద్దరు విద్యార్థుల స్కోర్ సమానంగా ఉంటే.. ఏడు కొలమానాలను పరిగణనలోకి తీసుకుంటారు. మొదట గణితంలో, తర్వాత సైన్స్, ఆంగ్లం, సాంఘిక శాస్త్రం, ప్రథమ భాషలో గ్రేడ్‌ను పరిశీలించి సీట్లు ఇస్తారు. అవీ సమానంగా ఉంటే పుట్టిన తేదీ ఆధారంగా ఎక్కువ వయసు ఉన్న వారికి సీటు కేటాయిస్తారు.

ముఖ్య సమాచారం

» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా.
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 19.06.2023.
» **పూర్తి వివరాలకు వెబ్‌సైట్:**www.rgukt.ac.in

ఆర్మీ పబ్లిక్ స్కూల్, గోల్కొండలో 18 టీచర్ పోస్టులు

హైదరాబాద్‌లోని గోల్కొండలో ఉన్న ఆర్మీ పబ్లిక్ స్కూల్(ఏపీఎస్).. టీచర్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 18
» **పోస్టులు:** పీజీటీ, టీజీటీ, పీఆర్‌టీ.
» **విభాగాలు:** సైకాలజీ, ఇంగ్లిష్,హిందీ, మ్యాథ్స్, సైన్స్, కంప్యూటర్స్, మ్యూజిక్ తదితరాలు.
» **అర్హత:** పోస్టును అనుసరించి సంబంధిత సబ్జెక్టుల్లో బీఈడీ/బీఈఐఈడీ /డీఈడీ/డీఈఐఈడీ/బ్యాచిలర్స్ డిగ్రీ/మాస్టర్స్ డిగ్రీ ఉత్తీర్ణులవ్వాలి.
» **ఎంపిక:** స్క్రూటినీ, ఇంటర్వ్యూ ద్వారా
» **దరఖాస్తు ఇలా:** ఆఫ్‌లైన్ ద్వారా. **చిరునామా:** ప్రిన్సిపల్, ఆర్మీ పబ్లిక్ స్కూల్, గోల్కొండ.
» **దరఖాస్తులకు చివరితేది:** 15.06.2023.
» **వెబ్‌సైట్:** www.apsgolconda.edu.in

ఇండియన్ ఆర్మీలో టెక్నికల్ ఎంట్రీ స్కీమ్ ప్రవేశాలు

ఇండియన్ ఆర్మీ జనవరి 2024లో ప్రారంభమయ్యే 50వ 10+2 టెక్నికల్ ఎంట్రీ స్కీమ్(టీఈఎస్) కోర్సు శిక్షణలో ప్రవేశాలకు అవివాహిత పురుష అభ్యర్థుల నుంచి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం ఖాళీల సంఖ్య:** 90
» **అర్హత:** గుర్తింపు పొందిన ఎడ్యుకేషన్ బోర్డు నుంచి కనీసం 60శాతం మార్కులతో 10+2(ఫిజిక్స్, కెమిస్ట్రీ, మ్యాథమేటిక్స్) లేదా దానికి సమానమైన పరీక్షతోపాటు జేఈఈ(మెయిన్స్) 2023లో ఉత్తీర్ణులై ఉండాలి.
» **వయసు:** 16 నుంచి 19 ఏళ్ల మధ్య ఉండాలి.
» **ఎంపిక విధానం:** స్టేజ్–1, స్టేజ్–2 పరీక్షలు, ఇంటర్వ్యూ, మెడికల్ ఎగ్జామినేషన్ తదితరాల ఆధారంగా ఎంపికచేస్తారు.
» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా.
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 30.06.2023.
» **వెబ్‌సైట్:** www.joinindianarmy.nic.in

వాయుసేనలో ఆఫీసర్ కొలువు

» ఏఎఫ్‌క్యాట్(2)-2023 నోటిఫికేషన్ విడుదల
» ఫ్లయింగ్, గ్రౌండ్ డ్యూటీ విభాగాల్లో 276 పోస్టులు
» ఏఎఫ్‌క్యాట్ ద్వారా ఎంపిక

దేశ రక్షణలో వెన్నెముక వంటి వాయుసేనలో చేరాలని కోరుకునే యువతకు అద్భుత అవకాశం స్వాగతం పలుకుతోంది. వివిధ విభాగాల్లో 276 పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ విడుదలైంది!! జాతీయ స్థాయిలో నిర్వహించే ఈ ఎంపిక ప్రక్రియలో విజయం సాధిస్తే.. ఎయిర్‌ఫోర్స్‌లో.. ఫ్లయింగ్, గ్రౌండ్ డ్యూటీ విభాగాల్లో గెజిటెడ్ ఆఫీసర్ కొలువు సొంతమవుతుంది. నెలకు రూ.లక్షకు పైగా వేతనం అందుకునే అవకాశం లభిస్తుంది. ఏఎఫ్‌క్యాట్(2)-2023 నోటిఫికేషన్ వెలువడింది. ఈ నేపథ్యంలో.. దరఖాస్తుకు అర్హతలు, ఎంపిక ప్రక్రియ, పరీక్ష విధానం, సిలబస్ అంశాలు తదితర వివరాలు..

బ్యాచిలర్ డిగ్రీ, బీటెక్ అర్హతలుగా ఫ్లయింగ్, గ్రౌండ్ డ్యూటీ విభాగాల్లో షార్ట్ సర్వీస్ కమిషన్ విధానంలో పోస్టుల భర్తీకి నిర్వహించే ప్రక్రియే.. ఏఎఫ్‌క్యాట్. వాయుసేన ఏటా రెండుసార్లు ఈ పరీక్షను నిర్వహిస్తుంది.

మొత్తం 276 పోస్టులు

ఏఎఫ్‌క్యాట్ (2)–2023 ద్వారా మొత్తం 276 పోస్టులను భర్తీ చేయనున్నారు. వీటిల్లో ఫ్లయింగ్ బ్రాంచ్, గ్రౌండ్ డ్యూటీ టెక్నికల్, గ్రౌండ్ డ్యూటీ నాన్ టెక్నికల్, ఎన్‌సీసీ స్పెషల్ ఎంట్రీ స్కీమ్(ఫ్లైయింగ్)ల్లో పోస్టులు ఉన్నాయి.

అర్హతలు

- **ఫ్లయింగ్ బ్రాంచ్:** ఎంపీసీ గ్రూప్‌తో ఇంటర్మీడియెట్‌లో 60 శాతం మార్కులతో ఉత్తీర్ణతతో పాటు 60 శాతం మార్కులతో బీఈ/బీటెక్ పాస్ అవ్వాలి.
- **ఏరోనాటికల్ ఇంజనీర్(ఎలక్ట్రానిక్స్):** నిర్దేశిత బ్రాంచ్‌లతో 60 శాతం మార్కులతో బీఈ/బీటెక్ ఉత్తీర్ణత సాధించాలి.
- **ఏరోనాటిక్ ఇంజనీర్(మెకానికల్):** ఏరోస్పేస్, ఏరోనాటికల్, ఎయిర్‌క్రాఫ్ట్ మెయింటనెన్స్, మెకానికల్, మెకానికల్ ఇంజనీరింగ్ అండ్ ఆటోమేషన్, ప్రొడక్షన్, మెకట్రానిక్స్, ఇండస్ట్రియల్ ఇంజనీరింగ్, మాన్యుఫ్యాక్చరింగ్, ప్రొడక్షన్ అండ్ ఇండస్ట్రియల్ ఇంజనీరింగ్, మెటీరియల్ సైన్స్, మెటలర్జికల్ అండ్ మెటీరియల్స్, ఏరోస్పేస్ అండ్ అప్లయిడ్ మెకానిక్స్, ఆటోమోటివ్, రోబోటిక్స్, నానో టెక్నాలజీ, రబ్బర్ టెక్నాలజీ అండ్ రబ్బర్ ఇంజనీరింగ్ బ్రాంచ్‌లతో బీటెక్‌లో 60 శాతం మార్కులతో ఉత్తీర్ణత ఉండాలి.
- **గ్రౌండ్ డ్యూటీ-వెపన్ సిస్టమ్స్:** ఎంపీసీ గ్రూప్‌లో 50 శాతం మార్కులతో ఇంటర్మీడియెట్ ఉత్తీర్ణతతోపాటు 60 శాతం మార్కులతో బ్యాచిలర్ డిగ్రీ ఉత్తీర్ణులవ్వాలి.
- **గ్రౌండ్ డ్యూటీ-అడ్మినిస్ట్రేషన్ అండ్ లాజిస్టిక్స్:** 60 శాతం మార్కులతో బ్యాచిలర్ డిగ్రీ ఉత్తీర్ణత సాధించాలి.
- **గ్రౌండ్ డ్యూటీ-అకౌంట్స్:** 60 శాతం మార్కులతో బీకాం లేదా బీబీఏ/బీబీఎం/ బీబీఎస్(ఫైనాన్స్ స్పెషలైజేషన్) లేదా సీఏ/సీఎంఏ/సీఎస్/సీఎఫ్ఏ ఉత్తీర్ణత ఉండాలి.
- **గ్రౌండ్ డ్యూటీ ఎడ్యుకేషన్ బ్రాంచ్:** 50 శాతం మార్కులతో పీజీ ఉత్తీర్ణులవ్వాలి.
- **గ్రౌండ్ డ్యూటీ మెటీయరాలజీ బ్రాంచ్:**60 శాతం మార్కులతో బీఎస్సీ(ఫిజిక్స్, మ్యాథమెటిక్స్) ఉత్తీర్ణత లేదా నిర్దేశిత బ్రాంచ్‌లతో బీఈ/బీటెక్‌లో 60 శాతం మార్కులతో ఉత్తీర్ణులై ఉండాలి.
- **ఎన్‌సీసీ స్పెషల్ ఎంట్రీ స్కీమ్(ఫ్లయింగ్ బ్యాచ్):** ఎన్‌సీసీ ఎయిర్‌వింగ్ సీనియర్ డివిజన్ 'సి' సర్టిఫికెట్ ఉన్న అభ్యర్థులకు అందుబాటులో ఉన్న అవకాశం ఇది. వీరికి ఎన్‌సీసీ సర్టిఫికెట్‌తో పాటు 60 శాతం మార్కులతో ఏదైనా డిగ్రీ తప్పనిసరి. ఇంటర్ మ్యాథ్స్, ఫిజిక్స్‌ల్లో 60 శాతం మార్కులతో ఉత్తీర్ణత సాధించాలి.

వయసు

- **ఫ్లయింగ్ బ్రాంచ్:** జూలై 1, 2004 నాటికి 20–24 ఏళ్లు (జూలై 2, 2000 –జూలై 1, 2004 మధ్యలో జన్మించి ఉండాలి).
- ఫ్లయింగ్ బ్రాంచ్‌కు సంబంధించి.. కమర్షియల్ పైలట్ లైసెన్స్ కలిగి ఉన్న వారికి గరిష్ట వయోపరిమితిలో రెండేళ్ల మినహాయింపు లభిస్తుంది. ఈ అభ్యర్థులు ఆగస్ట్ 1, 2004 నాటికి 20–26 ఏళ్ల మధ్యలో ఉండాలి.
- **గ్రౌండ్ డ్యూటీ:** జూలై 1, 2004 నాటికి 20–26 ఏళ్లు (జూలై 2, 1998–జూలై 1, 2004 మధ్యలో జన్మించి ఉండాలి) ఉండాలి.
- అన్ని విభాగాలకు అవివాహితులు మాత్రమే అర్హులు.

ఎన్‌సీసీ స్పెషల్ ఎంట్రీ

ఏఫ్‌క్యాట్‌లో భాగంగానే ఫ్లయింగ్ బ్రాంచ్‌లో ఎన్‌సీసీ స్పెషల్ ఎంట్రీ స్కీమ్ కూడా ఉంది. కంబైన్డ్ డిఫెన్స్ సర్వీసెస్‌లో పేర్కొన్న ఖాళీలు, అదే విధంగా ఏఎఫ్‌క్యాట్‌లో పేర్కొన్న సీట్లకు పది శాతం చొప్పున ఎన్‌సీసీ స్పెషల్ ఎంట్రీ స్కీమ్‌కు కేటాయిస్తారు. ఈ విధానంలో దరఖాస్తు చేసుకోవాలంటే.. ఎన్‌సీసీ ఎయిర్ వింగ్ విభాగంలో 'సి' సర్టిఫికెట్ పొంది ఉండాలి.

ఏఎఫ్‌ఎస్‌బీ ఎంపిక ప్రక్రియ

ఎంపిక ప్రక్రియలో భాగంగా ముందుగా ఎయిర్ ఫోర్స్ కామన్ అడ్మిషన్ టెస్ట్‌ను నిర్వహిస్తారు. ఇందులో నిర్దేశిత కటాఫ్ మార్కులు సాధించిన వారికి మలిదశలో ఎయిర్‌ఫోర్స్ సెలక్షన్ బోర్డ్ పరిధిలో మరో ఎంపిక ప్రక్రియ ఉంటుంది.

4 విభాగాలు-300 మార్కులు

ఎంపిక ప్రక్రియలో తొలి దశ ఏఎఫ్‌క్యాట్ 100 ప్రశ్నలు–300 మార్కులకు జరుగుతుంది. మొత్తం 4 విభాగాలు.. జనరల్ అవేర్‌నెస్, ఇంగ్లిష్ వెర్బల్ ఎబిలిటీ,న్యూమరికల్ ఎబిలిటీ అండ్ రీజనింగ్,మిలటరీ ఆప్టిట్యూడ్ టెస్ట్‌ల నుంచి ప్రశ్నలు అడుగుతారు. ఒక్కో ప్రశ్నకు మూడు మార్కులు కేటాయిస్తారు. నెగెటివ్ మార్కింగ్ నిబంధన కూడా ఉంది. పరీక్ష పూర్తిగా ఆబ్జెక్టివ్ విధానంలో ఆన్‌లైన్‌లో నిర్వహిస్తారు. పరీక్షకు నిర్దేశించిన సమయం రెండు గంటలు.

ఏఎఫ్‌ఎస్‌బీ టెస్టింగ్

- తొలి దశ ఏఎఫ్‌క్యాట్‌లో విజయం సాధించిన వారికి రెండో దశలో ఎయిర్ ఫోర్స్ సెలక్షన్ బోర్డ్‌ల ఆధ్వర్యంలో ఏఎఫ్‌ఎస్‌బీ టెస్టింగ్ నిర్వహిస్తారు. ఈ ఎంపిక ప్రక్రియ మొత్తం మూడంచెల్లో ఉంటుంది.
- **తొలి దశ స్టేజ్–1:** ఆఫీసర్ ఇంటిలిజెన్స్ రేటింగ్ టెస్ట్, పిక్చర్ పర్సెప్షన్ టెస్ట్.
- **రెండో దశ స్టేజ్–2:** సైకాలజికల్ టెస్ట్. ఇందులో భాగంగా అయిదు రోజులపాటు పలు అంశాల్లో పరీక్షలు నిర్వహిస్తారు. పర్సనల్ ఇంటర్వ్యూ కూడా ఉంటుంది.
- ఫ్లయింగ్ బ్రాంచ్ అభ్యర్థులకు ప్రత్యేకంగా కంప్యూటరైజ్డ్ పైలట్ సెలెక్షన్ సిస్టమ్ (సీపీఎస్‌ఎస్) విధానంలో ఇంకో పరీక్ష కూడా నిర్వహిస్తారు.
- ఎన్‌సీసీ ఎయిర్ వింగ్ 'సి' సర్టిఫికెట్ ద్వారా ఎన్‌సీసీ ఎంట్రీకి దరఖాస్తు చేసుకున్న వారికి ఏఎఫ్‌క్యాట్ నుంచి మినహాయింపు ఉంటుంది.
- ఇలా.. ఏఎఫ్‌క్యాట్‌తోపాటు ఏఎఫ్‌ఎస్‌బీ ఎంపిక ప్రక్రియలో విజయం సాధించిన వారిని శిక్షణకు ఎంపిక చేస్తారు.

74, 52 వారాల శిక్షణ

- తుది విజేతలుగా నిలిచిన వారికి ఎయిర్‌ఫోర్స్ అకాడమీ (హైదరాబాద్)లో శిక్షణనిస్తారు. ఫ్లయింగ్, గ్రౌండ్ డ్యూటీ–టెక్నికల్ విభాగాలకు ఎంపికైన వారికి 74 వారాలు, గ్రౌండ్ డ్యూటీ (నాన్–టెక్నికల్) బ్రాంచ్‌లకు 52 వారాల పాటు శిక్షణ ఉంటుంది. ఈ శిక్షణను విజయవంతంగా పూర్తి చేసుకున్న వారికి.. సంబంధిత విభాగాల్లో ఎయిర్‌ఫోర్స్ ఆఫీసర్‌గా కొలువు ఖరారు అవుతుంది. వీరికి ప్రారంభంలో రూ.56,100 - రూ.1,77,500 వేతన శ్రేణి లభిస్తుంది. శిక్షణ సమయంలో నెలకు రూ.56,100 స్టయిఫండ్ ఇస్తారు.



- ఎయిర్‌ఫోర్స్‌కు ఎంపికైన వారికి.. షార్ట్ సర్వీస్ కమిషన్ విధానంలో పదేళ్ల పాటు విధులు నిర్వర్తించే అవకాశం కల్పిస్తారు. ఆ తర్వాత ఆసక్తి, ప్రతిభను అనుసరించి మరో నాలుగేళ్లపాటు పొడిగించుకునే వీలుంది. షార్ట్ సర్వీస్‌కమిషన్ విధానంలో మొత్తం 14 ఏళ్లు పూర్తి చేసుకున్న తర్వాత పర్మనెంట్ కమిషన్ హోదా పొందే అవకాశాన్ని కూడా ఎయిర్‌ఫోర్స్ కల్పిస్తోంది.

విజయం సాధించేలా

- **ఇంగ్లిష్:** కాంప్రహెన్షన్, ఇంగ్లిష్ గ్రామర్, సెంటెన్స్ కంప్లీషన్, సెంటెన్స్ ఫార్మేషన్, స్పాటింగ్ ద ఎర్రర్, యాంటానిమ్స్, సినానిమ్స్, క్లోజ్ టెస్ట్, ఇడియమ్స్, ఫ్రేజెస్, అనాలజీ, వన్ వర్డ్ సబ్‌స్టిట్యూషన్‌లపై దృష్టి పెట్టాలి.
- జనరల్ అవేర్‌నెస్: చరిత్ర, జాగ్రఫీ, పాలిటీ, ఎకానమీలతోపాటు జాతీయ, అంతర్జాతీయ ప్రాముఖ్యం సంతరించుకున్న అంశాలు, సంఘటనలు, సైన్స్ అండ్ టెక్నాలజీ తాజా పరిణామాలు, రక్షణ రంగంలోని పరిణామాలపై దృష్టి సారించాలి.
- **న్యూమరికల్ ఎబిలిటీ:** టైమ్ అండ్ వర్క్, యావరేజెస్, ప్రాఫిట్ అండ్ లాస్, రేషియోస్, సింపుల్, కాంపౌండ్ ఇంట్రస్ట్, టైమ్ అండ్ డిస్టెన్స్, నంబర్ సిరీస్, పెరిమీటర్, ఏరియా, ప్రాబబిలిటీ అంశాలపై అవగాహన పొందాలి.
- **రీజనింగ్ అండ్ మిలటరీ ఆప్టిట్యూడ్ టెస్ట్:** ఇందులో రాణించడానికి వెర్బల్, నాన్ -వెర్బల్ రీజనింగ్ అంశాలతోపాటు.. సీటింగ్ అరేంజ్‌మెంట్, రొటేటెడ్ బ్లాక్స్, హిడెన్ ఫిగర్స్, అనాలజీపై అవగాహన పొందాలి.

ముఖ్య సమాచారం

- **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా.
- **ఆన్‌లైన్ దరఖాస్తు తేదీలు:** జూన్ 1 - జూన్ 30, 2023
- **ఏఎఫ్‌క్యాట్ తేదీ:** ఆగస్ట్ 25, 26, 27 తేదీల్లో ఆన్‌లైన్ పరీక్ష ఉంటుంది.
- **తెలుగు రాష్ట్రాల్లో పరీక్ష కేంద్రాలు:** గుంటూరు, హైదరాబాద్, రాజమండ్రి, తిరుపతి, విజయవాడ, విశాఖపట్నం, వరంగల్
- **వెబ్‌సైట్:** https://afcat.cdac.in

క్లుప్తంగా...

'నెక్ట్స్'పై నకిలీ సమాచారం నమ్మొద్దు

జాతీయ మెడికల్ కమిషన్ విజ్ఞప్తి

సాక్షి, హైదరాబాద్: ఆలిండియా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ (ఎయిమ్స్) ఆధ్వర్యంలో ఈ ఏడాది ద్వితీయార్థంలో నేషనల్ ఎగ్జిట్ టెస్ట్ (నెక్ట్స్) నిర్వహించాలని నిర్ణయించినట్లు సోషల్ మీడియాలో వచ్చిన వార్త నకిలీదని జాతీయ మెడికల్ కమిషన్ (ఎన్ఎంసీ) బుధవారం ఒక ప్రకటనలో స్పష్టం చేసింది. వైద్య విద్యార్థులు, ప్రజలను తప్పుదారి పట్టించేందుకు నెక్ట్స్–2023 కల్పిత నోటీసు మీడియాలో ప్రసారమైందని పేర్కొంది. ఈ ఏడాది నెక్ట్స్ నిర్వహించాలని నిర్ణయించినట్లు పేర్కొంది. మార్గదర్శకాలతో త్వరలో షెడ్యూల్ ప్రకటిస్తామని ఎన్ఎంసీ తెలిపింది. నకిలీ సమాచారం నమ్మొద్దని విజ్ఞప్తి చేసింది.

నేడు పీజీఈసెట్ ఫలితాల విడుదల

సాక్షి, హైదరాబాద్: ఎంఈ, ఎంటెక్, ఎం ఫార్మసీ వంటి కోర్సుల్లో ప్రవేశాలకు నిర్వహించిన పీజీఈసెట్ ఫలితాలు గురువారం విడుదల కానున్నాయి. మధ్యాహ్నం 3.30 గంటలకు కూకట్‌పల్లి జేఎన్టీయూలో ఉన్నత విద్యామండలి చైర్మన్ ప్రొఫెసర్ ఆర్.లింబాద్రి, వైస్ చైర్మన్ ప్రొఫెసర్ వెంకటరమణ, జేఎన్టీయూ వీసీ ప్రొఫెసర్ కట్టా నర్సింహారెడ్డి ఈ ఫలితాలను విడుదల చేస్తారని పీజీఈసెట్ కన్వీనర్ ప్రొఫెసర్ రవీంద్రారెడ్డి తెలిపారు. ఫలితాల కోసం https:// pgecet.tsche.ac.in వెబ్‌సైట్‌ను చూడాలని కన్వీనర్ ప్రొఫెసర్ రవీంద్రారెడ్డి సూచించారు.

నిమ్స్ డైరెక్టర్‌గా బీరప్ప



లక్డీకాపూల్ (హైదరాబాద్): నిజామ్స్ వైద్య విజ్ఞాన సంస్థ (నిమ్స్) నూతన డైరెక్టర్‌గా ప్రొఫెసర్ నగరి బీరప్ప నియమితులయ్యారు. ఈ మేరకు ప్రభుత్వం బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఇప్పటి వరకు డైరెక్టర్‌గా పని చేసిన డాక్టర్ కె.మనోహర్ కొంతకాలంగా హృద్రోగ సంబంధిత సమస్యతో బాధపడుతున్నారు. ప్రస్తుతం ఆయన దీర్ఘకాలిక సెలవులో ఉండటంతో బీరప్పను పూర్తి స్థాయి డైరెక్టర్‌గా నియమించింది. డాక్టర్ బీరప్ప ప్రస్తుతం సర్జికల్ గ్యాస్ట్రో ఎంట్రాలజీ విభాగాధిపతిగా, డీన్‌గా కొనసాగుతున్నారు. రెండు నెలలుగా ఇన్‌చార్జి డైరెక్టర్‌గా కూడా వ్యవహరించారు. ఈ కొద్ది కాలంలోనే ఆయన ఆస్పత్రిలో సమూలంగా మార్పులు తీసుకువచ్చారు. అత్యవసర విభాగాన్ని రోగుల నిష్పత్తికి అనుగుణంగా అభివృద్ధి చేశారు. ఆపదలో వచ్చిన ప్రతిఒక్కరికి ఆస్పత్రిలో ప్రవేశం కల్పించి.. అటు నిమ్స్‌కు, ఇటు ప్రభుత్వానికి మంచిగుర్తింపు తీసుకువచ్చారు.


టీఎస్ఎంఎస్ఐడీసీకి ఐఎస్‌వో 9001 సర్టిఫికెట్

సాక్షి, హైదరాబాద్: తెలంగాణ రాష్ట్ర వైద్య సేవలు, మౌలిక సదుపాయాల అభివృద్ధి సంస్థ (టీఎస్ఎంఎస్ఐడీసీ)కి ఐఎస్‌వో 9001: 2015 సర్టిఫికెట్ లభించింది. సంస్థ చేస్తున్న కార్యకలాపాలను అంతర్జాతీయ స్థాయిలో ఆడిట్ చేసిన అనంతరం ఈ సర్టిఫికెట్ ఇచ్చారు. దీని కాలపరిమితి మూడేళ్లు. టీఎస్ఎంఎస్ఐడీసీ ఔషధాల సేకరణ, వాటి సరఫరా, డయాగ్నస్టిక్స్ సేవలు తదితర అంశాలను పరిగణలోకి తీసుకొని ఈ గుర్తింపు ఇచ్చారు.

యాదాద్రి గౌరవ సలహాదారుగా ఆనంద్ సాయి



యాదగిరిగుట్ట: యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహస్వామి వారి ఆలయంతో పాటు వైటీడీఏ గౌరవ సలహాదారుగా ఆర్ట్ డైరెక్టర్ ఆనంద్ సాయి నియమితులయ్యారు. యాదాద్రీశుడి ప్రధానాలయ పునర్నిర్మాణంలో ఆర్కిటెక్ట్‌గా పని చేసిన ఆనంద్ సాయిని రాష్ట్ర ప్రభుత్వం గౌరవ సలహాదారుగా నియమించినట్లు వైటీడీఏ వైస్ చైర్మన్ కిషన్ రావు ఉత్తర్వులు జారీ చేశారు. ఆలయంతో పాటు ఆలయ పరిసరాలను అందంగా తీర్చిదిద్దడం, వాటిని పరిరక్షించడం, అభివృద్ధిలో భాగస్వామ్యం చేసేందుకు నియమించినట్లు తెలిసింది. ఆనంద్‌సాయి ఎన్నో సూపర్‌హిట్ సినిమాలకు ఆర్ట్ డైరెక్టర్‌గా పనిచేశారు.



అభివృద్ధికి 'రోడ్' మ్యాప్‌లు



ఎటైనా వెళ్లాలంటే.. బండి తీశామా, రోడ్డెక్కామా అంతే. వేరే పట్టణానికో, రాష్ట్రానికో వెళ్లాలంటే.. కారులోనో, బస్సులోనో హైవే ఎక్కాల్సిందే. కొన్ని హైవేలు అయితే వందలు, వేల కిలోమీటర్ల మేర సాగుతూనే ఉంటాయి. మరి ఇలా ప్రపంచవ్యాప్తంగా ఇలా ఎంత పొడవున రోడ్లు ఉన్నాయో తెలుసా? మన దేశంలో ఉన్న రోడ్ల లెక్క ఏమిటో తెలుసా? దీనిపై తాజాగా 'విజువల్ క్యాపిటలిస్ట్'సంస్థ ఓ అధ్యయనం చేయించి 'రోడ్ల'లెక్కలు తేల్చింది. ఆ వివరాలు ఏమిటో తెలుసుకుందామా..

\- సాక్షి సెంట్రల్ డెస్క్

మొత్తంగా 2.1 కోట్ల కిలోమీటర్లు

ప్రపంచవ్యాప్తంగా పెద్ద పెద్ద హైవేల నుంచి గ్రామీణ రోడ్ల దాకా.. మొత్తం రహదారుల పొడవు సుమారు 2.1 కోట్ల కిలోమీటర్లపైనే. చంద్రుడికి, భూమికి మధ్య దూరం సుమారు 3 లక్షల కిలోమీటర్లు. ఈ లెక్కన భూమ్మీద రోడ్ల పొడవు.. 35 సార్లు చంద్రుడి వద్దకు వెళ్లి వచ్చినంత అన్నమాట. ప్రపంచవ్యాప్తంగా మొత్తంగా 200కుపైగా దేశాలు ఉంటే.. మొత్తం రోడ్ల విస్తీర్ణంలో ఒక్క అమెరికాలోనే 14 శాతానికిపైగా ఉండటం గమనార్హం. విజువల్ క్యాపిటలిస్ట్ సంస్థ కోరిన మేరకు పైథాన్ మ్యాప్స్ సంస్థ ఈ అధ్యయనం చేసింది. 'గ్లోబల్ రోడ్స్ ఇన్వెంటరీ ప్రాజెక్ట్ (జీఆర్ఐపీ)'లోని రోడ్ల డేటాను సేకరించి.. వివిధ దేశాలు, ప్రాంతాల వారీగా క్రోడీకరించింది.

ఏ దేశంలో.. ఎంత పొడవుతో..

ప్రపంచవ్యాప్తంగా 222 దేశాల్లో కలిపి మొత్తం రోడ్ల విస్తీర్ణం 2,16,00,760 కిలోమీటర్లు. ఇందులో 30 లక్షల కిలోమీటర్లకుపైగా పొడవైన రోడ్లతో యూఎస్ఏ టాప్‌లో నిలిచింది. 17 లక్షల కిలోమీటర్లకుపైగా రోడ్లతో చైనా, పది లక్షల కిలోమీటర్లకుపైగా రోడ్లతో భారత్ ఆ తర్వాతి స్థానాల్లో నిలిచాయి. ప్రపంచంలోని మొత్తం రహదారుల విస్తీర్ణంలో కేవలం ఈ మూడు దేశాల్లోనే 25 శాతానికిపైగా ఉండటం గమనార్హం.

ఇక ఆండోరా, జిబ్రాల్టర్, వాలిస్ అండ్ ఫ్యుచురా ఐలాండ్స్, లీచెన్‌స్టీన్, పలౌ, అమెరికన్ సమోవా, ఫ్రెంచ్ సదరన్–అంటార్కిటిక్ ఐలాండ్స్, బెర్ముడా, క్రిస్మస్ ఐలాండ్స్, నార్ఫోక్ ఐలాండ్ తదితర దేశాల్లో రోడ్ల విస్తీర్ణం 30 కిలోమీటర్లలోపే కావడం విశేషం.

రోడ్ల విస్తీర్ణంలో మన పొరుగు దేశాలైన బంగ్లాదేశ్ 27వ (1,83,317 కి.మీ), పాకిస్తాన్ 38వ (1,06,183 కి.మీ), శ్రీలంక 43వ (96,023 కి.మీ) స్థానాల్లో ఉన్నాయి.

హైవేలలో చైనా.. స్థానిక రోడ్లలో అర్జెంటీనా..

- భారీ హైవేలు, ఎక్స్‌ప్రెస్ వేలు వంటి వాటిని పరిశీలిస్తే.. ప్రపంచంలో చైనా (6,83,248 కి.మీ) టాప్‌లో నిలిచింది. తర్వాతి స్థానాల్లో అమెరికా (3,66,800), మెక్సికో (1,05,822), జపాన్ (94,451), కెనడా (91,173), బ్రెజిల్ (86,772), ఫ్రాన్స్ (74,956), ఇండియా (69,748), అర్జెంటినా (69,188), ఆస్ట్రేలియా (69,138) నిలిచాయి.
- మధ్య స్థాయి హైవేల పొడవులో.. ప్రపంచంలో అమెరికా (8,98,873 కి.మీ) టాప్‌లో ఉంది. తర్వాతి స్థానాల్లో రష్యా (5,12,386 కి.మీ), ఇండియా (4,13,790 కి.మీ), చైనా (3,06,176 కి.మీ), బ్రెజిల్ (2,23,662 కి.మీ), మెక్సికో (1,81,088కి.మీ), ఫ్రాన్స్ (1,14,433కి.మీ) తదితర దేశాలు నిలిచాయి.
- జిల్లా, మండల స్థాయి రోడ్లను పరిగణనలోకి తీసుకుంటే.. అర్జెంటీనా (534,876 కి.మీ) ప్రపంచంలోనే టాప్‌లో ఉంది. తర్వాతి స్థానాల్లో ఇండియా (526,130 కి.మీ), ఆస్ట్రేలియా (426,346 కి.మీ), చైనా (373,831 కి.మీ), ఇండోనేషియా (334,164 కి.మీ), కొలంబియా (309,725 కి.మీ), బ్రెజిల్ (283,933 కి.మీ) తదితర దేశాలు ఉన్నాయి.
- పూర్తిగా స్థానిక, గ్రామీణ స్థాయి రోడ్లు అమెరికా (17,89,534 కి.మీ), చైనా (3,46,742 కి.మీ), జర్మనీ (3,01,853 కి.మీ) ఎక్కువగా ఉన్నాయి.

ఎలాంటి రోడ్లు ఉంటే ఏమిటి?

విజువల్ క్యాపిటలిస్ట్ విశ్లేషణ ప్రకారం.. ఎక్స్‌ప్రెస్ వేలు, భారీ హైవేలు అభివృద్ధి చెందిన ప్రాంతాలకు, పట్టణీకరణకు సంకేతాలు. ఎక్కువ ఖర్చు పెట్టగల దేశాలు మాత్రమే వీటిని నిర్మించగలుగుతాయి.

- మధ్యస్థాయి హైవేలు అభివృద్ధి చెందుతున్న, పట్టణీకరణ పెరుగుతున్న ప్రాంతాలకు సూచికలు. వేగంగా అభివృద్ధి చెందుతున్న దేశాలు వీటిని నిర్మిస్తున్నాయి.
- జిల్లా, మండల, స్థానిక రోడ్లు.. స్థానికంగా మౌలిక సదుపాయాల కల్పనకు ఇస్తున్న ప్రాధాన్యతను సూచిస్తాయి.
- మొత్తంగా రహదారుల విస్తీర్ణం ఎక్కువగా ఉండటం సుస్థిర అభివృద్ధికి సూచిక అని.. మౌలిక సదుపాయాల వల్ల అభివృద్ధి వేగం పెరుగుతుందని నిపుణులు చెప్తున్నారు.

రోడ్ల పొడవులో టాప్-10 దేశాలు (కిలోమీటర్లలో)

దేశం	రోడ్ల పొడవు	ప్రపంచ రోడ్లలో శాతం
అమెరికా	30,97,278	14.34
చైనా	17,09,997	7.92
ఇండియా	10,52,718	4.87
మెక్సికో	7,41,949	3.43
అర్జెంటీనా	7,03,087	3.25
బ్రెజిల్	6,81,267	3.15
రష్యా	6,21,813	2.88
ఆస్ట్రేలియా	6,20,393	2.87
జర్మనీ	5,63,155	2.61
ఫ్రాన్స్	5,23,566	2.42

టీఎస్‌పీఎస్సీ లీకేజీ కేసులో తొలి చార్జిషీట్

ఈ నెల 12 లోపు దాఖలుకు సిట్ సన్నాహాలు

- తొలి దశలో 37 మంది నిందితులపై అభియోగాలు
- ఇరిగేషన్ మాజీ ఏఈ పూల రమేష్‌పై ప్రత్యేకంగా...

సాక్షి, హైదరాబాద్: టీఎస్‌పీఎస్సీ వ్యవహారంలో సూత్రధారులుగా ఉన్న పులిదిండి ప్రవీణ్ కుమార్, అట్ల రాజశేఖర్‌రెడ్డి సహా మరికొందరిపై తొలి సప్లిమెంటరీ చార్జిషీట్ దాఖలు చేయాలని సిట్ అధికారులు నిర్ణయించారు. ఇరిగేషన్ శాఖ మాజీ ఏఈ పూల రమేష్‌పై ప్రత్యేకంగా వేయనున్నారు. టీఎస్‌పీఎస్సీ కార్యదర్శి వద్ద వ్యక్తిగత సహాయకుడిగా పనిచేసిన ప్రవీణ్‌కుమార్, కమిషన్ సిస్టమ్ అడ్మిన్ రాజశేఖర్‌రెడ్డితో పాటు మొత్తం 9మంది అరెస్టుతో ఈ డొంక కదిలింది. ఈ ఏడాది మార్చి 13న వీళ్లను అరెస్టు చేసిన మధ్య మండల టాస్క్‌ఫోర్స్ పోలీసులు అసిస్టెంట్ ఇంజనీర్ (ఏఈ) ప్రశ్నపత్రం లీకైనట్లు, టౌన్ ప్లానింగ్ బిల్డింగ్ ఓవర్సీర్ (టీపీబీఓ) పేపర్ లీకేజీకి సిద్ధంగా ఉన్నట్లు గుర్తించారు. బేగంబజార్ ఠాణాలో నమోదైన ఈ కేసు తదుపరి దర్యాప్తు నిమిత్తం సిట్‌కు బదిలీ అయింది. వీరి దర్యాప్తులోనే ఏఈ, టీపీబీఓ పేపర్లు మాత్రమే కాకుండా గ్రూప్–1 సహా ఆరు పరీక్షలకు సంబంధించిన 15 పేపర్లు లీకైనట్లు తేల్చారు. ఈ కేసుకు సంబంధించి ఇప్పటివరకు 54 మందిని నిందితులుగా చేర్చి 53 మందిని అరెస్టు చేశారు. ఈ తరహా కేసుల్లో తొలి అరెస్టులు చోటుచేసుకున్న మార్చి 13 నుంచి 90 రోజుల్లోగా చార్జిషీట్ దాఖలు చేయాల్సి ఉంది. దర్యాప్తు పూర్తి కాకుంటే కనీసం సప్లిమెంటరీ చార్జిషీట్ అయినా తప్పనిసరి. అలాకాకుంటే నిందితులకు మ్యాండేటరీ బెయిల్ లభిస్తుంది. దీన్ని పరిగణనలోకి తీసుకున్న సిట్ అధికారులు ఈ నెల 12 లోపు తొలి చార్జిషీట్ దాఖలు చేయనున్నారు. ప్రాథమికంగా ప్రవీణ్, రాజశేఖర్, రేణుక, డాక్యా సహా దాదాపు 37 మందిపై అభియోగాలు నమోదు చేస్తారు. భవిష్యత్తులో వెలుగులోకి వచ్చే అంశాల ఆధారంగా అనుబంధ చార్జిషీట్లు కూడా దాఖలు చేస్తారు. మరోపక్క పూల రమేష్ విచారణలో హైటెక్ మాస్ కాపీయింగ్ అంశం వెలుగులోకి వచ్చింది. దీంతో ఇతడితోపాటు మాస్ కాపీయింగ్‌లో పాత్ర ఉన్న అభ్యర్థులు, సహకరించిన వారిపై ప్రత్యేకంగా మరో చార్జిషీట్ దాఖలు చేయనున్నారు. ఈ తరహా మాస్ కాపీయింగ్‌తో పరీక్షలు రాసిన ఏడుగురిని అదుపులోకి తీసుకుని ప్రశ్నిస్తున్నారు. బుధవారంతో రమేష్ నాలుగు రోజుల పోలీసు కస్టడీ ముగియడంతో ఇతడిని మరో రెండు రోజులపాటు ప్రశ్నించనున్నారు.

ఎస్సీ, ఎస్టీ, బీసీ అభ్యర్థులకు సివిల్స్‌లో శిక్షణ

సాక్షి, హైదరాబాద్: యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (యూపీఎస్సీ) నిర్వహించే సివిల్ సర్వీసెస్ ప్రిలిమ్స్, మెయిన్స్, ఇంటర్వ్యూ పరీక్షలు–2024 కోసం ఎస్టీ, ఎస్సీ, బీసీ అభ్యర్థులకు హైదరాబాద్‌లోని రాజేంద్రనగర్‌లో ఉన్న గిరిజన ఐఏఎస్ స్టడీ సర్కిల్‌లో రెసిడెన్షియల్ పద్ధతిలో తెలంగాణ గిరిజన సంక్షేమశాఖ ఆధ్వర్యంలో ఇంటిగ్రేటెడ్ గైడెన్స్ శిక్షణ ఇవ్వనున్నారు. అందుకు అర్హులైన తెలంగాణ రాష్ట్ర అభ్యర్థుల నుంచి ఆన్‌లైన్ దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు గిరిజన సంక్షేమశాఖ కమిషనర్ బుధవారం ఒక ప్రకటనలో వెల్లడించారు. అభ్యర్థులను ఆబ్జెక్టివ్ టైపు, ఆప్టిట్యూడ్ పరీక్ష ద్వారా ఎంపిక చేస్తామన్నారు. దరఖాస్తు చేసుకునే అభ్యర్థుల కుటుంబ వార్షిక ఆదాయం రూ. 3 లక్షలకు మించకూడదు. అభ్యర్థులు http:// studycircle.cgg. gov.inలో లాగిన్ అయి ఈ నెల 9 నుంచి వచ్చే నెల 8వ తేదీ వరకు ఆన్‌లైన్ ద్వారా మాత్రమే రిజిస్ట్రేషన్ చేసుకోవాలి. ఆన్‌లైన్ అప్లికేషన్, సూచనలు http://studycircle.cgg.gov.in, అలాగే http://twd. telangana.gov.in వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉన్నాయన్నారు. మరిన్ని వివరాలకు ఫోన్: 6281766534 నంబరులో అన్ని పనిదినాలలో ఉదయం 10:30 గంటల నుంచి సాయంత్రం 5 గంటల్లోపు సంప్రదించాలని గిరిజన ఐఏఎస్ స్టడీ సర్కిల్ సంచాలకులు వి.సముజ్వల కోరారు.

షరియత్ స్థాపనే హెచ్‌యూటీ లక్ష్యం

- ఓ వర్గానికి చెందిన ప్రార్థన స్థలాలు, ప్రముఖులే టార్గెట్
- రద్దీ ప్రాంతాల్లోనూ భారీ పేలుళ్లకు కుట్ర
- ప్రాథమిక దర్యాప్తులో గుర్తించిన ఎన్ఐఏ
- ఈ ఉగ్రవాద సంస్థను నిషేధించే యోచనలో కేంద్రం



సాక్షి, హైదరాబాద్: దేశంలో రాజ్యాంగబద్ధంగా ఏర్పడిన ప్రభుత్వాన్ని పడగొట్టి షరియత్ స్థాపనే లక్ష్యంగా హిజ్బ్ ఉత్ తెహ్రీర్ (హెచ్‌యూటీ) సంస్థ పనిచేసినట్లు జాతీయ దర్యాప్తు సంస్థ (ఎన్ఐఏ) నిర్ధారించింది. ఈ సంస్థకు చెందిన 16 మంది ఉగ్రవాదులను మధ్యప్రదేశ్ యాంటీ టెర్రరిస్ట్ స్క్వాడ్ (ఏటీఎస్) అధికారులు గత నెల్లో హైదరాబాద్, భోపాల్‌లో అరెస్టు చేసిన విషయం విదితమే. ఎన్ఐఏ ఈ కేసును గత నెల 24న రీ–రిజిస్టర్ చేసి దర్యాప్తు చేపట్టింది. ఇస్లామిక్ రాజ్యస్థాపనకు వ్యతిరేకంగా, అడ్డంకిగా ఉన్న ఓ వర్గానికి చెందిన నాయకులను టార్గెట్‌గా చేసుకోవడంతోపాటు ప్రార్థన స్థలాలు, రద్దీ ప్రాంతాల్లో భారీ పేలుళ్లకు కుట్ర పన్నినట్లు గుర్తించింది. ఈ నేపథ్యంలో చట్టవ్యతిరేక కార్యకలాపాల నిరోధక చట్టం (యూఏపీఏ) కింద దేశంలో దీనిపై నిషేధం విధించాలని కేంద్ర ప్రభుత్వం యోచిస్తోంది.

ప్రాంతాల వారీగా తన్జీమ్‌లు ఏర్పాటు

దేశంలో ఉన్న ప్రభుత్వం ఓ వర్గానికి వ్యతిరేకంగా పనిచేస్తోందని, వారి హక్కుల కోసం పోరాడే సంస్థలపై నిషేధం విధిస్తూ, కార్యకర్తలను జైళ్లకు పంపుతోందని తమ కేడర్‌కు నూరిపోస్తోంది. దీనికి సంబంధించి ఆడియోలు, వీడియోలను రూపొందించి రాకెట్ చాట్, త్రీమా యాప్స్ ద్వారా ప్రచారం చేసింది. ఈ ఉగ్ర సంస్థ మధ్యప్రదేశ్, హైదరాబాద్‌ల్లో విస్తరించి ఉన్నట్లు దర్యాప్తులో వెలుగు చూసింది. ఈ ఉగ్రవాదులు ప్రాంతాల వారీగా తన్జీమ్‌గా పిలిచే మాడ్యుల్స్ ఏర్పాటు చేసుకున్నట్లు ఎన్ఐఏ తేల్చింది.

మధ్యప్రదేశ్ తన్జీమ్‌కు యాసిర్ ఖాన్, తెలంగాణ తన్జీమ్‌కు మహ్మద్ సలీం నేతృత్వం వహించారు. వీళ్లు మరింత మందిని తన సంస్థలో చేర్చుకుని వివిధ ప్రాంతాలకు విస్తరించడానికి కుట్ర పన్నారు. ఈ ఉగ్రవాదుల నుంచి స్వాధీనం చేసుకున్న ఫోన్లను ఫోరెన్సిక్ నిపుణులు విశ్లేషిస్తున్నారు. వీటిలో ఆడియో, వీడియోలతోపాటు ఐఎస్ఐఎస్ రూపొందించే ఆన్‌లైన్ పత్రిక వాయిస్ ఆఫ్ హింద్ ప్రతులు, ఖిలాఫతుల్లా అల్ మహదీపై ఉన్న పత్రాలు, యాంటీ ఎయిర్‌క్రాఫ్ట్ గన్స్, ఏకే 47, 303 రైఫిల్‌తోపాటు వివిధ పేలుడు పదార్థాల ఫొటోలు, వాటి డాక్యుమెంట్లను రిట్రీవ్ చేశారు.

హైదరాబాద్‌లోనే కీలక నిర్ణయాలు

మధ్యప్రదేశ్, తెలంగాణ తన్జీమ్‌లకు చెందిన 17 మంది ఉగ్రవాదులు గతేడాది హైదరాబాద్‌లో సమావేశమయ్యారు. గోల్కొండ ప్రాంతంలోని సలీం ఇంట్లో జరిగిన ఈ మీటింగ్‌లోనే భవిష్యత్తు ప్రణాళికలపై చర్చించి, అనేక కీలక నిర్ణయాలు తీసుకున్నారని అధికారులు తేల్చారు. సలీం సహా హైదరాబాద్ తన్జీమ్‌కు చెందిన ఆరుగురూ ఆపరేషన్స్ చేయడానికి సిద్ధమవుతూ శిక్షణ కూడా తీసుకున్నారు. హైదరాబాద్ తన్జీమ్‌కు సంబంధించి జవహర్‌నగర్‌కు చెందిన మహ్మద్ సల్మాన్ ఇప్పటికీ పరారీలో ఉన్నాడు. ఇతడిని పట్టుకునేందుకు ఎన్ఐఏ ప్రత్యేక బృందాన్ని రంగంలోకి దింపింది.


ఫాలోయింగ్‌లో కింగ్

సోషల్ మీడియాలో తెలంగాణ సీఎంఓ దూకుడు

ట్విట్టర్‌లో హరియాణా తర్వాత సీఎంఓకు రెండో స్థానం


- ట్విట్టర్‌లో ఒకటిన్నర మిలియన్లకు పైగా ఫాలోవర్లు
- మిలియన్‌కు చేరువలో కేటీఆర్ ట్విట్టర్ ఫాలోవర్లు

వివిధ డిజిటల్ మీడియా వేదికల ద్వారా ప్రజలకు సమాచారాన్ని చేరవేస్తున్న తెలంగాణ డిజిటల్ మీడియా విభాగం ముఖ్యమంత్రి కార్యాలయంతో పాటు ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి కేటీ రామారావు సామాజిక మాధ్యమ ఖాతాల నిర్వహణలో ముందుకు దూసుకుపోతోంది. తెలంగాణ సీఎంఓ, మంత్రి కేటీఆర్ డిజిటల్ మీడియా వింగ్.. ఫేస్‌బుక్, ట్విట్టర్, యూట్యూబ్ చానల్ ద్వారా ప్రభుత్వ సమాచారాన్ని ప్రజలకు చేరవేయడం, తప్పుడు సమాచారంపై అప్రమత్తం చేయడం వంటి కార్యకలాపాలు నిర్వర్తిస్తోంది. గత ఏడాది ఏప్రిల్ ఒకటి నుంచి ఈ ఏడాది మార్చి 31 వరకు వివిధ సామాజిక మాధ్యమాల ద్వారా సీఎం కార్యాలయం, మంత్రి కేటీఆర్‌ను ఎంత మంది అనుసరిస్తున్నారు, ఎంత మందికి చేరువవుతున్నారనే గణాంకాలను ఐటీ వల తెలంగాణ డిజిటల్ మీడియా వింగ్ విడుదల చేసింది. మరోవైపు ఈ ఏడాది మే 20వ తేదీ నాటికి ట్విట్టర్‌లో హరియాణా తర్వాత తెలంగాణ ముఖ్యమంత్రి కార్యాలయం ఖాతాను అనుసరిస్తున్న వారి సంఖ్య ఎక్కువగా ఉంది. ప్రతీ వెయ్యి మందిలో 44 మంది సీఎం కార్యాలయ ట్విట్టర్ ఖాతాను అనుసరిస్తున్నారని గణాంకాలు వెల్లడిస్తున్నాయి.



సీఎంఓ ట్విట్టర్‌లో అగ్రశ్రేణి రాష్ట్రాలు (మే 20 నాటికి)

రాష్ట్రం	ఫాలోవర్స్	జనాభా	ప్రతీ వెయ్యికి ఫాలోవర్లు
హరియాణా	11,69,042	2,53,51,462	46
తెలంగాణ	15,52,216	3,50,03,674	44
మహారాష్ట్ర	38,45,851	11,23,74,333	34
ఒడిశా	14,05,658	4,19,74,218	33
రాజస్తాన్	21,93,327	6,85,48,437	32



కరీంనగర్ వైద్య కళాశాలకు అనుమతి

- ప్రభుత్వ చొరవతో ఎట్టకేలకు ఎన్ఎంసీ అనుమతులు
- మొత్తంగా ఈ ఏడాది నుంచి రాష్ట్రంలో 9 వైద్య కళాశాలలు
- అందుబాటులోకి 900 ఎంబీబీఎస్ సీట్లు



సాక్షి, హైదరాబాద్: ఈ ఏడాది ప్రారంభించబోయే కరీంనగర్ ప్రభుత్వ మెడికల్ కాలేజీకి జాతీయ మెడికల్ కమిషన్ (ఎన్ఎంసీ) ఎట్టకేలకు అనుమతి ఇచ్చింది. తాజా అనుమతితో ఈ ఏడాది రాష్ట్రంలో తొమ్మిది ప్రభుత్వ మెడికల్ కాలేజీలకు అనుమతులు సాధించి తెలంగాణ సరికొత్త చరిత్ర సృష్టించిందని వైద్య శాఖ మంత్రి హరీశ్ రావు బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ ఏడాది కొమురంభీం ఆసిఫాబాద్, కామారెడ్డి, ఖమ్మం, వికారాబాద్, జనగాం, రాజన్న సిరిసిల్ల, నిర్మల్, జయశంకర్ భూపాలపల్లి, కరీంనగర్‌లో వైద్య కళాశాలు ప్రారంభమవుతాయన్నారు.

మెడికల్ కాలేజీల పనులు సకాలంలో పూర్తి చేయాలి: మంత్రి హరీశ్‌రావు ఆదేశం

ఈ సంవత్సరం ప్రారంభం కానున్న మెడికల్ కాలేజీల పనులను సకాలంలో పూర్తి చేయాలని వైద్య ఆరోగ్యశాఖ మంత్రి హరీశ్‌రావు అధికారులను ఆదేశించారు. టీఎస్ఎంఎస్ఐడీసీ, ఎన్‌హెచ్ఎం కార్యక్రమాలపై బుధవారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా నెలవారీ సమీక్ష నిర్వహించారు. వైద్య ఆరోగ్యశాఖ కార్యదర్శి రిజ్వీ, ఆరోగ్య కుటుంబ సంక్షేమ కమిషనర్ శ్వేత మహంతి, టీఎస్ఎంఎస్ఐడీసీ ఎండీ చంద్రశేఖర్‌రెడ్డి, డీఎంఈ రమేష్ రెడ్డి, ప్రజారోగ్య సంచాలకులు డాక్టర్ శ్రీనివాసరావు, వైద్య విధాన పరిషత్ కమిషనర్ అజయ్ కుమార్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ రూ.35 కోట్లతో గాంధీ ఆసుపత్రిలోని ఆర్గాన్ ట్రాన్స్ ప్లాంట్ సెంటర్ ఏర్పాటు పనులను త్వరగా పూర్తి చేయాలన్నారు. రూ. 16.5 కోట్లతో గాంధీ, ఎంజీఎం, పేట్ల బుర్జు ఆసుపత్రుల్లో ఏర్పాటు చేస్తున్న ఫెర్టిలిటీ సెంటర్ పనులు వేగవంతం చేయాలన్నారు.

సత్వరం బస్తీ దవాఖానలు

బస్తీ దవాఖానలు, తెలంగాణ డయాగ్నొస్టిక్ హబ్స్ ను వెంటనే ప్రారంభించాలని మంత్రి హరీశ్‌రావు సూచించారు. అనవసర సి సెక్షన్లు తగ్గించేందుకు కృషి చేయాలని, వంద శాతం వ్యాక్సినేషన్ జరిగేలా చూడాలన్నారు. ప్రత్యేక శిక్షణ పొందిన మిడ్ వైఫ్ స్టాఫ్ నర్సుల సేవలు పూర్తిస్థాయిలో వినియోగించుకోవాలని, సాధారణ ప్రసవాలు పెంచే దిశగా చర్యలు తీసుకోవాలని మంత్రి ఆదేశించారు. మిడ్ వైఫరీ నర్సుల పని తీరు వల్ల సి సెక్షన్లు తగ్గించడంలో మంచి మార్పు వచ్చిందన్నారు.

సైఫ్ వేధింపులతోనే మెడికో ప్రీతి ఆత్మహత్య

- పోలీసులు దాఖలు చేసిన చార్జిషీట్ చెబుతుందిదే..
- దాదాపు 70 మందికిపైగా సాక్షుల విచారణ, అన్ని కోణాల్లో దర్యాప్తు



సాక్షి, వరంగల్/వరంగల్ క్రైం: వరంగల్ కాకతీయ మెడికల్ కాలేజీ (కేఎంసీ)లో సీనియర్ అనస్తీషియా విద్యార్థి ఎంఏ సైఫ్ అలీ వేధింపుల వల్లే ఫస్టియర్ విద్యార్థిని ప్రీతి ఆత్మహత్యకు పాల్పడిందని వరంగల్ కమిషనరేట్ పోలీసులు కోర్టుకు బుధవారం సమర్పించిన చార్జిషీట్‌లో పేర్కొన్నారు. కెమికల్ అనాలసిస్ ఎగ్జామినేషన్ రిపోర్ట్, హిస్టోపాథాలజీ ఎగ్జామినేషన్, పోస్టుమార్టం నివేదికల ద్వారా ఆమె ఫెంటానిల్ పాయిజనింగ్ (సింథటిక్ డ్రగ్) తీసుకున్నట్టుగా వెల్లడైందని పేర్కొన్నారు. నొప్పి నుంచి ఉపశమనం పొందేందుకు మత్తుమందుగా ఉపయోగించే ఇది ఎక్కువ మోతాదులో తీసుకోవడంతో అన్ని అవయవాలపై దుష్ప్రభావం చూపడంతో ప్రాణం పోయిందని వైద్యుల నివేదికలో తేలిందన్నారు.

70 మందికిపైగా సాక్షుల విచారణ..

ధరావత్ ప్రీతి 2022 నవంబర్ 18న కేఎంసీలో అనస్తీషియా విభాగ కోర్సు తొలి సంవత్సరంలో చేరింది. అక్కడే హాస్టల్‌లో ఉండేది. కోర్సులో భాగంగా కేఎంసీ, ఎంజీఎం, మెటర్నిటీ ఆస్పత్రిల్లో ట్రెనింగ్ డ్యూటీ నిర్వహించేది. ఈ క్రమంలో తన సీనియర్, రెండో సంవత్సర విద్యార్థి సైఫ్ ర్యాగింగ్ చేయడం, కులం పేరుతో దూషించడంతో అవమానంగా భావించింది. ఈమెకు ఆస్పత్రుల్లో ఎవరూ సహకరించవద్దంటూ, ఆమెకు రిపోర్ట్ సరిగా రాయరాదంటూ కాలేజీ విద్యార్థులకు చెందిన ఓ వాట్సాప్ గ్రూప్‌లో పోస్టు చేయడంతో మానసిక వేదనకు గురైంది. దాంతో ఈ ఏడాది ఫిబ్రవరి 22న ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. ఎంజీఎం నుంచి హైదరాబాద్ నిమ్స్‌కు తరలించగా చికిత్స పొందుతూ 26వ తేదీన మృతి చెందింది. అప్పటికే 24వ తేదీన నిందితుడు సైఫ్‌ను పోలీసులు అరెస్టు చేసి కోర్టులో హాజరుపరిచారు. ఆ తర్వాత పోలీసులు కస్టడీకి తీసుకొని విచారించడంతో నేరాన్ని అంగీకరించాడు. ఇతడిచ్చిన సమాచారంతోపాటు ఘటనాస్థలిలో ఉన్న వారందరినీ కలుపుకొని దాదాపు 70కి పైగా మందిని పోలీసులు విచారించారు. మృతురాలు, నిందితుడితోపాటు వారి మిత్రులు వాడిన సెల్‌ఫోన్ డేటాలు కూడా సేకరించారు. ఈ విచారణలో ప్రీతిని ర్యాగింగ్ పేరుతో వేధించి ఆమె ఆత్మహత్య చేసుకునేందుకు ప్రేరేపించాడని రుజువైనందున అన్ని సాక్ష్యాధారాలతో కలిపి 970 పేజీలతో చార్జిషీట్‌ను వరంగల్ ఏసీపీ బోనాల కిషన్ ఆధ్వర్యంలో విచారించిన పోలీసులు కోర్టులో దాఖలు చేశారు.

మంత్రి కేటీఆర్‌ను కలిసిన ప్రీతి తండ్రి

దామెర: ప్రీతి తండ్రి నరేందర్ నాయక్ బుధవారం దామెర మండలం దుర్గంపేట్ వద్ద మంత్రి కేటీఆర్‌ను కలిశారు. ప్రీతి మరణానంతరం ఆమె సోదరికి ఔట్ సోర్సింగ్ ద్వారా ప్రభుత్వ ఉద్యోగం ఇచ్చారు. అలా కాకుండా ప్రీతి సోదరుడికి శాశ్వత ప్రాతిపదికన ప్రభుత్వ ఉద్యోగం కల్పించాలని నరేందర్‌నాయక్ కోరారు. ఇందుకు మంత్రి కేటీఆర్ సానుకూలంగా స్పందించినట్లు తెలిసింది.

Published and Printed by V. Murali, on behalf of Jagati Publications Limited, Published at Jagati Publications Limited, Survey No 300/E, Timmapur Village&Mandal, Karimnagar Dist–505527, T.G., and Printed at Jagati Publications Limited Survey No 300/E, Timmapur Village&Mandal, Karimnagar Dist–505527 T.G.,
Editor: V. Murali(Responsible for selection of News under the PRB Act), Phone No. 0878 - 2223017, Fax No. 0878 – 2223019. RNI Regn No. TELTEL/2008/23800.